www.manatelangana.news
Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 7 | సంచిక: 198 | సోమవారం | 7 జనవరి, 2019

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 16 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

అయ్యప్ప యాత్రలో తెల్లారిన బతుకులు

10 మంది మెదక్ జిల్లా అయ్యప్పల దుర్మరణం

ఐదుగురికి తీవ్ర గాయాలు

సిఎం కెసిఆర్, కెటిఆర్ దిగ్భ్రాంతి

బాధితుల కుటుంబాలను ఆదుకోవాలని ఆదేశాలు

- శబరిమల నుంచి వస్తుండగా తమిళనాడు పుదుక్కోట్టై వద్ద ఘోరప్రమాదం
- కంటైనర్‌ను ఢీకొన్న అయ్యప్పల వ్యాన్
- మృతులు నర్సాపూర్ మండలం ఖాజీపేట, మంతూరు, రెడ్డిపల్లి, చిన్న చింతకుంట, మంగాపూర్ గ్రామస్థులు

మృతులు: నాగరాజు(35) ఖాజీపేట, సాయి(28) చిన్నచింతకుంట, కుమార్(22)ఖాజీపేట, శ్యామ్‌సుందర్‌గౌడ్(22) మంతూరు, ప్రవీణ్(22) మంతూరు, సురేష్(25) మంతూరు, కృష్ణ(35) రెడ్డిపల్లి, రాజు(22)ఖాజీపేట, ఆంజనేయులు(25) చిన్నచింతకుంట, నరేష్ (24) చిన్నచింతకుంట

చికిత్స పొందుతున్న వారు: శ్రీశైలం, వెంకటేష్, రాజు, భూమాగౌడ్, రమేష్


ప్రమాద తీవ్రతకు నుజ్జునుజ్జైయిన వ్యాన్



మన తెలంగాణ/మెదక్/నర్సాపూర్

దైవ దర్శనానికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి బయలుదేరిన అయ్యప్ప భక్తులు తమిళనాడులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో పదిమంది మృతిచెందగా ఐదుమందికి తీవ్ర గాయాలయ్యాయి. మృతులు మెదక్ జిల్లా నర్సాపూర్ మండలానికి చెందిన భక్తులుగా గుర్తించారు. ఈ విషయం తెలిసిన గ్రామాల్లో విషాదం అలుముకుంది. నర్సాపూర్ మండలంలోని ఖాజీపేట, మంతూరు, రెడ్డిపల్లి, చిన్నచింతకుంట, మంగాపూర్ గ్రామాల నుంచి సుమారు 16 మంది అయ్యప్ప భక్తులు గత వారం రోజుల క్రితం అయ్యప్ప దర్శనానికి వ్యాన్‌లో తరువాయి 6లో

రైతుబంధుతోనే బతుకువిందు



పెట్టుబడి సాయంతోనే రైతులు కష్టాలు గట్టెక్కుతారు, తెలంగాణ ప్రభుత్వ పథకం ఆదర్శప్రాయం

రుణమాఫీల వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదు : నీతిఆయోగ్ సభ్యుడు రమేష్ చంద్



మన తెలంగాణ /హైదరాబాద్

రైతుల్లో నెలకొన్న అసంతృప్తితో ఇటీవలి కాలంలో చాలా రాజకీయ పార్టీలు 'రైతుల రుణమాఫీ'పై దృష్టి పెట్టాయని, కానీ వీటితో పెద్దగా ప్రయోజనం లేదని నీతి ఆయోగ్ సభ్యుడు రమేశ్ చంద్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయ రంగంలో నెలకొన్న సంక్షోభానికి, రైతుల్లో నిరాశా నిస్పృహలకు ప్రధాన కారణం గిట్టుబాటు ధర లేకపోవడం, పంట పెట్టుబడి కోసం రుణాలు తీసుకోవడమేనని వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న 'రైతుబంధు' లాంటి పథకం చాలా ప్రయోజనకరమని, సీజన్‌లో రైతులకు అవసరమైన పంట పెట్టుబడి కోసం అవసరమైన ఆర్థిక వనరులు సమకూరుతున్నాయని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఈ పథకాన్ని అమలుచేయడానికి, జాతీయ స్థాయిలో అమలుచేయడానికి ఆర్థికపరమైన అంశాల్లో చాలా తేడా ఉంటుందని, కానీ ప్రయోజనం మాత్రం రైతులకు చాలా ఎక్కువగానే ఉంటుందని పేర్కొన్నారు. ఒక ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రైతుబంధు పథకం గురించి ప్రస్తావించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతీ ఎకరానికి ఒక్కో సీజన్‌కు నాలుగు వేల రూపాయల చొప్పున సంవత్సరానికి రెండు సీజన్‌లకు మొత్తం ఎనిమిది వేల తరువాయి 6లో

కెటిఆర్‌కు హార్వర్డ్ ఆహ్వానం

ఫిబ్రవరి 16,17తేదీల్లో మసాచుసెట్స్‌లో జరిగే హార్వర్డ్ ఇండియా వార్షిక సమావేశంలో పాల్గోవాలని అభ్యర్థన

మన తెలంగాణ/హైదరాబాద్

అంతర్జాతీయంగా ప్రతిష్ఠాత్మకమైన అనేక సదస్సుల్లో పాల్గొని తెలంగాణ ప్రతిష్ఠను ఇనుమడింప చేసిన టిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావుకు హార్వర్డ్ యూనివర్సిటీ తాజాగా ఆహ్వానం పలికింది. హార్వర్డ్ యూనివర్సిటీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న 'హార్వర్డ్ ఇండియా' వార్షిక సమావేశానికి హాజరు కావాల్సిందిగా ఆహ్వానం పంపింది. ఫిబ్రవరి 16,17 తేదీల్లో అమెరికాలోని మసాచుసెట్స్‌లో జరగనున్న ఈ సమావేశంలో వివిధ దేశాలకు చెందిన ప్రముఖులు హాజరుకానున్నారు. సమకాలీన భారతదేశం ఎదుర్కొంటున్న అనేక సవాళ్లు, తరువాయి 6లో



నాపేరుతో అభిమాన సంఘాలు వద్దు 3

ఉన్నవాటిని రద్దు చేసుకోండి పార్టీకి సేవ చేయండి : కెటిఆర్

తొలివిడత పంచాయతీకి నేడే నోటిఫికేషన్

- మొదటి దఫాలో 4,480 పంచాయతీలకు, 39,832 వార్డులకు ఎన్నికలు

మన తెలంగాణ/హైదరాబాద్: తొలి విడత పంచాయతీ ఎన్నికల ప్రక్రియ సోమవారం నుంచి మొదలు కానుంది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తును పూర్తి చేసింది. ఈ నెల 1వ తేదీన విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం మొదటి దఫాలో తరువాయి 6లో

మిచ్‌గాన్‌లో మన సాయికృష్ణపై కాల్పులు



- కుడి చేతికి గాయాలు, రెస్టారెంట్ నుంచి వస్తుండగా కాల్పులు జరిపి కారు, నగదు దోచుకున్న దుండగులు
- లోరెంజ్ టెక్ వర్సిటీ విద్యార్థి సాయికృష్ణ మహబూబాబాద్ జిల్లా వాసి

మిచిగాన్: అమెరికాలోని మిచిగాన్ లో జరిగిన కాల్పుల ఘటనలో తెలంగాణ రాష్ట్రంలోని మహబూబాబాద్ జిల్లా విద్యార్థి గాయపడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మహబూబాబాద్‌కు చెందిన పూస ఎల్లయ్య, శైలజ దంపతుల కుమారుడు సాయికృష్ణ తరువాయి 6లో

విద్యుత్ షాక్‌కు ముగ్గురు బలి 2

- మరి ముగ్గురికి గాయాలు
- మంచిర్యాల జిల్లా ముల్కలపేట శివారులో విషాదం



కుంచెపోటు



సర్వే శివాలు

- ఉత్తమ్, కుంతియాలపై సర్వే సత్యనారాయణ తిట్ల దండకం
- టికెట్లు అమ్ముకున్నారని ఆరోపణ
- ఓటమికి కారకులే సమీక్షిస్తే ఎలా అని ప్రశ్న
- సహనం నశించి మంచినీళ్ల బాటిల్‌తో బొల్లు కిషన్‌పై దాడి
- క్రమశిక్షణ కమిటీ సస్పెన్షన్ వేటు



మన తెలంగాణ/హైదరాబాద్

కాంగ్రెస్‌లో విభేదాలు రచ్చకెక్కాయి. నేతలు పరస్పరం తిట్టుకున్నారు. బాహాబాహీకి పాల్పడ్డారు. ఇందుకు గాంధీభవన్ వేదికగా నిలిచింది. రాష్ట్రంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమికి దారితీసిన పరిస్థితులపై మూడు రోజులుగా గాంధీభవన్‌లో టిపిసిసి అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఇన్‌ఛార్జీ కుంతియాలు లోక్‌సభ నియోజకవర్గాలవారిగా సమీక్షా, సమావేశాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం హైదరాబాద్, సికింద్రాబాద్, చేవెళ్ళ, మల్కాజ్‌గిరి తరువాయి 6లో


బిరాబిరాద్రి

బ్రహ్మోత్సవాల నాటికే యాదాద్రి ముహూర్తం 14



జక్లేర్ టు కృష్ణ రైలు మార్గం శరవేగం 14

- రైల్వేకు భూమి అప్పగించిన రాష్ట్ర ప్రభుత్వం



తెలంగాణ దేశానికే దిక్సూచి

- రెండు జాతీయ పార్టీలతో రాష్ట్రానికి అన్యాయం
- కాంగ్రెస్, బిజెపిలపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్
- పార్లమెంటు ఎన్నికల్లో 17 ఎంపి సీట్లు గెలవాలి
- రాష్ట్రంలో 90 శాతం పైగా రైతు ఆత్మహత్యలు తగ్గుదల

మన తెలంగాణ/హైదరాబాద్: సిఎం కె. చంద్రశేఖర్ రావు హయాంలో తెలంగాణ దేశానికి దిక్సూచీగా మారిందని మాజీ మంత్రి, సిద్ధిపేట ఎంఎల్ఎ తన్నీరు హరీశ్‌రావు అన్నారు. రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలను దేశవ్యాప్తంగా అమలు చేసే యోచనలో ఉండటమే ఇందుకు నిదర్శనమన్నారు. రెండు జాతీయ పార్టీలు తెలంగాణకు తీవ్ర అన్యాయం చేశాయని విమర్శించారు. ఆదివారం జరిగిన తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో హరీశ్‌రావు మాట్లాడారు. మూడో పంట వచ్చేందుకు పోలవరానికి జాతీయ హోదా ఇచ్చారని, కరువు కాటకాలతో నిరంతరం ఇబ్బందులు పడుతూ ఒక్క పంటకే గత్యంతరం లేని మన రాష్ట్రానికి మాత్రం ఒక్క ప్రాజెక్టుకు కూడా జాతీయ హోదా ఇవ్వలేదని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. ఆనాడు కాంగ్రెస్, ఇప్పుడు బిజెపి రాష్ట్రానికి అన్యాయం చేశాయన్నారు. మహారాష్ట్రలో సాగునీటి ప్రాజెక్టులకు కేంద్రం రూ. 4 వేల కోట్ల గ్రాంట్లు ఇచ్చిందన్నారు. ఎందుకంటే కేంద్రంలో బిజెపి, మహారాష్ట్రలోనూ అదే పార్టీ అధికారంలో ఉండటంతో సాయం చేసిందన్నారు. సిఎం కెసిఆర్ జాతీయ హోదా ఇవ్వాలని పలుమార్లు కేంద్రానికి కోరినా పట్టించుకోలేదన్నారు. అందువల్ల 17 ఎంపి సీట్లూ టిఆర్ఎస్ గెలిస్తే కేంద్రం నుంచి అవసరమైన నిధులు సాధించుకోవచ్చని ఆయన స్పష్టంచేశారు. అందువల్ల వచ్చే పార్లమెంటు ఎన్నికలు అత్యంత కీలకమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుబంధు, రైతుబీమా తదితర వ్యవసాయ పథకాలతో తెలంగాణలో రైతు ఆత్మహత్యలు 90 శాతం పైగా తగ్గాయన్నారు. వ్యవసాయ శాఖ అధికారుల పనితీరు దేశానికే ఆదర్శంగా ఉందన్నారు. రైతు బీమా చెక్కులు రైతుల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంచిందన్నారు. దేశం మొత్తం మన పథకాలనే కాపీకొడుతున్నాయన్నారు. ఒకవైపు తమిళనాడు, మరోవైపు మహారాష్ట్ర, ఇంకోవైపు ఢిల్లీలో రైతులు ఉద్యమాలు జరుగుతుంటే, మన రాష్ట్రంలో రైతు సంక్షేమం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో చేపడుతున్న రైతు అనుకూల విధానాలను మెచ్చుకొని ప్రముఖ వ్యవసాయ నిపుణులు ఎంఎస్ స్వామినాధన్ సిఎం కెసిఆర్‌కు అవార్డు ఇచ్చిన విషయాన్ని ప్రస్తావిస్తూ, అలాంటి స్వామినాధన్‌ను తిట్టిపోసిన ఘనత కాంగ్రెస్ నేతలదని, అందుకే వారికి ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. రైతుల అకౌంట్లలో నగదు నిల్వలు ఉండడమే నిజమైన అభివృద్ధి అని ముఖ్యమంత్రి చెప్పారని, అదే స్ఫూర్తితో పనిచేయాలని ఆయన అధికారులకు విజ్ఞప్తి చేశారు.



దేశం తెలంగాణ వైపు చూస్తుంది: పోచారం

దేశం యావత్తూ తెలంగాణ వైపు చూస్తుందని వ్యవసాయశాఖ మాజీ మంత్రి, బాన్సువాడ ఎంఎల్ఎ పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. రాష్టంలో వ్యవసాయశాఖ ప్రత్యేక స్థానం సంపాదించడంలో కీలక భాగస్వామ్యం వ్యవసాయశాఖ అధికారులదేనన్నారు. దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా మనకు గుర్తింపు వచ్చిందన్నారు. రైతు చనిపోతే రూపాయి ఖర్చులేకుండా వారి బంధువుల ఖాతాల్లో మూడు రోజుల్లో రూ. 5 లక్షలు జమవుతున్నాయన్నారు. ప్రభుత్వం చేపట్టిన పథకాల వల్ల ధాన్యం ఎకరాకు పది బ్యాగులు అదనంగా ఈ ఏడాది వచ్చిందన్నారు. మరో పదేళ్లలో దేశంలో ధనవంతులైన రైతులు తెలంగాణలోనే ఉంటారన్నారు. త్వరలో వ్యవసాయాధికారులకు అన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు. వచ్చే పదిహేను ఇరవై ఏళ్ల వరకు టిఆర్ఎస్ మారదు...కెసిఆర్ మారరు అని వ్యాఖ్యానించారు. రైతు కార్పొరేషన్ ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ నాలుగున్నరేళ్ళలో ఎవరూ ఊహించని విధంగా ఎన్నో కార్యక్రమాలు చేసి చూపించామన్నారు. వరి నాటు యంత్రాలను కూడా ఇవ్వాలని ప్రభుత్వం యోచిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయాధికారుల సంఘం ఛైర్మన్ కృపాకర్‌రెడ్డి, అధ్యక్షులు అనురాధ, ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చెల్లింపులు

- ఈ ఏడాది ఖరీఫ్‌లో భారీగా ధాన్యం కొనుగోళ్లు
- 7.25 లక్షల మంది రైతులు.... రూ.6,291 కోట్లు ఖాతాల్లో జమ
- జిల్లా మేనేజర్లతో సమీక్షించిన కమిషనర్

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రంలో రైతులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ధాన్యం కొనుగోలుకు సంబంధించిన చెల్లింపులను ప్రణాళికాబద్ధంగా చెల్లించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాలశాఖ కమిషనర్ అకున్ సబర్వాల్ సంబంధిత అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. ఇందుకోసం మిల్లర్ల నుంచి సిఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్)ను వీలైనంత త్వరగా తీసుకోవాలని సూచించారు. కనీస మద్దతు చెల్లింపుల్లో ఎలాంటి సమస్యలు, అవకతవకలకు తావు లేకుండా చూడాలన్నారు. ఇందులో రైతులను సంబంధిత అధికారులు ఎలాంటి ఇబ్బందులకు గురిచేసినా సహించేది లేదని హెచ్చరించారు. పౌరసరఫరాల శాఖ భవన్‌లో సంబంధిత శాఖ జిల్లా మేనేజర్లతో ధాన్యం కొనుగోళ్లు, కనీస మద్దతు ధర, రైతులకు చెల్లింపులు తదితర అంశాలపై కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్‌లో అంచనాలకు మించి చరిత్ర లోనే అత్యధికంగా 7.25 లక్షల మంది రైతుల నుంచి 37 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. ఇందుకు సంబంధించి రూ.6,291 రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేసినట్లు కమిషనర్ వెల్లడించారు. రానున్న రోజుల్లో దిగుబడి మరింత భారీగా వచ్చే అవకాశముందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లు, చెల్లింపుల విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రణాళికబద్ధంగా ముందుకు సాగాలన్నారు. మిల్లర్లకు చెల్లించే బకాయిలు, ముఖ్యంగా మిల్లింగ్ ఛార్జీల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇదే సమయంలో బియ్యం (సిఎంఆర్) ఎగవేతదారులపై కఠినంగా వ్యవహరించాలన్నారు. ఉద్దేశ్యపూర్వకంగా అధికారులు తప్పు చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.



సంస్థలో పనిచేసే వారంతా కిందిస్థాయి నుంచి ఉన్నతాధికారులకు వరకు ప్రతి ఒక్కరూ బాధ్యతయుతంగా పని చేయాలని సూచించారు. ముఖ్యంగా క్షేత్రస్థాయిలోని పౌరసరఫరాలశాఖ అధికారులు, సిబ్బందితో మరింత సమన్వయంతో మెలగాలన్నారు. గోదాముల్లో నిరుపయోగంగా ఉన్న సరు కులను తక్షణమే టెండర్ల ద్వారా విక్రయించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే బియ్యం నిల్వల కోసం తీసుకునే గోదాముల లీజ్, ధరల విషయంలో పారదర్శకం గా వ్యవహరించాలని సూచించారు.

పవన్, బాబుతో ఆలీ భేటీ

- 20 నిమిషాల పాటు మంతనాలు
- రాజకీయాల్లోకి రావడానికి ముహూర్తం ఖరారు

మన తెలంగాణ/హైదరాబాద్ : పవన్‌కళ్యాణ్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరొందిన హాస్యనటుడు ఆలీ వైసిపి పార్టీలో చేరుతారన్న ఉహగానాల నేపథ్యంలో ఆయన పవన్‌కళ్యాణ్‌తో పాటు చంద్రబాబుతోనూ భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. కొద్ది రోజులుగా అలీ వైఎస్ జగన్ పార్టీలో చేరుతారని, ముహూర్తం కూడా ఖరారయ్యిందన్న ఊహాగానాలు వెలువడ్డాయి. ఆదివారం చంద్రబాబును కలిసిన అనంతరం జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌తోనూ నటుడు అలీ భేటీ అయ్యారు. పవన్‌కళ్యాణ్‌ను తన గురువుగా, మార్గదర్శకుడిగా అలీ పేర్కొంటుంటారు. ఈ నేపథ్యంలో ఆయన జనసేన పార్టీలో కాకుండా వైసిపి పార్టీలో చేరుతారన్న వార్తలు వెలువడడంతో అభిమానులు దీనిపై ఆసక్తిగా ఉన్నారు. అలీ పవన్‌కళ్యాణ్‌ను కలవడానికి ముందు సిఎం చంద్రబాబుతో సమావేశమయిన అనంతరం పవన్‌కళ్యాణ్‌తో భేటీ కావడం రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత పెంచింది. రానున్న ఎన్నికల్లో జనసేన పార్టీ టిడిపితో పొత్తు పెట్టుకుంటుందని టిడిపి నాయకులు గతంలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని రెండు రోజులు క్రితం జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ఖండించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ జనసేన పార్టీ మరే పార్టీతోనూ పొత్తు పెట్టుకోదని కార్యకర్తల సమావేశంలో ప్రకటించారు. అయితే అనూహ్యంగా హాస్యనటుడు అలీ ఆదివారం చంద్రబాబుతో భేటీ తరువాత పవన్‌కళ్యాణ్ సమావేశం కావడంతో రానున్న ఎన్నికల్లో ఈ రెండు పార్టీల మధ్య పొత్తు ఉండవచ్చని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. దీంతోపాటు ఈసారి రాజకీయాల్లోకి కచ్చితంగా రావాలని అలీ భావించాడని, ఈ నేపథ్యంలో తన గురువు జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌ను కలిసి ఈ విషయమై చర్చించినట్టు తెలిసింది. వీరిద్దరి మధ్య జరిగిన 20 నిమిషాల సమావేశంలో రాజకీయాలకు సంబంధించి పలు ఆసక్తికర చర్చలు జరిగినట్టు సమాచారం.

విద్యుత్‌షాక్‌తో ముగ్గురి బలి

మరో ముగ్గురికి తీవ్ర గాయాలు, ఆసుపత్రికి తరలింపు

మనతెలంగాణ/మంచిర్యాలప్రతినిధి: మంచిర్యాల జిల్లా ముల్కల్ల పేట శివారులోని పంట చేనులో ఆదివారం మధ్యాహ్నం విద్యుత్ షాక్‌కు గురై ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కరెంట్ మోటారుకు కనెక్షన్ ఇచ్చేందుకుగాను నూతనంగా విద్యుత్ లైన్ తీగలు అమర్చి స్తంభాన్ని పైకి లేపడంతో ప్రమాదవశాత్తూ పైన ఉన్న 11 కెవి తీగలకు స్తంభం తాకడంతో ప్రమాదం జరిగింది. దీంతో విద్యుత్‌షాక్‌కు గురైన ముల్కల్లపేట గ్రామ రైతులు చిన్నకొండే రామయ్య(68), వైశాఖ భీంరావు(65)తో పాటు విద్యుత్ శాఖలో కాంట్రాక్టు కార్మికునికిగా పని చేస్తున్న చిన్నగొండె సురేందర్‌లు అక్కడికక్కడే మృతి చెందగా మరో ముగ్గురు పరదేశీ, రామగిరి పున్నం, వెంకటేశ్వర్‌లు అనే ముగ్గురు రైతులు తీవ్రంగా గాయపడగా వారిని బెల్లంపల్లి ఆసుపత్రికి తరలించారు. ఆదివారం మధ్యాహ్నం విద్యుత్ శాఖ కాంట్రాక్టు కార్మికుడు ఇంటి వద్దనే ఉండడంతో కొంత మంది రైతులు అతన్ని పిలిపించి ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు లైన్ వేసేందుకు తీగలు అమర్చి స్తంభాన్ని పైకి లేపడంతో పైన ఉన్న 11కెవి విద్యుత్ తీగలకు తాకడంతో ప్రమాదం సంభవించింది. రైతుల పంట చేనుల్లో విద్యుత్‌మోటర్లకు కనెక్షన్‌లు ఇచ్చేందుకు గాను నూతనంగా ఏర్పాటు చేయాల్సిన ట్రాన్స్‌ఫార్మర్ కోసం డిడిలుచెల్లించి విద్యుత్ శాఖ అధికారుల చుట్టూ తిరుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులే కాంట్రాక్టు కార్మికులను పిలిపించుకొని స్తంభాలు వేయడం, తీగలు లాగడం లాంటి పనులు చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ముల్కల్ల పేట గ్రామశివారులోని పంట చేనులో విద్యుత్ తీగలు అమర్చుతుండగా ప్రమాదం జరిగి ముగ్గురు నిండి ప్రాణాలను కోల్పోయారు. ప్రమాదంలో మృతి చెందిన చిన్నకొండె రామయ్య, చిన్న కొండె సురేందర్‌లు అన్నదమ్ముల కొడుకులు కాగా వారి కుటుంబాల్లో విషాద చాయలు అలుముకున్నాయి. పంట చేనులో ఆదివారం మోటారు అమర్చవద్దని చెప్పినా వినిపించుకోకుండా రైతులు, కాంట్రాక్టు కార్మికుడు ఇంట్లోనే ఉంటాడని చేను వద్దకు వచ్చి పనులు చేయిస్తూ విద్యుత్ తీగకు తగిలి ప్రాణాలు కోల్పోయాడని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. సమాచారం అందుకున్న ముల్కల్లపేట గ్రామస్థులతో పాటు నాయకులు సంఘటన స్థలానికి చేరుకొని విద్యుత్‌శాఖ అధికారుల తీరుపై మండిపడ్డారు. 11 కెవి విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ముగ్గురు ప్రాణాలను కోల్పోయారని మండిపడ్డారు. మృతి చెందిన కుటుంబాలకు విద్యుత్‌శాఖ అధికారులు రూ. 30 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. ప్రమాదంలో గాయపడిన మరో ముగ్గురిని బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా, పరిస్థితి బాగాలేక హైదరాబాద్‌కు తరలించినట్లు సమాచారం.





ఇంజనీరింగ్ జాతీయ పరీక్షపై నీలినీడలు

- ప్రవేశాలకు ఐదారు పరీక్షలు రాస్తున్న విద్యార్థులు
- దరఖాస్తుల ఫీజులకే రూ.10-15 వేల వ్యయం

మనతెలంగాణ/హైదరాబాద్ : ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించే పరీక్షపై నీలినీడలు కమ్ముకున్నాయి. వైద్య విద్యలో ప్రవేశాలకు 'నీట్'ను నిర్వహిస్తున్న విధంగానే ఇంజనీరింగ్ ప్రవేశాలకు సైతం జాతీయ స్థాయిలో ఒకే పరీక్ష నిర్వహించాలని గతంలో కేంద్రం నిర్ణయించింది. 2019–20 విద్యా సంవత్సరానికి ఇంజనీరింగ్ ప్రవేశాలకు ఎంసెట్ షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో ఈ ఏడాది జాతీయ పరీక్ష లేనట్లేనని స్పష్టమవుతోంది. భవిష్యత్తులో కూడా ఇంజనీరింగ్ ప్రవేశాలకు దేశవ్యాప్తంగా ఒకే పరీక్ష జరుగకపోవచ్చనే అభిప్రాయాలు వెలువడుతున్నాయి. దేశవ్యాప్తంగా ఐఐటి,ఎన్ఐటిలతోపాటు రాష్ట్రాల వర్సిటీల పరిధిలోని ఇంజనీరింగ్ సీట్లు ఉన్నాయి. వివిధ రకాల ఇంజనీరింగ్ సీట్ల భర్తీకి ఒకే పరీక్ష నిర్వహించడం సాధ్యం కాదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇంజనీరింగ్‌కు ఒకే పరీక్ష నిర్వహిస్తే ఐఐటి, ట్రిపుల్ ఐటి, ఎన్ఐటి ప్రవేశాలకు నిర్వహించే 'జెఇఇ' పరీక్షను కూడా రద్దు చేయాల్సి ఉంటుంది. జాతీయ స్థాయిలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తే సిబిఎస్ఇ సిలబస్‌కు అనుగుణంగా ప్రశ్నలు ఉండాలి. ఇంటర్ వరకు రాష్ట్రాల సిలబస్‌లో చదువుకుని రాష్ట్ర స్థాయి ఇంజనీరింగ్ సీటు కోసం ప్రయత్నించే విద్యార్థులు జాతీయ స్థాయి పరీక్షలో పోటీపడడం మన రాష్ట్ర విద్యార్థులకు కాస్త కష్టమేనని ఇటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, మరోవైపు ఉపాధ్యాయులు కూడా అభిప్రాయపడుతున్నారు. అందువల్లనే జాతీయస్థాయి ఉమ్మడి ప్రవేశ పరీక్షను కొన్ని రాష్ట్రాలు వ్యతిరేస్తున్నాయి. సుమారు గత పదేళ్లుగా కొన్ని రాష్ట్రాల్లో పదవ తరగతి, ఇంటర్ సిలబస్‌లో ఎలాంటి మార్పులూ జరగలేదు. ఈ నేపథ్యంలో ఒకే పరీక్ష పెడితే ఆయా రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు ఇబ్బంది పడతారని, ఇతర రాష్ట్రాలతో పోటీపడే పరిస్థితి ఉండదని కొన్ని రాష్ట్రాలు పేర్కొంటున్నాయి.



ఇంజనీరింగ్ చదవాలనుకునే విద్యార్థులకు ఇంటర్ రెండవ సంవత్సరం నుంచే ప్రవేశ పరీక్షల టెన్షన్ మొదలవుతోంది. ఒక్కో విద్యార్థి కనీసం ఐదు ఆరు పరీక్షలు రాయాల్సి వస్తోంది. ఒక్కో పరీక్షకు ఒక్కో రకమైన సిలబస్ ఉంటుండంతో వత్తిడి పెరుగుతోంది. అయోమయానికి గురవుతున్నారు. ఇప్పటికే జెఇఇ ప్రకటనతో పాటు దేశంలోని కొన్ని ప్రముఖ డీమ్డ్ యూనివర్సిటీలు ప్రవేశాల కోసం ప్రకటన ఇచ్చేయగా, మరికొన్ని వర్సిటీలు మరో నెల రోజుల్లో షెడ్యూల్ విడుదల చేయనున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని ఇంజనీరింగ్ కళాశాలలు సరైన ప్రమాణాలు పాటించడం లేదన్న భావనతో వేలాదిమంది విద్యార్థులు కనీసం మూడు నుంచి ఐదు డీమ్డ్ వర్సిటీల ప్రవేశ పరీక్షలు రాస్తున్నారు. ఎన్ఐటి, ఐఐటిలలో ప్రవేశాలకు నిర్వహించే జెఇఇ మెయి న్స్, అడ్వాన్స్‌డ్‌తో పాటు తెలంగాణ, ఎపి ఎంసెట్ పరీక్షలకూ హాజరవుతున్నారు. ఇంజనీరింగ్ సీట్ల భర్తీకి నీట్ తరహాలో జాతీయ స్థాయిలో ప్రవేశ పరీక్ష నిర్వహించాలన్న కేంద్ర ప్రతిపాదన కార్యరూపం దాల్చకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రవేశ పరీక్షలకే రూ.వేలల్లో ఫీజులు

ఇంజనీరింగ్ ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో, రాష్ట్రాల స్థాయిలో ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తుండగా, ఈ ప్రవేశ పరీక్షలకు ఫీజులు చెల్లించేందుకే కనీసం రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు వెచ్చించాల్సి వస్తోంది.. ప్రస్తుతం జెఇఇ, ఎంసెట్ సహా డీమ్డ్ వర్సిటీలు అన్నీ ఎంట్రన్స్ టెస్టులు ఆన్‌లైన్‌లో కంప్యూటర్ ఆధారిత పరీక్షలే జరుగుతున్నాయి. దీనికి ప్రశ్నపత్రాలు ముద్రించాల్సిన అవసరం ఉండదు. వర్సిటీలు రూ.1000 నుంచి రూ.2,000 వరకు ఫీజులు వసూలు చేస్తున్నాయి. కొన్ని ప్రముఖ డీమ్డ్ వర్సిటీలు కేవలం దరఖాస్తుల ఫీజుల ద్వారానే రూ.లక్షలు వెనుకేసుకుంటున్నాయి. వీటితో పాటు జెఇఇ మెయిన్స్, అడ్వాన్స్‌డ్, రెండు రాష్ట్రాల ఎంసెట్ పరీక్షలకు సుమారు రూ.2 వేల నుంచి రూ.4 వరకు ఫీజులు చెల్లించాల్సి వస్తుంది.

బుల్లెట్ ప్రూఫ్ వాహనాలకు బిల్లులు

చెల్లించాలని 33 మంది నేతలకు డిజిపి లేఖలు


మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో స్టార్ క్యాంపెయినర్లు, జడ్ ప్లస్ భద్రతలో ఉన్న 33 మంది రాజకీయ ప్రముఖులకు ప్రోటోకాల్ ప్రకారం బుల్లెట్ ప్రూఫ్ వాహనాలను కేటాయించామని, వాటి వినియోగానికి సంబంధించిన బిల్లులను చెల్లించాలని వ్యక్తిగతంగా నేతలకు, పార్టీ కార్యాలయాలకు డిజిపి మహేందర్‌రెడ్డి లేఖలు రాశారు. పార్టీ అభ్యర్థన మేరకు వాహనాలు వినియోగించిన వారి మొత్తాలు ఆయా పార్టీలు చెల్లిస్తాయని పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో నాయకుల భద్రత దృష్ట్యా బుల్లెట్ ప్రూఫ్ వాహనాలను ఉపయోగించారని, వాటిని వాడుకున్నందుకుగాను కిలోమీటర్‌కు రూ.37 చొప్పున, డ్రైవర్ బత్తా రోజుకు రూ.100 చొప్పున చెల్లించాలని డిజిపి తెలిపారు. గత ఏడాది సెప్టెంబర్ 6వ తేదీ నుంచి డిసెంబర్ నెల 7వ తేదీ వరకు వాహనాలు వాడినవారిలో రాష్ట్ర ముఖ్యమంత్రి మొదలు మాజీ స్పీకర్ మధుసూధనాచారి, ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీ, బిజెపి నేత కిషన్‌రెడ్డి తదితరులు ఉన్నట్లు డిజపి పేర్కొన్నారు. బుల్లెట్ ప్రూఫ్ వాహనాలు ఉపయోగించిన 33 మంది నేతలు దానికైన ఖర్చును చెల్లించాలని, రూ.53 వేల నుంచి రూ.7,7 లక్షల మేరకు వాడిన వారు కూడా ఈ జాబితాలో ఉన్నారని డిజిపి పేర్కొన్నారు.

తెలంగాణలో పొడి వాతావరణం

మన తెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో రానున్న మూడురోజులపాటు పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం చలి తీవ్రత తగ్గిందని వారు తెలిపారు. ప్రధానంగా తెలంగాణలో ఆగ్నేయ దిశ నుంచి ఏపిలోని ఈశాన్య దిశ/తూర్పు దిశ నుంచి గాలులు వీస్తున్నాయని అధికారులు తెలిపారు. కోస్తాంధ్రాలో రాగల మూడురోజులు పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. రాయలసీమలో రాగల మూడు రోజులు పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

'అవినీతి చక్రవర్తి'ని ఆవిష్కరించిన జగన్

'బాబు' పాలనలోని అవినీతి పొందుపర్చిన వైనం



మన తెలంగాణ/హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వంలో జరిగిన అక్రమాలు, నిధుల గోల్‌మాల్‌కు సంబంధించి ఆధారాలతో సహా 'అవినీతి చక్రవర్తి' పేరుతో రాసిన పుస్తకాన్ని వైఎస్సార్ సిపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఎపిలోని శ్రీకాకుళం జిల్లాలో ప్రజా సంకల్పయాత్ర కొనసాగిస్తున్న జగన్ ఈ పుస్తకాన్ని విడుదల చేశారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సిఎం చంద్రబాబు ఆయన అనుచరులు 6 లక్షల కోట్ల రూపాయలకు పైగా దోచుకున్నారని వైఎస్సార్ సిపి అధినేత జగన్ ఆరోపించారు. చంద్రబాబు అధికారం చేపట్టినప్పటి నుంచి నవంబర్ 30వ తేదీ వరకు చంద్రబాబు, టిడిపి నేతలు కలిసి పాల్పడిన అవినీతి, అన్యాయాలను సాక్ష్యాధారాలు, జివొ నెంబర్లతో సహా ఈ పుస్తకంలో పొందుపరిచినట్లు తెలిపారు. అవినీతి చక్రవర్తి పుస్తకాన్ని రాష్ట్రపతి, ప్రధాన మంత్రికి, ఎంపిలతో పాటు దేశంలోని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు, గవర్నర్‌లకు అన్ని దర్యాప్తు సంస్థలకు అందజేయనున్నట్లు వెల్లడించారు.

సమాజ సేవలో 'లయన్స్' ముందుండాలి



మన తెలంగాణ/సిటీబ్యూరో : సమాజ సేవలో లయన్స్ ప్రతినిధులు ఎల్లప్పుడు ముందుండాలని తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఆదివారం తల్లాడ ఉత్సవ్ పేరుతో బేగంపేట మనోహర్ హోటల్‌లో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథి గా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తెలం గా ణ ప్రభుత్వం పంపిణీ చేస్తున్న మొక్కలను లయన్స్ సభ్యులు పెద్ద ఎత్తున ముందుకు వచ్చి మొక్కలు నాటే కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. అలాగే సమాజ సే వల్లో ప్రధానమైన ఉచిత వైద్య శిభిరాలు, ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులను కల్పిస్తూ ముందుకు సాగాలని సూచించారు. ఈ తల్లాడ ఉత్సవ్‌లో 11 క్లబ్‌ల ప్రతినిధులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. వీరు సంవత్సరం పాటు చేసిన సేవా కార్యక్రమాలను క్లబ్ ప్రతినిధులు వివరించారు. అనంతరం క్లబ్ నిర్వాహకులను ల యన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ వారు ఘనంగా సత్కరించి సన్మానించారు. కార్యక్రమం లో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ రీజియన్ చైర్మన్ తల్లాడ వెంకన్న, గవర్నర్ విజయ్‌కుమార్‌శెట్టి, వైస్ గవర్నర్స్ పి.మోహన్, దుర్గారావు, రీజియన్ పీఆర్వో రవీందర్‌లు పాల్గొన్నారు.



అన్నింటికీ వేదాలే మూలం

చినజీయర్ స్వామీజీ

మనతెలంగాణ/ సిటీబ్యూరో : 'వేదం అనైత్తుక్కుమ్ విత్తు ఆగుమ్' వేదం చెప్పే విషయాలన్నీ 'తిరుప్పావై'లో లభిస్తాయని ప్రముఖ ఆధ్యాత్మిక గురువు శ్రీ త్రిదండి చిన జీయర్ స్వామీజీ చెప్పారు. ఆదివారం నగరంలోని నంద గిరిహిల్స్‌లో మై హోం గ్రూపుల అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు నివాస ప్రాంగణంలో నిర్వహిస్తున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆయన తన ప్రవచనాలను వినిపించారు. తిరుప్పావై మన జీవన విధానాన్ని పూర్తిగా తెలియపరుస్తుందని, భగవంతుడిని తనలోపెట్టుకోగలిగిన 'నప్పిన్నై, నంగాయి తిరువే' అనే మూడు విశేషాలను కలిగినదే ఈ 'నీలా' దేవి అని, ఈమె ప్రకృతియని ఆయన వెల్లడించారు. ఈ ప్రకృతి గొప్ప అందాన్ని(నప్పిన్నై) కలిగినదని, ఈ పరిపూర్ణమైనద(నంగాయి)ని, ప్రకృతి సంపదలకు నిలయమని అందుకే దీనిని 'వసున్..ధర' అన్నారని ఆయన పేర్కొన్నారు. 'పుంసాం మోహన రూపాయ' అని రాముడిని కొలుస్తామని, పురుషులను, స్త్రీలను ఆకర్షించేవాడు రాముడు అని, స్త్రీలలో అందెగత్తె 'ద్రౌపది' అని, వ్యాసుడు వెల్లడించినట్టు, ఆమె నల్లగా ఉంటుందని ఆయన చెప్పారు. ప్రకృతి అంతా ఎప్పుడూ నీలికాంతు లీనుతూ ఉంటుందని, భూమి మిగతా గ్రహాల కన్నా అందంగా నీలికాంతులీనుతూ కనిపిస్తున్నందునే దీనికి 'నీలా' అని పిలుస్తుంటారని జీయర్ స్వామీజి తెలిపారు. భూమి ఎప్పుడూ కూడా నీటి సమృద్ధిని కలిగి ఉండాలని, పచ్చదనం, గోసమృద్ధి ఉండాలని గోదాదేవి తెలిపినట్టు ఆయన వివరించారు. ముక్తి రెండు రకాలు, ఒకటి దేహంలో ఉండటం, రెండవది దేహంలో నుంచి బయటికి పోవడమని, 'అగ్నే నయ' 'సుపథా రాయే' 'అస్మాన్' అని, వేదాల్లో మూలభూతమైనటువంటిది ఓంకారమని, దీనికి అర్థమేమిటంటే.. మనందరిని నడిపించేవాడు భగవంతుడని తెలియజేసేదియని ఆయన తెలిపారు. ఓంలో 'ఆ.. ఊ.. మ్..' ఆ అంటే అవతి అంటే రక్షకుడని, మ్ అంటే మనం అని అర్థమున్నదని తెలిపారు. ప్రకృతి 25 తత్వాలతో కూడికున్నదని, ప్రకృతి అంతా పంచభూతాలతో కూడుకున్నదని, ఆకాశానికి 'క' అని క అంటే ప్రకాశించేదని, గాలికి 'గ'అని పేరని 'గ' అంటే గచ్ఛతియని



ఎప్పుడూ తిరుగుతూ ఉన్నదని, భూమికి 'న' అని పేరుపెట్టారు న అంటే అజ్ఞాని యని, ఇలా విశ్వానికి 25 తత్వాలున్నాయని ఆయన వెల్లడించారు. 24 తత్వాలుండగా మనిషికి 25 వ తత్వం ఇవ్వడం జరిగిందని, 5 పంచభూతాలు, వాటికి 5 లక్షణాలున్నాయని, మనకు 5 కర్మేంద్రియాలున్నాయని, ఈ ప్రపంచానికి మూల భూతంగా ఉండే మూలంగా ఉండే ప్రకృతియని, వీటన్నిటినీ సమన్వయపరిచేది మనస్సుయని, జీవుడికి 'మ' అని పేరు పెట్టడం జరిగిందని, జీవుడికి ఉండే లక్షణాన్ని పరిగణలోకి తీసుకునే మ అంటే 'మననం' అనే అర్థం ఉన్నందున 'మ' అక్షరం కేటాయించడం జరిగిందని జీయర్ వెల్లడించారు. రక్షించేవాడైన భగవంతుడికి 'ఆ' అనే అక్షరం ఇచ్చినట్టుగా ఓంకారంలో 'ఆ ఊ మ్' భగవంతుడిని, మనిషిని కలిపేదే ఓంకారమని జీయర్ స్వామీజి విశదీకరించారు. ఓంకారమంటే అహం బ్రహ్మాస్మి అని కూడా వెల్లడిస్తున్నట్టు, ఓంకారం తనలోని నారాయణ మంత్రాన్ని, వేదాలను తీసుకువచ్చిందని, 'ఏతద్వై నారాయణస్య అష్టాక్షరం పదం' అని ఆయన పేర్కొన్నారు. అకారంలో నారాయణ పదం, ఉకారంలోంచి వచ్చిన పదం నమ: మకారంలో నుంచి వచ్చినది ఆయ పదం అని ఆయన తెలిపారు. సంస్కృతంలో 'ఆయ' అంటే కొరకు అని తెలియజేస్తుందని, దేవుడు నీలాదేవి(ప్రకృతి)లో ఉన్నాడని, గోదాదేవి... ప్రకృతిలో ఉండే భగవంతుడిని మనకు చూపించి, ప్రకృతి ద్వారా భగవంతుడిని చేరే ఉపాసన చూపిస్తుందని ఆయన వెల్లడించారు. మనకు సాత్విక ఆనందం కావాలని, ఆనందాన్ని నశింపజేకుండా ఇచ్చేదే అందం అని ఆయన పేర్కొన్నారు.

చంద్రబాబును ఎపి ప్రజలు నమ్మరు

అమరావతి/ న్యూఢిల్లీ : చంద్రబాబు నాయుడును, తెలుగుదేశం పార్టీని ఆంధ్ర ప్రజలు నమ్మే పరిస్థితి లేదని ప్రధాని నరేంద్ర మోడీ చెప్పారు. ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వైఖరిపై ప్రధాని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఢిల్లీ నుంచి ప్రధాని మోడీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల బిజెపి నేతలు, కార్యకర్తలతో మాట్లాడారు. వారి నుంచి ప్రశ్నలు అడిగారు. సమాధానాలు ఇచ్చారు. చంద్రబాబు నాయుడు కేవలం కుమారుడి భవిష్యత్తు కోసం పనిచేస్తున్నట్లుగా ఉంది తప్ప ప్రజల కోసం పాటుపడుతున్నట్లుగా లేదని విమర్శించారు. ప్రజల గురించి పట్టించుకోకుండా వ్యవహరించే నేతను ప్రజలు పట్టించుకుంటారా? నమ్ముతారా? అని ప్రధాని ప్రశ్నించారు. కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ స్వార్థంతో దుష్ప్రచారానికి దిగుతోందని, దీనిని తిప్పికొట్టాలని ప్రజలకు, ప్రత్యేకించి పార్టీ కార్యకర్తలకు మోడీ పిలుపు నిచ్చారు. రాష్ట్రంలోని వెనుకబడిన జిల్లాలకు అధిక నిధులు ఇచ్చినట్లు అయితే వీటిని ఏ విధంగా వెచ్చించాలనేది కూడా కేంద్రం నుంచి వివరణ తీసుకోలేదని విమర్శించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు సరిగ్గా లేవని, బిజెపి మహిళా కార్యకర్త ఒకరు సిఎంను అభివృద్ధి పనులపై నిలదీయడంతో చంద్రబాబు దురుసుగా వ్యవహరించారని బిజెపి అధ్యక్షులు కన్నా లక్ష్మి నారాయణ ప్రధాని దృష్టికి తెచ్చారు. కేరళలో కూడా ఇదే విధంగా జరిగిందని ఎప్పుడయితే పాలకులకు అధికారం పోతుందనే భయం పట్టుకుంటుందో అప్పుడే ఈ విధంగా వ్యవహరిస్తారని మోడీ ఈ సందర్భంగా కన్నాకు తెలిపారు.

సిబిఐకి కూటమి సంగతి చెపుతా

లక్నో : ఇసుక అక్రమ తవ్వకాలపై సిబిఐ విచారణ వార్తపై యుపి మాజీ సిఎం అఖిలేష్ యాదవ్ స్పందించారు. ఇటువంటి వాటికి భయపడేది లేదన్నారు. సిబిఐ బృందం తమ వద్దకు వస్తే వారికి తమ ఎస్‌పి –బిఎస్‌పి పొత్తు వివరాలను తెలిపి పంపిస్తామని ఈ ఎస్‌పి అధినేత చమత్కరించారు. తమ పొత్తుతో ఎటూ పాలుపోలేని స్థితిలోనే బిజెపి నేతలు ఇప్పుడు సిబిఐ దాడులకు రంగం సిద్ధం చేసినట్లుగా ఉందని వ్యాఖ్యానించారు. ఇసుక అక్రమ తవ్వకాల గురించి తనను సిబిఐ ప్రశ్నిస్తే ధైర్యంగానే ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. తాను సిబిఐని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు, అయితే ఇదే సమయంలో బిజెపి వారు ప్రజలను ఎదుర్కోవల్సి ఉంటుందన్నారు. సీట్ల సర్దుబాట్లు తమ కూటమి ఏ విధంగా ప్రజల వద్దకు దూసుకువెళ్లుతుందనే విషయాలను సిబిఐ వారికి చెపుతామని, ఏది ఏమైనా ఇప్పుడు బిజెపి అసలు రంగు తెలిసివచ్చిందని అన్నారు. ఇంతకు ముందు కాంగ్రెస్ వారి వల్ల తాము సిబిఐని కలుసుకునేందుకు వీలేర్పడిందని, ఇప్పుడు ఈ అవకాశాన్ని బిజెపి వారు కల్పించినట్లు యాదవ్ చెప్పారు. లోక్‌సభ ఎన్నికలలో అత్యధిక స్థానాలను గెల్చుకునేందుకు తాము యత్నిస్తున్నామని , తమను అడ్డుకోవాలనుకునే వారికి సిబిఐతోడుగా ఉంటుందని, తమకైతే బిజెపి అండదండలు దండిగా ఉన్నాయని తెలిపారు. సిబిఐ వారు తమను ప్రశ్నిస్తే ప్రశ్నించవచ్చునని అయితే ప్రజలు ఇప్పుడు బిజెపికి తగు సమాధానం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తేల్చిచెప్పారు.

పోలీసుల అదుపులో ఘరానా దంపతులు



మనతెలంగాణ/వనస్థలిపురం: వ్యాపారంలో భాగస్వాములు అయితే అధిక లాభాలు ఇస్తామని నమ్మించారు. భార్యకు కేంద్ర ప్రభుత్వం ఉద్యోగం ఉంది మీ డబ్బులకు ఎలాంటి డోక ఉండదని నమ్మించి భారీ మొత్తంలో డబ్బులు వసూళ్లు చేశారు. దాదాపు నాలుగు కోట్లకు కుచ్చిటోపి పెట్టి పరారు కావాలని చూసిన ఘరాన భార్యభర్తలను మోస పోయిన భాదితులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది..పోలీసుల, భాదితుల కథనం ప్రకారం...వనస్థలిపురంలోని సెల్ఫ్‌ఫైనాన్స్ కానలీకి చెందిన కొమ్ము సురేష్ స్థానికంగా ఓ బియ్యం షాపును నడుపుతున్నాడు. సురేష్ భార్య అన్నపూర్ణ బిడిఎల్‌లో ఉద్యోగం నిర్వహిస్తుంది. కాగా సురేష్ బియ్యం కోసం షాపుకు వచ్చే వారితో మంచి పరిచయం ఏర్పాటు చేసుకున్నారు. అయితే బియ్యం వ్యాపారంతో పాటు క్యాటరింగ్ వ్యాపారం నిర్వహిస్తున్న మంచి లాభాలు వస్తున్నాయని కొంత మందిని నమ్మించి వ్యాపారంలో డబ్బులు పెట్టామని కోరాడంతో పెట్టుబడులు పెట్టారు. అయితే కొంత కాలం వారికి లాభాలు వచ్చాయని వాటా ఇచ్చాడు. దాంతో నమ్మిన మరికొంత మందిని కూడా వ్యాపారంలోకి రమ్మని ఆహ్వానించాడు. దాదాపు 40 మంది వ్యాపారంలో పెట్టుబడిగా సూమారు 4 కోట్ల వరకు సురేష్‌ను నమ్మి ఇచ్చారు. అనుమానం వచ్చిన బాధితులు భార్యాభర్తలను మందలించారు. ఆదివారం సురేష్, అన్నపూర్ణ ఉంటున్న ఇంటిని గుట్టుగా ఖాళీ చేసే ప్రయత్నం చేస్తుండగా భాదితులు పసిగట్టి పోలీసులకు అప్పగించారు.

ఒడిశా మంత్రి మహారథి రాజీనామా

భువనేశ్వర్ : గ్యాంగ్ రేప్, హత్య కేసులో నిందితుడిని విడుదల చేయడంపై చేసిన వ్యాఖ్యలపై వివాదం రేగడంతో ఒడిశా వ్యవసాయ మంత్రి ప్రదీప్ మహారథి ఆదివారం రాజీనామా చేశారు. 'మహారథి తన రాజీనామా లేఖను ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపించారు. నైతిక బాధ్యత వహించి ఆయన రాజీనామా చేశారు' అని సిఎంఒ వర్గాలు తెలిపాయి. రాజీనామాపై వ్యాఖ్యానించేందుకు మహారథి అందుబాటులో లేరు. మహిళలు, బాలికల సంక్షేమాన్ని ఒడిశా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, పిపిలి గ్యాంగ్ రేప్, హత్య కేసుపై తిరిగి దర్యాప్తు చేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీ శనివారంనాడు బారిపడలో ఒక సభలో ఆరోపించారు. ఆయన చేసిన ఆరోపణకు స్పందించిన మహారథి తన మంత్రి పదవికి రాజీనామా చేశారు.

అభిమాన సంఘాలు వద్దు

- దానికి బదులు పార్టీ కోసం సేవ చేయడం మంచిది
- ఇప్పటికే ఉన్న సంఘాలను రద్దు చేసుకోవాలి
- టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



మన తెలంగాణ/హైదరాబాద్: అభిమానాన్ని చాటుకోడానికి వివిధ రకాల సంఘాలను పెట్టడం మంచి సంప్రదాయం కాదని సూచించిన టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ దానికి బదులుగా పార్టీ కోసం సేవ చేయాలని సలహా ఇచ్చారు. ఇప్పటికే ఏవైనా సంఘాలను ఏర్పాటు చేసి ఉన్నట్లయితే వాటిని వెంటనే రద్దు చేయాలని అభిమానులకు పిలుపు ఇచ్చారు. ఇకపైన అభిమాన సంఘాలు, యువ 'సేన' లాంటి సంఘాలను పెట్టవద్దని స్పష్టం చేశారు. ఇలాంటి సంఘాలకు గుర్తింపు లేదని, తనమీద ఉన్న అభిమానంతో ఇలాంటి సంఘాలు ఏర్పాటు చేయడంలో అభిమానులకు ఉత్సాహం ఉండొచ్చుగానీ దానికి బదులు పార్టీకి ఏదో ఒక తీరులో సేవ చేయడం ఇంకా ప్రయోజనంగా ఉంటుందని స్పష్టం చేశారు. తన పేరుమీద ఏర్పాటు చేసిన సంఘాలకు ఎలాంటి గుర్తింపు లేదని ఒక ప్రకటనలో స్పష్టంచేశారు. తనపేరుపై యువసేనలు, అభిమాన సంఘాలను అంగీకరించబోనని తెలిపారు. పేదల సంక్షేమం కోసం సేవా కార్యక్రమాలు నిర్వహించాలనుకుంటే టిఆర్ఎస్ పార్టీ నుంచి కానీ, టిఆర్ఎస్ అనుబంధ సంఘాల ద్వారా కానీ నిర్వహించాలే తప్ప తన పేరు మీద సంఘాలు స్థాపించి నిర్వహించడం మంచిది కాదని అన్నారు. ఇప్పటికే తనపేరు మీద సంఘాలు ఏర్పాటు చేసి కార్యకలాపాలు నిర్వహిస్తున్న వారు తక్షణం రద్దు చేసుకోవాలని సూచించారు. అలాగే తనపేరు పై ఏర్పాటు చేస్తున్న వివిధ సంఘాలు, యువసేనలు, అభిమాన సంఘాలకు తన వైపు నుంచి ఎలాంటి మద్దతు లేదని తెలంగాణ రాష్ట్ర సమితి కార్యనిర్వహక అధ్యక్షుడు కెటి రామారావు తెలిపారు. కెటిఆర్ యువసేన, కెటిఆర్ సేవాదళ్, కెటిఆర్ అభిమాన సంఘం వంటి పేర్లతో పలువురు సంఘాలను ఏర్పాటు చేసినట్లు తన దృష్టికి వచ్చిందని కెటిఆర్ తెలిపారు. ఇలాంటి సంఘాలను, సంస్థలను ఏమాత్రం ఆమోదించబోనని ఆయన తెలిపారు. తనపైన, పార్టీ పైన అభిమానంతో ఏర్పాటు చేసే సంఘాలకు కూడా తన ఆమోదం లేదని పేర్కొన్నారు. ఇప్పటికే పలు జిల్లాల్లో తన పేరుతో ఏర్పాటు చేసిన సంఘాలను వెంటనే రద్దు చేసుకోవాలని కోరారు. అలాగే ఫేస్‌బుక్ లాంటి సామాజిక మాధ్యమాల్లో కెటిఆర్ యువసేన, కెటిఆర్ అభిమాన సంఘం తదితర పేర్లతో కార్యకలాపాలు నిర్వహిస్తున్న వారు వాటిని వెంటనే నిలిపి వేయాలని ఆదేశించారు. కెటిఆర్ యువసేన పేరుతో ఇటీవల తనను కలిసిన పలువురికి తనపేరుతో ఉన్న సంఘాలను రద్దుచేసుకోవాలని చెప్పారు. తనపై అభిమానం ఉన్నవారంతా తన పేరుతో సంఘాలుఏర్పాటు చేసుకునే బదులు టిఆర్ఎస్ పార్టీ కార్యక్రమాల్లో చురుక్కాపాల్గొనాలన్నారు.

రాహుల్, రక్షణ మంత్రి ట్వీట్ల యుద్ధం

పార్లమెంటులో అబద్ధాలు చెప్పారు: రాహుల్ • వార్త పూర్తిగా చదవండి: నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ: రాఫెల్ ఒప్పందంపై పార్లమెంటులో చర్చ సందర్భంగా రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ అబద్ధాలు చెప్పారని, అందువల్ల ఆమె రాజీనామా చేయాలని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ ఆదివారం ఇచ్చిన ఓ ట్వీట్‌లో నిర్మలా సీతారామన్ పార్లమెంటులో అబద్ధం చెప్పారని ఆరోపించారు. ఒక అబద్ధం చెబితే దాన్ని కప్పి పుచ్చుకోవడానికి మరిన్ని అబద్ధాలు ఆడాల్సివస్తుందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందం విషయంలో చెప్పిన అబద్ధాలను సమర్థించే అత్రుతలో రక్షణ మంత్రి పార్లమెంటులో అబద్ధాలు చెప్పారన్నారు. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఎఎల్)కు ప్రభుత్వం ఇచ్చిన లక్ష కోట్ల రూపాయల విలువైన ఆర్డర్లను సోమవారం ఆమె పార్లమెంటులో ప్రవేశపెట్టాలని, లేని పక్షంలో ఆమె తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ ట్వీట్‌తో పాటుగా హెచ్ఎఎల్‌కు సంబంధించి ఓ అంగ్ల దినపత్రిక ప్రచురించిన వ్యాసాన్ని కూడా ఆయన జత చేశారు. రాహుల్ ట్వీట్ చేసిన కొద్ది సేపటికే నిర్మలా సీతారామన్ దానిపై స్పందిస్తూ ట్వీట్ చేశారు.' మీరు (రాహుల్ గాంధీ)ప్రస్తావిస్తున్న టైమ్స్ ఆఫ్ ఇండియాలోని వ్యాసాన్ని దయచేసి పూర్తిగా చదవండి (ఆ వ్యాసంలో ఇలా ఉంది).' అయితే లోక్‌సభ రికార్డులు చూపిస్తున్న దాని ప్రకారం ఆర్డర్స్‌పై సంతకాలు జరిగినట్లు నిర్మలా సీతారామన్ చెప్పలేదు. వాటికి సంబంధించిన పనులు జరుగుతున్నట్లు చెప్పారు' ఇండియా న్యూస్– టైమ్స్ ఆఫ్ ఇండియా అని రాసి ఉంది' అని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఆ తర్వాత రక్షణ మంత్రిత్వ శాఖ మరో ట్వీట్ చేసింది. రాహుల్ గాంధీ ఎబిసిలనుంచి ప్రారంభించవలసి ఉందని దానిలో పేర్కొన్నారు.' రాహుల్ గాంధీగారూ, మీరు నిజంగా ఎబిసిలనుంచి ప్రారంభించాల్సి ఉన్నట్లు కనిపిస్తోంది. ప్రజలను తప్పుదోవ పట్టించాలని మంకుపట్టు పట్టిన మీలాంటి వారు వ్యాసాన్ని చదవకుండానే దాన్ని ప్రస్తావిస్తుంటారు' అని ఎద్దేవా చేసింది.

గుజరాత్‌లో ఉత్సాహంగా పతంగుల పండగ

అహ్మదాబాద్: ఆదివారంనాడు ఇక్కడ పతంగుల ఉత్సవం కన్నుల పండువగా ప్రారంభమైంది. గుజరాత్‌లో జరిగిన పతంగుల పండగలో 45 దేశాలకు చెందిన ప్రతినిధులు, దేశంలో 13 రాష్ట్రాలకు చెందిన వారు ఉత్సాహంగా పాల్గొన్నారు. సబర్మతి నదీ తీరాన గుజరాత్ గవర్నర్ ఓపి కోహ్లీ, రాష్ట్ర ముఖ్యమంత్రి విజయ్ రూపానీ పతంగుల పండగను ప్రారంభించారు. అమెరికా, బ్రిటన్, కంబోడియా, నేపాల్ జాతీయులతో సహా 151 మంది అభ్యర్థులు ఈ ఉత్సవంలో పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు. గుజరాత్ సమగ్రతకు ఈ ఉత్సవం నిదర్శనంగా మారిందని రూపానీ చెప్పారు. గాలిపటాలను తయారు చేసే పేదలకు ఈ ఉత్సవం ఆర్థికంగా చేయూతనిస్తోందన్నారు. వివిధ మతస్థుల మధ్య ఆరోగ్యకరమైన వాతావరణాన్ని, సోదరభావాన్ని ఈ పండగ పెంపొందిస్తుందని గవర్నర్ కోహ్లీ పేర్కొన్నారు. జనవరి 14న వచ్చే మకర సంక్రాంతి సందర్భంగా గుజరాత్‌లో ఏటా గాలిపటాల పండగ జరుగుతుంది. ఈ ఏడాది స్టాచ్యూ ఆఫ్ యూనిటీ (సర్దార్ పటేల్ విగ్రహం ఉన్న ప్రదేశం)ఉన్న కేవడియాలో కూడా గాలిపటాల పండగ జరపాలని గుజరాత్ ప్రభుత్వం నిర్ణయించింది.

ఎయిర్ పోర్ట్‌ల తరహాలో సీల్డ్ రైల్వేస్టేషన్లు

రైల్వేల వినూత్న పథకం • 20 నిముషాల ముందే ప్రయాణికులు రావాలి

న్యూఢిల్లీ: విమానాశ్రయాల తరహాలోనే రైల్వే స్టేషన్లను కూడా సీల్ చేయాలని రైల్వేశాఖ భావిస్తోంది. భద్రతాపరమైన తనిఖీల ప్రక్రియపూర్తి చేసుకునేందుకు ఈ చర్య చేపట్టబోతున్నారు. ఈ కారణంగా ప్రయాణికులు రైలు బయలుదేరడానికి 15-20 నిముషాల ముందే స్టేషన్‌కు చేరుకోవలసి ఉంటుంది. ఉన్నత స్థాయి సాంకేతికతతో కూడిన ఈ ప్రక్రియను ఈ నెలలో ప్రారంభమయ్యే కుంభమేళాను దృష్టిలో ఉంచుకొని అలహాబాద్ రైల్వే స్టేషన్‌లోను, కర్ణాటకలోని హుబ్లీ స్టేషన్‌లోనూ ఇప్పటికే అమలు చేస్తున్నారు. మరో 202 స్టేషన్లలో దీని అమలుకు బ్లూప్రింట్‌ను సిద్ధం చేసినట్టు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ అరుణ్ కుమార్ తెలిపారు. 'రైల్వే స్టేషన్లలో ప్రవేశ ద్వారాలను మొదట గుర్తించి, వాటిలో ఎన్నింటిని మూసేయాలో నిర్ణయించాల్సి ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో శాశ్వతంతగా సరిహద్దు గోడల్ని కట్టడం ద్వారా మూసేయవచ్చు. మిగతావాటివద్ద ఆర్‌పిఎఫ్ సిబ్బందిని నియమించవచ్చు. ఇంకొన్ని గేట్లను పడగొట్టవచ్చు' అన్నారాయన. ప్రతి ఎంట్రీ పాయింట్ దగ్గర సెక్యూరిటీ చెక్ ఉంటుంది. ఎయిర్‌పోర్ట్‌ల్లో మాదిరి కొన్ని గంటల ముందే రానక్కర్లేదు. రైలు బయలుదేరడానికి 15-20 నిముషాల ముందొస్తే చాలు. సెక్యూరిటీ ప్రక్రియ కారణంగా వాళ్లకు ఆలస్యం కాకూడదని తెలిపారు. భద్రతను పెంచినా, భద్రతా సిబ్బందిని పెంచాల్సిన అవసరం లేదన్నారు. ఈ విధానాన్ని అమలు చేస్తే సిబ్బంది అవసరం కూడా తగ్గుతుంది. 202 రైల్వే స్టేషన్లలో భద్రతను పటిష్టం చేయడానికి ఇంటిగ్రేటెడ్ సెక్యూరిటీ సిస్టంను (ఐఎస్ఎస్)ను 2016లో ఆమోదించాము. ఆ ప్లాన్‌లో భాగంగా ఈ చర్యలు తీసుకుంటున్నాం' అని అరుణ్‌కుమార్ తెలిపారు.

స్నేహితుడు నిప్పంటించడంతో వ్యక్తికి గాయాలు

ఘజియాబాద్ : మొబైల్ ఫోన్ గురించి వచ్చిన తగాదాలో ఒకతనికి అతని స్నేహితుడే నిప్పుపెట్టాడు. దాంతో అతనికి తీవ్రగాయాలైనట్టు పోలీసులు తెలిపారు. షహిబాబాద్ ప్రాంతంలో గగన్ విహార్ ప్రాంతంలో ఈ సంఘటన జరిగిందని నగర ఎస్‌పి శ్లోక్ కుమార్ చెప్పారు. శివం అనే వ్యక్తి శుక్రవారం రాత్రి తన స్నేహితుడు సల్మాన్ సెల్‌ఫోన్‌ను బలవంతంగా లాక్కున్నాడు. ఆ తర్వాత ఫోన్ పనిచేయడం మానేసింది. తను దాన్ని బాగుచేసిస్తానన్నాడు. కానీ ఈ విషయంలో ఇద్దరి మధ్యా వాగ్వాదం చోటుచేసుకుంది. శనివారం ఉదయం సల్మాన్ మరో ఇద్దరితో కలిసి వెళ్లి, శివంను ఇంట్లోంచి బయటికి రమ్మన్నాడు. వాళ్లు బైక్‌లోంచి పెట్రోల్ తీసి, శివం వంటిమీద పోసి, నిప్పంటించారని ఎస్‌పి చెప్పారు.

కనీసం స్టీల్ వాల్ అయినా ఓకె


మెక్సికో గోడపై దిగొచ్చిన ట్రంప్

వాషింగ్టన్ : మెక్సికో వాల్ నిర్మాణంపై అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ ఓ మెట్టు దిగారు. కాంక్రీటు వాల్ కోసం తాను పట్టబట్టబోనని, అయితే మెక్సికో నుంచి అక్రమ ప్రవేశాల నిరోధానికి ఇనుప కంచె అయినా ఉండాల్సిందేనని తేల్చిచెప్పారు. అమెరికా కాంగ్రెస్‌తో వైట్‌హౌస్ ఉన్నతాధికారులు ఆదివారం జరిపిన సమావేశంలో ట్రంప్ ప్రతిపాదనను వెల్లడించారు. షట్‌డౌన్ నివారణకు జరుగుతున్న చర్చలు విఫలం అవుతున్న దశలో ట్రంప్ ప్రతిపాదన కీలకంగా మారింది. కాంక్రిటు వాల్ నిర్మాణానికి ట్రంప్ డిమాండ్ చేసిన భారీ స్థాయి నిధులు మంజూరీకి వీలు కాదని ప్రతిపక్ష డెమొక్రట్లు స్పష్టం చేయడంతో అమెరికా ప్రభుత్వంలో నెలకొన్న తాత్కాలిక ప్రతిష్టంభన మూడువారాలుగా సాగుతోంది. వేలాది మంది మెక్సికో సరిహద్దుల గుండా అమెరికాలోకి ప్రవేశిస్తున్నారని, దీనితో అమెరికా ఆర్థిక వ్యవస్థకు గండిపడుతోందని, అంతేకాకుండా విద్రోహ శక్తుల ఆగమనానికి ఆటంకం లేకుండా పోతోందని ట్రంప్ చెప్పారు. ఈ దశలో సరిహద్దులలో స్టీల్ వాల్ వంటి ఏదైనా భౌతికమైన అడ్డుగోడ తప్పనిసరి అని ట్రంప్ తెలిపారు. ప్రతిష్టంభన తొలిగింపునకు వైట్‌హౌస్ అధికారులు, కాంగ్రెస్ సభ సహాయకుల మధ్య చర్చలు జరుగుతున్నాయి. అయితే వీటిలో ఎటువంటి పురోగతి కన్పించలేదని ట్రంప్ తొలుత తెలిపారు. చర్చల వద్దకు అధికార యంత్రాంగం వెళ్లుతుందని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇప్పటికైతే ఎక్కడేసిన కోటు అక్కడిగానే ఉందని ట్రంప్ తెలిపారు. అయితే తాత్కాలిక షట్‌డౌన్ నివారణ దిశలో కొంతలో కొంత ముందడుగు పడిందని ప్రతిపక్షాలు తెలిపాయి. ప్రభుత్వం 5.6 బిలియన్ డాలర్ల నిధుల కోసం పట్టుపట్టడంలేదని, ఇంతవరకూ ఈ పట్టుదలకు దిగడంతోనే ప్రభుత్వం స్తంభించిందని డెమొక్రాట్లు తెలిపారు. నిధుల గురించి లోతుగా చర్చించలేదని వైట్ హౌస్ వర్గాలు తెలిపాయి. అయితే వాల్ నిర్మాణానికి నిధులు అవసరం అని, ఇదే సమయంలో ఇప్పుడు నెలకొన్న షట్‌డౌన్ నివారణకు కూడా ప్రాధాన్యతను ఇవ్వాల్సి ఉంటుందని వారు పేర్కొన్నారు.

కేరళలో ఎవరికీ రక్షణలేదు



న్యూఢిల్లీ:శబరిమల వివాదంలో ప్రభుత్వ పాత్రపై నిరసన వ్యక్తం చేస్తున్న బిజెపి కార్యకర్తలు ఇక్కడి కేరళ హౌస్ ముందు ఆదివారం ధర్నా జరిపారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో తమ పార్టీ కార్యకర్తలపై దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. పార్లమెంట్ స్ట్రీట్ నుంచి కేరళ హౌస్‌కు ర్యాలీగా వెళ్లిన ప్రదర్శకులు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జంతర్ మంతర్ రోడ్‌లో బారికేడ్‌ల వద్ద వారిని అడ్డుకునేందుకు భారీ ఎత్తున పోలీస్ బలగాలను మోహరించారు. కేరళలో సిపిఎం గూండాలు బిజెపి కార్యకర్తల్ని చంపుతున్నారు. ముఖ్యమంత్రి వారిని నివారించలేకపోతున్నారని ఢిల్లీ బిజెపి జనరల్ సెక్రెటరీ కుల్‌జిత్ ఛాహల్ విమర్శించారు. కేరళలో శాంతి భద్రతలు విచ్ఛిన్నమయ్యాయని బిజెపి ఆదివారం ఆరోపించింది. బిజె పి రాజ్యసభ సభ్యుడు వి. మురళీధరన్ నివాసంపై బాంబు దాడి జరగడాన్ని బిజెపి తీవ్రంగా పరిగణించింది. కేరళ రాష్ట్రంలో సామాన్యుడికి కానీ, పార్లమెంటు సభ్యుడికి కానీ భద్రత కరువైందని బిజెపి నాయకురాలు, కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ ఆరోపించారు.



భాషణ భూషణాలు

అది నేను 1981–83ల మధ్య హైదరాబాద్‌లో ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కాలేజీలో ఎం.ఎ. తెలుగు చదువుతున్న రోజులు. రెండవ సంవత్సరంలో డా.సి.నారాయణరెడ్డి గారు మాకు ఆధునిక తెలుగు కవిత్వం బోధిస్తుండేవారు. వారి వాక్శుద్ధీ, సమయస్ఫూర్తీ, సంభాషణాచాతుర్యాల ఉపన్యాసధారగల వారి క్లాసు వినడానికి ఇతర శాఖల విద్యార్థులూ వెనుక కూర్చుని వినేవాళ్ళు. ఆ రోజు నండూరి ఎంకి పాటల నడకను దరువు వేస్తూ పాడి వినిపిస్తుండగా సందర్భవశాత్తూ విశాఖమాండలికానికి చెందిన ఒక పదం అర్థం గురించి చర్చ వచ్చింది. ఆ పదం అర్థంపై ఒక విద్యార్థిని విభేదించినప్పుడు వారు వివరణ ఇస్తూ 'అది కాదు నాయని' అంటూ ఆమె విద్యార్థిని కనుక 'నాయనా' బదులు 'నాయనీ' అని చమత్కారంగా సంబోధించి క్లాసులో గురువు గారు సినారె నవ్వులు పూయించారు.

పంపిన వారు : రఘువర్మ (డా.టీ.లక్ష్మీ నారాయణ), కవి. జగిత్యాల

mail id : editor@manatelangana.org

కావ్య పరిమళం

తెలంగాణ సాహిత్య అకాడమి నెలనెలా 'కావ్య పరిమళం' పరంపరలో భాగంగా ఈ నెల 11న శుక్రవారం సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతి కాన్ఫరెన్స్‌హాల్‌లో డా॥ దాశరథి కృష్ణమాచార్య "అగ్ని ధార" కావ్యంపై దేశపతి శ్రీనివాస్ ప్రసంగం ఉంటుంది. డా॥ నందిని సిధారెడ్డి అధ్యక్షత వహిస్తారని తెలంగాణ సాహిత్య అకాడమి కార్యదర్శి డా॥ ఏనుగు నరసింహారెడ్డి తెలిపారు.

పరిశోధనలకు ఆహ్వానం

శ్రీమతి కొలకలూరి విశ్రాంతమ్మ పరిశోధన పురస్కారం –2019 కొరకు పరిశోధన గ్రంథాలను కోరుతున్నారు. 2016 నుండి 2018 వరకు ముద్రితాలైన తెలుగు పరిశోధనా గ్రంథాలు పోటీకి అర్హమైనవి. ఈ నెల 20 లోపు 3 ప్రతులు డా॥ కొలకలూరి సుమకిరణ్, ఆంగ్లశాఖ ప్రొఫెసర్, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి – 517502 కి పంపాలి. ఎంపికైన వారిని ఫిబ్రవరి 26న హైదరాబాద్‌లో జరిగే సభలో విజేతకు శాలువా, మొమెంటో, రూ. 10 వేల నగదుతో పురస్కరిస్తారు.

విమర్శ గ్రంథాలకు పోటీ

తెలుగు విమర్శ గ్రంథాలు 2016 నుండి 2018 వరకు ముద్రితాలైనవి శ్రీమతి కొలకలూరి భాగీరథీ పురస్కారం కొరకు ఆహ్వానిస్తున్నా. పోటీ కోసం 3 మూడు ప్రతులు ఈ నెల 20 వరకు ఆచార్య మధుజ్యోతి, తెలుగు ఆచార్యులు శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం – తిరుపతి –517502కు పంపాలి.

బాల సాహిత్య రచనల పోటీ – 2019

తానా – మంచి పుస్తకం ఆధ్వర్యంలో 'బాల సాహిత్య రచనల పోటీ –2019' నిర్వహిస్తున్నారు. కనీసం 10 వేల పదాలున్న ఏదేని బాల సాహిత్య రచనను ఫిబ్రవరి 28 వరకు, 'మంచి పుస్తకం : 12–13–439, వీధి నెం– 1, తార్నాక, సికింద్రాబాద్ 17కు పంపాలి. ఉత్తమమైన ఐదు రచనలకు ఒక్కొక్కటికి 10 వేల రూ॥ చొప్పున బహుమతులుంటాయి. యునికోడ్/ అను ప్రతులు info@ man chip ustakam.in కు పంపవచ్చు. వివరాలకు 94907 46614

కళాత్మక దర్శకుడు మృణాల్‌సేన్



అంపశయ్య నవీన్,
9989291299

భారతీయ సినిమాను సమాంతర లేక కళాత్మక సినిమా వైపు మళ్ళించిన ముగ్గురు దర్శకుల్లో మృణాల్‌సేన్ ఒకరు. మిగుతా ఇద్దరు: సత్యజిత్‌రే, రిత్విక్ ఘటక్‌లు. 1955లో సత్యజిత్‌రే దర్శకత్వంలో నిర్మించబడిన "పథేర్ పాంచాలి" చిత్రంతో భారతదేశంలో ఆర్ట్ సినిమాల యుగం ప్రారంభమైందని చెప్పొచ్చు. ఆర్ట్ సినిమా లేక సమాంతర సినిమా భారతదేశంలో ప్రారంభం కావడానికి దారితీసిన పరిస్థితికి నేపథ్యం: 1947లో సత్యజిత్‌రే, చిదానంద దాస్‌గుప్తాలు కలిసి కలకత్తా ఫిల్మ్‌సొసైటీని స్థాపించటమేనని సినిమా చరిత్రకారులు భావిస్తారు. ఫిల్మ్ సొసైటీల ద్వారా మనదేశ ప్రేక్షకులకు ఇంగ్లాండ్, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్‌లాంటి దేశాల్లో నిర్మించబడిన సమాంతర సినిమాలను వీక్షించే అవకాశం కల్గింది. అలాగే ఇక్కడి మంచి సినిమాలు నిర్మించాలన్న ఆసక్తి ఉన్న దర్శకులకు అనేక దేశాల్లో నిర్మించబడ్తున్న ఆర్ట్ సినిమాలను చూసే అవకాశం కల్గింది.

సత్యజిత్‌రే నిర్మించిన పథేర్ పాంచాలి సినిమాతో ప్రభావితులైన మృణాల్‌సేన్, రిత్విక్‌ఘటక్‌లు కూడా ఆర్ట్ సినిమాల నిర్మాణాలను చేపట్టారు. వాస్తవ జీవితాన్ని చిత్రించటమే ఆర్ట్ సినిమాల్లో ప్రధానంగా జరుగుతుంది. వాస్తవ జీవితమే ఆర్ట్ సినిమాకు ముడిపదార్థం. అతినాటకీయత, వాస్తవ జీవితంతో సంబంధం లేని పాటలు, డాన్స్‌లు, ఫైట్స్, కృతకమైన నటీనటుల నటన, సూపర్‌మ్యాన్‌లాంటి కథానాయకులు... ఇలాంటి వాతావరణం ఆర్ట్ సినిమాల్లో ఉండటానికి వీల్లేదు. "సినిమా అనేది కొత్త ఆలోచనలు, భావనలు కల్గించటానికి, వాటిని అభివృద్ధి పరచి వాటిద్వారా కళాత్మక ఆనందం పంచటానికి కృషి చేయాలి గాని కేవలం సాంకేతిక మాయాజాలంతో మేజిక్కులు సృష్టించటానికి కాదు" అని నమ్మినవాడు మృణాల్‌సేన్. యువకుడుగా ఉన్నప్పట్నించే మృణాల్‌సేన్ సత్యజిత్‌రే, చిదానంద దాస్ గుప్తా కలిసి స్థాపించిన కలకత్తా ఫిల్మ్‌సొసైటీ ప్రదర్శిస్తున్న ఆర్ట్‌సినిమాలన్నీ చూస్తుండేవారు. ఆ విధంగా మృణాల్‌సేన్‌కు ఆర్ట్ సినిమాల పట్ల గొప్ప అవగాహన కల్గింది. 1923, మే 14న జన్మించిన మృణాల్‌సేన్ కలకత్తా విశ్వవిద్యాలయం నుండి ఎం.ఏ. డిగ్రీ తీసుకున్న తర్వాత సినిమా నిర్మాణం పట్ల ఆసక్తి యేర్పడింది. మొదట్లో మామూలు సినిమాలే నిర్మించిన 1969లో ఆయన దర్శకత్వం వహించిన "భువన్ షోమ్"తో ఆయనకు ఆర్ట్ సినిమా దర్శకుడుగా గొప్ప పేరు లభించింది. భువన్‌షోమ్ సినిమా ఆయన నిర్మించిన మొట్టమొదటి ఆర్ట్ సినిమా. ఈ సినిమా ఆయన హిందీలో నిర్మించాడు. ఆర్ట్ సినిమాలు ఆర్థికపరంగా విజయవంతం కావు అనుకునేవారు. కాని భువన్‌షోమ్ ఆర్థికంగా కూడా విజయవంతమైంది. ఈ సినిమాలో గొప్ప బెంగాలీ నటుడైన ఉత్పల్‌దత్ ముఖ్యమైన పాత్ర పోషించాడు. ఆయనతోపాటు ఈ సినిమాలో సుహాసినీ మూలే గొప్పగా నటించారు.

రైల్వేస్‌లో పనిచేసే ఒక టికెట్ చెకింగ్ అధికారిని (సాధూమెహర్) రైల్వే అధికారులు చాలా దూర ప్రదేశానికి బదిలీ చేస్తారు. ఎందుకంటే అతడు ప్రయాణీకుల నుండి విరివిగా లంచాలు తీసుకుంటున్నాడన్న ఫిర్యాదులు అతని మీదున్నాయి. అయితే ఆ ఆఫీసర్ భార్యకు (సుహాసిని మూలే) ఒక పెద్ద రైల్వే ఆఫీసర్ (ఉత్పల్‌దత్) పరిచయమౌతాడు. ఆ రైల్వే ఆఫీసర్ పేరు 'భువన్ షోమ్'. అతడు గుజరాత్‌లోని కచ్ ప్రాంతం చూడటానికి ఒక టూరిస్టుగా వస్తాడు. అతనికి ఆ ప్రాంతమంతా చూపించే గైడ్‌గా ఆ బదిలీ అయిన చెకింగ్ మాస్టర్ భార్య పనిచేస్తుంది. ఎప్పుడూ సీరియస్‌గా ఉండే భువన్‌షోమ్‌కు ఆ ప్రాంతమంతా చూపిస్తూ సుహాసినీ మూలే అతన్ని బాగా ఆకర్షిస్తుంది. బోల్డు జోక్స్ చెప్పి



అతన్ని బాగా నవ్విస్తుంది. భువన్‌షోమ్ (ఉత్పల్‌దత్)కు ఆమె చాలా నచ్చుతుంది. కచ్ ప్రాంతంలోని టూరిస్టు ప్రాంతాలన్నీ చూడటం పూర్తయ్యాక మళ్ళీ బొంబాయి వెళ్ళిపోతున్న భువన్ షోమ్ ఆమెతో "నువ్వు ఈ వారం రోజులు నన్ను భలేగా ఎంటర్‌టైన్ చేశావు. నీకేదన్న సహాయం కావాలంటే కోరుకో" అంటాడు. అప్పుడామె "నా భర్త రైల్వేస్‌లోనే పనిచేస్తాడు. ఈమధ్యనే అతన్ని చాలాదూరం ట్రాన్స్‌ఫర్ చేశారు. అతన్ని మా ప్రాంతానికి దగ్గర్లో ఉన్న ఫలానా రైలుస్టేషన్‌కు ట్రాన్స్‌ఫర్ చేస్తే నేనెప్పుడూ మీకు కృతజ్ఞురాలుగా ఉంటానంటుందామె. "నీ భర్తకు తప్పకుండా సహాయం చేస్తానని భువన్‌షోమ్ ఆమె భర్తను బొంబాయి మహానగరంలోని ఒక రైల్వేస్టేషన్‌కు బదిలీ చేయిస్తాడు. అప్పుడామె భర్త "బొంబాయి లాంటి పెద్ద నగరానికి వెళ్తున్నానంటే లంచాలింకా బాగా దొరుకుతాయనుకుంటాడు.

స్థూలంగా ఇదీ భువన్‌షోమ్ కథ. మొత్తం సినిమాను అవుట్‌డోర్‌లోనే... అందమైన దృశ్యాల మధ్య షూట్ చేశారు. అద్భుతమైన ఫోటోగ్రఫీ... ఉత్పల్‌దత్, సుహాసినీ మూలే గొప్ప నటన... సినిమాలో పాటలు లేవు. ఎప్పుడూ సీరియస్‌గా, స్ట్రిక్టుగా ఉండే భువన్‌షోమ్‌ను ఆమె (సుహాసినీ మూలే) కడుపు నిండా నవ్వించడం, స్ట్రిక్టుగా ఉండే భువన్‌షోమ్ తనను బాగా నవ్వించిన ఆ అమ్మాయి భర్తను ఇదివరకంటే ఎక్కువ లంచాలు దొరికే బొంబాయి లాంటి మహానగరానికి బదిలీ చేయించటం ఈ దృశ్యాలన్నీ ప్రేక్షకులకు బాగా నచ్చాయి. బనఫూల్ అన్న బెంగాలీ రచయిత రచించిన ఓ చిన్న కథ ఆధారంగా మృణాల్ సేన్ ఈ సినిమాను రూపొందించాడు. ఈ సినిమాకు జాతీయ ఉత్తమచిత్రం, జాతీయ ఉత్తమ దర్శకుడు, జాతీయ ఉత్తమ నటుడు మొదలైన అవార్డులు లభించాయి. ఇలా మృణాల్‌సేన్ మొత్తం 27 సినిమాలకు దర్శకత్వం వహించి ఎన్నో జాతీయ, అంతర్జాతీయ అవార్డులు గెల్చుకున్నాడు. ప్రపంచంలో ఎన్నో చోట్ల జరిగే చలనచిత్రోత్సవాల్లో ఆయన సినిమాల్ని ప్రదర్శించారు. భువన్‌షోమ్ తర్వాత మృణాల్‌సేన్ నిర్మించిన మరో గొప్ప హిందీ చిత్రం "మృగయా" అంటే వేట. మిథున్ చక్రవర్తి తొలిసారిగా నటించిన చిత్రం ఇదే. అడవిలో వేట పేరుతో మనుష్యులను చంపుతున్న పెద్దపులుల లాంటి జంతువుల్ని చంపిన వాడు హీరో అవుతాడు. కానీ జనావాసాల్లో తోటి మనుష్యుల్ని చంపుతున్న మానవ మృగాల్ని చంపుతున్న వాళ్ళకు మరణశిక్ష విధించటం ఏమిటని ప్రశ్నిస్తుందీ సినిమా. ఈ సినిమాలో ప్రధాన భూమికను పోషించిన మిథున్ చక్రవర్తికి జాతీయ ఉత్తమ నటుడి పురస్కారం లభించింది.

మృణాల్‌సేన్ తెలుగులో కూడా ఒక సినిమా నిర్మించాడు. అదే "ఒక ఊరి కథ". మృణాల్‌సేన్ దీనిని 1977లో నిర్మించాడు. ప్రేమ్‌చంద్ రచించిన "కఫన్" ఆధారంగా ఈ సినిమాను నిర్మించారు. ఆర్థికంగా విజయవంతం కాకపోయినా ఈ సినిమాకు చాలా జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు లభించాయి."కలకత్తా ట్రయోలజీ"గా ప్రసిద్ధి చెందిన మూడు చిత్రాలు "ఇంటర్వ్యూ" (1970), "కలకత్తా 71" (1972), "పదాతిక్" (1973) ఈ మూడు సినిమాల్లో కూడా "కలకత్తా" నగరం ఒక ముఖ్య పాత్రలా రూపొందింది. ఈ మూడు చిత్రాలు ప్రధానంగా కమ్యూనిస్టు పార్టీలో యేర్పడిన విభజన, ఉవ్వెత్తున ఎగిసిపడిన నక్సలైట్ ఉద్యమం, కలకత్తా నగరంలో తాండవించిన నిరుద్యోగ సమస్య మొదలైనవి అత్యంత వాస్తవికంగా చిత్రించబడినాయి.1978లో మృణాల్‌సేన్ "ఏక్‌దిన్ ప్రతిదిన్" చిత్రాన్ని నిర్మించాడు.

కలకత్తాలో నివసిస్తున్న ఒక మధ్యతరగతి కుటుంబానికి చెందిన ఒక ఉద్యోగి అయిన యువతి ఒకరోజు అర్ధరాత్రి దాటాక కూడా ఇల్లు చేరదు. ఆమె తల్లిదండ్రులే కాకుండా ఆ వీధిలో నివసిస్తున్న అనేకమంది స్త్రీ పురుషులు "అర్ధరాత్రి దాటాక కూడా ఆ అమ్మాయి ఇల్లు ఎందుకు చేరలేదు" అన్న దాన్ని గూర్చి బోల్డు ఊహాగానాలు చేస్తారు. "ఆ అమ్మాయి ఎవరితోనైనా లేచిపోయిందా?" లేక "యే తప్పైనా చేసి పోలీసుల చేతికి చిక్కిందా?" ఇలాంటి ఊహాగానాలే చేస్తుంటారు. చివరికామె ఇంటికొచ్చి సిటీలో రెండు గ్రూపుల మధ్య గొడవలు జరిగి, ట్రాఫిక్‌జామ్ అయ్యిందని, ఈ కారణం వల్లనే ఇంత ఆలస్యం జరిగిందని చెబుతుంది.


ఒక ఆడపిల్ల సకాలంలో ఇల్లు చేరకపోతే సమాజం ఆమెను గురించి ఎంత నీచంగా ఆలోచిస్తుందో ఈ సినిమాలో మృణాల్ సేన్ అద్భుతంగా చూపించాడు.

1991లో మృణాల్‌సేన్ "మహా పృథ్వీ" అన్న సినిమాను నిర్మించాడు. 1991లో తూర్పుయూరోపియన్ దేశాల్లో కమ్యూనిస్టు ప్రభుత్వాలు కూలిపోవడం, బెర్లిన్ గోడను పగులగొట్టడం లాంటి సంఘటనలతో వ్యథ చెందిన కలకత్తాలోని ఓ మధ్యతరగతి కుటుంబానికి చెందిన ఓ పెద్దామె ఉరివేసుకొని మరణించిన సంఘటన ఆధారంగా మృణాల్‌సేన్ ఈ సినిమాను నిర్మించాడు. ఈ విధంగా 27 అత్యంత వాస్తవిక సినిమాలను నిర్మించిన మృణాల్‌సేన్ సినిమాలను అనేక జాతీయ, అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ప్రదర్శించారు. 1981లో భారత అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌లోనూ, బెర్లిన్ ఫిల్మ్ ఫెస్టివల్‌లోనూ ప్రత్యేక రెట్రాస్పెక్టివ్‌గా ప్రదర్శించబడ్డాయి.

అనేక సంవత్సరాలు ఫిల్మ్ సొసైటీ ఉద్యమంలో క్రియాశీల పాత్రను పోషించిన మృణాల్‌సేన్ చాలాకాలం ఓ.ఓ.ఐ.I. ఉపాధ్యక్షుడుగా పనిచేశాడు.


95 యేళ్ళ నిండు జీవితాన్ని జీవించిన మృణాల్‌సేన్ మొన్న, అంటే 30.12.2018 నాడు ఉదయం కలకత్తాలోని తన నివాసంలో గుండెపోటుతో చివరిశ్వాస విడిచాడు.

సారస్వత సార్వభౌముడు మన కె.సి.ఆర్



దేవులపల్లి ప్రభాకరరావు
9133335055

గత శతాబ్దం(ఇరువదవ శతాబ్దం) సగభాగంలో, అంతకుముందు దాదాపు రెండువందల సంవత్సరాల కంటె ఎక్కువ కాలం తెలంగాణ ప్రజలు, వారి భాష తెలుగు పాలకుల అలక్ష్యానికి, అనాదరణకు, అవమానాలకు గురి అయినాయన్నది చారిత్రక సత్యం. ఈ విషయంలో గోలకొండ కుతుబ్ షాహి పాలన కొంత మెరుగని చెప్పాలి. పాలకుల అలక్ష్యధోరణిని, అనాదరణను, అవమానాలను ఎదుర్కొంటూనె తెలంగాణ ప్రజలు, విశేషించి కవులు, రచయితలు, పండితులు, పరిశోధకులు తమ భాషను, వాఙ్మయాన్ని సుసంపన్నం చేసుకోవడానికి ఎంతో కృషి జరిపారు. నిజామ్ పాలనలోని తెలంగాణ ప్రాంతంలో తెలుగు కవులు, రచయితలు, పాఠకులు లేరని ఆంధ్రులు హేళన చేసినప్పుడు ఎనభయి సంవత్సరాల కిందట, అప్పటి గోలకొండ పత్రిక సంపాదకుడు, మహా పండితుడు, పరిశోధకుడు సురవరం ప్రతాపరెడ్డి తెలంగాణ ఊరూర నివురుగప్పిన నిప్పువలె మరుగున పడి ఉన్న కవుల కవితలను ఆహ్వానించి, సేకరించి, వాటిని సంకలనం చేసి గోలకొండ కవుల సంచిక ను ప్రచురించారు. తెలంగాణ ప్రాంతంలో, తెలంగాణ తెలుగు భాష, సారస్వతాలు బతికె ఉన్నాయని, వెలుగుతున్నాయని ఆధునిక యుగంలో ప్రపంచానికి సోదాహరణంగా చాటి చెప్పిన ప్రథమ ప్రయత్నం సురవరం వారిదే. తెలంగాణ తెలుగుభాష, సారస్వతాలకు వేయి సంవత్సరాల ఉజ్వల చరిత్ర ఉంది. ఈ ఉజ్వల చరిత్రను ఉద్దేశపూర్వకంగా గుర్తించకుండా అవహేళన చేసినవారు సున్నితంగా చెప్పాలంటే అజ్ఞానులు. తెలంగాణ ప్రాంతంపై రాజకీయంగా, పరిపాలనాపరంగా పెత్తనం చేసి, అన్ని రంగాలలో పిండారీలవలె దోపిడి చేసిన పరాయివాళ్లు 'ఇదేం తెలుగు' అంటూ తెలంగాణ తెలుగుభాషను ఘోరంగా గేలి చేసారు. తాము మాట్లాడేది నిజంగా తెలుగు కాదేమోనని తెలంగాణ ప్రజలు భయపడే, ఆ భయంతో న్యూనతాభావానికి(ఇన్ఫీర్యారిటీకి) గురిఅయ్యే, తమ అస్తిత్వాన్ని,



ఆత్మగౌరవాన్ని సైతం కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. తెలంగాణ ప్రజలు తమ సహజభాషలో మాట్లాడటానికి, ప్రసంగించడానికి, రాయడానికి బిడియపడిన క్లిష్ట పరిస్థితి ఉత్పన్నమయింది. ఈ దుస్థితిలో తెలంగాణ భాషా పతాకం పడిపోకుండా పట్టుకుని, నిటారుగా నిలిపి ఆదుకున్న ఆపద్బాంధవుడు, తెలంగాణ భాషోద్ధారకుడు శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖరరావు. పరాయిల గాలిదుమారంలో తెలంగాణ భాషా దీపం ఆరిపోకుండా చూసి, అది సహస్ర జ్యోతులతో వెలుగడానికి తగిన చర్యలు తీసుకున్న ఘనత కె.సి.ఆర్.దే; తెలంగాణ భాషా జ్యోతి అఖండంగా వెలిగినంత కాలం ఆయన అమోఘ పాత్ర నేల నాలుగు దిశల చిరస్మరణీయమవుతుంది. ఆయన స్వయంగా కవి, సాహిత్యపిపాసి, తపస్వి.

పద్నాలుగు సంవత్సరాలు సుదీర్ఘ తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమానికి ఏకైక సేనానిగ, ఎదురులేని మహానాయకుడుగా ఆయన చేబూనిన ఒకేఒక ఆయుధం, వజ్రాయుధం భాషఅది తెలంగాణ భాష. పద్నాలుగు సంవత్సరాల ఉద్యమకాలంలో, తరువాత అయిదు సంవత్సరాలు గౌరవనీయ ముఖ్యమంత్రిగా పరిపాలన బాధ్యత నిర్వహణలో వివిధ విషయాలపై, అనేక అంశాలపై(సాంకేతిక, శాస్త్రీయ అంశాలపై గూడ) కొన్నివేల సందర్భాలలో, కొన్ని వందల వేదికలపై కె.సి.ఆర్.ఏమాత్రం సంకోచం లేకుండా తన తెలంగాణ ప్రజల గ్రామ్య, వ్యవహారిక భాషలో, సరళ, శక్తివంతశైలిలో అనర్గళంగా, గంభీరంగా ప్రసంగించారుప్రసంగిస్తున్నారు. తెలంగాణ కోట్ల ప్రజల భావాలను ఆకళింపు చేసుకోవడానికి, కోట్లాది తెలంగాణ ప్రజలకు తన అమూల్య సందేశం అందించి మార్గదర్శకత్వం వహించడానికి, ఉద్యమస్ఫూర్తి కల్గించడానికి ప్రజానాయకుడు కె.సి.ఆర్.కు అచ్చమయిన తెలంగాణ ప్రజల తెలుగు భాష ఒక దివ్యాస్త్రంగా ఉపయోగపడింది ఉపయోగపడుతున్నది. కె.సి.ఆర్.తన వజ్రాయుధ భాషగా ఉద్యమకాలంలో, తరువాత ప్రభుత్వ నిర్వహణలో ఉపయోగించిన, ఉపయోగిస్తున్న(ఇంటర్వ్యూలు మొదలయిన వాటిలో గూడ) తెలంగాణ తెలుగుభాష ఈరోజు ప్రపంచమంతటా గుర్తింపు, ఆదరణ పొందడం విశేషం. ఇది తెలంగాణ తెలుగుభాషకు కె.సి.ఆర్.సంతరింపజేసిన అపూర్వగౌరవం, ఔన్నత్యం. నిన్న మొన్నటి వరకు తెలంగాణ తెలుగుభాషను చులకన చేసి ఈసడించిన వారు సైతం ఈరోజు అదే భాషలో మాట్లాడడానికి తంటాలుపడుతున్నారు. ఇది తెలంగాణ తెలుగుభాష విషయంలో కె.సి.ఆర్.సాధించిన ఘనవిజయం. తెలంగాణ తెలుగు భాష, సారస్వతం, సంస్కృతి గత వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పి, భవిష్యత్తులో తెలంగాణ తెలుగుభాష, సారస్వతం, సంస్కృతి మరింత ఉజ్వల వికాసం పొందడానికి సకల చర్యలు తీసుకోవాలన్నది కె.సి.ఆర్.తపన, పరమాశయం. ఈ తపనతోనె, ఈ ఆశయసాధన కోసమే ఆయన తెలంగాణ రాష్ట్రం, తొలి తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తరువాత కేవలం మూడు సంవత్సరాలకే తెలంగాణ ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణకు సంకల్పించి, అది విజయవంతం కావడానికి అన్నివిధాల అండగా నిలిచారు, అమితమయిన శ్రద్ధాసక్తులతో నేతృత్వం వహించారు. ఆ సందర్భాన ఆయన తెలంగాణ ప్రముఖ కవులు, రచయితలు, మేధావులు, పండితులు, సాహితీవేత్తలతో పలు పర్యాయాలు జరిపిన చర్చలు అసాధారణమయినవి. తెలుగు భాష, సాహిత్యం, చరిత్ర, సంస్కృతుల గురించి పనికిరాని ఎన్నో మాటలు మాట్లాడిన ఆంధ్ర పాలకులు ఆంధ్రప్రదేశ్ ఏర్పాటయిన తరువాత పద్దెనిమిది సంవత్సరాలకు ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభలు జరిపారన్నది ఈ సందర్భాన గమనించవలసిన విషయం. తెలంగాణ రాష్ట్ర ప్రథమ ప్రభుత్వం శ్రీ చంద్రశేఖరరావు ముఖ్యమంత్రిగా ఏర్పాటయిన పిదప మొదటి సంవత్సరం లోనె తెలుగు సారస్వతరంగ మహనీయులను, వైతాళికులను ప్రభుత్వపక్షాన గౌరవించే విశిష్ట సంప్రదాయం మొదలయింది; ప్రజాకవి కాళోజీ, మహాకవి దాశరథి సేవల సంస్మరణార్థం ప్రతి సంవత్సరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రముఖ తెలంగాణ కవులు, రచయితలు, కళాకారులకు లక్షరూపాయల అవార్డులిచ్చి ఘనంగా సన్మానిస్తున్నది. కాళోజీ జయంతి సెప్టెంబర్ 9 ప్రతి సంవత్సరం తెలంగాణ రాష్ట్రంలో అధికార భాషా దినోత్సవంగా జరుగుతున్నది. గౌరవనీయ ముఖ్యమంత్రి కె.సి.ఆర్. చొరవతో 2018 విద్యాసంవత్సరం నుంచి తెలంగాణ రాష్ట్రమంతట అన్ని పాఠశాలలలో తెలుగు మొదటి తరగతి నుంచి పదవ తరగతి వరకు తప్పనిసరి చదువవలసిన భాషగా ప్రవేశపెట్టబడింది. తెలంగాణ తెలుగు కవులు, రచయితలు, పండితులు, పాత్రికేయులు, పరిశోధకులకు కె.సి.ఆర్. ప్రభుత్వం అన్నివిధాల ప్రోత్సాహం అందిస్తున్నది. సారస్వత సార్వభౌముడు కె.సి.ఆర్.నాయకత్వంలో, ఆయన అందిస్తున్న స్ఫూర్తితో తెలంగాణ తెలుగుభాష, వాఙ్మయ రంగాలలో ఒక మహోజ్వల ఘట్టం ఆరంభమయింది.

నోముల సార్ ఇక లేరు

నోముల సార్ ఇంతలో ఎలా కనుమరుగై కనిపించకుండా పోయాడు
ఎన్నెన్నో కన్నీళ్ళు కథలు ఖైఫియతులు విడిచివెళ్లిపోయాడు
ఆయన హాస్యాల విసురులు ద్వంద్వార్థాల ఛలోక్తులు
మాత్రం చిరకాలం నిలిచిపోతాయి
ఆయనలాంటి విద్యావేత్త అధ్యాపకుడు మరెవరూ ఇక కనిపించరు
ఒక అనితర సాధ్యమైన పి.హెచ్.డి. పట్టా కోసం పరిశోధించి సాధించి
ఎందరికో ఆదర్శంగా నిలిచాడు.
యువతను మునుముందుకు నడిపించాడు
ఉధృతమైన జలపాతంలా ఉపన్యసిస్తుంటే
మనతెలంగాణ మట్టిబిడ్డ ఎంతటి ఎత్తులకు ఎదిగాడని
కవులు విమర్శకులు భాషా పండితులు ప్రశంసల జల్లులు కురిపించారు
ఆకాశాన్ని తాకుతూ నడిచి ఊరి చివర నిశ్శబ్ద వాటికకు
వెళ్లిపోతావని కలలోనైనా ఊహించలేదు
నల్లగొండ గుండె కొట్టుకోవడం మానేసింది
రామగిరి చిన్నబోయి చీకటి అలుముకుంది
చౌరస్తాలో పెద్దగడియారం ఆగిపోయింది
ముప్పారం మౌనంగా పారుతూ అక్క చలిమె అడుగంటి ఎండిపోయింది
ఆ కొండల నడుమ నాగార్జున కాలేజ్ తన ఆవరణలో నిలబడి శ్రద్ధాంజలి ఘటించింది.
జయహో అనే నీ స్వరం ఈ గాలిలో ఇంకా గింగురుమంటుంది
జయమిత్రుడు మన పెద్ద దిక్కు మనకు దక్కకుండా పోయాడు
అక్క రుక్మిణి రాహుల్ రజనీశ్ కూతుళ్ళు అల్లుంద్రు శంకర్‌రావులను
అనాథలను చేసి వెళ్లిపోవడానికి నీ మనసు ఎలా ఒప్పుకుంది
అన్న దేవులపల్లి కనకాచారి సుదర్శన్లు నిన్ను పోగొట్టుకొని
దీనంగా దేవులాటలో పడిపోయారు
సత్తయ్య డబ్బ నిశ్శబ్దంగా నిర్మానుష్యమైపోయింది ఇన్నాళ్ళు నవ్వును
నమ్ముకొని బతికాము
ఇక ఎవరితో మనసారా నవ్వుల్ని పంచుకోవాలి
ఇక కన్నీళ్లతో కాలం గడపడం ఇప్పుడు భారంగా బాధగా వుంది
నల్గొండకా నవాబ్ బగల్‌మె కితాబ్
జనాబ్ సత్యనారాయణ సాబ్ తెఝె సొబార్ సలామ్
అల్విదా ఖుదాఫీస్ జయహో అమర్‌హో నోముల సార్

– ప్రొ. పి.లక్ష్మీ నారాయణ , 9542656636



సకుటుంబం

సంతోషకరమైన జీవితాన్ని గడపాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. జీవితాన్ని ఆనందమయం చేసుకోవడానికి ఎవరికి తోచిన పద్ధతులను వారు పాటిస్తుంటారు. చాలా మంది లైఫ్‌లో హ్యాపీగా ఉండాలంటే డబ్బు వుంటే చాలు, మంచి ఉద్యోగం వుంటే చాలు ఇలా రకరకాలుగా అనుకుంటారు. కానీ జీవితాన్ని సంతోషంగా గడపడానికి కావాల్సిన సౌకర్యాలు మాత్రమే వుంటే సరిపోదు. సంతోషాన్ని వస్తువులలో, డబ్బులో వెతకాల్సిన అవసరం కూడా లేదు. మీకు నచ్చింది చేస్తే సంతోషం మీ దరి చేరుతుంది. మీరు ఏది అనుకుంటే అది చేయండి, మీలా మీరుండండి అప్పుడు అన్నీ మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తాయి. కానీ కొన్ని సందర్భాల్లో ఎదురయ్యే సంఘటనలు మనల్ని చిక్కుల ముడిలో పడేసి ఆనందానికి దూరం చేస్తాయి. అలాంటి పరిస్థితులలో కూడా ముఖంపై చిరునవ్వుతో సంతోషాలను సృష్టించుకుంటూ ముందుకు సాగితే ప్రపంచంలో మన కన్నా గొప్ప వ్యక్తి ఎవరూ ఉండరు. అలాంటి జీవితం కోసం చిన్న చిట్కాలు మీకోసం.

సంతోషం సొంతం కావాలంటే...!

ప్రేమను వ్యక్త పరచడానికి చాలా మార్గాలుంటాయి. కానీ మనం వ్యక్తపరిచే విధానం మన ఆత్మీయులను మరింత స్పెషల్‌గా ఫీల్ చెయ్యాలి.
మనలోని భావాలను ఎప్పటికప్పుడు సరికొత్త పద్ధతులలో తెలుపుతూ వారి మనస్సుకి దగ్గరగా వుండటానికి ప్రయత్నించాలి. అలాంటి మ్యాజిక్ జరగాలంటే వోల్డ్ ఈజ్ గోల్డ్ అన్న విషయాన్ని గుర్తుచేసుకొని ఉత్తరం ద్వారా మీ ప్రేమను వారికి తెలియజేయండి. మనసులో భావాలను అక్షర రూపంలో వండిస్తే ఇష్టపడని వారు ఎవరూ వుండరు. అందువల్ల ఇలాంటి వోల్డ్ ట్రెండ్స్‌తో ప్రేమను తెలుపుతూ సరికొత్త సంతోషాలను చేరుకోండి.





మీకు సంతోషాన్ని కలిగించిన విషయాలను రాయండి:
ఈ ఉరుకుల పరుగుల జీవితానికి కాస్త విరామం ఇచ్చి రోజులో మీ అనుభవాలను, సంతోషాన్ని కలిగించిన విషయాలను నోట్ చేసుకోండి. బాధలో వున్నప్పుడు ఒక్కసారి మీకు సంతోషాన్ని పంచిన విషయాలను చదవండి. మీ ముఖంలోని విచారం కాస్త ఆనందంగా మారిపోతుంది.

బ్రేక్ ఫాస్ట్‌ని మరవకండి....

మనం రోజూ తీసుకునే తొలి ఆహారం బ్రేక్‌ఫాస్ట్. రోజువారీ కార్యక్రమాలను ముందుకు తీసుకువెళ్లేందుకు అవసరమైన శక్తిని ఇవ్వడంలో అల్పాహారం కీలక పాత్ర పోషిస్తుంది. మనం ఉదయాన్నే తీసుకునే ఆహారంలో ఫలాలు, కూరగాయలు ఎక్కువగా ఉండేలా చూసుకుంటే అవి మన రోజు మొత్తాన్ని ఉత్సాహంగా వుంచుతాయి.

క్షమాగుణాన్ని కలిగివుండండి

మిమ్మల్ని బాధపెట్టిన వారిని క్షమించండి. ఇది కష్టమే కాని ప్రయత్నించండి. క్షమగుణాన్ని మించింది ఇంకొకటి లేదని గుర్తుపెట్టుకోండి. చిన్న విషయాలను మనస్సులో పెట్టుకొని ఎదుటి వారిని దూరం చేసుకోకండి. వారిని క్షమించి ఇంకొక అవకాశమిచ్చి చూడండి.

మీ బాధను వ్యక్తపరచండి

మీ బాధను, కోపాన్ని మీలోనే దాచుకోకండి. కొన్ని సందర్భాల్లో వాటిని అణిచివేయడం కంటే వ్యక్తపరచడమే మంచిది. ఎక్కువ సేపు ఒకే విషయం గురించి చింతించకుండా మీ బాధను దాని వల్ల వచ్చిన కోపాన్ని చూపించండి. ఇలా చేయడం వల్ల మనస్సుకి ప్రశాంతత లభిస్తుంది.

ప్రతికూల ఆలోచనలకు దూరంగా వుండండి

నెగిటివిటీ మనల్ని మాత్రమే కాదు మన చుట్టూ వున్న పరిసరాలను కూడా కలుషితం చేస్తుంది. అందువల్ల సాధ్యమైనంత వరకు ప్రతికూల ఆలోచనలకు దూరంగా వుండడి. సానుకూల దృక్పథాన్ని అలవరుచుకోండి. మీలోని నెగిటివ్ ఆలోచనలను పేపర్‌పై రాసి చెత్తకుప్పలో పడేయండి. మీలో వున్న చెడుపై మీరే పోరాడి గెలచి సంతోషాన్ని చేరుకోండి.

ప్రకృతిని ఆస్వాదించండి

ప్రకృతి దేవుడు ప్రసాదించిన గొప్ప వరం. పచ్చని పర్యావరణం ఆరోగ్యమైన జీవితంతో పాటు, మనస్సుకి ప్రశాంతతనిస్తుంది. అందమైన పక్షులు, జంతువులు, ఆకుపచ్చ మొక్కలు, నీలం ఆకాశం, భూమి, నడుస్తున్న నదులు, సముద్ర, అడవులు, గాలి, పర్వతాలు, లోయలు, కొండలు ఆనందలోకాలకు మనల్ని తీసుకెళ్తాయి. అందువల్ల కొత్త కొత్త ప్రదేశాలకు వెళ్ళి ప్రకృతిని ఆస్వాదిస్తూ అన్ని సమస్యలను మర్చిపోండి.

సోషల్ మీడియాకు తక్కువ సమయాన్ని కేటాయించండి

నేడు మనకు సోషల్ మీడియాతో ఉన్న అనుబంధం అంతా ఇంతాకాదు.ఈ మధ్యకాలంలో చాలామంది ప్రతిక్షణాన్నీ, ప్రతి సందర్భాన్నీ ఒడిసి పట్టుకుని పోస్ట్ చేస్తూ ఎక్కువ సమయాన్ని సోషల్ మీడియాకే కేటాయిస్తున్నారు. టెక్నాలజీ పెరుగుతున్నా కొద్ది మనుషుల మధ్య దూరం పెరిగిపోతుంది. అందువల్ల సోషల్ మీడియాకు తక్కువ సమయాన్ని కేటాయించి మనుషులతో కలిసి ప్రస్తుతంలో ఆనందాన్ని వెతుక్కోండి.

సంగీతాన్ని వినండి

ఆహ్లాదకరమైన సంగీతం మిమ్మల్ని రోజు మొత్తం ఉత్సాహంగా వుంచుతుంది. అంతే కాదు ఇష్టమైన పాట అన్ని సమస్యలను మర్చిపోయేలా చేసి కొత్త ఆనందలోకాలకు తీసుకెళ్తుంది. అందువల్ల వీలు దొరికితే మీకిష్టమైన పాటని ప్లే చేసుకొని ఎంజాయ్ చేయండి.

వ్యాయామం చేయండి

మీ శరీరానికి, మనస్సుకి విశ్రాంతి కలిగించడంలో వ్యాయామం కీలక పాత్ర పోషిస్తుంది. దీనిలో మానసిక, శారీరక, ఆధ్యాత్మిక ప్రయోజనాలు ఎన్నో ఉంటాయి. మనిషి శరీరం చేయగలిగే అత్యుత్తమ వ్యాయామాల్లో యోగా ఒకటి. యోగా మనిషిలోని ఒత్తిడిని తగ్గించి సంతోషకరమైన జీవితం వైపు అడుగులు వేయిస్తుంది. రోజు మొత్తాన్ని ప్రశాంతంగా వుంచుతుంది.అందువల్ల ఆనంద మయ జీవితం కోసం రోజూ కొద్ది సేపు యోగా చేయండి.

చిట్కాలు

✻ గర్భిణీలు రక్త హీనతతో బాధపడితే పుట్టే పిల్లలు మరణించే శాతం ఎక్కువ అని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంటుంది. కాబట్టి తల్లుల్లో పోషకాహార లోపం తలెత్తకుండా చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ✻ భోజనం చేసిన తరువాత 20 నిమిషాలు ఆగి కొబ్బరినీళ్లు తాగాలి. దీని వల్ల అజీర్ణం తగ్గుతుంది.
✻ వంటకాల్లో కారానికి బదులు మిరియాల పొడిని వేస్తే రుచిగా ఉంటుంది.

స్నేహితులలో హితులెవరు?



ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్... వంటి సోషల్ నెట్ వర్క్ ఖాతాల్లో మనకి ఎందరో స్నేహితులు. వాటి ద్వారా వ్యక్తి గత సమాచారాన్ని స్నేహితులతో పంచుకుంటుంటాం. అయితే ఆ స్నేహితులకి మరెందరో స్నేహితులు. అంటే ఆ స్నేహితుల స్నేహితులకీ మనం సుపరిచితులమే. ఫలితం మనకి సంబంధించిన సమాచారం మన ప్రమేయం లేకుండానే వాళ్ల నుంచి ఇంకొకరికీ అక్కడి నుంచి మరొకరికీ వెళుతూనే ఉంటుంది. ఈ రకమైన చెయిన్ కారణంగా వ్యక్తిగత సమాచారం గోప్యంగా ఉంచుకోవడం కష్టంగా మారుతుందనీ అది అనేక మందికి రక రకాలుగా వెళుతుందనీ ముఖ్యంగా స్నేహితుల స్నేహితుల ద్వారానే వ్యక్తి గత విషయాలన్నీ బయటకు వస్తున్నాయనీ నిపుణులు చెబుతున్నారు. ప్రధానంగా ఈ సోషల్ నెట్‌వర్క్‌ల కారణంగా వ్యక్తిగత సమాచారాన్ని సేకరించడం విద్రోహ చర్యలకు పాల్పడే వారికీ విదేశీగూఢచార సంస్థలకీ అత్యంత సులభంగా మారిందని వాళ్లు తమ పరిశీలినలో తెలుసుకున్నారు. జాగ్రత్త మరి!

ఇంట్లోనే ఫేషియల్!



చాలామంది మహిళలు ఫేషియల్ కోసం బ్యూటీ పార్లల్‌కి వెళ్తుంటారు. మరి పార్లల్‌కి వెళ్లలేని వారు ఇంట్లోనే ఫేషియల్ చేసుకోవచ్చు..అదెలాగో చూద్దాం..
✻ ముందుగా శనగపిండితో ముఖాన్ని శుభ్రంగా నీటితో కడుక్కోవాలి. ఆ తర్వాత దూదిని ఫ్రిజ్‌లోని ఐస్‌వాటర్‌లో ముంచి ముఖాన్ని తుడుచుకోవాలి.

వేడినీటిలో పసుపు, వేపాకులు వేసి ఆవిరి పట్టుకోవాలి. ఆ నీటిలోనే పెరుగు, పాలు కలిపి ముఖానికి రాయాలి. 20 నిమిషాల పాటు కీరా ముక్కలను కళ్లపై పెట్టుకోవాలి. తరువాత ముఖాన్ని నీటితో కడుగాలి.
✻ ఆలూపేస్ట్‌లో కొంచెం నిమ్మరసం, ఓట్‌మీల్‌పొడి, పాలు కలిపి ముఖానికి రాయాలి. 15 నిమిషాల తరువాత చల్లని నీటితో శుభ్రపరుచుకోవాలి. ఇలా చేస్తే ముఖం కాంతివంతమవుతుంది.
✻ దోసకాయ రసంతో ముఖాన్ని ఐదు నిమిషాల పాటు మర్దనా చేయాలి. 20 నిమిషాల తరువాత నీటితో కడగాలి.
✻ బాదంపొడి, ఓట్‌మీల్ పొడి, పాలు కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాయాలి. 15 నిమిషాల తరువాత గోరువెచ్చని నీటితో కడగాలి. ప్రతిరోజూ ఇలా చేస్తే ముఖం కాంతివంతంగా ఉంటుంది.

చలాకీగా ఉండాలంటే...



కొన్ని ఆహారపదార్థాలు తింటే భారంగానూ ఆయాసంగానూ అనిపిస్తుంది. తిన్నాక ఎందుకు తిన్నామా అనిపిస్తుంది. అదే కొన్ని పదార్థాలు తిన్నప్పుడు ఎంతో తేలికగానూ హుషారుగానూ అనిపిస్తుంది. ఎక్కువసేపు ఆకలి కూడా వేయదు. అలా అటు మెదడుని ఉల్లాసంగానూ ఇటు శరీరాన్ని చలాకీగానూ ఉంచే ఆహారపదార్థాలు కొన్ని ఉంటాయి. అవేమంటే...

బీట్‌రూట్: బీపీ రోగులకి బీట్‌రూట్ ఎంతో మంచిదన్నది తెలిసిందే. ఎందుకంటే బీట్‌రూట్‌ని తీసుకోవడం వల్ల శక్తితో బాటు అందులోని నైట్రేట్ల కారణంగా రక్తనాళాలు వ్యాకోచించడంతో రక్త సరఫరా మెరుగై బీపీ తగ్గుతుంది. ఫలితంగా మెదడు పనితీరు బాగుంటుంది. ఇందులోని పీచు కారణంగా బరువూ తగ్గుతారు. జీర్ణక్రియ బాగుంటుంది.

అరటి పండ్లు : అరటిపండు మంచి పౌష్టికాహారం. ఇందులోని పిండిపదార్థాలు, పొటాషియం, విటమిన్ – బి6, పీచు శక్తినివ్వడంతోబాటు ఆకలినీ తగ్గిస్తాయి.


చిలగడ దుంపలు: వీటిల్లోని సంక్లిష్ట పిండిపదార్థాలూ పీచూ నెమ్మదిగా జీర్ణమవుతూ అంతే నెమ్మదిగా శక్తిని విడుదల చేస్తాయి. దాంతో పొట్ట నిండినట్లుగా అనిపిస్తుంది. అలాగని భారం గానూ ఉండదు.

చేపలు : వీటిల్లో విటమిన్ –డి, బి2, ఒమెగా–3 ఫ్యాటీ ఆమ్లాలు,ఐరన్,జింక్ మెగ్నీషియం వంటి ఖనిజాలు పుష్కలంగా ఉండటంతో ఇవి మెదడును చురుగ్గా ఉంచుతాయి. ముఖ్యంగా అలసటనీ బద్ధకాన్నీ తగ్గిస్తాయివి. తిన్న తరవాత కూడా పొట్ట బరువుగా అనిపించకుండా తేలికగా ఉంటుంది.

డార్క్ చాకొలెట్ : ఇందులోని థియోబ్రొమినిన్ శక్తిని పెంచడంతో బాటు మానసిక ఉల్లాసాన్ని అందిస్తుంది. అదే సమయంలో చాకొలెట్ లోని మెగ్నీషియం సెరటోనిన్ హార్మోన్ విడుదలని పెంచి ఆనందంగా ఉండేలా చేస్తుంది. ఇంకెందుకు ఆలస్యం... ఈ క్షణమే వీటిని మీ ఆహారంలో చేర్చుకుని చురుగ్గా ఉండండి.


మన రంగవల్లులు

21చుక్కలు
11 వచ్చే వరకు
సందు చుక్క



సుగుణ,
బోరబండ

21చుక్కలు
11 వచ్చే వరకు
సందు చుక్క



సంతోషి,
యాదాద్రి



అన్ని రాష్ట్రాలూ కేంద్రానికి సమానమే

మన తెలంగాణ/హైదరాబాద్ : కేంద్రానికి అన్ని రాష్ట్రాలూ సమానమేనని, తెలంగాణపై వివక్ష చూపించాల్సిన అవసరం లేదని కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ అన్నారు. కేంద్రంపై టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఇటీవల చేసిన విమర్శలు సత్యదూరమని వ్యాఖ్యానించారు. ఆదివారం నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దత్తాత్రేయ మాట్లాడుతూ, అన్ని రాష్ట్రాల అభివృద్ధితోనే దేశం ముందుకు సాగుతుందని, ఆ దిశగానే ప్రధాని నరేంద్రమోడీ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అయినప్పటికీ కెటిఆర్ రాజకీయ ప్రయోజనాల కోసమే కేంద్రంపై తరుచూ విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపికి అనుకూలంగా ఫలితాలు రానున్నాయని గ్రహించే మోడీ ప్రభుత్వంపై కెటిఆర్ నిందలు వేస్తున్నారని విమర్శించారు. ఇదంతా తెలంగాణ ఓటర్లను టిఆర్ఎస్ వైపుకు తిప్పుకోవడంలో భాగంగానే కెటిఆర్ కేంద్రంపై నోరుపారేసుకుంటున్నారని మండిపడ్డారు. నాలుగున్నరేళ్ల కాలంలో తెలంగాణకు కేంద్రం పైసా ఇవ్వలేదనడం సరికాదన్నారు. రెండు లక్షల కోట్ల రూపాయలను అనేక గ్రాంట్ల రూపంలో తెలంగాణకు ఇచ్చిందని అన్నారు. 11 సాగునీటి ప్రాజెక్టులు, 24 గంటల విద్యుత్ సరఫరాకు ఉత్తర, దక్షిణ పవర్ గ్రిడ్‌లను అనుసంధానం చేయడానికి యాదాద్రి పవర్ ప్రాజెక్ట్‌కు డబ్బులు ఇచ్చిందని వివరించారు. రాష్ట్రంలో 2400 కిలోమీటర్ల జాతీయ రహదారులు ఉండగా దానిని 5600 కిలోమీటర్లకు కేంద్రం పెంచిందన్నారు. దీని కోసం రూ. 60 వేల కోట్లను కేంద్రం ఖర్చు చేస్తోందన్నారు. వరంగల్‌లో టెక్స్‌టైల్స్ పార్కు, కరీంనగర్, నిజామాబాద్ రైల్వే లైన్లలను కేంద్రం పూర్తి చేయలేదా అని నిలదీశారు. రాష్ట్రానికి 2.10 లక్షల ఇళ్లను మంజూరు చేశామన్నారు.

మజ్లిస్ ప్రొటెమ్ స్పీకర్‌తో ప్రమాణ స్వీకారం చేయను.. రాజాసింగ్

ప్రొటెమ్ స్పీకర్‌గా మజ్లిస్ పార్టీకి అవకాశం కల్పించడంతో తాను ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయబోనని బిజెపి శాసనసభ్యుడు రాజాసింగ్ చెప్పారు. కొత్తగా స్పీకర్‌గా ఎన్నికైన తరువాతనే ఎమ్మెల్యేగా ప్రమాణం చేస్తానని ఆయన తెలిపారు. రాష్ట్రం మొత్తంమీద బిజెపి తరఫున గెలిచిన ఏకైక ఎంఎల్‌ఏ రాజాసింగ్. మజ్లిస్ పార్టీ అంటే గిట్టని బిజెపి శాసనసభ్యుడిగా ఆయన చేతుల మీదుగా ప్రమాణ స్వీకారం చేయబోనని, కొత్త స్పీకర్ వచ్చిన తర్వాతనే నిర్ణయం తీసుకుంటానని స్పష్టం చేశారు.

కెటిఆర్‌కు హార్వర్డ్ ఆహ్వానం

(మొదటిపేజీ తరువాయి)

వివిధ అభివృద్ధి అంశాలపైన రెండు రోజుల పాటు ఈ సమావేశంలో చర్చ జరగనుంది. ప్రపంచ నలుమూలల నుంచి సుమారు వెయ్యి మంది విద్యావేత్తలు, ప్రతిభావంతులైన విద్యార్థులు, యువ వృత్తి నిపుణులు హాజరు కానున్న ఈ సమావేశానికి కెటిఆర్‌ను ఆహ్వానిస్తూ యూనివర్సిటీ లేఖ పంపించడం విశేషం. 'ఇండియా ఎట్ ఇన్‌ఫ్లెక్షన్ పాయింట్ థీమ్' అధారంగా సాగనున్న ఈ సమావేశంలో ప్రత్యేక వక్తగా హాజరై ప్రసంగించాల్సిందిగా కెటిఆర్‌ను యూనివర్సిటీ వార్షిక సదస్సు నిర్వహక కమిటీ కోరింది.

మిచ్‌గాన్‌లో మన సాయికృష్ణపై కాల్పులు

(మొదటిపేజీ తరువాయి)

లోరెంజ్ టెక్ యూనివర్శిటీలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో ఎంఎస్ చేస్తున్నాడు. ఈ నెల 3వ తేదీ సాయికృష్ణ ఒక రెస్టారెంట్‌నుంచి పార్శిల్ తీసుకుని వస్తుండగా దుండగులు అతనిపై కాల్పులు జరిపారు. ఈ ఘటనలో సాయికృష్ణ కుడి చేతికి గాయాలయ్యాయి. కాల్పులు జరిపిన వెంటనే దుండగులు సాయికృష్ణ వద్ద ఉన్న నగదు, కారు, గుర్తింపు కార్డు తీసుకుని పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన సాయికృష్ణను స్థానికులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు మహబూబాబాద్‌లోని సాయికృష్ణ బంధువులకు సమాచారం అందించారు. సంఘటనపై అధికారులను సంప్రదిస్తున్నారు. ఇంకా అమెరికాకు ఎవరూ బయలుదేరి వెళ్ళలేదని, అమెరికాకు వెళ్ళడానికి తమ కొడుకును చూసుకోవడానికి ప్రభుత్వం, అధికారులు సహకరించాల్సిందిగా సాయికృష్ణ తండ్రి పోలయ్య, తల్లి శైలజ కన్నీటి పర్యంతమై కోరారు.

తొలి విడత 'పంచాయతీ'కి నేడే నోటిఫికేషన్

(మొదటిపేజీ తరువాయి)

4480 పంచాయతీలకు, 39,832 వార్డులకు సంబంధించి రిటర్నింగ్ అధికారులు ఎన్నిలకు సంబంధించి నోటీసు ఇవ్వనున్నారు. ఈ నోటీసు ఆధారంగా పంచాయతీలవారీగా రిటర్నింగ్ అధికారులు నోటిఫికేషన్లను విడుదల చేస్తారు. వార్డుల వారీగా ఓటర్ల జాబితాను కూడా ప్రదర్శిస్తారు. ఆ వెంటనే నామినేషన్ల స్వీకరణ మొదలవుతుంది. ఏర్పాటు చేసుకున్న కార్యాలయంలో రిటర్నింగ్ అధికారులు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. ఈ నెల 9వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు నామినేషన్ల దాఖలుకు సమయం ఇచ్చారు. ఈ నెల 10వ తేదీన నామినేషన్ల స్క్రూటిని చేసి, 11వ తేదీన సరిగ్గా ఉన్న అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. వాటిపై అభ్యంతారలను కూడా అదే రోజున స్వీకరిస్తారు. ఇక 13వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్ల ఉపసంహరించుకునేందుకు గడువు ఉంది. ఆ వెంటనే బరిలో నిలిచిన సర్పంచ్, వార్డుమెంబర్ అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. తొలి విడత పోలింగ్ ఈ నెల 21వ తేదీ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనుంది. అదే రోజున కౌంటింగ్ చేపట్టి ఫలితాలను ప్రకటించనున్నారు. రాష్ట్రం మొత్తంమీద 12,732 గ్రామ పంచాయతీలు, 1,13,190 వార్డులకు మూడు విడుతల్లో ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ విడుదల చేసిన విషయం తెలిసిందే.

మూడవ విడతకు మారిన మాసాయిపేట ఎన్నికలు

తొలివిడతలో జరగాల్సిన యాదాద్రి భువనగిరి జిల్లా, యాదగిరి గుట్ట మండలం, మాసాయిపేట గ్రామ పంచాయతీ ఎన్నికను మూడో విడతకు మారుస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. ఈ పంచాయతీలోని వార్డులవారీ ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు కావడంతో విచారించిన ధర్మాసనం కొన్ని ఆదేశాలను రాష్ట్ర ఎన్నికల సంఘానికి జారీ చేసింది. వాటి ప్రకారం ఓటర్ల జాబితాలో లోపాలను సవరించేందుకు వీలుగా తొలి విడత నుంచి మూడో విడతకు మారుస్తున్నట్లు ఎన్నికల సంఘం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది.

మొదటి విడత పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ఇలా

మొత్తం మండలాలు	197
గ్రామ పంచాయతీలు	4480
వార్డులు	39,832
నామినేషన్ల స్వీకరణ ప్రారంభం	జనవరి 7వ తేదీ
నామినేషన్ల దాఖలుకు గడువు	జనవరి 9వ తేదీ, సా. 5 గం. వరకు
ఉప సంహరణకు గడువు	13వ తేదీ, మధ్యాహ్నం 3 వరకు
పోలింగ్	21వ తేదీ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు

కాలువల పటిష్టానికి ప్రణాళిక

● గరిష్ఠ స్థాయిలో సాగునీరు అందించేలా కార్యాచరణ ● ఖరీఫ్ లక్ష్యంగా సాగునీటి పనులు

మన తెలంగాణ/హైదరాబాద్: ఉత్తర తెలంగాణ జిల్లాలోని ప్రతి ఎకరానికి కాళేశ్వరం నీరు అందేలా ఇరిగేషన్ శాఖ ప్రణాళికలు రూపొందిస్తుంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కాకతీయ కెనాల్, లక్ష్మి కెనాల్, సరస్వతి కెనాల్, వరద కాలువ, ఇలా పలు వ్యవస్థల ద్వారా లక్షలాది ఎకరాల ఆయకట్టు ఇదివరకే ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఏర్పడింది. కాంటూరులో తేడా ఉండడం, ప్రధాన కాలువ వెళ్లే వేర్వేరు మార్గాల్లో వెళుతుండడంతో మధ్యమధ్యలో కొంత ఆయకట్టు ఏ పథకం కిందకు రాకుండా మిగిలిపోయింది. ఈ మిగిలిపోయిన ఆయకట్టుకు నీరిచ్చేలా కాళేశ్వరంలో ప్రతిపాదనలు రూపొందుతున్నాయి. దీంతో పాటు ఎటువంటి నీటి రాకడకు అవకాశం లేని ప్రాంతాలు, ఎత్తైన ప్రాంతాల కోసం ప్రభుత్వ ప్రత్యేక ప్రణాళికలు అనుసరిస్తోంది. దీనికి తోడు పాత పథకాల పునరుజ్జీవం కోసం కాళేశ్వరం నీళ్లను వినియోగించనున్నారు. సిరిసిల్ల జిల్లాలో ఏ పథకం పరిధిలోకి రాని, ఎత్తైన ప్రాంతాల్లోని చెరువులు నింపడం, ఆయకట్టుకు నీరివ్వడం లక్ష్యంగా ప్యాకేజీ 9 పరిధిలో తాజాగా ఇరిగేషన్ శాఖ టెండర్లు పిలిచింది. రూ.140 కోట్ల అంచనాతో మల్కపేట జలాశయం నుంచి 0.78 టిఎంసిల నీటితో దాదాపు 9 వేల ఎకరాల ఆయకట్టుకు స్థిరీకరణకు నీటిని ఎత్తిపోసేలా టెండర్లు పిలిచారు. ఇందులో భాగంగా ప్యాకేజి 9 పరిధిలోని మల్కపేట జలాశయం నుంచి సింగ సముద్రం చెరువు, రాయుని చెరువు వరకు ఓ వైపు, మరో వైపు లోయర్ మానేరు కెనాల్ నుచి శివంగళ పల్లి చెరువు వరకు నీటిని



తీసుకెళ్లే పనులు చేయనున్నారు. దీంతో పాటు లోయర్ మానేరు కెనాల్ 6.7 కిలోమీటర్ల వద్ద నుంచి మూల వాగు చెరువు, మూలవాగు చెరువు నుంచి హనుమయ్య చెరువు వరకు, పది వరకు, కోనరావుపేట, వీర్నపల్లి మండలాల్లోని ఎత్తైన ప్రాంతాలలో, సాగుచేయబడని, అధిక ఎత్తులో ఉన్న ఆయకట్టుకు సాగు, స్థిరీకరణ అవసరాలకు ఈ పనులు నిర్ధేశించారు. ఇదేవిధంగా కాకతీయ కాలువ, వరద కాలువకు అనుసంధానంగా గ్రావిటీ కాలువ నిర్మించనున్నారు. 3 కిలోమీటర్ల మేర గ్రావిటీ కాలువ నిర్మిస్తే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 2.51 లక్షల ఎకరాలకు సాగునీరు వస్తుంది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా 8వ ప్యాకేజి ఒక కూడలిగా మారనుంది. ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోసిన నీటిని వరద కాలువ ద్వారా మిడ్‌మానేరుకు తరలిస్తారు. అయితే కరీంనగర్ జిల్లా గంగాధర మండలం ర్యాలపల్లి సమీపంలోని వరద కాలువ నుంచి జగిత్యాల జిల్లా మల్యాల మండలం తాటిపల్లి సమీపంలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కాకతీయ కాలువ వరకు 3 కిలోమీటర్ల మేర గ్రావిటీ కాలువను నిర్మిస్తారు. ఇందుకోసం ఆయా గ్రామాల పరిధిలో 76 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. ఈ పనులు పూర్తయితే వరద కాలువ నీళ్లు కాకతీయ కాలువ ఆయకట్టుకు వస్తాయి. కాకతీయ కాలువలో డి 70 నుంచి డి 94 వరకు మొత్తంగా 24 ఉపకాలువల ద్వారా గోదావరి నీళ్లను అనుసంధాన కాలువ ద్వారా అందించే అవకాశం ఉంది. మరో వైపు వరద కాలువపై 102 కిలోమీటర్ వద్ద ఉన్న గేట్ల ద్వారా మానేరుకు ప్రతి రోజూ ఒక టిఎంసి నీటిని విడుదల చేస్తారు. మరో టిఎంసి నీరు వరద కాలువ ఎగువ ప్రాంతంలో సుమారు 90 కిలోమీటర్ల మేర నిల్వ ఉంటుంది. ఇలా నిల్వ ఉన్న నీటినే అనుసంధాన కాలువతో కాకతీయ కెనాల్ ఆయకట్టుకు, మధ్యలో ఏ పథకంలో లేని కొత్త ఆయకట్టుకు నీరందించనున్నారు. వీలున్న ప్రతి ఎకరానికి నీరిస్తూ 100 శాతం ఆయకట్టును సాధించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళుతోంది. గ్యాప్ ఆయకట్టు కోసం ప్రాంతాన్ని బట్టి ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. దీనికి తోడు ముఖ్యమంత్రి కాళేశ్వరం ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటించడంతో పనుల్లో వేగం పెరుగుతోంది. మార్చి నెలాఖరుకు ప్రధాన పనులు పూర్తి చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ జూన్ మాసంలో నీళ్లివ్వాల్సిందేనని సిఎం పట్టుదలగా ఉన్నారు. ఈ మేరకు పనుల వేగం పెంచాలని సిఎం ఆదేశించిన సంగతి తెలిసిందే.

తెల్లారిన బతుకులు

(మొదటిపేజీ తరువాయి)

శబరిమలకు బయలుదేరి వెళ్ళారు. అయ్యప్పను దర్శనం చేసుకున్నఅనంతరం తిరుగు ప్రయాణంలో తమిళనాడు రాష్ట్రంలో ఓ కంటేనర్ వీరు ప్రయాణిస్తున్న మినీ వ్యాన్‌ను అతివేగంగా వచ్చి ఢీకొంది. దీంతో వ్యాన్‌లో ప్రయాణిస్తున్న అయ్యప్ప భక్తుల్లో నాగరాజు(35), మహేష్(28), కుమార్(22), శ్యామ్‌సుందర్‌గౌడ్(), ప్రవీణ్, క్రిష్ణ, సాయి, అంజనేయులు, సురేష్‌తోపాటు వ్యాన్ డ్రైవర్ దుర్మరణం చెందారు. ఈ విషయం మీడియాలో రావడంతో ఈ గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. దైవదర్శనం కోసం వెల్లిన వారు క్షేమంగా తిరిగి ఇంటికివస్తారని వారి కోసం ఎదురు చూస్తున్న కుటుంబ సభ్యుల్లో ఈ ఘటన కన్నీళ్లను నింపింది. ఈ విషాదకర సంఘటనతో నర్సాపూర్ మండలం ఉల్లిక్కిపడింది. ఒకే ప్రయాణంలో 10 మంది మృతిచెందడం మండలంలోనే కలకలం రేపింది. కాగా ఈ ప్రమాదంలో గాయపడిన వారు ప్రస్తుతం తమిళనాడులోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. మృతదేహాలను స్వగ్రామానికి తరలించేందుకు అక్కడి ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు తెలిసింది. అయ్యప్ప భక్తులు మృత్యువాత పడడం పట్ల పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల్లో విషాదఛాయలు

స్నేహితులుగా అయ్యప్పమాలధారణ ధరించిన అయ్యప్ప దర్శనం కోసం వెళ్లి మృత్యువాత పడడంతో ఆ కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి. ఇంటి పెద్దదిక్కులను కోల్పోయి ఆ కుటు ంబాలు రోడ్డున పడ్డాయి. దీంతో వారి రోదనలు మిన్నంటాయి. ఆ గ్రామాల లో విషాదం అలుముకుంది. పుణ్యక్షేత్రాలకు వెల్లి క్షేమంగా తిరిగివస్తారనుకున్న కుటుంబ సభ్యులకు మృత్యువు కంటేనర్ రూపంలో వీరి కుటుంబాల్లో చీకటిని నింపింది. దీంతో వారు దిక్కుతోచని పరిస్థితుల్లో రోదిస్తున్నారు.

ప్రమాదంపై ముఖ్యమంత్రి దిగ్భ్రాంతి

శబరిమలైలో అయ్యప్ప దర్శనం నిమిత్తం ఒక వ్యాన్‌లో మెదక్ నుంచి వెళ్ళి తమిళనాడులోని పుదుక్కోట్టై దగ్గర ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పది మంది మృతి చెందిన సంఘటనపై ముఖ్యమంత్రి కెసిఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు త్వరగా కోలుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వ అధికారులను ఆదేశించారు. సిఎం కెసిఆర్ ఆదేశం మేరకు రాష్ట్ర ప్రభుత్వ అధికారుల బృందం విమానం ద్వారా వెంటనే పుదుక్కోట్టైకు చేరుకుంది. క్షతగాత్రులు ప్రాణాపాయం నుంచి బైటపడేందుకు అవసరమైన చికిత్స లభించేలా దగ్గరుండా ఆ రాష్ట్ర వైద్యులు, అధికారులతో సమన్వయం చేసుకోవాలని సిఎం కెసిఆర్ సూచించారు.

కెటిఆర్ ప్రగాఢ సంతాపం

శబరిమల అయ్యప్పస్వామి దర్శనం కోసం వెళ్ళి రోడ్డు ప్రమాదంలో పది మంది భక్తులు మృతిచెందిన సంఘటనపై టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ట్విట్టర్ ద్వారా మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. బాధిత కుటుంబాలను ఆదుకోడానికి అన్ని చర్యలు చేపట్టాల్సిందిగా ముఖ్యమంత్రి ఇప్పటికే అధికారులను ఆదేశించారని, సంబంధిత అధికారులు ఆ కుటుంబ సభ్యులకు అవసరమైన అన్ని రకాల సాయం చేస్తారని కెటిఆర్ స్పష్టం చేశారు.

మెదక్ జిల్లా కలెక్టర్‌కు హరీశ్‌రావు ఆదేశం

పుదుక్కోట్టై ప్రమాదంలో మృతిచెందినవారంతా మెదక్ జిల్లాకు చెందిన అయ్యప్ప భక్తులే కావడంతో సిద్దిపేట ఎంఎల్‌ఏ హరీశ్‌రావు వెంటనే స్పం దించి మెదక్ కలెక్టర్‌తో మాట్లాడి వెంటనే సిబ్బందిని అక్కడకు పంపాల్సిందిగా సూచించారు. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న వెంటనే పుదుక్కోట్టై కలెక్టర్ రమేశ్‌తోనూ ఫోన్‌లో మాట్లాడి క్షతగాత్రులకు అవసరమైన వైద్య చికిత్సను అందించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. మెదక్ నుంచి ప్రత్యేకంగా సిబ్బందిని అక్కడకు పంపుతున్నామని, మృతదేహాలకు అవసరమైన చట్టపరమైన లాంఛనాలను పూర్తిచేసి వీలైనంత త్వరగా పోస్టుమార్టం ప్రక్రియను నిర్వహించి మృతదేహాలను అప్పజెప్పాలని ఆ జిల్లా కలెక్టర్‌కు హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు.

మృతుల కుటుంబాలను ఓదార్చిన ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

అయ్యప్ప దర్శనం కోసం వెల్లిన నర్సాపూర్ మండలానికి చెందిన 16మంది అయ్యప్ప భక్తులు తమిళనాడులో జరిగిన రోడ్డు ప్రమాదంలో 10 మంది మృత్యువాత పడడంతో నర్సాపూర్ మండలం ఉల్లిక్కిపడింది. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే మదన్‌రెడ్డి హుటాహుటీన మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడ బాధిత కుటుంబా లను పరామర్శించి ఓదార్చారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వపరంగా ఆదుకునేందుకు చర్యలు చేపడుతామని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు.

వైఎష్ జగన్ తీవ్ర దిగ్భ్రాంతి

తమిళనాడు రాష్ట్రంలోని పుదుకొట్లైలో జరిగిన రోడ్డు ప్రమాదంపై ఎపి ప్రతిపక్ష నాయకుడు వైఎస్సార్‌సిపి అధినేత వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ సంతాపం ప్రకటించారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అయ్యప్ప భక్తుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన జగన్, క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

సంఘటన స్థలాన్ని పరిశీలించిన తమిళనాడు మంత్రి

పుదుక్కొట్టై వద్ద ఘోరరోడ్డు ప్రమాదం జరిగినట్టు తెలుసుకున్న తమిళనాడు రాష్ట్ర వైద్య శాఖ మంత్రి విజయభాస్కర్‌సంఘటన స్థలాన్ని సందర్శించారు. హాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. ప్రమాదంలో 11మంది మృతిచెందడం పట్ల విచారం వ్యక్తం చేసిన ఆయన పోస్టు మార్టం పూర్తయ్యాక మృతదేహాలను వారి స్వగ్రామాలకు తరలించే ఏర్పాటు చేస్తామని తెలిపారు.

తెలంగాణ డిజిపి ఆరా

తమిళనాడులో జరిగిన ఘోరరోడ్డు ప్రమాదంలో మెదక్ జిల్లాకు చెందిన 11మంది మృతిచెందిన విషయం తెలియగానే తెలంగాణ రాష్ట్ర డీజీపీ మహేందర్‌రెడ్డి పుదుక్కొట్టై జిల్లా కలెక్టర్ గణేష్‌తో మాట్లాడి క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందేలా చూడాలని తెలిపారు. అలాగే పుదుక్కొట్టై మెడికల్ కాలేజీలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందేలా చూడాలని పుదుక్కొట్టై కలెక్టర్ గణేష్‌ను కోరినట్టు మెదక్ జిల్లా కలెక్టర్ ధర్మారెడ్డి తెలిపారు.

ప్రమాదంలో మృతులు..



కృష్ణ(35) రెడ్డిపల్లి



కుమార్(22)ఖాజీపేట



ఆంజనేయులు చిన్నచింతకుట



ప్రవీణ్(22) మంతూరు



శ్యామ్‌సుందర్‌గౌడ్(22)



మంతూర్ సురేష్(25) మంతూర్

రైతుబంధుతోనే బతుకువిందు

(మొదటిపేజీ తరువాయి)

రూపాయలను ఇస్తోందని, ఇందుకు సుమారు ఐదారు వేల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తోందని పేర్కొన్నారు. దేశ స్థాయిలో దీన్ని అమలుచేయాలంటే సుమారు 33 కోట్ల ఎకరాలకు దాదాపు రూ. 2.60 లక్షల కోట్ల మేరకు నిధులు అవరమవుతాయని పేర్కొన్నారు. ఈ పథకం గురించి మంచి చెడ్డలను తరచి చూడాల్సిన అవసరమే లేదని, కానీ దేశవ్యాప్తంగా అమలు చేయాలంటే కేంద్ర ప్రభుత్వం ఆర్థిక వనరుల గురించి మాత్రమే ఆలోచించాల్సి ఉంటుందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ ఈ పథకాన్ని అమలుచేసిన తర్వాత ఒడిశా, జార్ఖండ్, పశ్చిమబెంగాల్ కూడా అమలుచేస్తున్నాయని పేర్కొన్నారు. సరిగ్గా సాగుపనులు ప్రారంభమయ్యే సమయానికి తెలంగాణ ప్రభుత్వం రైతులకు వారికున్న సాగుభూముల నిష్పత్తికి అనుగుణంగా రైతుబంధు పేరుతో ఆర్థిక సాయం చేయడం వలన ప్రైవేటు వడ్డీ వ్యాపారుల నుంచి అప్పు తీసుకునే భారం తగ్గుతోందని గుర్తుచేశారు.

రుణమాఫీతో ప్రయోజనాలు అంతంతమాత్రమే

అనేక రాజకీయ పార్టీలు రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని 'రైతుల రుణమాఫీ'పై దృష్టి పెడుతున్నాయని, కానీ దీనివలన ప్రభుత్వానికి ఆర్థిక భారమే తప్ప రైతులకు పెద్దగా ప్రయోజనం లేదని రమేశ్ చంద్ అభిప్రాయపడ్డారు. 'నాబార్డు' బ్యాంకు సర్వే ప్రకారం దేశం మొత్తం మీద రైతుల్లో కేవలం 36% మంది మాత్రమే సహకార, జాతీయ బ్యాంకుల నుంచి పంట అవసరాల నిమిత్తం రుణాలు తీసుకుంటున్నట్లు తేలిందని గుర్తుచేశారు. సుమారు 48% మంది రైతులు అసలు రుణాలే తీసుకోవడంలేదని, మిగిలిన 52% మంది మాత్రమే రుణాలు తీసుకుంటున్నారని, ఇందులోనూ దాదాపు 70% మంది సహకార బ్యాంకుల నుంచి తీసుకుంటూ ఉంటే మిగిలిన 30% మంది మాత్రమే ప్రైవేటు వ్యాపారుల నుంచి తీసుకుంటున్నట్లు తేలిందని వివరించారు. రుణమాఫీ పేరుతో ప్రభుత్వాలు భారీ మొత్తంలో ఖర్చు చేస్తున్నా కేవలం 36% మందికి మాత్రమే లబ్ధి కలుగుతోందని పేర్కొన్నారు.

గిట్టుబాటు ధరతో రైతుకు సంతృప్తి

రైతులు పండించే పంటలకు కనీస గిట్టుబాటు ధరను కల్పించడంతో పాటు వివిధ కారణాలతో పంటను నష్టపోతున్న రైతులకు సకాలంలో బీమా పరిహారం అందేలా పకడ్బందీ విధానాలను అమలుచేయడం ప్రయోజనకరంగా ఉంటుందని రమేశ్‌చంద్ సూచించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం కొన్ని పంటలకు కనీస గిట్టుబాటు ధరను పంట సాగుకు అయిన ఖర్చులో 50% మేర పెంచిందని, అయినా గతేడాదితో పోలిస్తే రైతులకు పెద్దగా ప్రయోజనం లేదని పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో అనేక పంటల దిగుబడి గణనీయంగా పెరిగినందున చాలా రాష్ట్రాల్లో రైతులు కనీస గిట్టుబాటు ధర కంటే తక్కువకే అమ్ముకునే వత్తిడికి లోనవుతున్నారని, ఇలాంటి సందర్భాల్లో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే గిట్టుబాటు ధర లభించేలా పటిష్టమైన పర్యవేక్షణ యంత్రాంగాన్ని అమలుచేసినట్లయితే ఫలితాలు మెరుగ్గా ఉంటాయని పేర్కొన్నారు. వరి, గోధుమల విషయంలో దేశం మొత్తం మీద ఉత్పత్తి అయినదాంట్లో కేవలం 30% మాత్రమే సేకరణ జరిగిందని, వందశాతం జరగకపోయినా కనీసం రైతులు తిరిగి సేద్యానికి సిద్ధమయ్యేందుకు అవసరమైనంత ఆర్థిక వనరులను సమకూర్చుకునేంత స్థాయిలోనైనా జరగాల్సి ఉందని పేర్కొన్నారు.

పంట బీమా పరిహారం సకాలంలో అందాలి

ప్రకృతి వైపరీత్యాలు సహా వివిధ కారణాలతో పంటలను నష్టపోతున్న రైతులకు బీమా పరిహారం చెల్లింపు విధానాన్ని పటిష్టం చేయడం అవసరమని రమేశ్‌చంద్ పేర్కొన్నారు. ఏ కారణంతో పంటను నష్టపోయినా రైతులకు బీమా కింద పరిహారం సకాలంలో చెల్లించాల్సిన అవసరం ఉందని, 2016–17 ఆర్థిక సంవత్సరంలో బీమా పరిధిలోకి వచ్చిన రైతుల్లో 4.36 కోట్ల మందికి మాత్రమే పరిహారం అందిందని, 2017–18 సంవత్సరంలో అది మరింతగా తగ్గిపోయి కేవలం 3.54 కోట్ల మందికి మాత్రమే పరిమితమైందన్నారు. రైతులకు బీమా చాలా భరోసా కలిగిస్తుందని, ఎంతో ఆశతో ఆ పరిధిలోకి వచ్చినా పరిహారం చెల్లింపు విషయంలో మాత్రం వారికి సంపూర్ణ ఫలాలు అందకపోవడం, ముఖ్యంగా తదుపరి పంటకు సిద్ధమవుతున్న సమయంలో పంట పెట్టుబడి అవసరాలకు పనికొచ్చేలా లేకపోవడం ఈ పథకం అమలైనా ప్రయోజనం లేకుండా పోతోందని వ్యాఖ్యానించారు.

సర్వే శివాలు

(మొదటిపేజీ తరువాయి)

లోక్‌సభ నియోజకవర్గాల సమీక్ష జరిగింది. మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గం సమావేశం ప్రారంభంకాగానే నాయకుల విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. కంటోన్మెంట్ అసెంబ్లీ సెగ్మెంట్ నియోజకవర్గం నుంచి పోటీచేసిన కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ ఒక దశలో సహనం కోల్పోయి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కుంతియాలను ఉద్దేశించి తీవ్ర స్థాయిలో వ్యాఖ్యలు చేశారు. ఇవి ఆ సమావేశంలో రసాభసకు దారితీసింది. పార్టీని పూర్తిగా భ్రష్టు పట్టిస్తున్నారని వారిద్దరినీ ఉద్దేశించి సమావేశంలో ఆరోపించడంతో ఒక్కసారిగా కలకలం రేగింది. అంతటితో ఆగకుండా ఉత్తమ్, కుంతియాలపై చిటపటలాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో టిక్కెట్లు అమ్ముకున్నారని ఆరోపించారు. తన ఓటమికి కారణమైనవారే సమీక్షను నిర్వహిస్తే ఎలా అని సర్వే సత్యనారాయణ వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. పోటీచేస్తున్న అభ్యర్థులకు కనీస ఆర్థిక సహాయం కూడా చేయలేదని, పార్టీ నుంచి వచ్చిన డబ్బులను ఏం చేశారని నిలదీశారు. ఇదే సమయంలో ఆయనను నివారించేందుకు అక్కడే ఉన్న పిసిసి జనరల్ సెక్రటరీ బొల్లు కిషన్, నిజామాబాద్‌కు చెందిన మహేష్‌గౌడ్‌లు యత్నించారు. దీంతో సర్వే మరింత ఆగ్రహంతో రెచ్చిపోయారు. వాస్తవాలు మాట్లాడుతుంటే తనను ఆపేందుకు యత్నిస్తారా అంటూ ఊగిపోయారు. దీంతో బొల్లు కిషన్, సర్వేల మధ్య మాటల యుద్ధం పతాక స్థాయికి చేరింది. దీంతో సహనం నశించిన సర్వే సత్యనారాయణ ఆయనపై మంచినీళ్ళ బాటిల్ విసిరేశారు. దీంతో ఒక్కసారిగా సమావేశంలో తీవ్ర స్థాయిలో గందరగోళం నెలకొంది. ఒక దశలో సమావేశంలో ముష్టి యుద్ధం జరుగుతోందా అన్న పరిస్థితి కనిపించింది. ఈ నేపథ్యంలో సర్వే సత్యనారాయణ ఆగ్రహంతో ఊగిపోయి సమావేశాన్ని బహిష్కరించి మధ్యలోనే బైటకు వచ్చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, సమావేశంలో మాట్లాడుతుంటే కొంతమంది రౌడీలు, దద్దమ్మలు తనను మాట్లాడనివ్వకుండా అడ్డుకున్నారన్నారు. తనపై కొంతమంది రౌడీలు జులుం చేయాలని చూస్తే కుంతియా, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు చోద్యం చూస్తూ కుర్చున్నారని, వారిని ఆపే ప్రయత్నం చేయలేదని ఆరోపించారు. అసలు ఎన్నికల్లో ఓటమికి కారణమైన వారే సమీక్షలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. పిసిసి చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పార్టీ ఇన్‌ఛార్జీ కుంతియాలు తమాషా చేస్తున్నారని ఘాటుగా విమర్శించారు. వారి మీద చర్య తీసుకోవాలని తాను అదిష్టానాన్ని కోరుతున్నట్లు తెలిపారు. పిసిసి పదవులను అమ్ముకున్న ఉత్తంకుమార్‌రెడ్డిని ఇంకా పార్టీ భరించాలా? అని ప్రశ్నించారు. సమావేశంలో తనపై దాడి చేయించినందుకు నిరసనగా సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తానని సర్వే చెప్పారు.

బూతులు తిట్టాడు : బొల్లు కిషన్

మల్కాజ్‌గిరి సమీక్షలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కుంతియాలపై సర్వే సత్యనారాయణ బూతులు తిట్టాడని బొల్లు కిషన్ తెలిపారు. సమావేశం అనంతరం బయటకు వచ్చి ఆయన మీడియాతో మాట్లాడారు. సర్వే తన స్థాయిని మరించి అసభ్యకరంగా వ్యాఖ్యానించారని పేర్కొన్నారు. ఇది సరికాదు అని అన్నందుకు తనను కూడా ఇష్టానుసారంగా మాట్లాడారని మండిపడ్డారు. కేంద్రమంత్రి స్థాయిలో పనిచేసిన ఆయన సభ్యతను మరించి పిసిసి అగ్రనేతలపై విమర్శలు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. వాటర్ బాటిల్‌ను తనపై విసరడమే కాకుండా తనపై దాడి చేసేందుకు కూడా యత్నించారని పేర్కొన్నారు.

సర్వేపై సస్పెన్షన్ వేటు

కుంతియా, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలపై అనుచిత వ్యాఖ్యలు చేసి సర్వే సత్యనారాయణపై పార్టీ అధిష్టానం చర్యలు తీసుకుంది. ఈ మేరకు ఆయన పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు రాష్ట్ర పిసిసి క్రమశిక్షణా కమిటీ నాయకుడు కోదండరెడ్డి స్పష్టం చేశారు.



అనుమానాస్పద స్థితిలో యువకుని మృతి

మనతెలంగాణ/కాసిపేట : బతుకు దెరువు కోసం వచ్చి కనిపించకుండా పోయిన యువకుడు చివరకు వాగులో పడి అనుమానస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన మంచిర్యాల జిల్లా కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం నెలకొంది. మంచిర్యాల జిల్లా తిర్యాణి మండలం మొర్రిగూడ గ్రామానికి చెందిన కుడిమేత రాజు (22) డిసెంబర్ 25న తిర్యాణి నుండి కొందరు యువకులతో కలసి కాసిపేట మండలంలోని గురువాపూర్‌కు పత్తి లోడ్ చేసేందుకు కూలీగా వచ్చాడు. తిరిగి వెళ్లే క్రమంలో రాజు కనిపించకుండా పోయాడు. దీంతో డిసెంబర్ 27న కాసిపేట పోలీస్‌స్టేషన్‌లో కుటింబికులు ఫిర్యాదు చేశారు. పోలీసులు రాజుది అదృశ్యం కేసుగా నమోదు చేసారు. ఆదివారం సోమగూడెం టోల్‌గేట్ సమీపంలోని సుద్దాల వాగులో గుర్తు తెలియని శవం ఉండడంతో కొందరు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పోలికలు పరిశీలించి, తిర్యాణిలో వున్న రాజు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న కుటింబికులు మృతదేహంపై వున్న దుస్తులను పరిశీలించి మృతుడు రాజుగా గుర్తించారు. రాజు శవం వాగునీటిలో కుళ్లి పోయింది. రాజు మిస్సింగ్ అయిన రోజే చనిపోయాడా, ఇక్కడే మృతదేహం వున్నప్పటికి వారు వెతికిన సమయంలో కనిపించలేదా అనే సందేహాలు ఇక్కడ వ్యక్తమవుతున్నాయి. రాజు ప్రమాదవశాత్తు చనిపోయాడా లేక ఎవరైనా హత్య చేశారా అనే సందేహాలు సంఘటన స్థలాన్ని బట్టి పలువురు వ్యక్త పరిచారు. సంఘటన వివారాల ప్రకారం రాజు కూలీ పనులకు వచ్చి వెళ్తున్న క్రమంలో సుద్దాల వాగు బ్రిడ్జి సమీపంలో వాహనం చెడిపోవడంతో (పంక్చరు) కాగా వాహనం టైరు మార్చుకున్న క్రమంలో రాజు కనిపించలేదని చాల సేపు వేచి చూసి పిలిచి వెళ్లి పోయామని పత్తి అన్‌లోడ్ చేసి వచ్చి మళ్లీ కుటుంబీకులతో కలసి వెతికినప్పటికి రాజు ఆచూకి లభించలేదని రాజు వెంట వచ్చిన వారు పోలీసులకు వివరణ ఇచ్చారు. కాగా రాజు మృతదేహంగా పడి వున్న ప్రదేశం అనుమానస్పదంగా వుండడంతో రాజు మృతి పట్ల కుటుంబీకులు అనూమానం వ్యక్తం చేసారు. రాజు నోటి నుండి నాలుక కూడా బయటకు వెళ్లి వుండడంతో కుటుంబీకులు పోలీసుల ముందు అనుమానాలు వ్యక్తం చేశారు. రాజు మృతదేహం వాగులో వున్నప్పటికి అటుగా ఎంతో మంది వెళ్లినప్పటికి ఎవరూ గుర్తించనట్లు తెలుస్తోంది. కాసిపేట పోలీసులు అనుమానాస్పద కేసుగా నమోదు చేయనున్నట్లు ఎఎస్ఐ రమణరెడ్డి పేర్కొన్నారు. సంఘటన స్థలంలో కాసిపేట విఆర్ఓ మురళి పంచనామ నిర్వహించారు. వైద్యులు వరుణ్ మృతదేహానికి సంఘటన స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించారు. ఈ సంఘటన స్థలాన్ని దేవాపూర్ ఎస్ఐ దేవయ్య పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కాసిపేట ఎఎస్ఐ రమణారెడ్డి పేర్కొన్నారు.

బైకును ఢీకొని బాలుడి మృతి



మన తెలంగాణ/రేవల్లి : గోపాల్‌పేట మండల పరిధిలోని పొలికెపాడ్ గ్రామానికి చెందిన మోహన్ కుటుంబం బైకు ప్రమాదంలో తీవ్రంగా గాయాల పాలైన సంఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ నర్సయ్య తెలిపిన వివరాల ప్రకారం ఇలా ఉన్నాయి. గోపాల్‌పేట మండల పరిధిలోని పొలికెపాడు గ్రామానికి చెందిన మోహన్(30), లక్ష్మీ(25) దంపతులు మరియు కుమారులు సుశాంత్(6) దీక్షిత్(2)లు కలిసి తమ స్వంత గ్రామం నుంచి శనివారం హైద్రాబాద్‌కు వెళ్తుండగా మార్గ మధ్యలో రాజాపూర్ మండల పరిధిలోని ముదిరెడ్డిపల్లి జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఎస్ఐ నర్సయ్య తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని పొలికెపాడు గ్రామానికి చెందిన మోహన్ తన కుటుంబ సభ్యులతో కలిసి శనివారం హైద్రాబాద్‌కు బైక్‌పై వెళ్తుండగా వెనుకనుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం బైకుకు ఢీకొనడంతో రోడ్డు డివైడర్ తగలడంతో దీక్షిత్ తలకు బలమైన గాయం కావడంతో సంఘటనా స్థలంలో అక్కడి కక్కడే దీక్షిత్ మృతి చెందాడు. మిగతా ముగ్గురికి మోహన్,లక్ష్మీ, సుశాంత్ లకు తీవ్రగాయాల య్యాయి. గాయపడిన వారిని వెంటనే 108 అంబులెన్స్ ద్వారా సమీపం లోని జడ్చర్ల ఆసుపత్రిలో చేర్పించారని ఎస్ఐ తెలిపారు. మోహన్ కుటుంబ సభ్యులు, బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసు కొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ.నర్సయ్య తెలిపారు.

జూరాలలో నీటి నిల్వను పరిశీలించిన డిఎస్‌పి



మన తెలంగాణ/అమరచింత : జూరాల ప్రాజెక్టును ఆదివారం డిఎస్‌పి సృజన,ఆర్డీఓ చంద్రారెడ్డిలు సంద ర్శించి ప్రాజెక్టులోని నీటిని పరిశీలించారు. అనంతరం ఇరిగేషన్ అధికారులతో వారు మాట్లాడారు. మండల పరిధిలోని నందిమల్ల, మూల మల్ల, జూరాల ,మస్తీపురం,అమరచింత గ్రామాల రైతులు ఆదివారం అధిక సంఖ్యలో హెడ్ రెగ్యూలేటర్స్ షెటర్స్‌ను తెరవకుండా ఆందోళన చేపట్టారు. అధికారులు, రైతుల మధ్య ఉద్రిక్త వాతావరణం ఏర్పడడంతో డిఎస్‌పి సృజన రైతులతో మాట్లాడుతూ ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు రైతులు ఆందోళన చేయడం జరిగిందని వారి సమస్యను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామి ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఎంపిపి శ్రీధర్‌గౌడ్,సింగిల్ విండో అధ్యక్షులు గాడి కృష్ణమూర్తి, నాయకులు రవి కుమార్ యాదవ్, రైతు సమ న్వయ సమితి సభ్యులు వీరేశలింగం తదితరులు ఉన్నారు. ఈఈ శ్రీధర్ తహ శీల్దార్ మోహన్,సిఐ శంకర్, ఎస్ఐ రామస్వామి ,రైతులు పాల్గొన్నారు.

భార్యను హతమార్చిన భర్త

మనతెలంగాణ, చార్మినార్ : భార్యభర్తల మధ్య ఏర్పడిన వివాదంలో భార్యపై కత్తెరతో దాడిచేసి హత్యచేసిన సంఘటన భవానీనగర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తలాబ్‌కట్టకు చెందిన నసీమ్‌బేగం (33), ఇమ్రాన్ (40)భార్యాభర్తలు. 2004లో వీరి వివాహం జరిగింది. నల్గురు సంతానం. గత కొన్ని రోజులుగా పని లేకుండా ఇమ్రాన్ జులాయిగా తిరుగుతున్నాడు. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. తాజాగా ఆదివారం వారి మధ్య జరిగిన వివాదంతో ఆగ్రహించిన ఇమ్రాన్ కత్తెరతో భార్య నస్రీన్ బేగంపై దాడి చేశాడు. ఈ దాడిలో తీవ్రగాయాలకు గురైన ఆమె మృతి చెందింది. సమాచారం అందుకున్న సంతోష్‌నగర్ ఏసీపీ శివరామ శర్మ, ఇన్‌స్పెక్టర్ ఎన్.వెంకటేశ్వర్లు, సిబ్బంది పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అటవీ భూముల లెక్కలను తేల్చే పనిలో

రెవెన్యూ, అటవీ శాఖలు

- జనవరి నుంచి మార్చి 31వరకు డెడ్‌లైన్
- 550 మంది సర్వేయర్లకు శిక్షణ
- సుమారు 25 లక్షల ఎకరాల్లో భూమి సర్వే



మన తెలంగాణ/హైదరాబాద్ : అటవీ భూముల లెక్కలను పక్కాగా సర్వే చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం రెవెన్యూ, అటవీ శాఖలు రంగంలోకి దిగాయి. ఆ భూములను సర్వే చేయడానికి రంగంలోకి స్పెషల్ టాస్క్‌ఫోర్స్ టీంలు దిగాయి. జనవరి మొదటివారం నుంచి మార్చి 31వ తేదీ వరకు ఈ భూములకు సంబంధించిన లెక్కలు పక్కాగా తేల్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో 550 మంది సర్వేయర్లకు ప్రభుత్వం ప్రత్యేక శిక్షణ ఇచ్చింది. రెవెన్యూతో పాటు అటవీ శాఖకు చెందిన అధికారులు ఈ సర్వే పనుల్లో పాలుపంచుకోనున్నారు. చాలా చోట్ల అటవీ భూములతో పాటు రెవెన్యూ భూములు కబ్జాకు గురి కావడంతో పాటు ఈ రెండు శాఖల మధ్య వివాదాస్పదంగా మారాయి. కొన్ని భూముల విషయంలో కోర్టుల్లో కేసుల విచారణ కూడా పెండింగ్‌లో ఉంది. దీంతోపాటు అడవిలో నివసించే గిరిజనులకు పోడు భూములకు సంబంధించి పట్టాలను ఇవ్వాలని, అటవీ హక్కుల గుర్తింపు చట్టం 2006 కింద ఈ పట్టాలను గిరిజనులకు ఇవ్వాలని ప్రభుత్వం గతంలో నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కొందరికీ పట్టాలను ఇచ్చినా, చాలా జిల్లాల్లో ఆ సమస్య పెండింగ్‌లో ఉంది. ఈ సర్వేతో ఆ సమస్యకు కూడా చెక్ పెట్టవచ్చన్న భావనలో రెవెన్యూ విభాగం ఉంది. పోడు భూముల్లో వ్యవసాయం చేసుకుంటున్న గిరిజనులు తమకు పట్టాలు ఇవ్వాలని సుమారు 2 లక్షల పైగా మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో సుమారు లక్ష మందికి ప్రభుత్వం పట్టాలను ఇచ్చింది. మరో లక్ష మందికి పట్టాలను ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టింది.

కోర్టుకు వెళుతున్న కబ్జారాయుళ్లు

చాలా సంవత్సరాలుగా అటవీ శాఖ భూములు కబ్జాకు గురవుతున్నాయి. దీనిపై జాయింట్ సర్వే చేయాలని ప్రభుత్వం భావించినా అది ముందుకు సాగలేదు. కబ్జారాయుళ్లు అటవీ భూములను ఆక్రమించుకొని వాటిపై కోర్టులకు వెళ్లి ప్రభుత్వాన్ని ఇరకాటంలో పడేస్తున్నారు. చాలా ఏళ్లుగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. రానున్న మూడునెలల కాలంలో అలాంటి భూములను పక్కాగా సర్వే చేసి వివరాలను సేకరించాలని రెండు శాఖలూ భావిస్తున్నాయి. రెవెన్యూ భూ రికార్డుల ప్రక్షాళన సందర్భంగా అటవీ భూములను సర్వే చేసి హద్దులను నిర్ణయించాలని అనుకున్నా అది సాధ్యపడలేదని రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నారు. అటవీ భూములకు సంబంధించి 41.75 లక్షల ఎకరాల భూమి వివాదాలు లేకుండా ఉందని (ఫారెస్ట్, అడవి, పోరంబోకు, జంగాల్త్, మహాఘర)తదితర పేర్లతో ఈ భూములు రికార్డుల్లో ఉన్నాయని పేర్కొంటున్నారు. ఆయా పేర్లతో ఉన్న భూములను సరిచేసి అటవీభూమిని అంతా పహాణీలో 'అడవి' అనే పేరుతో నమోదు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ భూములను సెక్షన్ (22)ఏ ప్రకారం నిషేధిత భూముల జాబితాలో చేర్చి నిర్దిష్టంగా మ్యాపింగ్ చేసి హద్దులు నిర్ణయించే ఆలోచనలో అధికారులు ఉన్నారు. ఈ భూములతో పాటు మరో 25 లక్షల ఎకరాల భూమిని సర్వే చేసి రికార్డులు సరి చేయాల్సి ఉందని, రాష్ట్రంలో పోడు వ్యవసాయం కింద సుమారు 6లక్షల ఎకరాల భూమి ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

పోడు రైతులకు ఇబ్బందులు కలగకుండా

అయితే చాలా జిల్లాల్లో అటవీ భూములు అన్యాక్రాంతానికి గురవుతున్నాయని ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. దీంతో ప్రభుత్వం రెండు శాఖలతో కలిపి కబ్జాకు గురైన భూములతో పాటు అటవీ శాఖ భూములను గుర్తించాలని నిర్ణయించింది. మార్చి 31వరకు అటవీ భూముల సర్వేలను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా అధికారులకు నిర్ణయించింది. దీనివలన పోడు రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ప్రభుత్వం భావిస్తోంది. దీంతోపాటు ప్రభుత్వ శాఖల మధ్య సరిహద్దు తగాదాలు లేకుండా చూడాలని సిఎం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో రెవెన్యూ శాఖ ఈ నిర్ణయం తీసుకున్నట్టు అధికారులు పేర్కొంటున్నారు. ఈ మేరకు అధికారులు దీనికి సంబంధించిన కార్యాచరణను రూపొందించారు. రెవెన్యూ, అటవీ అధికారుల సంయుక్త సర్వేతో ప్రభుత్వానికి, రైతులకు,అటవీశాఖకు లబ్ధిచేకూరనున్నట్టు పేర్కొంటున్నారు. ధరణి ప్రాజెక్టు ప్రారంభమయితే భూములకు సంబంధించిన వివరాలు ధరణి వెబ్‌సైట్‌లో పొందుపరచవచ్చని ప్రభుత్వం భావించింది. అయితే భూములకు సంబంధించిన వివరాలను గుర్తించే సందర్భంలో చాలా భూములు కబ్జాకు గురయినట్టు అధికారుల పరిశీలనతో తేలింది. దీంతోపాటు అటవీ శాఖ భూములు అన్యాక్రాంతం అయినట్టు గుర్తించారు. చివరకు ఈ విషయం సిఎం దృష్టికి రెవెన్యూ అధికారులు తీసుకెళ్లడంతో దీనిపై పూర్తి స్థాయ సర్వే చేపట్టాలని కెసిఆర్ నిర్ణయించారు. ఈ సర్వే వలన చాలా సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న భూములకు సంబంధించిన సమస్య పరిష్కారం అవుతుందని అధికారులు భావిస్తున్నారు.

పంచాయతీ ఎన్నికల్లో యువ చైతన్యం

- ప్రధానంగా ఏకగ్రీవం చేసేందుకే యత్నాలు
- బరిలో నిలిచేందుకు ఆశావహుల సన్నాహాలు
- మెజారిటీ స్థానాలకు ఎంఎల్‌ఏల గురి
- రసవత్తరంగా మారనున్న పంచాయతీ సమరం
- పంచాయతీ ఎన్నికల నిర్వహణకు భారీ ఏర్పాట్లు



మనతెలంగాణ/మంచిర్యాల ప్రతినిధి : గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు యువత మొగ్గు చూపుతుంది. స్థానికంగా జరిగే పోరులో పార్టీల మద్దతు లేకుండా బరిలో నిలిచేందుకు సన్నాహాలు చేస్తున్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీచేయడంతో గ్రామాల్లో ఎన్నికల సందడి నెలకొంది. ప్రధానంగా పలు పంచాయతీలను ఏకగ్రీవం చేసేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. టిఆర్‌ఎస్‌కు చెందిన ఎంఎల్‌ఏలు సైతం శాసన సభ ఎన్నికల్లో సత్తా చాటినట్లు పంచాయతీ ఎన్నికల్లో కూడ మెజార్టీ స్థానాలను ఏకగ్రీవం చేసేందుకు యత్నిస్తున్నారు. మూడు విడతలుగా జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో మాజీ సర్పంచ్‌లు సైతం పోటీ చేసేందుకు ముందుకు వస్తుండగా వారిపై అసంతృప్తితో ఉన్న యువకులు పోటీ చేసి వారిని ఓటమి పాలు చేయాలని పాచికలు కదుపుతున్నారు. ఇప్పటికే అధికారులు వార్డులు, సర్పంచ్‌ల రిజర్వేషన్‌లను ప్రకటించారు. గతంలో ఉన్న రిజర్వేషన్‌లు మారిపోగా అనుకూలించే గ్రామపంచాయతీల్లో మాజీ సర్పంచ్‌లు, యువకులు పోటీ చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. పంచాయతీ ఎన్నికల్లో బహుముఖపోటీ నెలకొనే అవకాశం ఉండగా ఇప్పటికే పల్లెల్లో రాజకీయ వాతావరణం వేడెక్కింది. సర్పంచ్ ఎన్నికలు పార్టీల ప్రమేయం లేకుండా జరుగుతుండగా పరోక్షంగా పార్టీల మద్దతుతోనే అభ్యర్థులు బరిలో కొనసాగుతారు. దీనికి తోడు కుల సంఘాలు కూడగట్టుకొని ఇలాంగైనా సర్పంచ్ ఎన్నికల్లో విజయం సాధిచుకోవాలని పక్కాగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. విజయమే లక్ష్యంగా పోటీ చేసే అభ్యర్థులు పార్టీల మద్దతుతో సీట్లను చేజిక్కించుకునేందుకు కసరత్తులు చేస్తున్నారు. ప్రధానంగా టిఆర్‌ఎస్ పార్టీకి ప్రతి గ్రామంలో క్యాడర్ ఎక్కువగా ఉండడంతో సీట్ల కేటాయించిపు విషయంలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సారి జరిగే ఎన్నికల్లో యువత మాత్రం ఎలాంగైనా పోటీలో నిలబడి విజయం సాధించాలని ముందుకు సాగుతున్నారు. గత కొన్ని రోజులుగా యువజన సంఘాల పేరిట గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతూ సమస్యలపై పోరాటాలు సాగిస్తున్నారు. అదే విధంగా మహిళలకు కేటాయించిన స్థానాల విషయంలో నిరక్షరాస్యులు ఉన్నచోట విద్యావంతులను బరిలో నిలిపేందుకు ఆయా పార్టీలు సన్నాహాలు చేస్తున్నాయి. మంచిర్యాలజిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలు మూడు విడతలుగా జరుగుతున్న నేపథ్యంలో అధికారులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. అధికారులకు శిక్షణకార్యక్రమాలు పూర్తి చేయడంతో పాటు పోలింగ్ సామాగ్రిని మండల కేంద్రాలకు తరలించి జిల్లాలో 308 పంచాయతీలు,2706 వార్డులకు ఎన్నికలు జరగనుండగా 2706 పోలింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేశారు. మొదటి విడత కింద 7 మండలాల్లో 111 పంచాయతీలు 972వార్డులకు, రెండోవ విడతలో 5మండలాల్లోని 102 పంచాయతీలు, 868 వార్డులకు,మూడో విడతలో 4 మండలాల్లోని 95 పంచాయతీలు,866 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. జాయింట్ కలెక్టర్ సురేందర్‌రావుతో పాటు జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చన్న ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించి,ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరపాలని సూచించారు.

ఏకగ్రీవం చేసేందుకు ఎంఎల్‌ఏల యత్నాలు

అసెంబ్లీ ఎన్నికల్లో మూడు నియోజకవర్గాలో ఘన విజయం సాధించి ఆత్మవిశ్వాసంతో ఉన్న అధికార పార్టీ ఎంఎల్‌ఏలు మెజార్టీ పంచాయతీ స్థానాలను చేజిక్కించుకునేందుకు పాచికలు కదుపుతున్నారు. టిఆర్‌ఎస్‌కు నాయకులతో పాటు కార్యకర్తల బలం కూడా ఎక్కువగా ఉండడంతో వారి సాయంతోనే సర్పంచ్ పదవులను ఏకగ్రీవం చేసే దిశగా ముందుకు సాగుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 308 గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరుగుతుండగా కనీసం 100 గ్రామపంచాయతీలైనా ఏకగ్రీవం చేసి తమ ఖాతాలో వేసుకోవాలని కసరత్తులు చేస్తున్నారు. అధికార పార్టీల పెద్ద సంఖ్యలో సర్పంచ్‌ల స్థానాల కోసం ఆశావహులు ఆశపడుతుండడం ఎంఎల్‌ఏలకు తలనొప్పిగామారింది. సర్పంచ్ అభ్యర్థులుగా ఎవరిపేరును ప్రతిపాదించాలో అర్థం కాక సతమతమవుతున్నారు. గతంలో ఏకగ్రీవమైన పంచాయతీలతో పాటు ఇటీవల కొత్తగా ఏర్పడిన చిన్న పంచాయతీలు వందశాతం ఎస్‌టి జనాభా గల గ్రామాలు టిఆర్‌ఎస్‌కు పూర్తి స్థాయిలో పట్టు ఉన్న పంచాయతీలపై ఎంఎల్‌ఏలు దృష్టిని కేంద్రీకరించారు. మంచిర్యాల చెన్నూర్,బెల్లంపల్లి, నియోజకవర్గాల్లోని మెజార్టీ గ్రామాల్లో టిఆర్‌ఎస్‌కు పట్టు ఉండడం వల్ల పలు పంచాయతీలు ఏకగ్రీవం జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

రూ. 1.20 కోట్ల

కలకలం..

మన తెలంగాణ/సత్తుపల్లి : ఎటువంటి పత్రాలు లేకుండా సుమారు రూ. 1.20 కోట్లు (ఏపి 20 క్యూ 3557) ఇన్నోవా, (ఏపి 16 డిఓ 2697) డిజైర్ కార్లలో తరలిస్తున్నారనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు రెండు కార్లను తనిఖీ చేసి, సుమారు రూ. 1.20 కోట్లను స్వాధీనం చేసుకున్న ఘటన పట్టణంలో కలకలం రేపింది. ఆదివారం తెల్లవారుజామున తమ్మిలేరు పెద్ద వంతెన సమీపంలో ఆంధ్రా రాష్ట్రం, ప.గో జిల్లా మండపేట ప్రాంతం నుండి వస్తున్న రెండు కార్లలో సరైన పత్రాలు లేని నగదు (హవాలా) తరలిస్తున్నట్లు పక్కా సమాచారం మేరకు తనిఖీ చేసి, నగదుతో పాటు రెండు కార్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. లలిత బ్రాండ్ రైస్ కంపెనీకు చెందిన ప్రతినిధులు వ్యాపార పరమైన మొత్తాన్ని డీలర్ల నుండి వసూళ్ళు చేసుకొని వస్తున్నట్లు చెబుతున్నప్పటికీ తగిన పత్రాలు లేని కారణంగా పోలీసులు నగుదును సీజ్ చేశారు. అనంతరం సంబంధిత పత్రాలను వ్యాపార కార్యకలాపాల వివరాలను పోలీసులకు సమర్పించటంతో కథ సుఖాంతమైంది. రూ. 1.20 కోట్లు తరలిస్తూ పట్టుబడిన విషయం పట్టణంలో దావానంలా వ్యాపించటంతో చర్చనీయాంశంగా మారింది. ఈ కేసు వివరాలను ఏసిపి ఆంజనేయులుతో పాటు సిఐ సురేష్ పరిశీలించారు.

బాలికపై మారుటి తండ్రి అత్యాచారం

ముజఫర్‌నగర్ (యుపి) : పదహారేళ్ల బాలికపై ఆమె మారుటితండ్రి, అతని సోదరుడు అత్యాచారం చేశారు. వారు తమ అకృత్యాన్ని వీడియో కూడా తీశారు. షామ్లీ జిల్లా కంధ్లా టౌన్‌లో శనివారం ఈ సంఘటన జరిగిందని పోలీసులు ఆదివారం తెలిపారు. బాధితురాలి మారుటి తండ్రి వసీం, అతని సోదరుడు తస్వీర్‌పై ఐపిసిలోని వివిధ సెక్షన్ల కింద, పోక్సో కింద కేసు నమోదు చేశామని, నిందితులిద్దరూ పరారీలో ఉన్నారని సర్కిల్ ఆఫీసర్ రాజేష్ తివారీ తెలిపారు. నిందితులు తన కూతురిపై అత్యాచారం చేశారని, వారు వీడియోగా కూడా చిత్రీకరించారని బాధితురాలి తల్లి ఫిర్యాదు చేసింది. ఈ సంఘటనను ఎవరికైనా చెబితే వీడియోను బయటపెడతామని తన కుమార్తెను బెదిరించారని ఆమె తెలిపింది. గత ఏడాది అక్టోబర్‌లో మొదటి భర్త మరణించగా బాధితురాలి తల్లి వసీంను వివాహం చేసుకుంది. నిందితులకోసం గాలింపు చేపట్టినట్టు తివారీ చెప్పారు. మరో కేసులో, ట్రక్కు హెల్పర్‌గా పనిచేస్తున్న 16 ఏళ్ల పిల్లవాడిపై ఆ వాహనం డ్రైవర్ లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలుడు ప్రతిఘటిస్తే అతన్ని చితకబాదాడు.షామ్లీ జిల్లాలో శనివారం ఈ సంఘటటన జరిగిందని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్ చెప్పారు. ట్రక్కు డ్రైవర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.

వేటగాళ్ల ముసుగులో పులి బలి



మన తెలంగాణ/పెంబి : వేటగాళ్ల ముసుగులో మరో పులి బలైపోయింది. పులులను రక్షించాలని అధికారులు శ్రమిస్తుంటే మరో వైపు వేటగాళ్ల ముసుకులో పులులు బలి అవుతున్నాయి. కరెంట్ తీగలకు పులి బలైపోయిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిర్మల్ జిల్లా కడెం మండలం పెంబి తులుగాం పొంద్రి గ్రామ పరిధిలో రెండు నెలల క్రితం కరెంట్ తీగలకు తగిలి పులి చనిపోయిందని, దానిని ఎవరికి తెలియకుండా మట్టిలో పాతేశారని అటవీ శాఖ అధికారులు తెలిపారు. పులి చర్మాన్ని నిందితులు తరలిస్తుండగా ఇచ్చోడ మండలకేంద్రంలో అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. ఆదివారం జాగిలాలతో స్పెషల్ టీమ్‌ను రప్పించి ఎఫ్‌డిటిటి శర్వానంద్, డిఎఫ్ఓ దామెదర్ ఆధ్వర్యంలో పులిని చంపిన ప్రదేశాన్ని గుర్తించి పరిశీలించారు. నిందితులుగా తాటిగూడకు చెందిన గుగ్లవత్ ప్రకాష్, తులుగాంపొంద్రికి చెందిన అలవత్ మున్యలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఇందులో తులవత్ ప్రకాష్‌ను పట్టుకొని రిమాండ్‌కు తరలిస్తుండగా అలవత్ మున్యను పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డిఎఫ్ఓ దామోదర్ మాట్లాడుతూ అటవీ జంవుతులను, అడవిని నరికిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనతో పాటుగా ఎఫ్ఆర్ఓలు అఫీసొద్దిన్, రవీందర్, చంద్రశేఖర్, ఎఫ్ఎస్ఓలు శ్రీనివాస్, సీతారాం, బీట్ ఆఫీసర్లు, ఎస్ఐ సంజీవ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

కెసిఆర్ మరోసారి సిఎం కావడం వరం

- కాంట్రాక్టు లెక్చరర్లకు బాసటగా నిలిచింది టిఆర్ఎస్సే
- మాజీమంత్రి, తన్నీరు హరీశ్‌రావు



మన తెలంగాణ/ సిద్దిపేట ప్రతినిధి : కెసిఆర్ మరో సారి ముఖ్యమంత్రి కావడం కాంట్రాక్టు లెక్చరర్ల పాలిట వరమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఆదివారం కాంట్రాక్టు లెక్చరర్ల ఆధ్వర్యంలో సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయడానికి వారికి ఉద్యోగ భద్రత కల్పించడానికి సానుకూలంగా ఉందన్నారు. తెలంగాణ ఉద్యమంలో మీరందరు చూపిన తెగువ తెలంగాణ రాష్ట్రం ఏర్పడటానికి ప్రధాన కారణమని అన్నారు. కాంట్రాక్టు లెక్చరర్లు ఉద్యమంలో పాల్గొనడమే కాకుండా విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనడానికి ప్రేరణ కూడా ఇచ్చారన్నారు. రాబోయే రోజులలో ఉద్యోగ భద్రత కల్పించే ఏకైక ప్రభుత్వం టిఆర్‌ఎస్ ప్రభుత్వమే అన్నారు. మీరే లేకపోతే కాలేజీలు ఏవి కూడా మనుగడ సాధించలేవని అన్నారు. మీ కృషిని ప్రభుత్వం గుర్తించి త్వరలోనే ఫలితాన్ని సంతోషకరమైన వార్తను కూడా వినబోతున్నారన్నారు. సమస్య పరిష్కారానికి త్వరలోనే అడ్వకేట్ జనరల్‌తో మాట్లాడి ఆకాంక్షను నేరవేర్చ దిశగా అడుగు ముందుకు వేయబోతున్నామన్నారు. ఇంత వరకు చనిపోయిన వారి గురించి సిఎం కెసిఆర్‌తో మాట్లాడి వారికి ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తానన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రతిఒక్కరికీ మేలు చేసే దిశగా ముందుకు సాగుతుందని, ప్రతి సమస్యను తన ముందుకు తీసుకొని వస్తే పరిష్కారాన్ని కనుగొని అందరికీ సమన్యాయం చేస్తానన్నారు.

తెలంగాణ ఉద్యమంలో ఇందిరా పార్కు వద్ద నిర్వహించిన ధర్నాలకు నేను వచ్చి సంఘీభావం తెలిపానన్నారు. రెగ్యూలర్ చేసే విధంగా టిఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తే వారి నోటి కాడిబుక్కను లాక్కోనే విధంగా కాంగ్రెస్ నాయకులు కోర్టులో కేసులు వేశారని పేర్కొన్నారు. త్వరలోనే కోర్టు కేసుల పరిష్కారం జరిగి మీ ఆకాంక్షను నేరవేర్చే విధంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. మీ కుటుంబంలో ఒక సభ్యుడిగా ఉన్న నాకు మీ కష్ట సుఖాలు తెలుసు. కావున ఉద్యోగ భద్రత కల్పించే దిశగా ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అందోల్ ఎమ్మెల్యే కాంత్రికుమార్, సిద్దిపేట మున్సిపల్ చైర్మన్ కడవేర్గు రాజనర్సు, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రంగాచారి, కౌన్సిలర్లు చిప్ప ప్రభాకర్, కాంట్రాక్టర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కనకచంద్రం, గిరి, బాలకిషన్, కాశీనాథ్, నర్సింహా, నాగేందర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

స్వామి సన్నిధానంకు ఇలా...

- ఏటా శబరిమలకి ఖమ్మం జిల్లా నుంచి వేలాది మంది భక్తులు
- మునపటికంటే పెరిగిన సౌకర్యాలు





మనతెలంగాణ/ఖమ్మం కల్చరల్: శబరిమలై కొండపై వెలసిన అయ్యప్పస్వామిని ఏటా లక్షలాదిమంది భక్తులు దర్శించుకుని తరిస్తున్నాడు. దీక్షాకాలంలో కఠిన నియమాలను పాటిస్తూ అయ్యప్ప పట్ల తమ భక్తిని చాటుకుంటున్నారు. కార్తీకమాసం ఆరంభం కావడంతో అయ్యప్ప దీక్షలు చేపట్టే భక్తుల సందడి మొదలైంది. చాలా దేవాలయాల్లో అయ్యప్ప పడి పూజలు మారుమోగుతున్నాయి. మాలలు ధరించి శబరమల వెళ్లేవారి సంఖ్య ఏటా పెరుగుతూనే ఉంది. మండల పూజకు హాజరుకావాలనుకునే స్వాములు 41 రోజులు కఠోర దీక్షలో ఉం టారు. మకరజ్యోతికి హాజరు కావాలనుకునేవారు 60 రోజుల దీక్షను పాటిస్తారు. దీక్షా కాలంలో స్వాములు కఠిన నియమాలు పాటిస్తుంటారు. తెల్లవారుఝామునే చన్నీటి స్నానం చేసి, సూర్యోదయానికి ముందే అయ్యప్పపూజ చేయడం, మాంసం, మద్యం, ధూమపానాలకు పూర్తిగా దూరంగా ఉండటం, చెప్పులు లేకుండా నడవడం, నేలపై నిద్రపోవటం చేస్తుంటారు. ఒకపూట మాత్ర మే భోజనం చేస్తూ మరోపూట అల్పాహారమే తీసుకుంటారు. దీక్ష నియమాలను పాటిస్తూ అయ్యప్ప స్వా మి పట్ల తమ భక్తి ప్రపత్తులను చాటుకుంటారు. దేహమే దేవాలయం, జీవుడే సనాతన దైవం అన్న పవిత్ర భావన అయ్యప్ప భక్తుల్లో కనిపిస్తుంటుంది. ప్రతి ఒక్కరినీ స్వా మి అని సంబోధిస్తుంటారు. ప్రకృతి సౌందర్యంతో అలరారే శబరిమలలో ఆలయం ఎప్పుడూ నిర్మితమైందో తె లిసే ఆధారాలు కచ్చితంగా లేవు. రామభక్తురాలు శబరి ఆ ప్రాంతంలో నివసించిందని, అందుకే శబరిమల అనే పేరు వచ్చిందని అంటారు. శబరిమలైకు 6 కిలోమీటర్ల దూరంలో పంపానది ఉంది. సాక్షాత్తు శ్రీరాముడే ఇక్కడ స్నానం ఆచరించినట్లు పురాణంలో ఉంది. ఈ పంపానదికి ఎదురుగా ఉన్న రుష్యశృంగ పర్వతమే సుగ్రీవుని సంస్థానమని చెప్తారు. నదీతీరంలోని ఓ రాతిపై శ్రీరాముని పాద ముద్రలు ఉన్నాయని యాత్ర చేసిన వారు చెప్తుంటారు.

శబరికి ఎలా వెళ్లాలి?

శబరిమలై వెళ్లాలనుకునే భక్తులు శబరి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించి కొట్టాయం లేదా ఎర్నాకుళం స్టేషన్లలో దిగి అక్కడికి పంబ సుమారు 100 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. పంబ వరకు ఆర్టీసి బస్సులలో లేదా ప్రైవేటు టాక్సీలలో వెళ్లవచ్చు. పంబ నుండి కాలినడకన 5 కిలోమీటర్లు ప్రయాణించి అయ్యప్ప సన్నిధానానికి చేరుకోవచ్చు. నడవలేని అసహాయులకు డోలీలు ఏర్పాటుచేసారు. తొలిసారి మాల ధరించిన కన్నెస్వాములు జ్యోతి దర్శనం చేసుకోవాలి. కాబట్టి కేరళలోని ఎరుమేలి వరకు బస్సులో ప్రయాణించి అక్కడి నుండి 70 కిలోమీటర్లు కాలినడకన ప్రయాణించి పంబా తీరానికి చేరుకుంటారు. అక్కడ స్నానం ఆచరించి ఇరుముడితో స్వామి సన్నిధానానికి కొండదారిన బయలుదేరుతారు. ఎరుమేలి మార్గం గుండా వెళ్లేవారు పెట్టతుళ్లీయ నృత్యం సంబరంగా చేసుకుని కొండదారిన స్వామి సన్నిదానానికి చేరుకుంటారు. ఈదారిలో అయ్యప్పస్వామి నడయాడిన పుణ్య ప్రదేశాలు ఉన్నాయి. తేని, కంభల మీదుగా వెళ్లేవారు 45 కిలోమీటర్ల కాలినడక ప్రయాణించాల్సి ఉంటుంది. కొండపై ఇరుముడితో 18 మెట్లెక్కి సన్నిధానానికి చేరుకుని శ్రీధర్మ శాస్త్రావారిని కనులారా వీక్షించి తరిస్తుంటారు. డిసెంబర్‌లో జరిగే మండల పూజ, మకల విలక్కు(మకరజ్యోతి దర్శనం), విశు, చైత్ర ప్రథమ దినాల్లో భక్తులు విశేష సంఖ్యలో స్వామిని దర్శించుకునేందుకు వస్తుంటారు. మకర సంక్రాంతి రోజున మకర జ్యోతి దర్శనం కోసం లక్షలాది మంది భక్తులు దేశం నలుమూలల నుండి శబరి మలకు తరలివెళతారు. తిరుగు ప్రయాణంలో వీరంతా కేరళలోని ఇతర పుణ్యక్షేత్రాలైన చెంగనూర్‌లోని భగవతి, గురువాయూరప్పన్, అయ్యప్పస్వామి పెరిగిన ప్రదేశం, పందలం, కొట్టాయంలోని శివాయలయాలను దర్శించుకుంటారు. నవంబర్ 16 నుండి 41 రోజుల పాటు మండల పూజ రోజుల్లో, మకర విలక్కు ఉత్సవం సందర్భంగా ప్రతి ఏటా జనవరి 1 నుండి 20 వరకు ఆలయాన్ని తెరిచి ఉంచుతారు.



యాత్రికులకు కేరళ ప్రభుత్వ శాఖల సేవలు

శబరిమలై యాత్రకు వచ్చే అయ్యప్పభక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అటవీశాఖ అధికారులు చర్యలు చేపడతారు. పరిశుభ్రమైన నీటి బాటిల్‌ను తక్కువ ధరకే అందజేస్తారు. ఖాళీ బాటిల్ తిరిగి ఇచ్చిన పక్షంలో మరల కొనే బాటిల్‌పై మరికొంత ధర తగ్గిస్తుంటారు. ఆరోగ్య శాఖ వారు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా తగిన చర్యలు తీసుకుంటారు. శబరిమలైలో లభించే ఆహార పదార్థాల నాణ్యతపైనా అక్కడి అధికారులు ఓ కన్నేసి ఉంచుతారు.

ఖమ్మం నుంచి శబరిమల వెళ్లే రైళ్లు

ఖమ్మం నుండి శబరిమలై వెళ్లే భక్తులకు వివిధ ప్రాంతాల నుండి నడిచే రైళ్లలో రోజు ఏదో ఒక రైలు అందుబాటులో ఉంది. గోరఖ్‌పూర్ కొచ్చిన్ రైలులో వెళ్తే రైలు కొచ్చిన్‌కు చేరటానికి ముందు స్టేషన్ ఎర్నాకుళంలో దిగాలి, అక్కడ నుండి వెళ్లాలి. దాని తరువాత బరోని ట్రైన్, త్రివేంద్రం రైళ్లు కూడా అందుబాటులో ఉన్నాయి. తిరుగు ప్రయాణంలో భక్తులు ఎర్నాకుళంలోగానీ, త్రివేండంలో గానీ ఎక్కి తమ గమ్యస్థానాలకు సులభంగా చేరుకోవచ్చు. అయితే దేశవ్యాప్తంగా లక్షలాది మంది భక్తులు అయ్యప్ప సన్నిధానానికి వెళుతుంటారు కాబట్టి 3నెలల ముందే బుక్ చేసుకోవటం అన్నిటికంటే ఉత్తమం.

12 మంది మట్కా జూదరుల అరెస్ట్



మన తెలంగాణ / సిరిసిల్ల : రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో పది మంది మట్కా జూదరులను ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. సిరిసిల్లలో జిందం లక్ష్మణ్ అనే వ్యక్తి గుజరాత్‌కు చెందిన మదూర్ శ్రీనివాస్ అనే వ్యక్తికి సబ్ ఏజెంట్‌గా పనిచేస్తూ సిరిసిల్లలో మట్కా నడిపుతున్నాడని పోలీసులు తెలిపారు. సిరిసిల్లలోని వ్యక్తులతో లక్ష్మణ్ బొంబాయి, కళ్యాణి కంపెనీలతో మట్కా ఆడిస్తుంటాడని, మట్కా డబ్బులను పది రోజులకోసారి గుజరాత్‌నుండి వచ్చిన వ్యక్తికి అప్పగిస్తాడని తెలిపారు. ఆదివారం అందిన సమాచారం మేరకు జిందం లక్ష్మణ్‌ను, అదుపులోకి తీసుకొని, అతనిచ్చిన సమాచారం మేరకు కోల లక్ష్మి నారాయణ, కోల రాములు, షేక్ షరీఫ్, మహ్మద్ ఫయాజ్, మహమ్మద్ అలీం, అసరి నారాయణలను అరెస్ట్ చేసామని పోలీసులు తెలిపారు. సత్కురి పాండు, లగిశెట్టి రాములు, గోరిట్యాల హరీష్, కొప్పుల శ్రీనివాస్, శ్రీపతి రమేశ్‌లను బైండోవర్ చేశామన్నారు. నిందితుల నుండి 5,770 రూపాయల నగదు, మట్కా గెస్సింగ్ చార్టులు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మట్కా నడిపేవారు తమ పద్ధతి మార్చుకోకపోతే వారిపై పిడి యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని ఎస్‌పి హెచ్చరించారు. మట్కాకు సంబంధించిన వివరాలు అందించిన వారి సమాచారం గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు.

పోలీస్‌స్టేషన్ ముందు మహిళ ఆత్మహత్యాయత్నం





మన తెలంగాణ/ చందుర్తి: భూ సమస్య పేరిట తరచు ఠాణాకు పిలిపిస్తున్నారని మనోవేదనకు గురై ఓ మహిళా రైతు కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టిన సంఘటన చందుర్తి ఠాణా ఎదుట ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే చందుర్తి మండల కేంద్రానికి చెందిన మేడికాల లక్ష్మి (53) అనే మహిళా రైతు చందుర్తి గ్రామ శివారులోని 582/ఆ సర్వే నెంబర్‌లో 0.34 గుంటల వ్యవసాయ భూమి ఉంది. ఇదే సర్వే నెంబర్‌లో లక్ష్మి బావ కుమారుడు తిరుపతి పేరిట 0.34గుంటల భూమి ఉంది. ఈ భూమి మొత్తం తనదేనంటూ మేడికాల తిరుపతి చందుర్తి పోలీస్‌స్టేషన్‌లో డిసెంబర్ 26న ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్‌ఐ మల్లేశ్ గౌడ్ ఫిర్యాదు స్వీకరించారు. విచారణ చేపట్టక ముందే ఎస్‌ఐ బదిలీ కావడంతో రెండు రోజుల క్రితమే బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐ నీలం రవి పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను పరిష్కరించేందుకు ఆదివారం పెండింగ్ ఫిర్యాదులో ఉన్న మేడికాల లక్ష్మిని ఠాణాకు పిలిపించగా, కిరోసిన్ వెంట తెచ్చుకుని ఠాణా ఎదుట కిరోసిన్ తన మీద పోసుకుంది. ఇది గమనించిన కానిస్టేబుల్ వెంటనే అడ్డుకుని ఠాణాలోనికి తీసుకొని వెళ్లాడు. వెంటనే ఎస్‌ఐ మహిళా రైతును కిరోసిన్ ఎందుకు పోసుకున్నావని ప్రశ్నించారు. ఫిర్యాదు చేసిన తిరుపతి పోలీస్‌స్టేషన్‌లో తాత్కాలిక జీపు డ్రైవర్‌గా పని చేస్తున్నాడని, కొత్తగా వచ్చిన ఎస్‌ఐలు అందరూ పిలిపిస్తున్నారని ఆ మహిళ వాపోయింది. ఈ విషయంలో న్యాయం చేస్తానని, ఆత్మహత్య చేసుకుంటే సమస్య పరిష్కారం కాదని మహిళా రైతుకు నచ్చజెప్పారు. వెంటనే ఆ మహిళ ఠాణా నుండి వెనుదిరిగి వెళ్లింది.

ఈ విషయమై ఎస్‌ఐని వివరణ కోరగా పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులపై విచారణలో భాగంగా ఠాణాకు పిలిపించామన్నారు. ఠాణాకు వచ్చే ముందే కిరోసిన్‌ను ఒంటిపై చల్లుకుని ఠాణాకు వచ్చిందన్నారు. నిప్పు అంటించుకునేందుకు ప్రయత్నించగా అడ్డుకున్నామన్నారు. ఆ విషయంపై విచారణ చేసి న్యాయం చేస్తామన్నారు.

వెంకటయ్యకు జాతీయస్థాయి ప్రశంసాపత్రం

మన తెలంగాణ/మొయినాబాద్ : ఢిల్లీలో జరిగిన నేషనల్ ఇన్నోవేషన్ ఇన్ ఎడ్యుకేషనల్ ప్లానింగ్ అడ్మినిస్ట్రేషన్ కార్యక్రమంలో కనకమామిడి జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయుడు, మండల విద్యాధికారి ఎం.వెంకటయ్య పాల్గొన్నారు. గత మూడు రోజులుగా ఢిల్లీలో నేషనల్ లేవల్ అవార్డు ఫర్ ఇన్నోవేషన్ మెథడ్స్ ఇన్ ఎడ్యుకేషన్ పేరుతో న్యూపా యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో మొయినాబాద్ మండలానికి చెందిన విద్యాధికారి వెంకటయ్యపాల్గొని కేంద్ర మంత్రి డాక్టర్ సత్యపాల్ చేతులమీదుగా జాతీయ అవార్డు ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. జాతీయ స్థాయి సదస్సులో పాల్గొని అవార్డు ప్రశంస పొందడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు.

తండ్రికి తలకొరివి పెట్టిన తనయ



మనతెలంగాణ/గణపురం : అనారోగ్యంతో మృతిచెందిన తండ్రికి కూతరే కొడుకై తలకొరివి పెట్టిన దయనీయ సంఘటన ఆదివారం గణపురంలో జరిగింది. గణపురం పిహెచ్‌సిలో పనిచేసే దిండు రాజ్‌కుమార్(38) హన్మకొండ ఆసుపత్రిలో శనివారం సాయంత్రం మృతిచెందగా ఆదివారం అంత్యక్రియలు జరిగాయి. ఆయనకు భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నందున పెద్ద కూతురు ధరణి ఆయన చితికి నిప్పు అంటించడంతో అక్కడ విషాదఛాయలు అలుముకున్నాయి. నిరుపేద కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటామని మృతుని ఇంటికి పరామర్శకు వచ్చిన భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, ఆయన సతీమణి పిసిసి ఉపాధ్యక్షురాలు గండ్ర జ్యోతి తమ సానుభూతి తెలిపి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయనతోపాటు ఎంజిఎం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నవీన్ మరో రూ.5వేలు అందజేశారు. ఈకార్యక్రమంలో జెడ్పిటిసి మోటపోతుల శివశంకర్, వివిధ పార్టీల నాయకులు బత్తిని శంకర్, ఆకుల శంకర్, మాజీ ఎంపిపి వడ్లకొండ నారాయణ, నారగాని దేవేందర్ తదితరులు రాజ్‌కుమార్ కుటుంబానికి సంతాపం తెలిపారు.

ఉప సర్పంచ్ 'కీ'లకం

- రసవత్తరం పంచాయతీ పోరు
- ఉప సర్పంచ్‌లకే చెక్ పవర్



మన తెలంగాణ/మహాముత్తారం : పంచాయతీ ఎన్నికల్లో ఈ సారి సర్పంచ్‌లతోపాటు ఉప సర్పంచ్ పదవులూ కీలకంగా మారనున్నాయి. ఈ నెల 21,25, 30 తేదీల్లో జరగనున్న పంచాయతీ ఎన్నికలకు తేదీ ఖరారు కావడంతో అందరి చూపు ఈ ఎన్నికలపైనే పడింది. తెలంగాణ ప్రభుత్వం తండాలు, గిరిజన గూడెంలను కొత్త పంచాయతీలుగా ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టిఆర్‌ఎస్ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి రావడంతో ఇక స్థానిక సంస్థల ఎన్నికలను కూడా టిఆర్‌ఎస్ కైవసం చేసుకునేందుకు పావులు కదుపుతోంది. సర్పంచ్ ఎన్నికలు దగ్గర పడుతుండడంతో ఆశావహుల కల నెరవేరబోతోంది. తెలంగాణ ప్రభుత్వం కొత్త పంచాయతీ రాజ్ చట్టాన్ని తెరపైకి తీసుకురావడంతో ఈ ఎన్నికలు నాయకులకు ప్రతిష్టాత్మకంగా మారనున్నాయి. 500ల జనాభా గల ప్రాంతాలను అధికారులు గ్రామ పంచాయతీలుగా గుర్తించి, వాటికి కొత్త పంచాయతీలుగా నామకరణం చేశారు. ఇప్పటికే కొత్త పంచాయతీలను ఏర్పాటు చేసి ప్రత్యేక పాలనను కొనసాగిస్తున్నారు. కొత్త పంచాయతీల అభివృద్ధికి నిధులు కేటాయించడంతో పాటు ప్రత్యేక అధికారులను నియమించారు. అతి తక్కువ సంఖ్య కలిగిన వార్డులు కొత్త పంచాయతీల్లో ఉండనున్నాయి. వార్డు మెంబర్లు కొత్త పంచాయతీల్లో గెలిస్తే మెజార్టి సభ్యులు ఉప సర్పంచ్‌ను ఎన్నుకుంటారు. అందువల్ల ఉప సర్పంచ్ పదవికి పోటీ చేసే వారు ఎక్కువ మంది వార్డు సభ్యులను గెలిపించుకోవాల్సిన పరిస్థితి ఉంది.

ఉప సర్పంచ్ 'కీ'లకం

కొత్త పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం సర్పంచ్‌తోపాటు ఉప సర్పంచ్‌కు కూడా చెక్‌పవర్ ఉండనుండడంతో ఆ పదవి ఇప్పుడు కీలకంగా మారింది. పంచాయతీ తీర్మానాలు చేయాలన్నా, నిధుల వినియోగం జరగాలన్నా సర్పంచ్‌తో పాటు, ఉప సర్పంచ్ కూడా భాగస్వామ్యం కావాల్సిందే. ఈ నేపథ్యంలో గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ పదవికి విపరీతంగా పోటీ పెరగనుంది. అయితే ఈ సారి ఉప సర్పంచ్ పదవికి కొన్ని హక్కులు కల్పించడంతో ఈ పదవి ఇప్పుడు కీలకంగా మారనుంది. గ్రామ పంచాయతీలో మెజారిటి సభ్యులు ఉప సర్పంచ్‌ను ఎన్నుకుంటారు. నిబంధనల ప్రకారం కూడా వార్డు మెంబర్లలో ఒకరు ఉప సర్పంచ్‌కు పోటీలో ఉంటారు.

రిజర్వేషన్లు, అనుకూల స్థానాలపై ఆరా..!

సర్పంచ్‌లుగా పోటీ చేయాలని చాలా రోజులుగా ఆశలు పెట్టుకున్న కొందరికి రిజర్వేషన్లు కలిసి రాక పోవడంతో ఉప సర్పంచ్‌గానైనా ఎన్నిక కావాలనే కోణంలో కొందరు ఆలోచనలో పడ్డారు. ఉప సర్పంచ్ పదవికి రిజర్వేషన్ అడ్డంకి లేకపోవడంతో ఇప్పటికే తమకు అవకాశం దక్కని పరిస్థితిని ప్రధాన కారణంగా చూపుతూ రెండోస్థానంపై దృష్టి పెడుతున్నారు. ఈ క్రమంలో తాము పోటీ చేసేందుకు సానుకూలంగా రిజర్వేషన్ ఉన్న స్థానాన్ని వెతుక్కోవడం.. తమ బంధువర్గం, తమకు ఎక్కువ ఓట్లు దక్కే అవకాశం ఉన్న వార్డును ఖరారు చేసుకునే పనిలో ఎక్కువ మంది నిమగ్నమయ్యారు.

సర్పంచ్, ఉప సర్పంచ్ పదవులకు పోటా పోటీ..!

అయితే సర్పంచ్, ఉప సర్పంచ్ పదవులకు పోటీ చేయాలనుకునే వారు తీవ్రంగా పోటీ పడుతున్నారు. దీంతో గ్రామాల్లో పంచాయతీ పోరు మరింత వేడెక్కింది. చాలామంది ఆశావహులు టిఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల మద్దతు కోసం ప్రయత్నిస్తున్నారు. రాష్ట్రంలో టిఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండడంతో సర్పంచ్, ఉప సర్పంచ్ మెజారిటి స్థానాలను గెలుచుకోవాలని టిఆర్‌ఎస్ నాయకులు పావులు కదుపుతున్నారు. ఒకవైపు టిఆర్‌ఎస్, మరోవైపు కాంగ్రెస్ పార్టీల నాయకులు సర్పంచ్, ఉపసర్పచ్ పదవులను దక్కించుకునేందుకు ఎవరికి వారు ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో అటవీ గ్రామాల్లో సర్పంచ్, ఉప సర్పంచ్ పదవులకు తీవ్రమైన పోటీ నెలకొంది. పలు పార్టీల నాయకులు గ్రామాల్లో ముఖ్య కార్యకర్తల సమావేశాలు ఏర్పాటు చేసుకుని సర్పంచ్, ఉప సర్పంచ్ అభ్యర్థుల పేర్లను ఖరారు చేసుకుంటున్నారు. ఏది ఏమైనప్పటికి 2019లో జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికలు పలు పార్టీలకు సవాలుగా మారనున్నాయి.

ట్రిపుల్‌ఐటి విద్యార్థుల నైపుణ్యం అద్భుతం

- ముగిసిన స్పీక్‌మేసీ కార్యక్రమాలు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



మనతెలంగాణ/బాసర : భారత దేశంలోని స్పీక్‌మేసీ కార్యక్రమం ఇప్పటికే అనేక కళాశాలలో ప్రదర్శించినప్పటికి తెలంగాణ రాష్ట్రంలోని గవర్నర్ నరసింహన్ ఆదేశాల మేరకు బాసర ట్రిపుల్‌ఐటిలో గత మూడు రోజుల నుండికార్యక్రమాన్నిచేపట్టగా విద్యార్థుల నైపుణ్యం అద్భుతంగా ఉందని స్పీక్‌మైసీ ఫౌండేషన్ చైర్మన్ కిరణ్ సేతు అన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే దేశంలోనే వివిధ రాష్ట్రాల్లో 7వేల వరకు కార్యక్రమాలు చేపట్టగా వివిధ భాషలకు సంబంధించి కళాకారులు 800 మంది పాల్గొన్న మూడు రోజులకు గాను ఇప్పటికే 500 మంది విద్యార్థులు భరతనాట్యం, కూచిపూడి, కర్నాటక సంగీతం, జానపదాలు, ఎంబ్రాయిండింగ్, ముగ్గులు తదితర అంశాలపై తమ నైపుణ్యాన్ని చాటి అద్భుతమైన ప్రదర్శనలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. కళల మీద ప్రాముఖ్యతను వెలికితీయడమే మా ధ్యేయమని భారతదేశంలో విభిన్న సంస్కృతిక, జాతులు ఉన్నప్పటిక సాంస్కృతి కళల ద్వారా భావిభరత విద్యార్థులు నేర్చుకోవడానికి మంచి అవకాశమన్నారు. అంతకుముందు సాక్ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు జానపదాలు, భరతనాట్యం, కర్నాటక సంగీతంలో అద్భుతమైన ప్రదర్శనలు ఇచ్చారు. రేల రేల ఫేం గంగా మన రాష్ట్రానికి చెందిన ఫోక్ సింగర్‌గా గుర్తింపు పొందినప్పటికి విద్యార్థులకు ఎంతో శిక్షణను అందించారు. ఈకార్యక్రమంలో కళాశాల ఏఓ వెంకటస్వామి, ఏవివి మూర్తి, ఎన్ఎస్ఎస్ ఆర్గనైజర్, కన్వీనర్, కోఆర్డినేటర్ రాకేశ్‌రెడ్డి, డాక్టర్ విజయ్‌కుమార్, సిబ్బంది, వాలెంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ భోజనం తిన్న 40 మందికి అస్వస్థత

- పాఠశాలలో హుటాహుటిన వైద్యశిబిరం ఏర్పాటు
- రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేసిన ఆర్‌డిఒ
- ప్రిన్సిపాల్ పై చర్యలు తీసుకోవాలని విద్యార్థి, యువజన సంఘాల డిమాండ్



మనతెలంగాణ/చిట్యాల: చిట్యాల మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ వెలుగు పాఠశాలలోని హాస్టల్ విద్యార్థుల భోజనం ఫుడ్‌పాయిజన్ కావడంతో ఆదివారం కలకలం సృష్టించింది. ఈ సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలోని చిట్యాలలో జరిగింది. జరిగిన సంఘటనకు బాధ్యురాలిని చేస్తూ హాస్టల్ ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని విద్యార్థి నాయకులు, తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. సంఘటనకు స్పందించిన డిఎం అండ్ హెచ్ఓ అప్పయ్యతోపాటు స్థానిక అధికారులు సిఐ శ్రీనివాస్, ఎస్ఐ అనిల్ కుమార్‌లు పరిస్థితిని పర్యవేక్షించారు. ఇదిలావుంటే హాస్టల్ సంబంధించిన విద్యార్థులు యథావిధిగా గత రాత్రి భోజనం చేయగా ఆరుగురు విద్యార్థులు ఉదయం 4 విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. శనివారం రాత్రి విద్యార్థులు క్యాబేజి కూర, సాంబారుతో అన్నం తినడంతో ఫుడ్ పాయిజన్ అయింది. దీంతో 40 మంది విద్యార్థులకు వాంతులు, కడుపునొప్పి రావడంతో స్థానిక సివిల్ ఆసుపత్రికి తరలించారు. పాఠశాల, కళాశాలలో 634 మంది విద్యార్థులు ఉన్నారు. శనివారం రాత్రి బింధు అనే విద్యార్థినితో పాటు మరో ఐదుగురికి కడుపునొప్పి, వాంతులు చేసుకోవడంతో ఆసుపత్రికి తరలించారు. తదనంతరం ఆదివారం ఉదయం మిగతా 40 విద్యార్థులకు వాంతులు, కడుపు నొప్పి రావడంతో పాఠశాల ప్రిన్సిపాల్ తోపాటు ఉపాధ్యాయులు ఆసుపత్రికి తీసుకొచ్చి చికిత్స చేయించారు.ఆసుపత్రిలో ఉన్న విద్యార్థినులను స్థానిక సిఐ శ్రీనివాస్, ఎస్ఐ అనిల్‌కుమార్ సందర్శించి విద్యార్థులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే పాఠశాలను సందర్శించి విద్యార్థులకు జరిగిన సంఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఎలాంటి గొడవలు చేయకుండా ఉండేందుకు ఆసుపత్రిలో పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా వైద్య అధికారులు డాక్టర్ అప్పయ్య, డిప్యూటీ డిఎం హెచ్ఓ గోపాల్‌రావు లు హుటాహుటిన ఆసుపత్రిని సందర్శించి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని పాఠశాలలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. అలాగే జయశంకర్ జిల్లా ఆర్‌డిఓ వీరభద్రచారికు సమాచారం తెలువడంతో మండల రెవెన్యూ అధికారులను అప్రమత్తం చేసి విద్యార్థుల పరిస్థితిని తెలుసుకుని విఆర్‌ఓలను ఆసుపత్రి వద్ద అందుబాటులో ఉంచారు.

ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను సందర్శించిన అనంతరం నాయకులు మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులు కలుషిత ఆహారం తిని అస్వస్థకు గురైన సంఘటనకు బాధ్యులైన పాఠశాల ప్రిన్సిపాల్ జయశ్రీ పై సంబంధిత జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు పసుల వినయ్‌కుమార్, బొడ్డు ప్రభాకర్, గుర్రం రాజేందర్, గుండా మణికుమార్‌లు డిమాండ్ చేశారు.

పరామర్శించిన నాయకులు


పాఠశాల విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గండ్ర జ్యోతి, పరకాల మార్కెట్ కమిటి చైర్మన్ కుంభం రవీందర్‌రెడ్డి, మాజీ జెడ్పిటిసి ఒరం సమ్మయ్య, నాయకులు పేరుమాండ్ల రవీందర్ , సమ్మయ్య, ఆరెపల్లి సమ్మయ్య, బుర్ర రాజు, పాండ్రాల స్వామి, గుర్రం నర్సయ్య, పర్లపేల్లి భద్రయ్య తదితరులు ఉన్నారు. ఏది ఏమైనా హాస్టల్‌లో జరిగిన సంఘటన మండలంలో చర్చనీయాంశంగా మారింది.

చికిత్స అందిస్తున్నాం: డాక్టర్ కొండల్‌రెడ్డి



పాఠశాలలోని విద్యార్థులకు సరైన సమయంలో భోజనం చేయకపోవటంతోపాటు చలి తీవ్రత కారణంగా జీర్ణం కాకపోవటంతో వాంతులు, కడుపు నొప్పి బాధలు వచ్చాయని అన్నారు. 40 మంది విద్యార్థులకు చికిత్స అందించామని అందులో 10 మంది విద్యార్థులకు డెక్సోజల్ పెట్టమని, దీంతో విద్యార్థులు ఉపశమనం పొందారని విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం లేదని డాక్టర్ కొండల్‌రెడ్డి తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



మన తెలంగాణ/రామడుగు : మండలంలోని దేశరాజుపల్లి గ్రామానికి చెందిన హన్మండ్ల రాంరెడ్డి (40) తనకున్న 3.5 ఎకరాల్లో పత్తి సాగు చేయగా దిగుబడి సరిగా రాక తీవ్రంగా నష్టపోయాడు. పెట్టుబడులకు తెచ్చిన అప్పు తీర్చలేక గత బుధవారం ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో పురుగుల మందు తాగి వాంతుల చేసుకోగా వారి కుటుంబ సభ్యులు ఆయనను కరీంనగర్‌కు తరలించారు. ఆదివారం మెరుగైన చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించారు. మృతుని తల్లి హన్మండ్ల నర్సమ్మ ఫిర్యాదు మేరకు రామడుగు ఎస్సై రవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

థర్మల్ పవర్ స్టేషన్‌ను సందర్శించిన డైరెక్టర్



మనతెలంగాణ/మణుగూరు: మండలంలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను ఆదివారం డైరెక్టర్ పవర్ (బిహెచ్ఇఎల్) ఢిల్లీ మనోజ్‌కూమార్ సందర్శించారు. బిటిపిఎస్ నిర్మాణ పనుల పూరోగతిని పరిశీలించారు. వివిధ విభాగాల్లో జరుగుతున్న పనులు వివరాలను అధికారులు ఆయనకు వివరించారు. బిహెచ్ఇఎల్ అధికారులకు మనోజ్‌కూమార్ వర్మ పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన డిసిఎ కంట్రోల్ ప్యానెల్‌ను చార్జ్ చేశారు. ఈకార్యక్రమంలో డైరెక్టర్ వెంట భద్రాద్రి పవర్ ప్లాంట్ చీఫ్ ఇంజనీర్ పిల్లి బాలరాజు బిహెచ్ఇఎల్ ఇంజనీర్లు అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో చెడ్డి గ్యాంగ్... ప్రజల్లో కలవరం!

మనతెలంగాణా అయిజ: జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలొ చెడ్డి గ్యాంగ్ సంచరిస్తుందని శనివారం తెల్లవారు జామున గద్వాల పట్టణంలోని వేణు అపార్ట్ మెంట్‌లో అర్ధరాత్రి చెడ్డి గ్యంగ్ ప్రవేశించి, అపార్ట్‌మెంట్‌లోని అన్ని ఇళ్ల తలుపులను తట్టినప్పటికి ఎవరూ తలుపులు తీయకపోవటంతో చోరీ ప్రయత్ని విఫలమయ్యారనే వార్త ఆదివారం సామాజిక మాధ్యమంలో హల్‌చల్ చేసింది. ఈ నేపథ్యంలో అయిజ పట్టణ కేంద్రంలో కలవరం నెలకొంది. ఎక్కడ చూసినా ప్రజలు దాని గురించే చర్చలు చేస్తున్నారు. ప్రతి ఒక్కరి చరవాణిలో ఆ చెడ్డి గ్యాంగ్ సిసిటివిలో రికార్డయిన ఫుటేజిలే కనిపించాయి. పట్టణమంతా భయాందోళన వాతావరణం నెలకొంది. గతంలో ఇలాంటి గ్యాంగులు ఎక్కడో రాయలసీమలో వచ్చాయని తెలిసినప్పుడు ప్రజలు రాత్రుళ్లు నిద్దర మానుకుని భయంభయంగా గడిపేవారు. ప్రస్తుతం స్థానికంగానే ఇలాంటి చెడ్డి గ్యాంగులు వచ్చాయన్న వార్త తో, ప్రజలంతా అలజడితో రేగింది. పగలు రాత్రి అనకుండా ఇండ్ల వద్ద మహిళలు ఒంటరిగా ఉండాలంటే బెంబేలెత్తుతున్నారు. కాగా ఈ సంఘటనతో అప్రమత్తమైన పోలీసు శాఖ, ఎస్పై ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం అయిజ పట్టణంలోని తనిఖీలను ముమ్మరం చేసి, లాడ్జింగ్‌లలోనూ సోదాలు నిర్వహించారు. కొత్తగా సంచరిస్తున్న వారిని ఆరా తీశారు. తదనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రజలు భయాందోళనకు గురవ్వవద్దని, తగు జాగ్రత్తలు పాటించాలని, శాంతి భద్రతలను మరింత పర్యవేక్షించటానికి ప్రత్యేకంగా పోలీస్ వారు గస్తీలు నిర్వహిస్తున్నారని, పట్టణంలో కొత్తగా ఎవరైన సంచరిస్తునట్టు అనుమానం వస్తే ప్రజలు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఆసిఫాబాద్‌లో ఆగిన ఎన్నికలు



మనతెలంగాణ / ఆసిఫాబాద్ టౌన్ : ఎప్పుడు ఎప్పుడా అని ఎదురుచూస్తున్న పంచాయతీ ఎన్నికలకు ఇటీవల ఎన్నికల నగర మోగడంతో ఆసిఫాబాద్ జిల్లాలోని పలు మండలాల్లో ఎన్నికల వాతావరణం ఒక్కసారిగా వెడెక్కగా, జిల్లా కేంద్రంలో మాత్రం స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు అనేది ప్రజలల్లో అయోమయం నెలకొంది. జిల్లాలోని అన్ని మండలాల్లో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం విధివిధానాలు, రిజర్వేషన్లు, కొత్త పంచాయతీలు, తండాల్లో జరిగే ఎన్నికలకు సంబందించి అన్ని ఏర్పాట్లు చేస్తుండగా జిల్లా కేంద్రంలో మాత్రం ఎన్నికల ఊసే లేకుండా పోయింది. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో గతంలో మేజర్ గ్రామపంచాయతీగా ఉన్నదాన్ని టిఆర్ఎస్ ప్రభుత్వం దీనిని మున్సిపాలిటీగా ఉన్నతీకరించేందుకు ప్రకటించినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి బలమైన ఉత్తర్వులు ఇవ్వకపోవడం గెజిట్‌కూడా విడుదల కాకపోవడం మున్సిపాలిటీని గవర్నర్ ఆమోదించాల్సివుంటుంది. ఆసిఫాబాద్ మేజర్ గ్రామపంచాయతీనా... మున్సిపాలిటినా అని పలువురు చర్చించుకుంటున్నారు. ఇటు పంచాయతీ కాక, మున్సిపాలిటీగా ఏర్పడక పోవడంతో జిల్లా కేంద్రంలో ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయనేది ప్రశ్నగా మారింది. గత జూలైతో సర్పంచుల పదవి కాలం ముగియడంతో, అనంతరం ప్రభుత్వం ముందస్తు ఎన్నికలకు పోవడంతో శాసనసభ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. అనంతరం పాత, కొత్త పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమవుతుండగా ఇక్కడ మాత్రం ఎన్నికల వాతావరణం కనిపించడం లేదు. గత 60 ఏండ్ల తర్వాత ఆసిఫాబాద్ మేజర్ పంచాయతీ ఎన్నికలకు దూరమైంది. 2 ఆగస్టు 2018న ఆసిఫాబాద్ పట్టణాన్ని మున్సిపాలిటీగా మార్చేందుకు నిర్ణయించినప్పటికీ ఇటీవల ప్రకటించిన పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్‌లో ఆసిఫాబాద్ పంచాయతీని చేర్చలేదు. పాలనపరంగా పంచాయతీ అధికారులే కార్యకలపాలు సాగిస్తుండగా, ఎక్కడి అభివృద్ధి అక్కడే నిలిచిపోయింది. ఆసిఫాబాద్ ఏజెన్సీ ప్రాంతం కావడంతో ఎన్నికలు నిర్వహించాలంటే గవర్నర్ ఆమోదం కచ్చితంగా అవసరం ఉంటుంది. అలాగే ఎస్టీలకు రిజర్వు చేయాల్సిన విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సివుంది. సర్పంచ్ ఎన్నికలపై ఆశలు పెట్టుకున్న అభ్యర్థులు పంచాయతీ ఎటు తేలకపోవడంతో ఎన్నికలు జరుగుతాయ లేదాననే అయోమయంలో అతృత్తతో ఉన్నారు.

వానర సైన్యానికి వనభోజనాలు



మన తెలంగాణ/సంస్థాన్ నారాయణపురం : నారాయణపురం మండలం రాచ కొండలోని రామాలయంలో ఆదివారం వానర సైన్యానికి వనభోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాచప్ప సమితి అధ్యక్షులు బద్దుల కృష్ణకుమార్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తొలి ఆదివారం రోజున వన్య ప్రాణుల ప్రేమికులు రాచ కొండ వానరులకు పండ్లు, కూరగాయలతో వనభోజనాలు ఏర్పాటు చేసి వడ్డించడం జరుగుతుందన్నారు. సరైన వర్షాలు కురువకపోవడం మూలంగా వన్య ప్రాణులకు సరైన ఆహారం లభించడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పగిడోజు దయాకరాచారి, మరికంటి రవీందర్‌రెడ్డి, వెంకట్‌రాములు, శ్రీనివాస్‌రెడ్డి, ప్రమీల, సూరపల్లి వెంకటేషం, కడారు అంజిరెడ్డి, శేఖర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, శాంత, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఏఎమ్మార్పికి నీటి విడుదల

మన తెలంగాణ / మిర్యాలగూడ : జిల్లాలోని ఏఎమ్మార్ ప్రాజెక్టుకు, వరదకాల్వకు సోమవారం నుండి అధికారులు నీటిని విడుదల చేయనున్నారు. సాగర్ జలాశయం నుండి ప్రస్తుతం సాగర్ ఎడమకాల్వకు సాగు నీరందిస్తున్న అధికారులు ఏఎమ్మార్పి, వరదకాల్వ పరిధిలో తాగునీటి అవసరాలకు, చెర్వులు నింపేందుకు నీటిని విడుదల చేయనున్నారు. ఏఎమ్మార్పి, వరదకాల్వకు నీటి విడుదలతో జిల్లాలోని పలు మండలాల్లో నీటి ఇక్కట్లు ఇక తీరనున్నాయి.

మూడు టిఎంసిల నీరు: ఏఎమ్మార్పి, వరదకాల్వకు మూడు టిఎంసిల మేర నీటిని అధికారులు విడుదల చేయనున్నారు. మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి ఇటీవలే నీటి విడుదలకు సంబంధింత అధికారులను కోరగా, నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేములవీరేశంలు నీటి విడుదల కోరుతూ హైదరాబాద్‌లో నీటి పారుదల అధికారులను ఇటీవలే కలిసారు. ఏఎమ్మార్పి పరిధిలో 183 చెరువులున్నాయి. ఈ ప్రాజెక్టు పుట్టంగండి నుండి ప్రారంభమై పిఏపల్లి, గుర్రంపోడు, కనగల్, నల్లగొండ, తిప్పర్తి, నకిరేకల్, కట్టంగూర్, కేతేపల్లి మండలాల పరిధిలో వున్న 55 డిస్ట్రిబ్యూటర్ల ద్వారా చెర్వులను ప్రతీ యేటా నింపుతున్నారు. వరదకాల్వ పెద్దవూర మండలంలో పుల్యాతండా నుండి ప్రారంభమై మాడ్గులపల్లి మండలం వరకు విస్తరించి వుంది.

చిన్న పల్లె...పెద్ద అద్భుతం

- దేశం 'గర్వించిన' గంగదేవిపల్లి
- కెసిఆర్ ఆశీస్సులతో మరింత ప్రగతి
- ముఖ్యమంత్రి కెసిఆర్ అందించిన నిధులతో ఉరకలేసిన గ్రామాభివృద్ధి
- గ్రామజ్యోతి కమిటీలతో ప్రతి ఇంటా జ్యోతిని వెలిగిస్తున్న గ్రామపాలకులు
- రాష్ట్రానికే దిక్సూచిగా గ్రామజ్యోతి ప్రారంభం
- ఎన్నో అవార్డులు ఆ గ్రామానికి దాసోహం



మన తెలంగాణ/ వరంగల్ రూరల్ జిల్లా ప్రతినిధి : చిన్న పల్లె...పెద్ద అద్భుతంగా నిలిచింది. రాష్ట్రమే కాదు దేశమే చెప్పుకోదగ్గ గుర్తింపును పొందింది. విదేశాల నుంచి సందర్శకులను రప్పించుకుంది. స్వచ్ఛతగా ఎలా ఉండాలి...గ్రామ అభివృద్ధి అంటే ఎలా ఉంటుంది...గ్రామస్తులంతా ఐక్యంగా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే ఎలాంటి అద్భుతాలు సృష్టించవచ్చో నిరూపించింది. దేశ ప్రధాని నరేంద్ర మోడి నోట గర్వించదగిన గంగదేవిపల్లిగా పిలుపించుకుంది. ప్రధాని మొదలుపెట్టిన 'స్వచ్ఛ భారత్'ను దశాబ్ధకాలం ముందే అమలు చేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక స్వయంగా ముఖ్యమంత్రి కేసిఆర్ 2015 ఆగస్టు 17న గ్రామానికి వచ్చి రూ. 10 కోట్లు అందించారు. ముఖ్యమంత్రి చేయూతతో గ్రామాభివృద్ధి మరింత ఉరకలేసింది. వరంగల్ నగరానికి 14 కిలో మీటర్ల దూరంలో గంగదేవిపల్లి గ్రామం ఉంది. ఇప్పుడు ఈ గ్రామం పరిచయం లేని గ్రామంగా దేశ ప్రశంసలు పొందిన గ్రామంగా నిలిచింది. గ్రామ అభివృద్ధి కమిటీగా ఏర్పడిన పాలకవర్గం రాజకీయాలకతీతంగా గ్రామ అభివృద్ధి కోసం పాటుపడ్డారు. అభివృద్ధి అంటే ఇలా ఉండాలి అనే విధంగా కలిసికట్టుగా కృషి చేసి దేశంలోని పల్లెలకు ఆదర్శ పల్లెగా గ్రామాన్ని నిలబెట్టారు. స్వచ్ఛంగా ఉండెందుకు సిసి రోడ్ల నిర్మాణం, అంతర్గత రోడ్లు, విద్యుత్‌దీపాలు, మద్యపాన నిషేదం, విద్యాభివృద్ధి, పారిశుధ్యం, స్థానిక వనరుల వినియోగం లాంటి తదితర అంశాలను సాధించారు. ఇక్కడ 2000 సంవత్సరం నాటికే ప్రతి ఇంటికి మరుగుదొడ్లు నిర్మించుకొని స్వచ్ఛ భారత్ మిషన్ కంటే ముందున్న పల్లెగా నిలిచారు.

ముఖ్యమంత్రి కెసిఆర్ అందించిన రూ.10 కోట్లతో మరింత ఉరకలేసిన గ్రామాభివృద్ధి...

పల్లెల అభివృద్దే దేశ అభివృద్ధి అంటారు. అలాంటి అభివృద్ధికి చిహ్నంగా నిలిచిన గంగదేవిపల్లిని తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన మొదటి ప్రభుత్వ హయంలో ముఖ్యమంత్రి కేసిఆర్ 2015 ఆగస్టు 17న గ్రామానికి వచ్చి స్వయంగా రూ. 10 కోట్లు అందించారు. దీంతో గ్రామంలో అభివృద్ధిని మరింత పటిష్టం చేశారు. ఇప్పటి వరకు రూ.8 కోట్లు పూర్తి స్థాయిలో అభివృద్ధి పనులకు వెచ్చించి, మరో రూ.2 కోట్ల పనులకు సిద్దంగా ఉన్నారు. ముఖ్యమంత్రి కేసిఆర్ అందించిన రూ. 10 కోట్లతో లింకురోడ్ల నిర్మాణం చేపట్టారు. గ్రామానికి సంబంధించిన శ్మశానవాటిక చుట్టు కంపౌండ్ వాల్ నిర్మాణం, గ్రామంలోని ట్రైనింగ్ చుట్టు కంపౌండ్ నిర్మాణం, సోలార్ విద్యుత్ ఏర్పాటు, గ్రామంలో 120 సోలార్ స్ట్రీట్‌లైట్లు, కెబుల్ వైర్ ద్వారా విద్యుత్ సరఫరా లాంటి అభివృద్ధిని చేపట్టారు. అంతర్గత సిసి రోడ్లు, వ్యవసాయదారులకు సౌకర్యార్థం డ్రిప్‌లు లాంటి పనులకు శ్రీకారం చుట్టారు. అయితే ఇందులో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మిగిలిన నిధులను ఖర్చు చేయటానికి రూ.1కోటీ 4 లక్షలు కేటాయించగా స్థలం అనుకూలించకపోవటం వల్ల స్థల పరిశీలనలో ఉన్నారు.

గంగదేవిపల్లి గ్రామ ముఖచిత్రం

గ్రామంలోని జనాభా 1084
గ్రమాంలోని మొత్తం ఓటర్లు 911
స్త్రీలు... 551
పురుషులు...533
గ్రామంలోని మొత్తం ఇండ్లు 287
దాబాఇండ్లు 170
పెంకుటిల్లు 91
రేకుల ఇండ్లు 26
గ్రామంలోని మరుగుదొడ్ల సంఖ్య... 299
గ్రామంలోని మంచినీటి నల్లాల సంఖ్య 264
గ్రామంలోని మొత్తం పెన్షన్లు 158
ఇందులో వృద్దాప్యం75, వితంతు 40, వికలాంగులు 30,గీతకార్మికులు 1, చేనేత 9,అభయహస్తం 3
గ్రామంలోని రేషన్ కార్డులు 406
సెల్‌ఫోన్‌ల సంఖ్య 1020
వీధిదీపాలు 110
గ్రామంలోని మొత్తం కుటుంబాలు 406
బిసి స్త్రీలు 505, పురుషులు 507
ఎస్టీ స్త్రీలు 20, పురుషులు 20
ఇతరులు స్త్రీలు 6, పురుషులు 6
గ్రామం నుంచి జిల్లా కేంద్రానికి దూరం 14 కిలోమీటర్లు
గ్రామం నుంచి మండల కేంద్రానికి దూరం 5 కిలో మీటర్లు

ప్రభుత్వ భవనాలు
గ్రామపంచాయతీ భవనం, జెడ్‌పిఎస్ఎస భవనం, ప్రైమరీ స్కూల్ భవనం, టిఎస్ఆర్‌డి సెంటర్ భవనం, పశువైద్యశాల భవనం, బస్ షెల్టర్,

విద్యా సంస్థలు
జిల్లా పరిషత్ సెకండరీ స్కూల్ (ప్రభుత్వ), ప్రైమరీ స్కూల్, భారతీ ఎడ్యుకేషనల్ సొసైటీ (ప్రయివేటు), అరబిందో బి ఫార్మసీ (ప్రయివేటు), ఉషోదయ హైస్కూల్ ఇంగ్లీష్ మీడియం (ప్రయివేటు)

సెల్ఫ్‌హెల్ప్ గ్రూపులు...
అభ్యుదయ గ్రామైఖ్య సంఘం 1, మొత్తం గ్రూపులు 25, శిక్షణ బుక్ కీపర్స్ 6, సంతోషి ఎంపిఎస్ 1, రైతు వికాసపొదుపు సంఘం 1, బాల వికాస పొదుపు గ్రూపులు 23

ఎంజిఎన్ఆర్ఇజిఎస్...
జాబ్ కార్డు పొందిన కుటుంబాలు 254
శ్రమ గ్రూపులు 22
పని చేసిన కూలీల సంఖ్య 406

కరెంటు వినియోగం వివరాలు...
కరెంటు మీటర్లు కలిగిన ఇండ్లు 310, వ్యవసాయ కనెక్షన్లు 60, వీధిదీపాలకు మరియు తాగునీటి కనెక్షన్లు 11,
100 కెవి ట్రాన్స్‌ఫార్మర్లు 2, 63 కెవి ట్రాన్స్‌ఫార్మర్లు 1, 25 కెవి ట్రాన్స్‌ఫార్మర్లు 2, 15 కెవి ట్రాన్స్ ఫార్మర్ 8

భూముల వివరాలు..
మెట్టభూమి ఎకరాలు 600
తరిభూమి ఎకరాలు 30
చుట్టపక్కల రెవెన్యూగ్రామాల పరిధిన 400 ఎకరాలు

గ్రామ అభివృద్ధి కమిటీలు...
గ్రామజ్యోతి పేరుతో గ్రామ అభివృద్ధి కమిటీలను నిర్వహించి ప్రగతిని సాధించిన ఘనత గంగదేవిపల్లికే దక్కుతుందనటంలో సందేహం లేదు. గ్రామంలో నిర్వహించే అభివృద్ధి కమిటీలే ప్రగతికి మూలంగా మారాయి. స్వయంగా ముఖ్యమంత్రి కేసిఆర్ గంగదేవిపల్లి నుంచే ఇక్కడ నిర్వహించబడే గ్రామజ్యోతి ని రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామం నిర్వహించాలని ప్రకటించటం గమనార్హం.
విద్యాకమిటీ, మౌళిక సదుపాయాల కమిటీ, ఆరోగ్య పౌషికాహార కమిటీ, గుడుంబా బెల్టుషాపుల నివారణ కమిటీ, ప్రకృతి వనరుల నిర్వాహణ కమిటీ, వ్యవసాయ కమిటీ, పారిశుద్ధ్యం త్రాగునీరు కమిటీ, సాంఘీక భద్రతా ధరిద్ర్య నిర్మూలన కమిటీ, లాంటి వాటిని నిర్వహిస్తూ గ్రామ అభివృద్ధిని దేశం గర్వించేలా ఒగదేవిపల్లి చేసి చూపింది. ప్రతి కమిటీకి సభ్యులను నిర్వహించటానికి టీం లీడర్లను నియమంచుకోవటం నిబద్ధత కమిటీలను నిర్వహిస్తూ ప్రగతిని సాధించటం గంగదేవిపల్లి ప్రత్యేకత.

ఎన్నో అవార్డులు...
- 2007 మే 4న అప్పటి రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం చేతుల మీదుగా నిర్మల్ గ్రామ పురస్కార్ అవార్డును అప్పటి సర్పంచీ కూసం రాజమౌళి న్యూడిల్లీలో అందుకున్నారు. ఈ అవార్డు పొందిన జిల్లాలోని మొట్టమొదటి గ్రామం గంగదేవిపల్లి కావటం గమనార్హం.
- 2008 నవంబర్ 1న శుభ్రం అవార్డును అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా అప్పటి సర్పంచీ కూసం రాజమౌళి అందుకున్నారు. ఈ అవార్డు పొందిన మొట్టమొదటి గ్రామం కూడా ఇదే.
- 2010 జనవరి 4న గూగుల్ సంస్థ వారు గూగుల్ గ్రామపంచాయతీ కింద రూ.5 లక్షల నగదు తో పాటు అవార్డును ప్రధానం చేశారు.
- 2007లో ఆగస్టు 20 న ఆంధ్రబ్యాంక్ వారు పట్టాభీ ఆదర్శగ్రామం గా ప్రకటించారు.
- 2007 ఆగస్టు 20న భారతరత్న రాజీవ్ గాంధీ అత్యుత్తమ గ్రామపంచాయతీ అవార్డు ప్రధానం.
- ఇప్పటి వరకు గ్రామాన్ని 78 దేశాల ప్రతినిధులు సందర్శించారు. అప్పటి సర్పంచి కూసం రాజమౌళి శ్రీలంక, ఫ్రాన్స్, నేపాల్ దేశాల్లో పరిశుభ్రత తాగునీటిపై జరిగిన సదస్సుల్లో పాల్గొన్నారు.

ప్రజల గొప్పతనమే మా ప్రగతికి మూలం...

గ్రామ అభివృద్ధి కమిటీ నాయకులు
మా గ్రామ అభివృద్ధికి గ్రామంలోని ప్రజల గొప్పతనే మూలం. అందరి సహకారంతో ప్రగతిని సాధించటానికి అవకాశాలు ఏర్పడుతున్నాయి. దేశం మా పల్లె వైపు చేసే విధంగా చేయటానికి అందరూ కలిసికట్టుగా ముందుకు సాగటం మూలంగానే సాధ్యమైంది. ఇంకా మరింత ప్రగతిని సాధించాల్సిన అవసరముంది. ముఖ్యమంత్రి కేసిఆర్ 2015 ఆగస్టు 17 అందించిన రూ.10 కోట్ల సహకారంతో మరింత అభివృద్ధి సాధ్యమైంది. గ్రామానికి సంబంధించిన శ్మశానవాటిక లోపల సౌకర్యాలను కల్పించటానికి, గ్రామంలో పోస్టాపీసు, ఎఎన్ఎం సబ్ సెంటర్ కోసం ప్రజలు ఆతృతగా ఎదురు చూస్తున్నారు. భవిష్యత్‌లో వీటి కోసం కృషి చేయాల్సిన అవసరం బాధ్యత మా గ్రామాభివృద్ధి కమిటీలపై ఎంతో ఉంది. నేను అభివృద్ధి కమిటీలో బాగస్వామిగా ఉంటూ అందరూ కలిసికట్టుగా పని చేయటం జరుగుతుంది. ముఖ్యమంత్రి కేసిఆర్, స్థానిక ఎమ్మెల్యే సహకారంతో భవిష్యత్‌లో మరింత ముందుకు సాగటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఎన్నిక ఐక్యంగానే....
గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన కూసం రాజమౌళి 2006లో ఏకగ్రీవంగా ప్రజలు ఎన్నుకున్నారు. 2011 వరకు ఆయన కొనసాగారు. అన్ని గ్రామ అభివృద్ధి కమిటీలను ఐక్యంగా ముందుకు నడిపారు. 2013 నుంచి 2018 జూలై వరకు (అంటే ప్రస్తుతం వరకు) ఇట్ల శాంతి సర్పంచిగా కొనసాగుతున్నారు.

జోరందుకున్న కోడి పందాలు

- లక్షల్లో చేతులు మారుతున్న వైనం
- జిల్లా, రాష్ట్ర సరిహద్దు మామిడి తోట్లలో స్థావరాలు
- అనుమతులు లేకపోయినా యథేచ్ఛగా పందాలు



మన తెలంగాణ/ఖమ్మం : నూతన సంవత్సరం, సం క్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలతో పాటు తెలంగాణకు సరిహద్దుగా ఉన్న ఆంధ్రప్రదేశ్ బోర్డర్ పరిధిలోని మామిడి తోటల్లో కోడి పందాలు జోరందుకున్నాయి. ఈ పందాల్లో లక్ష నుంచి కోట్ల వరకు చేతులు మా రుతుండటం ప్రతి ఏటా షరామాములే. ప్రధానంగా వీటి అనుమతులకు సంబంధించి ప్రభుత్వలు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ పం దాలను నిరాకరిస్తున్నప్పటికీ అనుమతులు లేకపోయిన కోడి పందాలు మాత్రం యాదేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ఖమ్మం అవిభా జ్య జిల్లాలతో పాటు ఎపి సరిహద్దు ప్రాంతాల్లోని పెనుబ ల్లి, వేంసూరు, సత్తుపల్లి, దమ్మపేట, అశ్వారావుపేట, తిరువూరు, చర్ల, భద్రాచలం, దుమ్ముగూడెం, కొత్తగూడెం, పా ల్వంచ, మణుగూరు, ఇల్లందు తదితర ప్రాంతాల్లోని మా మిడి తోటల్లో ఈ పందాల జోరు ఊపందుకుంది. ఈ పం దాల నియంత్రణ కు పోలీస్ శాఖ యంత్రాంగం ముం దస్తు చర్య తీసుకోవాల్సి ఉన్నప్పటికీ పందె నిర్వహకుల వద్ద పెద్ద మొత్తంలో మామూ ళ్లు తీసుకుని పందెలను ప్రోత్సహిస్తున్నట్లు తెలుస్తుంది. కోడి పందాలతో పాటు పేకాట, ఇతర జూదాలకు సంబంధించిన ఆటలను ఆడించటం సంక్రాంత్రి పండుగకు ముందే జోరందుకుంది. ఈ పం దెల్లో అన్ని వర్గాల ప్రజలు ఉత్సాహం గా పాల్గొనటంతో పాటు డబ్బుకు వెనుకాడకుండా అప్పులు సై తం చేసి ఈ పందెల్లో లక్షలాది రూపాయ లు పోగొట్టుకుంటు న్న అభాగ్యులు కోకొల్లలు. ప్రధానంగా ఈ పందాలను మామిడి తోటల నిర్వహకులే స్వయంగా నిర్వహిస్తున్నట్లు సర్వత్రా విమర్శలు చోటు చేసుకుంటున్నాయి.
ఈ పందెల్లో పాల్గొ న్న వారికి సకల వసతులతో పాటు మద్యంతో పాటు కోడి మాంస ంతో మంచి ఆహారాన్ని అందించ టం అలవాటుగా మారింది. ఈ పందెలు నిర్వహిస్తున్న విషయం పోలీస్‌శాఖ అధికారులకు తెలిసినా తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకపోయిన కో డి పందాలను నియంత్రించటంలో పోలీ స్, రెవెన్యూ, ఇతర శాఖలు ఘోరం గా వైఫల్యం చెందుతున్నాయి. కోడి పందెల్లో పాల్గొనేందుకు ముందస్తుగా ఆరు నెలల నుంచే కోడి పుంజులను పెంచటంతో పాటు వాటి నిర్వహణ బాధ్యత నిర్వహకులే చూసుకుంటారు. పందెల్లో గెలిచిన వారు లక్షలు పోగేసుకుంటారు. అనేకమంది పందెల్లో పాలొని పెద్ద మొత్తంలో పోగొట్టుకుని రోడ్డున పడుతున్నారు. ఈ ఏడాదైనా ముందస్తుగా ఈ పందెల నిర్వహకులపై క్షేత్ర స్థాయిలో నిఘాను పెంచి పందెలను నియంత్రించాల్సి న అవసరం ఎంతైనా ఉంది మరి.

వనదుర్గామాత ఆలయానికి తరలివచ్చిన భక్తజనం

అమ్మవారికి వివిధ రూపాల్లో మొక్కుల చెల్లింపులు



మన తెలంగాణ/పాపన్నపేట : తెలంగాణ రాష్ట్రంలో పవిత్ర పున్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గాభవాని మాత ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు మంజీరానదిలో పున్యస్నానాలు ఆచరించగా, అమ్మవారి ఆలయం ముందుగల సంతాన గుండంలో పిల్లలు కలుగాలని దంపతులు స్నానాలు ఆచరించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం సెలవు రోజు కావడంతో భక్తులు అధికంగా రావడంతో ఎక్కడ చూసినా కోలాహలం నెలకొంది. ఆలయ ప్రాధానార్చకులు వేకువజామున అమ్మవారికి అభిషేక కార్యక్రమాలు నిర్వహించి అందంగా పట్టువస్త్రంలో, పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకోగా ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.
అనంతరం భక్తులు వివిధ రూపాల్లో మొక్కులు చెల్లించుకున్నారు. భారీ ఎత్తున భక్తులు తరలిరావడంతో ఏడుపాయలలో ఉన్న సత్రాలు సరిపోక చెట్లు, బండ రాళ్ల వద్ద నివాసాలను ఏర్పాటు చేసుకొని వన భోజనాలు చేశారు. మరికొంతమంది భక్తులు శివసత్తుల మేళాలతో, బోనాల ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయంలో అమ్మవారికి సమర్పించి ఒడి బియ్యం పోసారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కార్యనిర్వాహణ అధికారి పి.మోహన్‌రెడ్డి, ఆలయ సిబ్బంది జెన్న రవికుమార్, సిద్దిపేట శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, లక్ష్మి నారాయణ, సూర్య శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్‌శర్మ తదీతరులు భక్తులకు సేవలందించారు.

కానరాని హరిదాసులు

అంతరిస్తున్న సంస్కృతి



మన తెలంగాణ/సత్తుపల్లి : సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా తెలుగు పండుగలు ఉన్నప్పటికి నేటి ఆధునిక సమాజంలో వాటి విశిష్టత, ఆవశ్యకత, చరిత్రలను నేటి తరానికి అవి తెలియజేసే వారు లేకపోవడం శోచనీయం. సంక్రాంతి పండుగ అనగానే హరిదాసులు, గంగిరెద్దులు, ముత్యాల ముగ్గులు, గొబ్బెమ్మలు, చలి మంటలు, బోగి పండ్లు కొత్త బియ్యంతో అరిసెలు, చక్రాలు వంటి పిండి వంటలతో వచ్చిన బంధువుల మధ్య ఇళ్ళు కలకలలాడేవి. ఇక కోడిపందాల గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ప్రస్తుతం అవి కూడా కొన్ని ప్రాంతాలకే పరిమితమవటంతో ఆసక్తి ఉన్నవారు సుదూర ప్రాంతాలకు వెళ్ళి మరి తిలకిస్తుంటారు. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో వీడియో కాల్స్, ఆన్‌లైన్ చాటింగ్‌లతో ప్రపంచం బిజీగా మారిపోయింది. సంక్రాంతి విశిష్టతను ఇనుమడింపజేసే హరిదాసులు అంతరించిపోయారు. తలపై రాగి పాత్రతో చేతిలో తంబూర పట్టుకుని మెడలో పూలమాలతో నారథముని వేషధారణతో ప్రతి ఇళ్ళు తిరుగుతూ భక్తి గీతాలపన చేస్తూ బిక్షాటన చేసే హరిదాసులు చూద్దామన్న కనిపించడం లేదంటే ఏమాత్రం అతిశయోక్తి కాదు. ఇక వారి వారసులు కూడా ఈవిధమైన వృత్తికి దూరంగా ఉండటం కూడా ప్రధాన కారణం.

మన తెలంగాణ

10

హైదరాబాద్

సోమవారం

7 జనవరి, 2019

www.manatelangana.news

యువ



ఫేస్‌బుక్‌లో అన్నీ పోస్ట్ చేస్తున్నారా..!

ఈ రోజుల్లో ఫేస్‌బుక్ అకౌంట్‌లేనివారు సాధారణంగా కనిపించరు. తోచినవన్నీ ఎఫ్‌బీలో పోస్ట్ చేయడం చాలా మందికి దినచర్యగా మారిపోయింది. దీనివల్ల ప్రమాదాల్ని కొని తెచ్చుకున్నటే అంటున్నారు నిపుణులు.

ఫేస్‌బుక్ చాలా సమాచారాన్ని వెల్లడిస్తుంది. ఫేస్‌బుక్‌లో అతి పెద్ద డేటా ఉంటుంది. మీ స్నేహితులు, తోటి ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, మీ ఉద్యోగం, మీ అభిరుచులు, మీ పిల్లలు, ఇలా చాలా సమాచారం ఉంటుంది. సెక్యూరిటీ ప్రశ్నలకి ఇచ్చే ఎన్నో సమాధానాలు (వీటిని బ్యాంక్ లావాదేవీలు పాస్‌వర్డ్ రీసెట్స్‌కి ఉపయోగిస్తారు) కూడా ఫేస్‌బుక్ అకౌంట్‌లో దొరుకుతాయి. పైగా, ఫేస్‌బుక్ డిజైన్ మీ గోప్యతని కాపాడడానికి పెద్దగా ఏమీ పని చేయదు. అందరూ పరిమితుల్లో ఉండి, ఏ విషయాన్నీ బయటికి చెప్పకుండా ఉంటే సోషల్ మీడియా సరిగ్గా పనిచేయదు. చాలా మంది యూజర్లు ప్రైవసీ సెట్టింగ్స్ పెట్టుకుందామనుకున్నా, తీసుకోవలసిన జాగ్రత్తలు పెద్దగా తీసుకోరు.

ఎవరైనా తాము ఆన్‌లైన్‌లో పెడుతున్న విషయానికి గల రిస్క్‌ని నిజంగా అర్థం చేసుకుంటే, అలా పోస్ట్ చేసే ముందు వాళ్లు ఒకటికి రెండు సార్లు ఆలోచిస్తారు. ఉదా.

* **కొత్త డ్రైవర్లు–** ఈ జాబితాలోకి టీనేజీలో పిల్లలు (లేదా పెళ్లయినవాళ్లు కూడా) వస్తారు. వీళ్లు కొత్తగా అప్లై చేసే లైసెన్సు కోసం క్లోజ్ అప్ ఫొటో తీయించుకుంటారు. ఇందులో వీళ్ల వ్యక్తిగత సమాచారం, ఇంటి అడ్రస్ అన్నీ ఉంటాయి.

కొత్త ఇంటి యజమానులు– కొత్తగా ఇళ్లు కట్టుకున్నవారు గృహ ప్రవేశం వైభవోపేతంగా జరుపుకుంటారు. వాళ్ల ఇంటి తలుపుకీ నమూనా, ఆ ఇంటి జియో– ట్యాగింగ్‌తో వాళ్లకి తెలియకుండానే, ఒక ఫొటోతో ఆ ఇంటి డూప్లికేట్ కీ తయారు చేయడం సాధ్యపడుతుంది.

ఉద్యోగులు– ఉద్యోగులు తరచుగా సెల్ఫీలు తీసుకుంటూ ఉంటారు. తమ వెనకా, ముందూ ఎలాంటి ప్రదేశాలు పిక్చర్‌లోకి వస్తున్నాయో గమనించరు. ఫొటో బ్యాక్‌గ్రౌండ్‌లో ఒకోసారి కంప్యూటర్ మానిటర్ ఓపెన్ అయి ఉంటుంది. పాస్‌వర్డ్‌లు, వైట్‌బోర్డులపై కీలకమైన సమాచారం, వాయిస్‌మెయిల్ పాస్‌వర్డ్స్ ఉంటాయి. వాటిని ట్యాప్ చేసే అవకాశం ఉంటుంది. అలాగే, ఉద్యోగులు తమ పేచెక్ వంటి వాటిని కూడా ఫొటో తీసి పోస్ట్ చేస్తుంటారు. కొంత మందికి ఇలాంటి పోస్ట్‌ల్లో తప్పేముందీ అనిపిస్తుంది. గానీ హ్యాకర్లు ఇలాంటి ఫొటోల్ని తమ ప్రయోజనాల కోసం వాడుకునే అవకాశం ఉంది.

సోషల్‌మీడియాలో ఎన్నడూ చేయకూడని పని ఏటంటే... ఆలోచించకుండా పోస్ట్ చేయడం. ఏదైనా పోస్ట్ చేసే ముందు, కొన్ని ప్రశ్నలు మీ మనసులోకి రావాలి. 'నేను ఎలాంటి సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పెడుతున్నాను?' 'నా చిత్రానికి బ్యాక్‌గ్రౌండ్‌లో ఏమేమి ఉన్నాయి?' 'ఒకవేళ నా మీద నేను కక్ష తీర్చుకోవాలంటే, ఈ సమాచారాన్ని నాకు వ్యతిరేకంగా నేను ఎలా ఉపయోగించగలను? ఇలాంటివన్నీ ఆలోచించాలి.

ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీ :



ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీ కొన్ని రకాల స్కామ్ అకౌంట్లని తగ్గించడానికి ఉపకరిస్తుంది. కానీ దానితోనే పూర్తిగా అడ్డుకట్ట పడదు. హ్యాకర్లు చాలా నిపుణులై ఉంటారు. ఇలాంటి ఆటంకాల్ని అధిగమించడానికి కొత్త కొత్త మార్గాల్ని అన్వేషిస్తూ వికృతానందంలో ఉంటారు. ఇది దాదాపుగా పిల్లీ– ఎలుకా చెలగాటంగా ఉంటుంది. మరో వైపు, ఫేస్‌బుక్‌ని మరింత శక్తివంతం చేయడానికి, మనం మరింత వ్యక్తిగత సమాచారాన్ని అందించాల్సి ఉంటుంది. చాలా మంది తమ ప్రైవసీకి ఎంత విలువ ఇస్తున్నారంటే, చివరికి సోషల్ మీడియాలో వాళ్ల అకౌంట్లలో పేర్లు కూడా వాళ్లవి కావు. నకిలీ పేర్లు పెట్టుకుంటారు. వాళ్ల ఫొటోలు పెట్టరు. ఏవో జంతువుల పేర్లు పెట్టుకుంటారు. ఒక నకిలీ ప్రొఫైల్‌ని ఆపాలంటే.. అకౌంట్ హోల్డర్లు ఫేస్‌బుక్‌లో వాళ్ల అసలు పేరు ఇవ్వాలి, అసలు ముఖం చూపించాలి. న్యూడ్ ఫొటోలు అడిగి ఫేస్‌బుక్‌లో రివెంజ్ పోర్న్ చేసేవారితో తలపడడానికి ఇది మంచి ఐడియాగా పనిచేస్తుంది. వాళ్ల దగ్గర అవి ఉంటే, వాటిని ఓ ఆటో మేషన్ స్టాండ్‌పాయింట్ నుంచి వాటిని నాశనం చేయడం సాధ్యపడుతుంది.

పాస్‌వర్డ్స్, సెక్యూరిటీ ప్రశ్నలు– అందులో ఎన్నో రకాల ఉల్లంఘనలు

డేటా లాక్కోవడానికి ఎన్నో కారణాలున్నాయి. ఉదా. సోషల్ ఇంజనీరింగ్ దాడులు, అప్లికేషన్‌లో ఉండే లొసుగులు, అన్‌ప్యాచ్డ్ సర్వర్స్, ఫిజికల్ సెక్యూరిటీ కంట్రోల్స్ లేకపోవడం, బలహీనమైన, దొంగలించబడిన క్రెడెన్షియల్స్ మొదలైనవి చాలా ఉంటాయి. ఇలాంటి లోపాలు తలెత్తుతూనే ఉంటే, డేటా అలా జారిపోతూనే ఉంటుంది. ఎవరైనా సరే, మంచి పాస్‌వర్డ్ పెట్టుకునే అలవాటు చేసుకోవాలి. పాస్‌వర్డ్స్ అనేవి వ్యక్తి, కార్పొరేషన్– ఇరు పక్షాలకీ సంబంధించిన బాధ్యత. మిమ్మల్ని మీరు రక్షించుకోవడానికి కొన్ని చిట్కాలు పాటించాలని నిపుణులు చెబుతున్నారు.

* పాస్‌వర్డ్‌ని ఎక్కువసార్లు ఉపయోగించకండి. తరచుగా మీ పాస్‌వర్డ్స్‌ని మారుస్తూ ఉండండి, పాస్‌వర్డ్ మేనేజర్‌ని ఉపయోగించండి. మీ పాస్‌వర్డ్ ఛేదించడానికి సాధ్యం కానంత చాలా విలక్షణంగా ఉండాలి. ఎక్కడ నుంచైనా పరే, మీరు లాగిన్ అయ్యేలా ఉండాలి.
* కామన్‌గా అడిగే సెక్యూరిటీ ప్రశ్నలకి అబద్ధాలు చెప్పండి. మీ అమ్మగారి అసలు పేరేమిటో కరెక్టుగా నింపనవసరం లేదు. ఎవరూ తేలిగ్గా ఊహించలేని 'న్యూటెల్లా లేదా 'డిస్నీలాండ్' లాంటి పేరేదో అక్కడ రాస్తే సరిపోతుంది.
* టూ– ఫ్యాక్టర్ ఆథంటికేషన్‌ని ఉపయోగించాలి. చాలా సైట్లలో మీకు ఈ అదనపు సెక్యూరిటీ సెట్టింగ్‌ని సెటప్‌చేసుకునే ఆప్షన్ ఉంటుంది.

మన సమాచారాన్ని తమ స్వార్థ ప్రయోజనాలకి వాడుకోవాలనుకునే ఈ స్కామర్లు/ హ్యాకర్లు ఎవరు?

అవకాశాన్ని తమ స్వార్థానికి ఉపయోగించుకోవాలని చూసే వాళ్లే స్కామ్ చేయాలనీ,హ్యాక్ చేయాలనీ చూస్తారు. మిగతా చట్టవిరుద్ధమైన కార్యకలాపాల్లాగే, వాళ్లు పరిస్థితుల్ని తమ వైపు ఆకర్షింపబడేలా చేసుకుంటారు. దీంతో రిస్కు విపరీతంగా పెరుగుతుంది. చాలా చోట్ల ఇలా జరగడానికి కారణం, స్థానిక చట్టాలు ఈ పనిని అడ్డుకునే రిస్కు తీసుకోవు. అసలు హ్యాకర్ ఎవరూ, ఏమిటీ అనేది విషయం కాదు ఇక్కడ! వాళ్లకి కావలసిన సమాచారం అక్కడ ఉంటుంది. వాళ్ల దగ్గర ఆ సమాచారాన్ని చేరుకునే మార్గం ఉంది. ఆ సమాచారం విలువైనదీ, దానికి బాగా డబ్బు వస్తుందనుకుంటే, వాళ్లు తమ సామర్థ్యంతో దాన్ని అందుకున్నారు. చాలా సందర్భాల్లో వాళ్లు భయంకరమైన విజయాలు సాధించారు. షాప్స్ విషయంలో అయితే, ఇది కేవలం నెంబర్ల గేమ్ మాత్రమే. స్కామర్లకి టెలీమార్కెటింగ్ కాంపెయిన్స్‌ని పోలిన కాల్ సెంటర్ ఉంటుంది. వాళ్లకి లీడ్ జనరేషన్, డైలాగ్ స్క్రిప్టులు, ఇంటర్నల్ ఎస్కలేషన్, ట్రైనింగ్, చివరికి కోటాలు కూడా ఉంటాయని నిపుణుల అభిప్రాయం.

కాజువల్‌గా ఇంటర్నెట్ వాడేవారు ఏ విషయంపై స్పృహ కలిగి ఉండాలంటే...

ఈ సెక్యూరిటీ సమస్యలు అంత వెంటనే పరిష్కారమయ్యేవి కావు. పైగా, మిమ్మల్ని మీరు ఈ ప్రపంచంలో అత్యంత సురక్షితంగా ఉందామని ప్రయత్నించినా కూడా సాధ్యం కాదు. కాకపోతే,జాగ్రత్తలు తీసుకొని మిగతా వారితో పోలిస్తే, వీలైనన్ని జాగ్రత్తలు తీసుకుంటూ మిమ్మల్ని మీరు సురక్షితంగా ఉంచుకునే ప్రయత్నం మాత్రం చేయవచ్చు.

ఎవరికి వాళ్లు జాగ్రత్తలు తీసుకుంటే కొంత కాలానికి హ్యాకర్సు వాళ్ల తుంటరి చర్యల్ని విడిచిపెడతారని ఆశించవచ్చు!

బాధ్యతగా ఉండండి..!

పిల్లలు పెరుగుతున్నకొద్దీ వారిలో శారీరకంగా మానసికంగా ఎన్నో మార్పులు వస్తుంటాయి. అప్పటివరకూ అమ్మానాన్నల చాటు పెరిగిన పిల్లలు స్వతంత్ర భావనలు, సొంతంగా నిర్ణయాలు తీసుకోవడం చేస్తుంటారు. అదే సమయంలో ఒకవైపు బయటి ఆకర్షణల ప్రభావాలు, స్నేహితుల ప్రోద్బలాలు, మరోవైపు తల్లిదండ్రుల ఆకాంక్షలు, చదువుల భారం... వీటన్నింటి మధ్య సతమతమౌతుంటారు. మంచి, చెడు తేల్చుకోలేని సందిగ్ధావస్థలో పడతారు.



ఇంట్లో పెరిగిన వాతావరణానికి, బయటి పరిస్థితులకూ పొంతన కుదరదు. ఇలాంటి పిల్లల మానసిక అవస్థను తల్లిదండ్రులు ఒక్కోసారి అర్థం చేసుకోలేరు. దీంతో పిల్లలకు మానసికంగా దూరమౌతారు. అలాకాకుండా పిల్లల అలవాట్లను గమనిస్తూనే, నెమ్మదిగా వారికి ఇదికాదు అది అని చెప్పాల్సిన బాధ్యత పెద్దవాళ్లదే.

నిందించడం ఆపండి: ఎప్పుడు చూసినా పిల్లలు ఫోన్‌లోనే ఉంటున్నారనేది చాలా మంది తల్లిదండ్రుల ఫిర్యాదు. ఆ ధ్యాసలో పడి సరిగ్గా చదువుకోవటం లేదని నిందిస్తుంటారు. ఫేస్‌బుక్, ట్విట్టర్, వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ఈ రోజుల్లో తోటివాళ్ల కన్నా తామెక్కడ వెనకబడిపోతామో అనే బెంగతో సగం కుంగిపోతుంటారు యువత. ఇలాంటివన్నీ పెద్దవాళ్లు గమనించి వారికి దిశానిర్దేశం చేయాలి.

స్నేహితుల్ని గమనించండి: యుక్తవయసులో స్నేహితుల ప్రభావం విపరీతంగా ఉంటుంది. ఈ వయసులో పిల్లలు ఇంట్లో కన్నా ఎక్కువ సమయం బయటే గడుపుతుంటారు. వయసు ప్రభావమో ఏమో గానీ కుటుంబ సభ్యులతో కలిసి బయటకు వెళ్లటానికీ చాలా మంది ఇష్టపడరు. ఇదే తల్లిదండ్రుల మనసును కలచి వేస్తుంది.అలాగని స్నేహితులున్నవారిని నిందించనక్కర్లేదు. పెద్దయ్యాక కష్టనష్టాల్లో స్నేహితులే ఎక్కువగా తోడుంటారనే విషయాన్ని మరవరాదు. బాధ్యతగా మెలగటం, ఆపదల్లో ఆదుకోవటం వంటివి పిల్లలు స్నేహాలతోనే నేర్చుకుంటారు. అయితే స్నేహాల మధ్య తారతమ్యాలను గ్రహించగలిగేలా చేయాలి.

చిన్నవాళ్ళని పట్టించుకునేలా చేయండి: ఇద్దరు ముగ్గురు ఉన్నప్పుడు పెద్దపిల్లలు చిన్నవాళ్లను పట్టించుకునేలా చేయాల్సిన బాధ్యత పేరెంట్స్‌దే. అప్పుడే ఆ పిల్లలకు ఓ విధమైన బాధ్యత వస్తుంది. ఇలాంటివి చేయాలంటే వీలైనప్పుడల్లా కుటుంబమంతా కలిసి బయటకు వెళ్లండి. ఒకరితో మరొకరు చనువుగా మెలగటానికి అవకాశం ఇచ్చినట్టు అవుతుంది. నిజానికి చిన్నప్పుడు తోబుట్టువుల మధ్య 'వైరం' ఉండడం సహజమే. అయితే అది రానురానూ పోతుంది. పిల్లలు ఒకరినొకరు అర్థం చేసుకుని, ఒకరి అవసరాలను మరొకరు కనిపెట్టుకోవడం అలవాటవుతుంది.

ఏ విషయాన్నయినా చెప్పటానికి సంకోచిస్తుంటే అంత చనువు, స్వేచ్ఛ లేదని అర్థం. కాబట్టి ముందు నుంచే పిల్లలతో స్నేహితుల్లా మెలగాలి. ఒకవేళ పిల్లలు ప్రేమలో పడినట్టు తెలిస్తే ఆ విషయాన్ని నిర్భయంగా, నిస్సంకోచంగా ఇంట్లో చెప్పగలిగే వాతావరణం ఉండాలి. తమ సమస్యల్ని వేరెవరితోనో కాకుండా తల్లిదండ్రులతోనే చెప్పుకోవటం మంచిది. పిల్లలు ప్రేమలో పడినట్టు తెలియగానే చాలామంది 'అవన్నీ కట్టిపెట్టు, బుద్ధిగా చదువుకో' అంటూ వాళ్లను కట్టడి చేస్తారు. ఇలాంటివి వికటించే అవకాశమే ఎక్కువ. అంతకన్నా 'ఒంటరిగా కలుసుకోవద్దు, ఇతర స్నేహితుల సమక్షంలోనే మాట్లాడుకోవాలి, పెద్దవాళ్లు ఉన్నప్పుడే ఇంటికి రానివ్వాలి' వంటి జాగ్రత్తలు చెబితే బాగుంటుంది. పిల్లలు కూడాఅర్థం చేసుకుంటారు. ఒక వయసుకు వచ్చాక పిల్లలు బాధ్యతగా మెలగేలా చేయాలి. అలా ఉండాలంటే వారికి తగినంత గౌరవం కూడా ఇవ్వాలి. ఇంటికి సంబంధించిన ప్రతి విషయాన్ని వారితో పంచుకోవాలి. తల్లిదండ్రులుగా మీరు వారి చదువుకు చేసిన అప్పులు, ఖర్చుపెట్టే ప్రతి పైసా వారికి తెలియజేయండి. అప్పుడే వారికి ఆర్థిక విషయాలపై కూడా పట్టు వస్తుంది. అప్పుడే బాధ్యతగా వ్యవహరిస్తారు.

పెళ్లికి రాకుంటే బ్లాక్ చేస్తాం..!



ఈరోజుల్లో వాట్సాప్ గురించి తెలియని వారుండరు. ప్రతి ఒక్కరి ఫోన్‌లో వాట్సాప్ తప్పనిసరి. ఈ క్రమంలో తమ పెళ్లి శుభలేఖను వాట్సాప్ రూపంలో డిజైన్ చేయించారో దంపతులు. ప్రస్తుతం వీరి పెళ్లి కార్డు తెగ వైరల్ అవుతోంది. సూరత్‌కు చెందిన చింతన్ అనే వ్యక్తి వెబ్ డిజైనర్. తన పెళ్లి కార్డును వెరైటీగా డిజైన్ చేయించాలని భావించాడు. వాట్సాప్ రూపంలో తన పెళ్లి కార్డును డిజైన్ చేశాడు. గుజరాతీ, ఇంగ్లీష్ భాషల్లో నాలుగు పేజీల్లో కార్డ్‌ను ప్రింట్ చేశారు. స్టేటస్ దగ్గర తాను, తన కాబోయే భార్య అర్జూ కలిసి ఉన్న ఫొటోను పోస్ట్ చేసి మా పెళ్లికి రాకపోతే మా వాట్సాప్‌లో మిమ్మల్ని బ్లాక్ చేస్తామని ప్రింట్ చేశారు. వాట్సాప్ లోగో మీద గణపతి బొమ్మను ముద్రించాడు. ఇలా అందరినీ ఆకట్టుకుంటున్నాడు.



ఇలా చేస్తే క్యాలరీలు ఖర్చవడం ఖాయం..

జాగింగ్ చేస్తున్న వారెవరైనా ఉన్నట్టుండి రోడ్డు మీదకు వంగి అక్కడున్న చెత్తను తీసుకొని బ్యాగులో వేసుకోవడం చూశారా? ఇదేంటి ఇలా చేస్తున్నారని అనుకోకండి... అదే ఈ ప్లాగింగ్. అలా ఉద్యానవనాలు, అడవులు, రహదారులపై జాగింగ్ చేస్తూ... స్వచ్ఛభారత్ నిర్వహించడమే దీని ఉద్దేశం. ప్లాస్టిక్ కవర్లతో పాటు... చిత్తు కాగితాలను ఏరిపారేస్తున్నారు ప్లాగర్స్. దీనివల్ల ఎన్నో జంతువులకు, పక్షులకు ప్రాణాపాయం తప్పుతుందని చెబుతున్నారు. సాధారణంగా జాగింగ్ చేస్తే కరిగే లరీల (235)కన్నా... ఇలా చేస్తే ఎక్కువ కేలరీ(288)లు ఖర్చవుతు న్నాయని చెబుతున్నారు ప్లాగర్స్. పరుగెత్తడం, పర్వతారోహణ ఇందులో భాగమేనంటున్నారు ఢిల్లీకి చెందిన ప్లాగర్ సుచీఖన్నా. చెత్త తీయ డానికి నడుం వంచడం వల్ల పొట్ట కరగ డంతో పాటు వెన్నె ముక బలప డుతుందని చెబుతు న్నారు. గుండె పనితీరు మెరుగ వుతుం దంటున్నారు. విదేశాల్లో మొదలైన ఈ ట్రెండ్ ఇప్పుడు భారత యువతనూ కదిలిస్తోంది.

ఫ్యాషన్ యాప్

సినిమాలు చూస్తున్నపుడో, వీడియోలు వెతుకుతున్నపుడో కుర్రకారుకు హీరోహీరోయిన్లు, మోడళ్లు, మరొకరో వేసుకున్న డ్రెస్‌లు ఒక్కోసారి తెగ నచ్చేస్తాయి. ఆ ట్రెండేంటి? ధర సంగతేంటి? ఎక్కడ దొరుకుతాయి? ఇలాంటి వివరాలు తెలుసుకోవాలనే కుతూహలం ఎక్కువ అవుతుంది. కానీ ఇలా వీడియోలు చూసి వివరాలు రాబట్టే అవకాశం మనకుంటే బాగుంటుందనుకుంటాం.



అదే మీ స్మార్ట్‌ఫోన్‌లో Fashin అనే యాప్ ఉందనుకోండి.. ఆ వివరాలన్నీ తెలుసుకోవడం సాధ్యమే. వీడియో చూస్తూనే ఈ యాప్ ద్వారా వీడియోపై ఒక ఫొటో క్లిక్‌మనిపిస్తే చాలు.. ఫ్యాషన్ ట్రెండ్, ధర, దొరికేచోటు వివరాలన్నీ ప్రత్యక్షమవుతాయి. యాప్‌లో ఫొటోల్ని అప్‌లోడ్ చేసి కూడా ఈ వివరాలు పొందొచ్చు. 2014 నుంచి ఇప్పటివరకు యూట్యూబ్‌లో ఉన్న వెయ్యికిపైగా వీడియోల్లోని సెలబ్రిటీలు ధరించిన స్టైల్స్ వివరాలు దీనిద్వారా తెలుసుకోవచ్చు.

మరచిపోయేది లేదిక!



వాలెట్ మరిచిపోవడం అనేది అందరికీ అనుభవమే. హోటల్, రెస్టారెంట్, ఆఫీసు... ఇలా ఎక్కడపడితే అక్కడ వాలెట్ చేజార్చుకుంటుంటాం. మనం అలా పక్కకు వెళ్తే చాలు దాన్ని ఎత్తుకుపోవడానికి చాలా మంది సిద్ధంగా ఉంటారు. మరి దీనికి పరిష్కారం లేదా? ఉంది. మీ ఫోన్‌కు అనుసంధానం చేసుకొనే వయోగర్ స్మార్ట్ వాలెట్ అందుబాటులోకి వచ్చింది. ఇది బ్లూటూత్ ద్వారా కనెక్ట్ అయి ఉంటుంది. మనం మరిచిపోయి కొన్ని అడుగుల దూరం వెళ్లగానే ఫోన్‌కు నోటిఫికేషన్ వస్తుంది. మనం వెంటనే వెనక్కి వెళ్లి తీసుకోవచ్చు. అంతేకాదండయ్ ఫోన్ ఎక్కడపెట్టామో కన్పించకపోతే ఈ వాలెట్‌లోని బటన్‌ను నొక్కితే అది రింగ్ అవుతుంది. దాంతో మొబైల్ ఎక్కడుందో తెలుసుకోవచ్చు. మొబైల్‌ను మన ఎదురుగా ఉంచి... వాలెట్‌లోని బటన్‌ని నొక్కి సెల్ఫీ తీసుకోవచ్చు. ఇంకెందుకు ఆలస్యం cuirally.com లో ఆర్డరిచ్చేయండి. ధర : రూ.3,699

డ్రైవర్ లేకుండా..

ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా డ్రైవర్ అవసరం లేని కార్లు రోడ్ల మీద తిరుగుతున్నాయి. కానీ ఇప్పుడు డ్రైవర్ అవసరం లేని బైకులు కూడా వచ్చేశాయంటే నమ్ముతారా? నమ్మాల్సిందే.. ఎందుకంటే బీఎండబ్ల్యూ డ్రైవర్ అవసరం లేని కొత్త తరం బైకులను మార్కెట్‌లోకి విడుదల చేసింది. రిమోట్ సెన్సార్‌తో పనిచేసే ఈ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బైకులు వాటంతటవే ఎక్కడికైనా వెళ్లిపోగలవు. ఎదురుగా ఏదైనా వాహనం ఉన్నప్పుడు హారన్ కొట్టడం, బ్రేక్ వేయడం, ఆగినప్పుడు స్టాండ్ వేయడం వంటి పనులు కూడా స్వయంగా చేసుకుంటుంది. బైకు వెనుకభాగంలో రోబో మిషన్లు అమర్చారు. దీంతో మనుషులు నడుపుతున్న వాహనం నుంచి ఏదైనా ప్రమాదం సంభవించే అవకాశం ఉంటే ముందే పసిగట్టి హెచ్చరిస్తుంది. రక్షిస్తుంది కూడా. బీఎండబ్ల్యూ ఆర్1200 జీఎస్ పేరుతో ఈ బైక్‌ను మార్కెట్లోకి విడుదల చేశారు.



హైదరాబాద్ జోన్ — నెక్, చికెన్ ధరలు రూపాయల్లో

టోకు గుడ్లు	రూ. 442
రిటైల్ గుడ్లు	రూ. 5.00
ఫారమ్ కోడి	రూ. 85
డ్రెస్డ్ స్కిన్ చికెన్	రూ. 155
స్కిన్‌లెస్	రూ. 177

పన్ను వసూళ్లు పెంచండి





- ఎగవేతదారులపై కేసులు దాఖలు చేయాలి
- ఐటి శాఖ అధికారులకు సిబిడిటి ఆదేశాలు
- గతేడాదితో పోలిస్తే వసూళ్లు కనిష్ట స్థాయికి చేరాయని వెల్లడి

న్యూఢిల్లీ: ప్రత్యక్ష పన్ను వసూళ్లను పెంచాలని ఆదాయం పన్ను(ఐటి) శాఖ అధికారులకు సిబిడిటి(కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు) సూచించింది. పన్ను వసూళ్లు గరిష్ఠ స్థాయికి చేరేలా కృషి చేయాలని, లక్షిత సర్వేలు నిర్వహించి, పన్ను ఎగవేతలకు పాల్పడుతున్న వారిపై కోర్టు కేసులు దాఖలు చేయాలని సిబిడిటి ఆదేశించింది. ప్రత్యక్ష పన్ను వసూళ్ల వృద్ధి మందగించిన నేపథ్యంలో సిబిడిటి ఈ ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపు మార్చి 31 నాటికి అంటే మూడు నెలలే ఉందని, ఈ లోగా ప్రత్యక్ష పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని ఈమేరకు అందరు ఐటి శాఖ ప్రధాన ముఖ్య కమిషనర్లకు సిబిడిటి చైర్మన్ సుశీల్ చంద్ర లేఖ రాశారు. ప్రాంతీయ శాఖల వృద్ధిని పరిశీలిస్తే వసూళ్లు చాలా కనిష్ట స్థాయికి చేరగాయని, రెగ్యులర్ అసెస్‌మెంట్ టాక్స్ కింద వసూళ్ల వృద్ధి 1.1 శాతమే ఉందని, గత ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో ఈ వసూళ్లు 15.6 శాతం వృద్ధిని నమోదు చేశాయని సుశీల్ పేర్కొన్నారు. చాలా ప్రాంతాల్లో ప్రతికూల వృద్ధి కనిపిస్తోందని, ఇది చాలా తీవ్రమైన అంశమని, అధికారులు రికవరీని మరింతగా పెంచాల్సి ఉందని ఆయన అన్నారు. ఐటి శాఖకు ప్రణాళికను రూపొందించి, పనుల పర్యవేక్షణ చేపట్టనున్నామని సిబిడిటి వెల్లడించింది. 2018 డిసెంబర్ ముగింపు నాటికి 14.7 శాతం లక్ష్యానికి గాను ప్రస్తుతం వృద్ధి 13.6 శాతంగా ఉంది. స్థూల వసూళ్లలో వృద్ధి 14.1 శాతంతో మెరుగ్గానే ఉన్నా బడ్జెట్‌లో అంచనా వేసిన రూ.11,50,000 కోట్లకు దిగువనే నమోదైంది. పన్ను వసూళ్లు ఊపందుకొనేందుకు స్వాధీనం చేసుకున్న ఆస్తులు వేలం వేయడం, ఉద్దేశ పూర్వక ఎగవేతదారులపై కోర్టు కేసులు పెట్టడంపై అధికారులు దృష్టి పెట్టాలని, ఇతర వ్యూహాలు అమలు చేయాలని సుశీల్ చంద్ర లేఖలో పేర్కొన్నారు. టిడిఎస్(టాక్స్ డిడక్షన్ ఎట్ సోర్స్) వసూళ్లపై పన్ను అధికారులకు శిక్షణ ఇవ్వాలని, డిఫాల్టర్లపై విచారణ చేపట్టాలని కూడా ఆయన సూచించారు.

క్యూ3, స్థూల గణాంకాలు కీలకం



- అమెరికా–చైనా చర్చలు, రూపాయి కదలికలను గమనించాలి
- ఈ వారం మార్కెట్లపై నిపుణులు

న్యూఢిల్లీ: ఐటి దిగ్గజాలు టిసిఎస్(టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్), ఇన్ఫోసిస్ వంటి కంపెనీల క్యూ3(అక్టోబర్–డిసెంబర్) ఫలితాలు, రూపాయి కదలికలు, అమెరికా–చైనా వాణిజ్య చర్చలు ఈ వారం దేశీయ ఈక్విటీ మార్కెట్లకు దిశానిర్దేశం చేస్తాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. ద్రవ్యోల్బణం, పారిశ్రామిక ఉత్పత్తికి సంబంధించిన స్థూల ఆర్థిక గణాంకాలు కూడా మార్కెట్లకు కీలకమైనవని వారన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక ఫలితాలను టిసిఎస్ ఈ నెల 10న(గురువారం) విడుదల చేయనుంది. అలాగే ఇన్ఫోసిస్ 11న పనితీరు వెల్లడించనుంది. ప్రధానంగా ఇన్ఫోసిస్ ఆదాయ అంచనాలు(గైడెన్స్) సెంటిమెంటుపై ప్రభావాన్ని చూపే వీలున్నట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. వీటితో పాటుగా మరో ఐటి సేవల సంస్థ టాటా ఎలక్సీ 8న, ప్రయివేట్ రంగ బ్యాంకింగ్ సంస్థ ఇండస్‌ఇండ్ 9న, బంధన్ బ్యాంక్ 10న, కర్నాటక బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రా 11న ఫలితాలను వెల్లడించనున్నాయి. ఈ వారం నవంబర్ నెలకు పారిశ్రామికోత్పత్తి(ఐఐపి) గణాంకాలు 11న విడుదలకానున్నాయి. అక్టోబర్‌లో ఐఐపి 8.1 శాతం జంప్‌చేసింది. ఈనెల 7, 8 తేదీల్లో అమెరికా, చైనా మధ్య మంత్రివర్గ స్థాయిలో వాణిజ్య వివాద పరిష్కార చర్చలు జరగనున్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన ఈ రెండు దేశాల మధ్య చర్చలు ఎంతో కీలకంగా మారాయి. ఈ రెండు దేశాల మధ్య ఏడాది కాలంగా వాణిజ్య వివాదాలు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. దీంతో ప్రపంచ ఆర్థిక మందగమన సంకేతాలు కూడా వెలువడుతున్నాయి. దీంతో ఈ చర్చలకు అధిక ప్రాధాన్యమున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు. అంతర్జాతీయ మార్కెట్లలో ముడిచమురు ధరలు, డాలరుతో మారకంలో రూపాయి కదలికలపైనా ఇన్వెస్టర్లు దృష్టి పెట్టాలని నిపుణులు సూచిస్తున్నారు. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పిఐలు), దేశీ ఫండ్స్ పెట్టుబడుల తీరు వంటి పలు ఇతర అంశాలు కూడా ట్రెండ్‌ను నిర్దేశిస్తాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. చైనాలో అమ్మకాలు క్షీణిస్తుండటంతో గత వారం ఐఫోన్ల దిగ్గజం యాపిల్ డిసెంబర్ త్రైమాసికానికి గైడెన్స్‌లో కోత పెట్టింది. దీంతో అమెరికా స్టాక్ మార్కెట్లలో అమ్మకాలు వెల్లువెత్తగా, ఇది ఇతర దేశాలపైనా ప్రభావం చూపింది. ఇంకా జిఎస్‌టి కౌన్సిల్ జనవరి 10న సమావేశం కానుంది. నిర్మాణంలో ఉన్న ఫ్లాట్లపై, గృహాలపై జిఎస్‌టి 5 శాతం వరకు తగ్గింపు, అలాగే చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు మినహాయింపు స్థాయిని పెంచడం వంటి అంశాలపై చర్చించనుంది.

ఎటిఎంలలో నగదు సమస్యను పరిష్కరించాలి

- తగిన సంఖ్యలో ఎటిఎంలను కూడా ఏర్పాటు చేయాలి
- ఆర్‌బిఐని కోరిన పార్లమెంట్ ప్యానెల్



న్యూఢిల్లీ: ఎటిఎంలలో నగదు కొరత సమస్యను పరిష్కరించాలని పార్లమెంట్ ప్యానెల్ ఆర్‌బిఐ(భారతీయ రిజర్వు బ్యాంక్)ను కోరింది. పనిచేయని ఎటిఎంలు, ఇంకా ఎటిఎంల నగదు కొరత సమస్యను పరిష్కరించి, తగినంతగా ఎటిఎంలను కూడా ఏర్పాటు చేయాలని ప్యానెల్ నివేదికలో పేర్కొంది. గతవారం ప్యానెల్ నివేదికను పార్లమెంట్‌లో సమర్పించారు.

దేశంలో 2 లక్షలకు పైగా ఎటిఎంలు

ఆర్‌బిఐ నివేదిక ప్రకారం, 2018 సెప్టెంబర్ ముగింపు నాటికి దేశంలో 2,21,492 ఎటిఎంలు (ఆటోమేటెడ్ టెల్లర్ మెషిన్లు) ఉన్నాయి. దీనిలో 1,43,844 ఎటిఎంలు ప్రభుత్వరంగ బ్యాంకలకు చెందినవి, 59,645 ఎటిఎంలు ప్రైవేటురంగ బ్యాంకులకు చెందినవి ఉన్నాయి. ఇంకా 18,003 ఎంటిఎంలు విదేశీ బ్యాంక్‌లు, పేమెంట్ బ్యాంక్‌లు, చిన్న ఫైనాన్స్ బ్యాంక్‌లు, వైట్ లేబుల్ ఎటిఎంలు ఉన్నాయి.

డిజిటల్ లావాదేవీలు విస్తృతం కాలేదు

డిజిటల్ లావాదేవీలు ఇంకా ఎక్కడా విస్తృతం కాలేదని, అందువల్ల పనిచేయని ఏటిఎంల సమస్యను ఆర్‌బిఐ వెంటనే పరిష్కరించాలి. అలాగే పనిచేయని ఎటిఎంలు, ఎటిఎంల కొరత సమస్యలను కూడా పరిష్కరించి, నగదు కొరత లేకుండా చూడాలని నివేదికలో ప్యానెల్ పేర్కొంది.

ఏటిఎంల మూసివేత

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వీరప్ప మొయిలీ ఆధ్వర్యంలోని పార్లమెంట్ కమిటీ ఇంకా పలు విషయాలను వెల్లడించింది. ఆర్‌బిఐ చేపట్టిన రీమానిటైజేషన్ కార్యక్రమంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నగదు సమస్యను పరిష్కరించలేకపోయాయని, అనేక ఏటిఎంల మూసివేతకు దారితీసిందని ఈ కమిటీ పేర్కొంది. తగిన సంఖ్యలో ఏటిఎంలు లేకపోవడంపై ఈ కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. పెద్దసంఖ్యలో జన్‌ధన్ ఖాతాలు తెరవడం, భారీ సంఖ్యలో డెబిట్ కార్డులు జారీ చేయడంతో నగదు డిమాండ్ పెరిగిందని కమిటీ వెల్లడించింది.

ఎటిఎంల ప్రధాన పాత్ర

బ్యాంకు సమయం ముగిసిన తర్వాత నగదు ఉపసంహరణకు ఎటిఎంలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. చాలా వరకు ప్రజలు తమ అవసరాల కోసం ఎటిఎంలకు వెళ్లడాన్ని అలవాటు చేసుకున్నారు. డిజిటల్ లావాదేవీలు కూడా నిర్వహిస్తున్నారు. ఎటిఎంలతో పాటు మైక్రో ఎటిఎంల ద్వారా వ్యాపార ప్రతినిధులు బ్యాంకింగ్ సేవలను అందిస్తున్నారు.

రికవరీ కోసమే మీడియాలో సెన్సేషన్

ఎరిక్సన్ బకాయిల చెల్లింపులకు కట్టుబడి ఉన్నాం: ఆర్‌కామ్



న్యూఢిల్లీ: బకాయిలను చెల్లించడం లేదంటూ విమర్శలకు దిగిన స్వీడన్ సంస్థ ఎరిక్సన్‌పై రిలయన్స్ కమ్యూనికేషన్స్(ఆర్‌కామ్) మండిపడింది. ఎరిక్సన్ సురక్షితమైన సంస్థ కాదని, రికవరీ కోసం మీడియాలో సెన్సేషన్ సృష్టిస్తోందని ఆర్‌కామ్ విమర్శించింది. ఎరిక్సన్‌కు చెల్లింపుల విషయంలో తమ కంపెనీ పూర్తిగా కట్టుబడి ఉందని, సెటిల్మెంట్ దిశగా ఆర్‌కామ్ చర్యలు చేపట్టిందని అన్నారు. ఎరిక్సన్ నుంచి ఎలాంటి ధిక్కరణ పిటిషన్‌ను అందుకోలేదని ఆర్‌కామ్ ప్రతినిధి తెలిపారు. వైర్లెస్ ఆస్తుల విక్రయంలో టెలికామ్ శాఖ నుంచి ఇంకా అనుమతి పొందాల్సి ఉందని వెల్లడించారు. కాగా రెండు రోజుల క్రితం ఆర్‌కామ్ ఛైర్మన్ అనిల్ అంబానీకి వ్యతిరేకంగా ఎరిక్సన్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దేశం విడిచి వెళ్లకుండా నిరోధించాలని, తమ కంపెనీకి రూ.550 కోట్లు చెల్లించేంత వరకు ఆయన్ని జైలులో నిర్బంధించాలని ఎరిక్సన్ కోరింది. అనిల్ అంబానీ, ఆర్‌కామ్ కంపెనీలకు చెందిన ఇతర అధికారులు దేశం విడిచిపోకుండా చూడాలని, హోం మంత్రిత్వశాఖ ద్వారా చర్యలు తీసుకోవాలని ఎరిక్సన్ కోరింది. అంతేకాదు గడువులోపు బాకీ చెల్లించకుండా కోర్టు ధిక్కరణకు పాల్పడినందుకుగాను అనిల్ అంబానీని జైలుకు పంపాలని డిమాండ్ చేసింది. చాలాకాలంగా ఆర్‌కాం చెల్లింపుల కోసం ఎదురుచూస్తున్నామని సంస్థ పేర్కొంది. రూ.550 కోట్ల చెల్లింపునకు అంబానీ కోర్టులో వ్యక్తిగత హామీ ఇచ్చారు, అయితే కోర్టు ఆదేశాలను ఉల్లంఘించడం ఇది రెండవసారి అని ఆ సంస్థ వెల్లడించింది.

2018లో 100కు పైగా విమానాలు




న్యూఢిల్లీ: గతేడాదిలో దేశీయ విమాన సంస్థలు 100కు పైగా విమానాలను ప్రవేశపెట్టాయి. ఇంతటి స్థాయిలో విమానాలను తీసుకురావడం ఇదే తొలిసారి. దీనిలో బడ్జెట్ విమానయాన సంస్థ ఇండిగో సంస్థవే సగం వరకు ఉండడం గమనార్హం. ఈమేరకు పరిశ్రమ గణాంకాలు వెల్లడించాయి. తొమ్మిది దేశీయ విమాన సంస్థలు 120 విమానాలను ప్రవేశపెట్టాయి. వీటిలో ట్విన్, సింగిల్ ఐసిల్ అలాగే ప్రాంతీయ విమానాలు ఉన్నాయి. అయితే 2017లో 88 విమానాలను ప్రవేశపెట్టారు. అలాగే దేశీయ విమాన ప్రయాణికుల రద్దీ కూడా 20 శాతం వరకు పెరిగింది.

టాప్ 6 కంపెనీల ఎం–క్యాప్ రూ.38,153 కోట్లు ఆవిరి




న్యూఢిల్లీ: గత వారం టాప్ 10 కంపెనీల్లో ఆరు సంస్థలు దాదాపు రూ.38,152 కోట్ల మార్కెట్ విలువ(ఎం–క్యాప్)ను కోల్పోయాయి. వీటిలో రిలయన్స్ ఇండస్ట్రీస్ అత్యంతగా నష్టపోయింది. ఇంకా టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టిసిఎస్), ఆర్‌ఐఎల్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, హెచ్‌యుఎల్, ఐటిసి, హెచ్‌డిఎఫ్‌సి వంటివి మార్కెట్ విలువను కోల్పోగా, మిగతా సంస్థలైన ఇన్ఫోసిస్, ఎస్‌బిఐ, కోటక్ మహీంద్రా, ఐసిఐసిఐ బ్యాంక్‌లు లాభపడ్డాయి. కంపెనీల మార్కెట్ విలువ విషయానికొస్తే.. ఆర్‌ఐఎల్ ఎం–క్యాప్ రూ.16,955 కోట్లు తగ్గి రూ.6,96,639 కోట్లకు చేరింది. ఇక హిందుస్తాన్ యునిలీవర్ లిమిటెడ్(హెచ్‌యుఎల్) విలువ రూ.8,626 కోట్లు పడిపోయి రూ.3,85,361 కోట్లకు చేరగా, ఐటి దిగ్గజం టిసిఎస్ ఎం–క్యాప్ రూ.8,198 కోట్లు తగ్గి రూ.7,03,178 కోట్లకు చేరింది. హెచ్‌డిఎఫ్‌సి విలువ కూడా రూ.1,501 కోట్లు కోల్పోయి రూ.3,38,933 కోట్లకు చేరగా, ఐటిసి విలువ రూ.1,469 కోట్లు క్షీణించి రూ.3,43,832 కోట్లు అయింది. ఇక హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ మార్కెట్ విలువ విషయానికొస్తే రూ.1,400 కోట్లు తగ్గి రూ.5,75,922 కోట్లకు చేరింది. వీటికి విరుద్ధంగా ఐసిఐసిఐ బ్యాంక్ విలువ రూ.2,906 కోట్లు పెరిగి రూ.2,35,444 కోట్లకు చేరగా, ఎస్‌బిఐ విలువ కూడా రూ.2,722 కోట్లు పెరిగి రూ.2,65,506 కోట్లు అయింది. ఇన్ఫోసిస్ విలువ రూ.1,376 కోట్లు పెరిగి రూ.2,88,658 కోట్లు అయింది. కోటక్ మహీంద్ర బ్యాంక్ విలువ కూడా రూ.391 కోట్లు పెరిగి రూ.2,37,787 కోట్లకు చేరింది. టాప్ 10 ర్యాంకింగ్‌లో టిసిఎస్ మొదటి స్థానంలో నిలిచింది. ఆ తర్వాత రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, హెచ్‌యుఎల్, ఐటిసి, హెచ్‌డిఎఫ్‌సి ఇన్ఫోసిస్, ఎస్‌బిఐ, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్‌లు ఉన్నాయి. గత వారం సెన్సెక్స్ మొత్తంగా 381.62 పాయింట్లు అంటే 1.05 శాతం నష్టపోయింది.



కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	70.03
యూరో	79.75
బ్రిటిష్ పౌండ్	88.44
ఆస్ట్రేలియన్ డాలర్	49.18
కెనెడియన్ డాలర్	51.91
సింగపూర్ డాలర్	51.40
స్విస్ ఫ్రాంక్	70.92
చైనీస్ యువాన్	10.20
మలేషియన్ రింగిట్	16.92
న్యూజిలాండ్ డాలర్	46.88
హాంకాంగ్ డాలర్	8.94
జపనీస్ యెన్	0.65
కువైట్ దినార్	230.86
సౌతాఫ్రికన్ రాండ్	4.90

బులియన్



బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	30480	32598.93	0.13%
ముంబై	31280	33454.55	2.02%
ఢిల్లీ	31200	33368.98	0.16%
కోల్‌కతా	31610	33807.49	0.25%
కేరళ	29750	31818.18	1.19%
బెంగళూరు	29950	32032.09	0.3%
హైదరాబాద్	30480	32598.93	0.13%
గల్ఫ్	137.68	147.25	1.38%

వెండి ధర (రూ./ కిలో)

చెన్నై	₹ 42365.00
ముంబై	₹ 42365.00
ఢిల్లీ	₹ 42365.00
కోల్‌కతా	₹ 42365.00
హైదరాబాద్	₹ 42365.00



డ్రైవింగ్ లైసెన్స్‌కు ఆధార్‌ను తప్పనిసరి చేస్తాం

కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్



ఫగ్వారా (పంజాబ్): డ్రైవింగ్ లైసెన్స్‌లకు ఆధార్ అనుసంధానాన్ని తప్పనిసరి చేస్తామని కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ పేర్కొన్నారు. ఇక్కడ లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలో నిర్వహించిన 106వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో మంత్రి మాట్లాడుతూ, వాహనదారులకు డ్రైవింగ్ లెసెన్స్ త్వరలో ఆధార్‌ను అనుసంధానం చేయడాన్ని తప్పనిసరి చేస్తామని అన్నారు. దీనికి సంబంధించిన బిల్లు ప్రస్తుతం పార్లమెంటులో పెండింగ్‌లో ఉందన్నారు. ఆధార్ దేశ ప్రజల జీవితాల్లో పెను మార్పు తీసుకొచ్చిందని, ప్రతి ఒక్కరి గుర్తింపునకూ ఇదే ప్రధానమని అన్నారు. డ్రైవింగ్ లైసెన్స్‌కు ఆధార్‌ను అనుసంధానం చేసే ఆలోచన వెనుక ఉన్న ఉద్దేశాన్ని మంత్రి వివరిస్తూ.. మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తి రోడ్డు ప్రమాదం చేస్తే, ఈ ఘటనలో ఎవరైనా చనిపోతే, అప్పుడు అతని లైసెన్స్ రద్దు చేస్తారు. ఆధార్ అనుసంధానం లేకపోతే పక్క రాష్ట్రానికి వెళ్లి అదే వ్యక్తి వేరే గుర్తింపుతో మరో లైసెన్స్ పొందగలుగుతాడని, అదే డ్రైవింగ్ లైసెన్స్‌కు ఆధార్ అనుసంధానమై ఉంటే అతడు మరో లైసెన్స్ పొందేందుకు అవకాశం ఉండదని ఆయన వివరించారు. ఆధార్ అనుసంధానం వల్ల నకిలీ డ్రైవింగ్ లైసెన్స్‌లను నిరోధించడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి జరిమానాలను తప్పించుకొనే అవకాశం కష్టమవుతుందని మంత్రి స్పష్టం చేశారు. దేశంలో 124 కోట్ల మంది ఆధార్ కలిగి ఉన్నారని, డ్రైవింగ్ లైసెన్స్‌లను జారీ చేయడం ఏళ్ల తరబడి అసంఘటిత ప్రక్రియగానే ఉండిపోయిందని, కొన్నేళ్లుగా ప్రక్రియంతా డిజిటల్‌వైపు మళ్లినా పరిస్థితి పూర్తిగా మారలేదు. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం అన్ని ప్రమాణాలు, సౌకర్యాలతో డ్రైవింగ్ శిక్షణ కేంద్రాలను నెలకొల్పనుందని అన్నారు.

> దేశభక్తికి సంబంధించిన 'మణికర్ణిక' చిత్రంలో నటించడంతో గర్వంగా ఉంది. ఈ సినిమా ఆరంభంలో నా బరువు 50 కిలోలే. యాక్షన్ సన్ని-వేశాల్లో నటించేటప్పుడు నా శక్తి సరిపోయేది కాదు. ఈ కథకు తగ్గట్లుగా శరీరాకృతి, ఫిట్‌నెస్ నాకు లేదని అర్థమైంది.
>
> –బాలీవుడ్ హీరోయిన్ కంగనారనౌత్

తమిళ్ రీమేక్‌లో బెల్లంకొండ శ్రీనివాస్



నిర్మాత బెల్లంకొండ సురేష్ కొడుకుగా అడుగుపెట్టి యంగ్ హీరోగా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు బెల్లంకొండ శ్రీనివాస్. పెద్ద దర్శకులు వి.వి.వినాయక్, బోయపాటి శ్రీనులతో సినిమాలు చేసి యువ కథానాయకుడిగా ప్రేక్షకుల్లో మంచి క్రేజ్‌ను తెచ్చుకున్నాడు. ఇటీవల 'కవచం' సినిమాతో అతను ప్రేక్షకుల ముందుకు వచ్చి పర్వాలేదనిపించుకున్నాడు. ఆతర్వాత కొంత గ్యాప్ తీసుకొని మళ్లీ సినిమాలు చేయడానికి సిద్ధమవుతున్నాడు. బెల్లంకొండ శ్రీనివాస్ ఓ తమిళ్ రీమేక్‌లో నటించబోతున్నాడని తెలిసింది. ఇక తమిళంలో తక్కువ బడ్జెట్‌లో తెరకెక్కి భారీ లాభాలను తెచ్చి పెట్టిన చిత్రం 'రాచ్చసన్'. విష్ణు విశాల్, అమలాపాల్ జంటగా నటించిన ఈ చిత్రం చిన్న సినిమాగా విడుదలై 20 కోట్ల లాభాలను తెచ్చిపెట్టింది. అయితే ఈ సినిమా రీమేక్ హక్కులను హీరో నితిన్ కొన్నాడని... ఆయనే హీరోగా ఈ సినిమాను తెరకెక్కిస్తాడని అప్పట్లో వార్తలు వచ్చాయి. కానీ తాజాగా ఈ రీమేక్ హక్కులు మరో హీరో చేతుల్లోకి వెళ్లినట్టు తెలిసింది. ఆ హీరో మరెవరో కాదు బెల్లంకొండ శ్రీనివాస్. దర్శక నిర్మాతలు ఎవరన్నది ఇంకా తెలియరాలేదు. బెల్లంకొండ శ్రీనివాస్ హీరోగా ఈ చిత్రం తెరకెక్కుతుందని సమాచారం. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలు బయటకు రానున్నాయి.

అప్పట్లో నాది చిన్న లోకం



ఇప్పుడు నేను పొందినవన్నీ లేకపోయినా సినిమాల్లోకి రాకముందు నా జీవితం సంతోషంగా ఉండేదని చెప్పింది అందాల తార అనుష్క. అగ్ర నాయకిగా తెలుగు, తమిళ ఇండస్ట్రీని ఏలుతున్న ఈ భామ నటిగా దశాబ్ద కాలాన్ని పూర్తిచేసుకుంది. కెరీర్‌లో తిరుగులేని స్టార్ హీరోయిన్‌గా దూసుకుపోతోంది. ''సినీ ప్రపంచం నా జీవితాన్ని వంద శాతం మార్చేసింది. చాలా మంది స్నేహితులయ్యారు. ఎన్నో దేశాలు చుట్టొచ్చాను. కీర్తి, ప్రతిష్టలతో సినీ రంగం నన్ను శిఖరానికి చేర్చింది. అయితే ఇవేమీ నాకు తలకెక్కలేదు. ఇంటికి వెళ్తే అన్నీ మర్చిపోయి ఒక సాధారణ అమ్మాయిగా మసలుకుంటాను. చిత్ర పరిశ్రమలో చాలా మంది స్నేహితులున్నారు. సినిమా నాకు చాలా నేర్పింది. ఇప్పుడు తెలుగు, తమిళ భాషల్లో ప్రముఖ నటిగా రాణిస్తున్నాను. నటనకు ప్రాముఖ్యత ఉన్న పాత్రలు చేస్తున్నాను. ఇది నాకు చాలా సంతోషాన్నిస్తోంది''అని చెప్పింది ఈ స్టార్ హీరోయిన్. ''చిన్నప్పుడు ఇతర ప్రదేశాలకు వెళ్తే అక్కడి పరిస్థితులు నచ్చేవి కావు. ఎప్పుడు ఇంటికి పారిపోదామా అని అనిపించేది. సినిమాకు వచ్చిన కొత్తలోనూ అలాంటి భావనే కలిగేది. చిత్ర పరిశ్రమకు రాకముందు నాది చాలా చిన్న లోకం. తక్కువ మంది స్నేహితులు ఉండేవారు. టివి చూడడం, స్నేహితులతో గడపడం, పుస్తకాలు చదువుకోవడం ఇదే అప్పట్లో నా దినచర్య. సినిమాల్లోకి వచ్చిన తర్వాత అంతా తలక్రిందులైపోయింది. ఎక్కడికి వెళ్లినా అభిమానులు ఆటోగ్రాఫ్ అంటూ వెంటపడుతున్నారు. రెగ్యులర్ షూటింగ్‌లతో నా జీవితమే మారిపోయింది. ఇవన్నీ లేకపోయినా సినిమాల్లోకి రాకముందు నా జీవితం సంతోషంగానే ఉండేది. ఎంత స్టార్‌డమ్ వచ్చినా సరే ఎప్పటికీ నేను సాధారణ అమ్మాయిగానే జీవించాలనుకుంటాను''అని పేర్కొంది అనుష్క

ఛాలెంజింగ్‌గా ఉండే పాత్రలు చేస్తా

అల్లుఅర్జున్ హీరోగా నటించిన 'దేశముదురు' సినిమాతో టాలీవుడ్‌లోకి అడుగుపెట్టింది పాలబుగ్గల సుందరి హన్సికా మోత్వానీ. కొన్నాళ్లు తెలుగులోనే ఆమె నటించినా పెద్దగా హిట్లేమీ రాలేదు. అదే సమయంలో కాస్త బొద్దుగా మారింది. దాంతో రూటు మార్చి కోలీవుడ్‌కు వెళ్లిపోయింది. అక్కడ వరుసగా ఆఫర్లు దక్కించుకుంటూ హిట్స్‌ను అందుకుంటూ టాప్ హీరోయిన్‌గా రాణించింది. ఈమధ్య హన్సిక బరువు తగ్గి స్లిమ్‌గా మారింది. అయితే ఒకే తరహా పాత్రలు చేసిచేసి బోర్ కొట్టేసిందని అంటోంది హన్సిక. క్యూట్‌గా, బబ్లీగా కనిపిస్తూ హీరోతో రొమాన్స్, డ్యాన్సులు చేసే పాత్రలతో విసిగిపోయిందట. ''కెరీర్‌లో ముందుకెళ్లాలంటే చేసే పాత్రల్లో మార్పు తప్పనిసరి అనిపించింది. అందుకే పాత్రలు ఛాలెంజింగ్‌గా ఉంటేనే నటించడానికి ఒప్పుకుంటున్నా''అని అంటోంది హన్సిక. ఆమధ్య తమిళ్‌లో 'అరణ్మయి' అనే లేడీ ఓరియెంటెడ్ మూవీలో నటించింది హన్సిక. ఆతర్వాత అలాంటి ఆఫర్లు ఆమెకు వరుసగా వచ్చాయి. ఇలాంటి స్టీరియో టైప్ స్క్రిప్టులు చేయాలని అనుకోకపోవడంతో వాటిని వద్దనుకున్నానని చెప్పింది హన్సిక. ప్రస్తుతం ఛాలెంజింగ్‌గా ఉండే పాత్రలు చేయాలని కోరుకుంటున్నట్టు హన్సిక పేర్కొంది.



సంక్రాంతికి బిగ్ ఫైట్





> సంక్రాంతి పండుగ సీజన్‌లో సినిమా థియేటర్లు కళకళలాడబోతున్నాయి. ఈ పండుగకు తెలుగు రాష్ట్రా లతో సహా ప్రపంచ వ్యాప్తంగా పలు పెద్ద సినిమాలు భారీ ఎత్తున విడుదల కానున్నాయి. ఇప్పటికే నాలుగు పెద్ద సినిమాలు సంక్రాంతి బరిలోకి దిగేందుకు సిద్ధంగా ఉన్నాయి. రామ్‌చరణ్ చిత్రం 'వినయ విధేయ రామ', బాలకృష్ణ సినిమా 'ఎన్టీ ఆర్-కథానాయకుడు', వెంకటేష్, వరుణ్‌తేజ్‌ల చిత్రం 'ఎఫ్2', రజనీకాంత్ మూవీ 'పేట' ప్రేక్షకుల ముందుకు రాబోతు న్నాయి. అయితే ఈ నాలుగు చిత్రాల పైన దాదాపు 200 ప్రీ కోట్ల బిజినెస్ సాగిం దని ట్రేడ్ వర్గాలు అంటు న్నాయి.





ప్రతి సంవత్సరం సంక్రాంతి పండుగ సీజన్ స్టార్ హీరోల సినిమాలకు పెద్ద మార్కెట్‌గా ఉంటోంది. దీంతో పలువురు పెద్ద స్టార్ల సినిమాలను ఈ పండుగ సందర్భంగా విడుదల చేయాలని ఫిల్మ్‌మేకర్స్ తహతహలాడుతుంటారు. ఈ నేపథ్యంలో ఈసారి నాలుగు పెద్ద సినిమాలు సంక్రాంతి పండుగ కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. నందమూరి తారక రామారావు జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కిన చిత్రం 'ఎన్టీఆర్'. నందమూరి బాలకృష్ణ ప్రధాన పాత్రలో క్రిష్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం 'ఎన్టీఆర్‌కథానాయకుడు', 'ఎన్టీఆర్‌మహానాయకుడు' పేరిట రెండు భాగాలుగా విడుదల కానుంది. అయితే ఈ చిత్రం మొదటి భాగం 'ఎన్టీఆర్‌కథానాయకుడు' ఈనెల 9న విడుదల కానుంది. ఈ చిత్రానికి 60 కోట్లకు పైగా ప్రీ రిలీజ్ బిజినెస్ జరిగిందని తెలిసింది. రామ్‌చరణ్ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'వినయ విదేయ రామ'. కియారా అద్వానీ హీరోయిన్‌గా డి.వి.వి.దానయ్య నిర్మించిన ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. వివేక్ ఓబెరాయ్ విలన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో ఆర్యన్ రాజేష్, ప్రశాంత్, స్నేహ, మధునందన్, రవివర్మ కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రం ఈనెల 11న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి 120 కోట్ల వరకు ప్రీ రిలీజ్ బిజినెస్ జరిగిందని సమాచారం. ఇక వెంకటేష్, వరుణ్‌తేజ్ కథానాయకులుగా అనీల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన మల్టీస్టారర్ మూవీ 'ఎఫ్2'. దిల్‌రాజు నిర్మించిన ఈ చిత్రంలో తమన్నా, మెహరీన్‌లు హీరోయిన్లుగా నటించారు. ఈ చిత్రం ఈనెల 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి 30 కోట్ల మేర ప్రీ రిలీజ్ బిజినెస్ జరిగిందని తెలిసింది. సౌతిండియా సూపర్‌స్టార్ రజనీకాంత్ హీరోగా కార్తిక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పేట'. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై రూపొందిన ఈ చిత్రాన్ని తెలుగులో నిర్మాత అశోక్ వల్లభనేని విడుదల చేస్తున్నారు. భారీ అంచనాల మధ్య ఈ చిత్రం ఈనెల 10న విడుదల కానుంది. ఈ చిత్రానికి 21 కోట్ల మేర ప్రీ రిలీజ్ బిజినెస్ జరిగిందని తెలిసింది. ఇవన్నీ కలుపుకుంటే దాదాపు 200 కోట్ల మేర బిజినెస్ జరిగింది. భారీ అంచనాల మధ్య విడుదలవుతున్న ఈ నాలుగు సినిమాలు పోటాపోటీగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. అయితే ఈమేరకు థియేటర్ల నుంచి 200 కోట్ల మేర షేర్ వసూలు అవుతుందా? అనేది చూడాలి. వీటిలో ఏ సినిమా పెద్ద హిట్‌గా నిలిచి భారీ కలెక్షన్లు సాధిస్తుందో చూడాలి. అయితే సంక్రాంతి సెలవులు ఈ సినిమాలకు పూర్తిగా కలిసి రానున్నాయి. సూపర్ హిట్ అన్న టాక్ వినిపిస్తే చాలు వసూళ్లు రావడం పెద్ద కష్టమేమీ కాదు. ఇక విడుదలకు ముందు ఈ నాలుగు చిత్రాల ప్రీమియర్ల సందడి భారీగానే ఉంటుంది.

సీనియర్ స్టార్‌తో సినిమా?



'పటాస్' చిత్రంతో చాలా కాలం తర్వాత కల్యాణ్‌రామ్‌కు మంచి హిట్‌ను ఇచ్చిన దర్శకుడు అనీల్ రావిపూడి. ఆ సమయంలో ఈ యంగ్ డైరెక్టర్‌తో ఓ సినిమా చేసేందుకు సీనియర్ స్టార్ బాలకృష్ణ ఓకే చెప్పారని అప్పట్లో వార్తలు వచ్చాయి. బాలయ్య వందవ సినిమాకు అనీల్ దర్శకత్వం వహించబోతున్నట్లుగా కూడా పుకార్లు షికార్లు చేశాయి. అయితే తన వందవ సినిమాను క్రిష్ దర్శకత్వంలో చేశారు ఈ సీనియర్ స్టార్. ఎట్టకేలకు ఇప్పుడు బాలయ్య, అనీల్ రావిపూడి కాంబినేషన్‌లో ఓ సినిమా పట్టాలెక్కే అవకాశం కనిపిస్తోంది. ప్రస్తుతం బాలకృష్ణ 'యన్.టి.ఆర్' చిత్రం పనుల్లో బిజీగా ఉన్నారు. ఈ బయోపిక్ రెండు పార్టులు విడుదలైన తర్వాత అనీల్ రావిపూడి దర్శకత్వంలో ఈ సీనియర్ స్టార్ ఓ సినిమా చేసే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. తాజాగా 'ఎఫ్2' చిత్రాన్ని తెరకెక్కించి ఆ సినిమా విడుదల పనుల్లో అనీల్ బిజీగా ఉన్నాడు. ఆతర్వాత బాలయ్యతో మూవీ ఉంటుందని తెలిసింది. అయితే వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమాను నిర్మించేందుకు దిల్‌రాజు ఆసక్తిగా ఉన్నారు. కానీ దిల్‌రాజుతో కలిసి బాలయ్య తన ఎన్‌బికె ప్రొడక్షన్స్‌లో ఈ సినిమాను నిర్మించే అవకాశాలు కూడా లేకపోలేదు. ఈ విషయమై క్లారిటీ రావాలంటే మరో రెండు, మూడు నెలల వరకు ఆగాల్సిందే.

పాఠీ

ప్లాసీ యుద్ధం

- రాబర్ట్ క్లైవ్ ప్లాసీ యుద్ధం గురించి 'భారతీయులకు అంతమెరుగని విషాద కాలరాత్రి దాపురించింది' అని వర్ణించాడు.
- 1757 నుండి 1760 వరకు మీర్జాఫర్ బెంగాల్ నవాబ్‌గా ఉన్నాడు.

ప్లాసీ యుద్ధ ఫలితాలు

- దీంతో బెంగాల్లోనూ, తర్వాత భారతదేశంలో ఆంగ్లేయుల సర్వాధికారం చలాయించడానికి మార్గం సులభమైంది.
- మీర్జాఫర్ బ్రిటీష్ వారి చేతిలో కీలుబొమ్మగా మారాడు.
- బెంగాల్ ఆర్థిక వనరులను తమ రాజకీయ, ఆర్థిక ప్రయోజనాల కోసం ఉపయోగించుకొన్నారు.
- పెద్ద సైన్యాన్ని ఏర్పాటుచేసుకొని తమ అధికారులకు పెద్దమొత్తంలో జీతాలిచ్చారు.
- 1757లో కలకత్తాలో మింట్‌ను ఏర్పాటుచేశారు.
- 1760 నాటికి ఖజానా ఖాళీఅవటంచే మీర్జాఫర్ బ్రిటీష్ వారికి బహుమానాలు ఇవ్వడానికి నిరాకరించాడు.
- 1757—60 కాలాన్ని 'సిగ్గుశరం లేని దోపిడీ యుగం'గా వర్ణించినవారు —పెర్సివల్ స్పియర్ (ఇంగ్లాండ్)
- మీర్జాఫర్‌ను తొలగించి అతని, అల్లుడైన మీర్‌ఖాంసీంను బెంగాల్ నవాబ్‌గా చేశాడు.
- మీర్‌ఖాసీం మిడ్నాపూర్, చిట్టగాంగ్, బర్ధ్వాన్‌లను బ్రిటీష్‌కు ఇచ్చాడు.
- మీర్ ఖాసీం సమర్థమైన పాలకుడు. బెంగాల్ వర్తకులెవ్వరూ పన్నులు చెల్లించాల్సిన అవసరం లేదని ప్రకటించడంతో మీర్‌ఖాసీంకు బ్రిటీష్ వారికి వివాదాలు ప్రారంభమైనాయి.
- 1760లో రాబర్ట్‌క్లైవ్ ఇంగ్లాండ్ వెళ్ళగా 'హల్‌వెల్' కొంతకాలం తాత్కాలిక గవర్నర్‌గా కొనసాగాడు.
- అనంతరం – వాన్ సిట్టార్ట్ (1760—65) గవర్నర్‌గా పనిచేశాడు.

బక్సార్ యుద్ధం- 1764 అక్టోబర్ -22
(Battle of Buxar)

- బక్సార్ బీహార్‌లోని పట్టణం, నాటి బెంగాల్ గవర్నర్ —వాన్‌సిట్టార్ట్.
- మీర్‌ఖాసీంతో వివాదాల కారణంగా బ్రిటీష్‌వారు 1763లో మీర్‌ఖాసీంను తొలగించి మీర్జాఫర్‌ను మరల బెంగాల్ నవాబ్‌గా నియమించారు. మీర్‌ఖాసీం చిన్న చిన్న యుద్ధాలలో ఓటమిపాలై అవద్‌కు పారిపోయాడు.
- అవద్‌పాలకుడు – షుజాఉద్దౌలా, మొఘల్ పాలకుడు —2వ షాఆలం, మీర్‌ఖాసీంలు కలసి ఒక కూటమి ఏర్పద్దారు. ఈ భారతీయ త్రయ కూటమికి, ఆంగ్లేయులకు మధ్య 1764 అక్టోబర్ 22న బక్సార్ యుద్ధం జరిగింది. దీనిలో భారతీయత్రయం ఓడిపోయింది.
- నాటి బ్రిటీష్ సైనిక జనరల్ —సర్ హెక్టార్ మాన్రో.
- దీంతో బెంగాల్, బీహార్, ఒరిస్సా పూర్తిగా బ్రిటీష్ ఆధీనంలోకి వచ్చింది.
- అవద్‌పాలకుడు —షుజాఉద్దౌలా రోహిల్‌ఖండ్‌లో తలదాచుకొన్నాడు.
- 2వ షాఆలం – బ్రిటీష్ వారితో సంధి చేసుకున్నాడు.
- బక్సార్ యుద్ధం విజయంతో భారత్‌లో బ్రిటీష్‌వారి సామ్రాజ్య స్థాపన స్థిరీకరించబడింది.
- 1765లో బెంగాల్‌కు రెండవసారి గవర్నర్‌గా నియమించబడినది – రాబర్ట్‌క్లైవ్



- 1765లో అలహాబాద్ ఒప్పందం ప్రకారం బెంగాల్‌లో ద్వంద్వ ప్రభుత్వం ప్రవేశపెట్టబడింది.

మైసూర్‌కు ఖ్యాతిని తెచ్చిన తొలి పాలకుడు

అలహాబాద్ ఒప్పందం- 1765

- బక్సార్ యుద్ధంలో ఓడిపోయిన షుజాఉద్దౌలా, షాఆలం – 2 మరియు రాబర్ట్‌క్లైవ్‌ల మధ్య అలహాబాద్ సంధి కుదిరింది.
- అవద్ నవాబ్‌గా షుజాఉద్దౌలా కొనసాగడానికి 20లక్షలు బ్రిటీష్‌కు ఇచ్చాడు.
- షా ఆలం – 2 బెంగాల్, బీహార్, ఒరిస్సాలలో దివానీ శిస్తు వసూలు చేసే హక్కు బ్రిటీష్‌వారికి ఇచ్చాడు.
- శిస్తు వసూలు చేసే అధికారులుగా క్లైవ్ భారతీయులను నియమించాడు.
- ఉత్తరసర్కార్ జిల్లాలపై ఆంగ్లేయుల అధికారం గుర్తించబడింది.

బక్సార్ యుద్ధ ఫలితాలు

- భారతదేశంలో రెండు శక్తివంతమైన బెంగాల్, అవద్ రాజ్యాలపై ఆంగ్లేయుల సైనిక ఆధిపత్యం స్థిరపడింది.
- బెంగాల్, బీహార్, ఒరిస్సాలలో ఆంగ్లేయులు అధికారం సుస్థిరం చేసి శిస్తు వసూలు చేసే అధికారం పొందారు.
- 1765లో మీర్జాఫర్ చనిపోగా అతని 2వ కొడుకైన నజీర్‌ఉద్దౌలా నవాబ్ చేసి అతనితో ఒక ఒప్పందం కుదుర్చుకున్నారు.
- దీని ప్రకారం తనసైన్యంను తగ్గించాలి. బెంగాల్‌ను కంపెనీయొక్క సుబేదార్ ఆధీనంలో ఉంచాలి. కంపెనీ అనుమతి లేనిదే అతనిని తొలగించరాదు.
- అవద్‌నవాబ్ షుజాఉద్దౌలా నష్టపరిహారం క్రింద 50లక్షలు చెల్లించాడు.
- 1772లో వారన్ హేస్టింగ్స్ క్లైవ్ యొక్క ద్వంద్వ పాలనను బెంగాల్‌లో రద్దు చేశాడు. నజీర్ ఉద్దౌలాకు 6లక్షలు భరణం ఇచ్చి బెంగాల్‌లో బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రత్యక్ష పాలనను నెలకొల్పాడు.
- బెంగాల్‌లో ఈస్టిండియా కంపెనీ ప్రత్యక్షపాలన దేశంలోనే తొలిసారిగా ఏర్పడింది.

ఆంగ్లో —మైసూర్ యుద్ధాలు

- భారతదేశంలో బ్రిటీష్ వారి 3వ ఆక్రమణ – మైసూర్
- మైసూర్ రాజ్యస్థాపకుడు – యదురాయ వడయార్ (1399)
- క్రీ.శ. 18వ శతాబ్దంలో ఆధునిక స్వతంత్ర మైసూర్ రాజ్యస్థాపకుడు – 4వ చామరాజు.
- ఇతని ప్రధాని – వాన్‌పూర్ణయ్య కాగా మంత్రులు సంధ్యరాజ్, దేవరాజ్‌లు.
- రాజు నామమాత్రపు పాలకుడిగా ఉండగా ప్రధాని, మంత్రులే అధికారాలు చెలాయించేవారు.
- 1947లో జయచామరాజు, వడయార్ మైసూర్‌ను భారత్‌లో విలీనం చేశాడు.

హైదర్ అలీ

- బిరుదు : 'ఫతేజంగ్ హైదర్'
- ఆధునిక భారతదేశ చరిత్రలో మైసూర్‌కు ఖ్యాతిని తెచ్చిన తొలి పాలకుడు.
- మొదట్లో హైదర్ అలీ సైనికుడిగా, తర్వాత తన నైపుణ్యంతో దుండిగల్ ప్రాంతంను ఫౌజ్‌దార్ (సైనిక అధికారి)గా నియమించబడ్డాడు.
- 1755లో దుండిగల్‌లో ఫ్రెంచి వారి సహకారంతో ఆధునిక ఆయుద కారాగారం ఏర్పాటు చేశాడు.
- హైదర్ అలీ బిద్‌నూర్‌లో నాణెంలను ముద్రించాడు. బిద్‌నూర్‌ను టిప్పుసుల్తాన్ హైదర్‌నగర్‌గా మార్చాడు.
- 1759లో మరాఠా దాడిని తిప్పికొట్టి మైసూర్‌కు సర్వసేనానిగా నియమించబడ్డాడు.
- 1761లో నంద్యరాజ్‌ను వధించి మైసూర్ పాలకుడిగా ప్రకటించుకున్నాడు. తన రాజ్యాన్ని ఉత్తరాన చంద్రగిరి, దక్షిణాన ఆర్కాట్ వరకు విస్తరించాడు.
- హైదర్‌అలీకి వ్యతిరేకంగా బ్రిటీష్‌వారు హైదరాబాద్ నిజాం—సలాపత్‌జంగ్‌తో సంధిం కుదుర్చుకున్నాడు. దీనితో ఆగ్రహించిన అలీ తన రాజ్యాన్ని అన్నివైపులా విస్తరించుట కు ఆంగ్లేయులతో మైసూర్ యుద్ధాలను ప్రారంభించా డు.
- మొత్తం నాలుగు ఆంగ్లో మైసూ ర్ యుద్ధాలు జరిగినవి. వాటి లో 1, 2 యుద్ధాలలో హైదర్ అలీ పాల్గొన్నాడు.

ఎస్ లక్ష్మీనారాయణ
డైరెక్టర్, రామయ్య
కాంపిటీటివ్ కోచింగ్ సెంటర్
దిల్‌సుఖ్ నగర్, హైదరాబాద్,
8885555202


1. మొదటి ఆంగ్లో – మైసూర్ యుద్ధం
(1767 – 69)

- బ్రిటీష్ గవర్నర్ – వెరెల్ట్స్
- హైదర్ అలీ తన అధికారంను అన్ని వైపులా విస్తరింపజేయుటకు కారణంగా తన భవిష్యత్‌కు ప్రమాదం అని భావించిన ఆంగ్లేయులు, హైదరాబాద్, మరాఠీలు ఈర్ష్య చెందాయి.
- మహ్మద్ అలీ శత్రువైన 'మవూజ్‌ఖాన్'కు హైదర్ అలీ ఆశ్రయం ఇవ్వటం.
- చందాసాహెబ్ కుమారుడైన రాజాసాహెబ్‌కు కూడా ఉద్యోగమివ్వటం.
- వారన్‌హేస్టింగ్స్ సలాపత్‌జంగ్ (హైదరాబాద్ నిజాం)తో సంధి కుదర్చుకోవడం వల్ల కోపగించిన హైదర్ అలీ మొదటి ఆంగ్లో– మైసూర్ యుద్ధానికి తెరతీశాడు.
- మావుజ్‌ఖాన్ సలాపత్‌జంగ్‌తో రహస్య ఒప్పందంను కుదుర్చుకున్నాడు.
- దీంతో హైదర్ అలీ యుద్ధంలో భాగంగా అర్కాట్‌ను ఆక్రమించాడు. కానీ బ్రిటీష్ వారి చేతిలో మొదట్లో హైదర్ అలీ ఓడిపోయాడు.
- సైన్యాన్ని పునఃసమీక్షించుకుని చెంగిమ, తిరువన్నమలై యుద్ధాలలో బ్రిటీష్ వారు హైదర్ అలీతో 1769లో మద్రాస్ శాంతి ఒప్పందంను కుదుర్చుకున్నాడు.
- దీని ప్రకారం యుద్ధానికి ముందుగల యథాస్థితి కొనసాగాలి.
- భవిష్యత్ యుద్ధాలలో ఆంగ్లేయులు హైదర్ అలీకి సహాయపడాలి, యుద్ధఖైదీలను విడుదల చేయాలి.

2. రెండవ ఆంగ్లో – మైసూర్ యుద్ధం (1780 – 84) :

- బ్రిటీష్ గవర్నర్ జనరల్ : వారన్‌హేస్టింగ్స్.
- అమెరికా జార్జ్‌వాషింగ్‌టన్ నాయకత్వంలో స్వాతంత్ర పోరాటంను (1770 దశకం) బ్రిటీష్‌కు వ్యతిరేకంగా ప్రారంభించగా ఫ్రెంచ్‌వారు అమెరికాకు మద్ధతు ఇచ్చారు.
- దీని కారణంగా బ్రిటీష్, ఫ్రెంచ్ వారికి మధ్య యుద్ధం ప్రారంభమైంది.
- భారతదేశంలో మైసూర్ రాజ్యంలో హైదర్‌అలీ ఆధీనంలో గల మహే అనే ఫ్రెంచ్ స్థావరంపై దాడిచేయడానికి బ్రిటీష్ వారు నిర్ణయించుకున్నారు.
- దానిని హదర్ అలీ వ్యతిరేఖించినప్పటికి అంగ్లేయులు మహేపై దాడి చేయడంతో యుద్ధం ప్రారంభమైంది.
- హైదర్ అలీ మొదట్లో కావేరీ యుద్ధంలో కల్నల్ బెయిలీని బంధించాడు.
- వారన్ హేస్టింగ్స్ హైదర్ అలీని ఓడించుటకు జనరల్ ఐర్‌కూట్‌ను నియమించాడు.
- 1781లో పోర్టునోవా యుద్ధంలో ఐర్‌కూట్ హైదర్‌అలీని ఓడించాడు.
- 1782లో హైదర్ అలీ మరణానంతరం అతని కుమారుడైన టిప్పు సుల్తాన్ యుద్ధాన్ని కొనసాగించాడు.

అటవీశాఖలో జాగిలాల వినియోగం



మన తెలంగాణ / హైదరాబాద్ : సవాలుగా మారిన నేరాలను పసిగట్టేందుకు పోలీసులు జాగిలాలను వినియోగించడం పరిపాటి. కానీ దేశంలోనే మొదటిసారిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అటవీశాఖలో ఈ జాగిలాల వినియోగానికి శ్రీకారం చుట్టింది. సాధారణంగా దేశంలో శాంతిభద్రతల పరిరక్షణలో ప్రధానమైన పాత్రను పోషించే పోలీసులతో పాటు దేశ సంరక్షణలో భాగంగా ఉన్న పారామిలిటరీ బలగాలు మాత్రమే వినియోగించేవి. కానీ మొదటిసారిగా దేశంలోని ఐదారు రాష్ట్రాల్లో అటవీశాఖ ఈ జాగిలాలను వినియోగాని కి శ్రీకారం చుట్టింది. ఇందులో తెలంగాణ రాష్ట్రం ఒకటి కావడం విశేషం. ట్రాఫిక్ ఇండియా అనే ఎన్‌జిఓ సంస్థ ఆధ్వర్యంలో గ్వాలియర్‌లో 12 కుక్కలకు శిక్షణనిచ్చారు. తొమ్మిది నెలల పాటు శిక్షణ అనంతరం గత ఏడాది చివరి వారంలో వీటిని పలు రాష్ట్రాలకు అందజేశారు. ఇందులో తెలంగాణ అటవీశాఖ రెండు జాగిలాలను తీసుకువచ్చింది. ఇందులో ఒకటి అమ్రాబాద్, మరొకటి కవ్వాల్ టైగర్ ఫారెస్ట్ అధికారులకు అప్పగించారు.



నేపథ్యమిది.....

రాష్ట్ర అటవీశాఖ పలు వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోంది. ఇందులో ప్రధానంగా అడవి విస్తీర్ణం పెంచడంతో పాటు పచ్చదనం, పర్యావరణ పరిరక్షణతో పాటు వన్యప్రాణుల సంరక్షణకు అందుబాటులో ఉన్న ఆధునిక టెక్నాలజీ వినియోగిస్తుంది. దీంతో పాటు జంతువుల అడవి ప్రాంతాన్ని వదలివెళ్లకుండా ఉండడంతో పాటు అగ్ని ప్రమాద కారకాలను కూడా ముందుగానే గుర్తించి ప్రమాదాల నివారణకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. జంతువులకు అటవీ ప్రాంతంలోనే అవసరమైన మౌలిక వసతుల కల్పనతో పాటు ఇతర రకాల చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగానే వన్యప్రానులను వేటాడుతున్న వారిని అతి సులభంగా పట్టుకునేందుకు డాగ్‌స్క్వాడ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. అటవీశాఖ చేపట్టిన వినూత్న ప్రయత్నాలు సత్ఫలితాలను ఇవ్వడంతో మరింత వేగంగా అడవులు, వన్యప్రాణుల రక్షణకు సంబంధిత ఉన్నతాధికారులు చర్యలు చేపడుతున్నారు. డాగ్ స్క్వాడ్‌ను తీసుకువచ్చి పట్టుమని పది రోజులు కాకముందే మంచిర్యాల జిల్లా జన్నారంలో దుప్పిని వేటాడి మాంసం విక్రయానికి ప్రయతిస్తున్న ఇద్దరు నిందులను అటవీశాఖ అధికారులు అదుపులోకి తీసుకొని వారిని రిమాండ్‌కు తరలించారు. రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా చేపట్టి న ఈ డాగ్‌స్క్వాడ్ అటవీ నేరాల అదుపులో కీలకంగా ఉంటుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

వన్య ప్రాణుల సంరక్షణే ధ్యేయం....

దేశంలో వన్యప్రాణుల సంరక్షణే ధ్యేయంగా డాగ్ స్క్వాడ్‌ను పలు రాష్ట్రాల్లో వినియోగంలోకి తీసుకువచ్చాయి. ఈ డాగ్‌స్క్వాడ్ నిందితుల పాటు వేటగాళ్ల చేతిలో మృతి చెంది న జంతువులను పసిగట్టేలా శిక్షణనిచ్చారు. ప్రత్యేకమైన తరహాలో తొమ్మిది నెలల పాటు సాగిన ఈ శిక్షణకు రాష్ట్రం నుంచి నలుగురు సిబ్బంది శిక్షణలో పాల్గొన్నారు. వీరి ఆదేశాల మేరకే డాగ్‌స్క్వాడ్ పనిచేస్తుందని అటవీశాఖ అధికారులు తెలిపారు. డాగ్‌స్క్వాడ్ ప్రధానంగా బలైన జంతువుల చర్మం, మాంసం, ఎముకలు, గోళ్లు, వెంట్రుకలతో పాటు వేటాడిన వ్యక్తుల ఇతర చేతి రుమాలు, అడుగులు, బీడి, సిగరేట్, ఇతరాత్ర వస్తువుల ఆధారంగా పసిగడుతుందని తెలిపారు. మనిషి కంటే పదివేల రెట్ల అధికంగా వాసనను పసిగట్టే శక్తి కుక్కలకు ఉంటుందని తెలిపారు. ఎలాంటి ఆధారాలు లభించకపోతే వారి అడుగులే ప్రధాన ఆధారమయ్యే అవకాశముంటుందన్నారు. అయితే ఇది రోజులు గడిచే కొద్ది వేటగాళ్ళను పసిగట్టే అవకాశాలు తక్కువగా ఉంటాయని జన్నారం ఫారెస్టు డివిజనల్ అధికారి డాక్టర్ కె.రవీందర్ వివరించారు.

ప్రజల్లో అవగాహన...

అటవీ సమీపంలోని గ్రామాలతో పాటు అడవుల్లో సంచరించే గ్రామాల్లోని ప్రజలకు డాగ్‌స్క్వాడ్‌పై అవగాహన కల్పించారు. వీటి పనివిధానంతో పాటు నేరగాళ్లను ఈజీగా దొరుకుతారనే విషయాలను తెలిపారు. దీనివల్ల జంతువులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం అడవి ఆధారిత గ్రామాల ప్రజలు జంతువులతో పాటు ఇతరత్రా పక్షులను ఎట్టి పరిస్థితుల్లోనూ చంపకుండా ఉండాలని సూచించారు. లేకపోతే అటవీ నేరాలకు గురికావాల్సి వస్తుందన్నారు. డాగ్‌స్క్వాడ్ పని విధానంపై ప్రజల్లో నమ్మకం కలిగించేందుకు వీలుగా మాక్ డ్రిల్‌ను కూడా నిర్వహించినట్లు డాక్టర్ రవీందర్ తెలిపారు. దీంతో వన్యప్రాణుల సంరక్షణకు ఒక భరోసా కలుగుతుందనే ఆశా భావాన్ని అటవీశాఖ వ్యక్తం చేస్తుంది.


50 ఏళ్లు రైతుకు లాభాల పంట!

- వెదురు సాగుపై ఉద్యానశాఖ ఉక్కు సంకల్పం
- ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం చేసిన సంచాలకుడ
- త్వరలో రాష్ట్రంలో 1000 మంది రైతులతో వెదురు సాగు



మన తెలంగాణ/హైదరాబాద్: వెదురు సాగును ప్రోత్సహించే ప్రక్రియను రాష్ట్ర ఉద్యాన శాఖ వేగవంతం చేసింది. వెదురు పండించడానికి అవసరమైన ప్రణాళికలు పూర్తి చేస్తోంది. దాదాపు 1000 మంది రైతుల చేత వెదురు సాగు చేపట్టేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసింది. రైతులు వెదురు పంటను టిష్యూకల్చర్ పద్ధతిలో సాగుచేసేందుకు వీలుగా బ్యాంబూసా బాల్కోనా రకం ప్లాంట్లను కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ మేరకు ఐదు లక్షల ప్లాంట్లు సరఫరా చేయాలని మధ్యప్రదేశ్ ప్రభుత్వాన్ని రాష్ట్రం కోరింది. ప్రభుత్వం వెదురు మొక్కలను రైతులకు ఉచితంగా అందజేస్తుంది. మొదటి నాలుగేండ్లు ఎకరానికి రూ. 4 లక్షలు, ఆ తర్వాత ఏడాదికి రూ.25 వేలు పెట్టుబడి కానుంది. మూడోఏట నుంచే పంట చేతికొస్తుందని, ఎకరానికి రూ.1.32 లక్షల వరకు ఆదాయం వస్తుందని చెప్పారు. దాదాపు 50 సంవత్సరాల పాటు పంట వస్తుందని, వెదరు సాగుకు ఉచిత డ్రిప్‌ను అందించనున్నట్లు ఉద్యాన శాఖ సంచాలకులు ఎల్. వెంకట్రామ్ రెడ్డి ''మన తెలంగాణ''కుతెలిపారు. ఇటీవల ఆయన మహారాష్ట్రలోని పుణేకు వెళ్లారు. అక్కడ వెదురు సాగుపై అధ్యయనం చేసి వచ్చారు. కేంద్రంకు పంపిన యాక్షన్ ప్లాన్ నిధులకు సంబంధించి ఆమోదం లభించిన వెంటనే రైతుల చేత సాగు చేయించనున్నారు. పంటల సాగుకు తగినంత సారం లేని భూములు, అటవీయేతర ప్రభుత్వ భూములు వెదురు తోటల సాగుకు అనుకూలం. దేశవ్యాప్తంగా రెండేళ్లలో 1,05,000 హెక్టార్లలో వెదురు తోటల సాగే లక్ష్యంగా, ప్రత్యేకంగా 'బాంబూ మిషన్' ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహకమిస్తున్నాయి. ఖర్చులో 60% కేంద్రం, 40% రాష్ట్రం భరించనున్నాయి. ఇటీవల ఇందుకు సంబంధించిన యాక్షన్ ప్లాన్‌కు ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. వెదురు అనాదిగా మనకు అనేక విధాలుగా ఉపయోగపడుతున్నది. సుమారు 1500 రకాలుగా వెదురు ఉపయోగపడుతున్నట్లు అంచనాగా ఉంది. అయితే, మన దేశంలో వెదురు ఇన్నాళ్లూ సంరక్షించదగిన అటవీ చెట్ల జాబితాలో ఉంది. అందువల్లనే మన పొలంలో పెరిగిన వెదురు బొంగులను నరకాలన్నా అటవీ శాఖ అనుమతి తీసుకోవాల్సి వచ్చేది. ఈ ఆంక్షల వల్ల ప్రజల అవసరానికి తగినంత వెదురు దొరక్కుండా పోయింది. అందుకని, కేంద్ర ప్రభుత్వం కొద్ది నెలల క్రితం వెదురును అటవీ చెట్ల జాబితాలో నుంచి తొలగించింది. దీంతో పొలాల్లో వెదురు తోటలు సాగు చేయడానికి ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి.

అన్ని రకాలుగా రైతులకు లాభాలు



వెదురుతో తయారు చేసిన గృహోపకరణాలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ వుంది. వెదురుతో ఫర్నీచర్, వెదురు బద్దలతో మన్నికైన, ఆకర్షణీయమైన గృహోపకరణాలు తయారు చేసుకోవచ్చు. అలాగే వెదురు కోత సందర్భంలో నిరుపయోగంగా ఉన్న వెదురు ముక్కల్ని విద్యుత్ ఉత్పత్తికి వాడుకునే అవకాశం ఉండటంతో ఏపుగా పెరిగి వెదురుతో పాటు, విరిగిన వెదురుగడలు రైతులకు లాభాలు అర్జించి పెట్టే అవకాశం వుంది. ఒక్క పంట 50 ఏళ్లు, వంద ఏళ్లు వస్తుంది. బ్యాంబూ సాగు రైతులకు అన్ని రకాలుగా లాభామే. త్వరలోనే రాష్ట్రంలో వెయ్యి మంది రైతులను ఎంపిక చేసి సాగు ప్రారంభిస్తాం.

– ఉద్యానశాఖ సంచాలకులు, ఎల్. వెంకట్రామ్ రెడ్డి

బిసి రిజర్వేషన్లను 34 శాతానికి పునరుద్ధరించాలి

మన తెలంగాణ / ముషీరాబాద్ : గ్రామపంచాయితీ, ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికలలో బిసి రిజర్వేషన్లను 34 శాతానికి పునరుద్ధరించాలని కోరుతూ ఆదివారం ఇందిరాపార్కు వద్ద పలు బిసి సంఘాల ప్రతినిధులు ధర్నా నిర్వహించారు. జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య, గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, కోలా జనార్ధన్, అనంతయ్య, సి.రాజేందర్, డి.సురేష్, జైపాల్ ముదిరాజ్, సాయి కార్తీక్ నాయకత్వంలో జరిగిన ఈ భారీ ధర్నాలో వివిధ ప్రతిపక్ష రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం రాష్ట్రంలో జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో బిసి రిజర్వేషన్లను 34 నుంచి 22 శాతానికి తగ్గించడానికి రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీ చేసింది. బిసి సంఘాలు ఈ నిర్ణయంపై అసంతృప్తి వ్యక్తం చేశాయి. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం బిసిలకు రాజకీయ ప్రాతినిధ్యం తగ్గిపోతోందని, దీన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించాలని ఈ ధర్నాలో పాల్గొన్న పలువురు విజ్ఞప్తి చేశారు. ఈ ధర్నాలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామేశ్వర్, అనంతయ్య, సత్యం గౌడ్ (టిజెఎస్), దాసు సురేష్, సి.రాజేందర్, జి.కృష్ణ యాదవ్, జైపాల్ ముదిరాజ్, నరేష్ గౌడ్, జయంతి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడతాయి

విటోపియా-2019 ముగింపు ఉత్సవంలో జస్టిస్ టి.రజని



మనతెలంగాణ/హైదరాబాద్ : క్రీడల ద్వారా వ్యక్తిత్వ వికాసం అలవడుతుందని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.రజని అన్నారు. అమరావతిలో విఐటిఎపిలో జరుగుతున్న విటోపియా–2019 ఇంటర్నేషనల్ క్రీడా సాంస్కృతిక ఉత్సవం ముగింపు ఉత్సవానికి జస్టిస్ టి.రజని ప్రముఖ సినీ హీరోయిన్ లావణ్య త్రిపాఠిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ టి.రజని మాట్లాడుతూ, విఐటి వర్సిటీ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమని పేర్కొన్నారు. క్లాస్‌రూం విద్యతో పాటు అన్ని అంశాల్లో అభివృద్ధి చెందినప్పుడే విద్యార్థులు రాణించగలుగుతున్నారని చెప్పారు. రెండు రోజులపాటు జరిగిన విటోపియా రెండవ ఎడిషన్‌లో భాగంగా పాటలు, నృత్య పోటీలు నిర్వహించారు. కార్పొరేట్ ఫ్యాషన్ వీక్‌కి ఫెమినా మిస్ చత్తీస్‌ఘడ్ స్పందన పల్లి న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. మొదటి రోజు ప్రముఖ సంగీత దర్శకుడు థమన్, అతని బృందం అనేక తెలుగు, హిందీ, తమిళ్, మలయాళ పాటలతో ఊరడిన సంగీత విభావని నిర్వహించారు. సాంస్కృతిక పోటీల్లో విఐటి వర్సిటీ ఓవరాల్ ఛాంపియన్‌గా నిలవగా, స్పోర్ట్స్ ఓవరాల్ ఛాంపియన్‌గా కెఎల్ యూనివర్సిటీ నిలిచింది. విజేతలకు జస్టిస్ టి.రజని, హీరోయిన్ లావణ్య త్రిపాఠి బహుమతులతు అందజేశారు. అలాగే కార్పోరేట్ ఫ్యాషన్ వీక్ విజేతలకు ఫెమినా మిస్ ఛత్తీస్‌ఘడ్ స్పందన పల్లి బహుమతులతు అందజేశారు.

క్యాడర్ బలోపేతానికి సిపిఎం సిద్ధం

మన తెలంగాణ/హైదరాబాద్: కింది స్థాయి నుంచి క్యాడర్‌ను చక్కదిద్దే విషయమై సిపిఎం పార్టీ కసరత్తు చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో బిఎల్‌ఎఫ్ పేరిట చేసిన ప్రయోగం విఫలం కావడంతో రానున్న పంచాయతీ, పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలతో పాటు క్యాడర్ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి పెట్టింది. గత ఎన్నికల్లో క్షేత్రస్థాయిలో సిపిఎం క్యాడర్ దెబ్బతిన్నట్టు పార్టీ గుర్తించింది. దీనికోసం తీసుకోవాల్సిన చర్యలపై ఆలోచిస్తోంది. కిందిస్థాయి నేతలు ప్రలోభాలకు గురయినట్టు పార్టీ గుర్తించింది. దీనికి సంబంధించిన నివేదిక పార్టీ తెప్పించుకుందని, రానున్న ఎన్నికల్లో ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందని పార్టీ గుర్తించినట్టు సమాచారం. పార్టీకి పట్టున్న నియోజకవర్గాల్లో కూడా ఆశించిన మేర ఓట్లు పడకపోవడంపై ముఖ్యంగా ఈ సమావేశంలో చర్చించినట్టు తెలిసింది. దీంతోపాటు పార్టీకి పట్టున్న జిల్లాల్లోని నాయకులు, కార్యకర్తల మధ్య ఉన్న అంతరాలను తుడిచిపెట్టాలని, గ్రామాల్లో రెండు వర్గాలు లేకుండా ఒకటే వర్గంలా క్యాడర్ పనిచేసేలా వారికి దిశానిర్దేశం చేయాలని ఇటీవల జరిగిన ఒక సమావేశంలో నిర్ణయించినట్లు సమాచారం. గతంలో మాదిరిగానే కార్యకర్తలకు పార్టీ తరఫున శిక్షణ ఇవ్వాలని, ఈ శిక్షణా తరగతుల్లో రాష్ట్ర నాయకులు పాల్గొనాలని కూడా వారు నిర్ణయించినట్టు తెలిసింది. బహుజన లెఫ్ట్ పార్టీ (బిఎల్‌ఎఫ్), సిపిఎం పార్టీ కార్యకలాపాలు వేరుగా ఉండాలని, పంచాయతీ ఎన్నికల్లో బిఎల్‌ఎఫ్ తరఫున అభ్యర్థులను పోటీలో నిలపాలన్న విషయమై కూడా ఈ సమావేశంలో చర్చకు వచ్చినట్టు సమాచారం.

ఓటర్ ఆలోచనలు మారాయి...

కాంగ్రెస్ విధానాలూ మారాలి : దామోదర నర్సింహ

మన తెలంగాణ/హైదరాబాద్: ఓటర్ల ఆలోచనలు మారుతున్న నేపథ్యంలో దానికి అనుగుణంగా కాంగ్రెస్ లైన్ ఆఫ్ థింకింగ్ కూడా మారాల్సిన అవసరముందని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ డిప్యూటీ ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ్మా వ్యాఖ్యానించారు. ఆదివారం గాంధీభవన్‌కు వచ్చిన ఆయన కొద్దిసేపు మీడియాతో చిట్‌చాట్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఓటమికి మూడు, నాలుగు ప్రధాన కారణాలు ఉన్నాయని అన్నారు. టిఆర్‌ఎస్ అధికార దుర్వినియోగం, ఈసీ తీరుపై అనేక అనుమానాలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ తీసుకున్న ప్రతి నిర్ణయం అధికార టిఆర్‌ఎస్‌కు లాభించేలా తీసుకున్నారని అన్నారు. డబ్బు, మద్యం ప్రభావం కూడా విపరీతంగా ఉండడం వల్లే కాంగ్రెస్ పార్టీ మెజార్టీ సీట్లను కోల్పోవాల్సి వచ్చిందని దామోదర రాజనర్సింహ్మా అన్నారు. టిఆర్‌ఎస్ వైఫల్యాలను ప్రజల్లోకి సరైన సమయంలో తీసుకవెళ్ళడంతో కూడా తాము విఫలం చెందామని అంగీకరించారు. మల్లన్నసాగర్ తప్పితే ప్రజా సమస్యలపై కాంగ్రెస్ పార్టీ పెద్దగా ఆందోళన కార్యక్రమాలను చేపట్టకపోవడం వల్ల ప్రజలు ఆదరించలేకపోయారన్నారు. ఓటర్ ప్రాధాన్యత మారిపోయిందని, ఎన్నికల ప్రచారం సందర్భంగా ఇరవై రోజుల్లో ఏమి చేశామన్నదే ముఖ్యమవుతోందన్నారు. అభివృద్ధికి, గెలుపుకు, ఓట్లకు సంబంధం లేదన్నారు.

ఒవైసిని కలిసిన వైసిపి ఎమ్మెల్యే



మన తెలంగాణ/హైదారాబాద్: ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గ వైసిపి శాసనసభ్యుడు మేకపాటి గౌతంరెడ్డి ఆదివారం హైదరాబాద్‌లో అక్బరుద్దీన్ ఓవైసీని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఇద్దరూ కలిసి అల్పాహారం తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని తాజా రాజకీయ పరిస్థితులపై ఎమ్మెల్యే గౌతంరెడ్డిని ఒవైసీ అడిగి తెలుసుకున్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలలో ఆంధ్రప్రదేశ్‌లో వైసిపి అధికారంలోకి వస్తుందని ఒవైసీ జోస్యం చెప్పారు. తాము కూడా పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు నిరంతరం శ్రమిస్తున్నామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతం రెడ్డి ఒవైసీకి వివరించారు. రాష్ట్రంలో వైఎస్ జగన్ చేపట్టిన పాదయాత్రకు విశేష స్పందన వస్తోందని, వచ్చే ఎన్నికలలో విజయ దుందుభి మోగించనున్నామని గౌతంరెడ్డి ఒవైసీకి తెలియజేశారు. తమ ఇద్దరి మధ్య భేటీ కేవలం మర్యాదపూర్వకమైనది మాత్రమేనని, ఇందులో రాజకీయపరమైన అంశానికి ఎలాంటి ప్రాధాన్యత లేదని గౌతమ్‌రెడ్డి మీడియాకు వివరించారు.

బిరాబిరాద్రి



- బ్రహ్మోత్సవాలనాటికి గర్భాలయ పనులు పూర్తి?
- జీయర్ స్వామి శుభ ముహుర్తాలకు ఆలయ ప్రారంభం కానుంది
- యాదాద్రి పనులను సందర్శించి సమీక్షించిన సిఎంఓ భూపాల్‌రెడ్డి

మనతెలంగాణ/యాదాద్రి : తెలంగాణ రాష్ట్రంలో మహక్షేత్రంగా రూపొందుతున్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి యాదాద్రి క్షేత్రం ప్రారంభ శుభ ముహుర్తానికి వేళయింది. రాష్ట్ర ఏర్పాటుతో యాదగిరిగుట్ట దేవస్థానాన్ని యాదాద్రి క్షేత్రముగా రూపొందించి ఆధ్యాత్మిక కళతో నిర్మాణం చేపట్టిన ముఖ్యమంత్రి కేసిఆర్ సంకల్పంతో ఆలయ అభివృద్ధి పనులు పూర్తి కానున్నాయి. వైటిడిఎ కమిటీ పర్యావేక్షణలో సాగుతున్న ఆలయ అభివృద్ధి పనులు జరుగబోయే శ్రీవారి బ్రహ్మోత్సవాలకు గర్భాలయాన్ని ప్రారంభించాలన్న సంకల్పం నెరవేరనుంది. పంచనారసింహుని గర్భాలయ పనులు శిల సంపదతో ఆధ్యాత్మికంగా రూపొందుకున్నాయి. ఇప్పటికే 80 శాతం పైగా ఆలయ పనులు పూర్తి కావడంతో మార్చిలో జరుగబోయే బ్రహ్మోత్సవాల వరకు గర్భాలయ పనులు పూర్తి చేసే విధంగా స్తపతులు, నిపుణులు పనులు సాగిస్తున్నారు. ఆలయ పనులపై సిఎం కార్యదర్శి భూపాల్ రెడ్డి ఆదివారం యాదాద్రి క్షేత్రాన్ని సందర్శించి అభివృద్ధి పనులపై నిపుణుల కమిటీలతో, వైటిడిఎ బృందంతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనుకున్న సమయంలోపు పనులు పూర్తి చేసే విధంగా కొనసాగుతన్న అన్న విషయంపై వివరాలు తీసుకొని ఆలయ అభివృద్ధి పనుల్లో ఎమైన ఇబ్బందులు కలుగుతున్నాయా అని తెలుసుకున్నారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల వరకు గర్భాలయ పనులు పూర్తవతాయని స్తపతులు, నిపుణులు తెలిపినప్పటికి ఆలయ పరిసర ప్రాంతాలు పూర్తి స్థాయిలో పనులు పూర్తి కాక పోవచ్చని సమీక్షలో తెలిపినట్లు తెలుస్తుంది. గర్భాలయం మాత్రమే పూర్తి చేసి ఆలయాన్ని ప్రారంభించవచ్చ లేక ఆలయ పనులు పూర్తి చేసి ఆలయాన్ని ప్రారంభించాలన్న విషయాలను ముఖ్యమంత్రికి నివేదిక ఇచ్చి శాస్త్రోత్తంగా శుభ ముహుర్తాన్ని చూసేందుకు శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి తెలుపనున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికి ఆలయానికి సంబంధించి నాలుగు ప్రధాన రాజ గోపురాలతో పాటు గర్భాలయ ముఖ మండపంలో శిల శిల్పాలతో నిర్మాణం పనులు 90 శాతం పూర్తికాగ ఆలయ పరిసర ప్రాంతంలో గల మాడ వీధుల పనులు 80 శాతం పూర్తయినట్లు తెలుపారు. కొండపైన జరుగుతున్న ఆలయ అభివృద్ధి పనులను అణువు అణువు సందర్శించి ఆయన వివరాలు తీసుకొని సూచనలు తెలిపారు. అనుకున్న సమయంలోపు ఆలయాన్ని ప్రారంభించేలా పనులు వేగవంతం కొనసాగుతున్నాయని వైటిడిఎ వైస్ చైర్మెన్ కిషన్‌రావు తెలిపారు. ఆలయ ప్రారంభ ముహుర్తాన్ని జీయర్ స్వాములు నిర్వహిస్తారని ప్రస్తుత అభివృద్ధి పనుల నివేదికను ముఖ్యమంత్రికి తెలియచేయడం జరుగుతుందని కిషన్‌రావు అన్నారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ అనితరామచంద్రన్, వైటిడిఎ, నిపుణుల కమిటీ బృందం, స్తపతులు సుందర్‌రాజన్, వేలు, ఆర్కిటెక్చర్ ఆనంద్‌సాయి, ఆలయ ఈఓ గీత, పలు శాఖల అధికారులు, దేవస్థాన ఉద్యోగ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆలయ ప్రారంభం వేళ

యాదాద్రి క్షేత్రం ప్రారంభోత్సవం గర్భాలయం పూర్తి కాగానే ప్రారంభిస్తార లేక ఆలయ పనులు పూర్తి కాగానే ప్రారంభిస్తారా ? అన్న అంశంపై సమీక్ష సమావేశంలో చర్చించుకున్నట్లు తెలుస్తుంది. అనుకున్న సమయం ప్రకారం శ్రీ వారి బ్రహ్మోత్సవాల వరకు గర్భాలయాన్ని పూర్తి చేసి భక్తులకు స్వామి వారి దర్శనం కల్పించాలని అనుకున్నప్పటికి గర్భాలయంతో పాటు మాడ వీధులు ఇతర ఆలయ పనులు పూర్తి అయ్యాకే ఆలయాన్ని ప్రారంభిస్తే బాగుంటుందా అన్న విషయాలను శాస్త్రోత్తంగా నిర్ణయాలతో ముహుర్తాన్ని నిర్ణయం తీసుకునేటట్లు తెలుస్తుంది. శాస్త్రం ప్రకారం గర్భాలయ పనులు పూర్తి కావడంతో దర్శనాలు కల్పించవచ్చు అని జీయర్ స్వాములు తెలియచేస్తే శ్రీవారి బ్రహోత్సవాలకే లక్ష్మీ నరసింహుని స్వయంభు దర్శనంతో ఆలయ దర్శనాలు ప్రారంభం కానున్నాయ..?లేక ఆలయ పనులు పూర్తి స్థాయి అయిన తరువాతే ఆలయాన్ని ప్రారంభం చేయనున్నారు.

పనుల వేగవంతంపై స్తపతులకు ఆదేశం

ఆలయ నిర్మాణాల్లో భాగంగా శిల సంపద కూడిన పనులను మరింత వేగవంతం చేయాలని స్తపతులకు సిఎంఓ భూపాల్‌రెడ్డి ఆదేశించారు. ఆలయ నిర్మాణ పనుల్లో సందర్శన సమయంలో పనులను పరిశీలించిన ఆయన గర్భాలయ పనులతో పాటు ఆలయ పరిసర ప్రాంతాలను పూర్తి చేసే విధంగా పనులను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు.

ఇకేబానా సంస్థ పుష్పాల ఎగ్జిబిషన్ ప్రారంభం



మనతెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణ సంస్కృతికి దగ్గరగా ఇకేబానా సంస్థ కార్యకలాపాలు ఉంటాయని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం తెలిపారు. ఇకేబానా ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఆదివారం ఐటిసి కాకతీయ హోటల్‌లో రూట్స్ పేరిట అరుదైన మొక్కల కళాకృతులతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను తెలంగాణ, ఎపి జనరల్ కమాండింగ్ ఆఫీసర్ మేజర్ జనరల్ శ్రీనివాసరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బుర్రా వెంకటేశం మాట్లాడుతూ, అరుదైన పుష్పాలతో కళాకృతులను రూపొందించి ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసిన ఇకేబాణ సంస్థ హైదరాబాద్ చాప్టర్‌ను అభినందించారు. ప్రపంచవ్యాప్తంగా ఇకేబాణ సంస్థకు ఎన్నో ఛాప్టర్లు ఉన్నాయని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న బతుకమ్మ సంబరాల్లో ఇకేబాణ సంస్థ సభ్యులు పాల్గొన్నారని వెల్లడించారు. అలాగే మన బతుకమ్మను కూడా పూలతో అలంకరించి వేడుకలు నిర్వహించడం మన తెలంగాణ సంస్కృతికి దగ్గరి సంబంధం ఉందన్నారు. బతుకమ్మ పండుగను అంతర్జాతీయ స్థాయిలో తీసుకెళ్లడానికి ఇకేబాణ ఇంటర్నేషనల్ సంస్థ ప్రయత్నాలను ఆయన అభినందించారు. ఈ ఎగ్జిబిషన్ ఏర్పాటు వల్ల విదేశీ పర్యాటకులను ఆకర్షితులయ్యే అవకాశం ఉందన్నారు.మేజర్ జనరల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఇలాంటి ఫ్లవర్ ఎగ్జిబిషన్‌లను ఏర్పాటు చేయడం ద్వారా రాష్ట్రానికి పర్యాటకులను ఆకర్షించేందుకు అవకాశం ఉంటుందన్నారు.

ప్రగతి పథంలో జక్లేర్-కృష్ణ రైలుమార్గం

- శరవేగంగా సాగుతున్న అభివృద్ధి పనులు
- 2019–20వ ఆర్థిక సంవత్సరంలో పూర్తికి సన్నాహాలు
- సేకరించిన భూమిని రైల్వేకు అప్పగించిన ప్రభుత్వం





మన తెలంగాణ / హైదరాబాద్ : మహబూబ్‌నగర్ నుంచి మునీరాబాద్ కొత్త రైల్వే మార్గం ప్రగతిపథంలో ముందుకు సాగుతోంది. అభివృద్ధికి సోపానంగా మారనున్న ఈ లైనులో అభివృద్ధి పనులు మరింత వేగంగా సాగుతున్నాయని దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. ఇప్పటికే 29 కిలోమీటర్ల మేర రైలు మార్గం పూర్తికావడంతో 2017 మార్చి 23 న ఈ మార్గాన్ని రైల్వేశాఖ మంత్రి జాతికి అంకితం చేశారు. అలాగే మహబూబ్‌నగర్ జిల్లాలోని జక్లేర్ నుంచి కృష్ణ వరకు రైలు మార్గం పనులు కూడా శరవేగంగా సాగుతున్నాయని రైల్వే యంత్రాగం తెలిపింది. ఈ మార్గం కోసం 2018 –19వ ఆర్థిక సంవత్సరంలో రూ.175 కోట్లను కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించింది. దీంతో ఈ మార్గం అభివృద్ధి పనులు పురోగతిలో ఉన్నాయి. ఈ రైలు మార్గం నిర్మాణం కోసం 866 ఎకరాల భూమిని కేటాయించాల్సి ఉండగా ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం 734 ఎకరాల భూమిని సేకరించి రైల్వేకు అప్పగించింది. ఈ ప్రాజెక్టును ప్రధాన మంత్రి పర్యవేక్షణ కింద చేర్చడంతో పిఎంఓ కార్యాలయం పనుల పర్యవేక్షణను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నదని అధికారులు తెలిపారు. జక్లేర్ నుంచి కృష్ణ వరకు రైలు మార్గం పనులను రానున్న ఆర్థిక సంవత్సరంలో పూర్తి చేసేందుకు అధికార యంత్రాగం కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది. మహబూబ్‌నగర్ నుంచి మునీరాబాద్ నూతన రైలు మార్గాన్ని కేంద్ర ప్రభుత్వం 1997 –98వ సంవత్సరంలో మంజూరు చేసింది. నూతనంగా నిర్మితమయ్యే ఈ రైలు మార్గం 247 కిలోమీటర్ల నిడివితో రూ.1723 కోట్ల అంచనా వ్యయంతో ఈ మార్గం నిర్మాణానికి చర్యలు చేపట్టారు. 2014 –15 ఆర్థిక సంవత్సరం నుంచి 2018 నవంబర్ వరకు రూ.499 కోట్లను ఖర్చు చేసినట్లు చెప్పారు. 2018 –19వ ఆర్థిక సంవత్సరంలో మరో రూ.175 కోట్లను కేటాయించారు.

ప్రాజెక్టు వల్ల కలిగే ప్రయోజనాలివి

ఈ మార్గం పూర్తిస్థాయిలో నిర్మితమయితే మహబూబ్‌నగర్‌తో పాటు కర్ణాటకలోని రాయచూర్‌తో పాటు ఇతర వెనుకబడిన ప్రాంతాల ప్రజలు సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ఉపయోగపడుతుందని రైల్వే అధికారులు భావిస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాల్లో పెద్ద సంఖ్యలో (88.87) శాతంగా ఉన్న గ్రామీణ ప్రాంతాల ప్రజలకు రైలు సేవలు, సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అంతేకాక ఈ ప్రాంత ప్రజలకు రైల్వేతో అనుసంధానం ఏర్పడుతుందన్నారు. ఈ మార్గంతో హైదరాబాద్ నుంచి హుబ్లీ, గోవాలకు మధ్య దూరం ప్రస్తుత మార్గంతో పోలిస్తే సుమారు 102 కిలోమీటర్లు తగ్గుతుంది.

ప్రాజెక్టు ముఖ్యాంశాలివి

- 2018 –19వ ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ కేటాయింపు రూ.157 కోట్లు
- ఇందులో మూడు పెద్ద వంతెనలు, 82 చిన్న వంతెనలు, 5 రోడ్డు ఓవర్ బ్రిడ్జిలు, 27 అండర్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించారు.
- మహబూబ్‌నగర్ టు దేవరకద్ర టు జక్లేర్ మధ్య కొత్త రైళ్లను ప్రవేశపెట్టడం వల్ల దేవరకద్ర టు జక్లేర్ మార్గంలో రైలు సౌకర్యం లేని ప్రాంతాలు అభివృద్ధి పథంలో నడిచే అవకాశముంది.



బంగారు తెలంగాణ సాధనే లక్ష్యం

టిడిపి, కాంగ్రెస్ నుంచి టిఆర్‌ఎస్‌లో చేరికలు

టిఆర్‌ఎస్ కండువా వేసి ఆహ్వానించిన లక్ష్మారెడ్డి

మన తెలంగాణ/హైదరాబాద్ : బంగారుతెలంగాణ లక్ష్యంగా టిఆర్‌ఎస్ ప్రభుత్వం నిరంతర కృషిచేస్తూ దేశానికి ఆదర్శంగా నిలిచిందని తాజా మాజీ మంత్రి, ఎంఎల్‌ఏ లక్ష్మారెడ్డి ఉద్ఘాటించారు. తెలంగాణ రాష్ట్ర సాధనతోనే బాధ్యతలన్నీ పూర్తి కాలేదని, బంగారు తెలంగాణ సాధించినప్పుడే ప్రజల కలలు నెరవేరుతాయన్నారు. ముఖ్యమంత్రి కె.చంద్ర శేఖర్ రావు మానవీయ కోణంలో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అధిక ప్రాధాన్యత ఇచ్చారని, రాష్ట్రం బంగారు తెలంగాణ దిశగా అడుగులు వేస్తోందని అన్నారు. టిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల మండలానికి చెందిన నసూర్లబాద్, నసూర్లబాద్ తండాలోని కాంగ్రెస్,టిడిపికి చెందిన కార్యకర్తలు లక్ష్మారెడ్డి సమక్షంలో టిఆర్‌ఎస్‌లో చేరారు. సుమారు రెండు వందల మంది వివిధ పార్టీల కార్యకర్తలను టిఆర్ఎస్ కండువా వేసి లక్ష్మారెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం లక్ష్మారెడ్డిమాట్లాతూ తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు దేశవ్యాప్తంగా ఆకట్టుకుంటున్నాయని చెప్పారు. మిషన్ భగీరథ ద్వారా నీళ్ళు తాగిన నసూర్లాబాద్ ప్రజలకు ఈ విషయం బాగా తెలుసని చెప్పారు. గత ఉమ్మడి పాలనలో సాగునీటి రంగంలో వివక్షతకు గురైన మహబూబ్ నగర్‌కు తెలంగాణ ప్రభుత్వం పలు సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి నీటిని అందించేందుకు చేస్తున్న కృషి ఫలితాలు ఇస్తోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తామని స్పష్టం చేశారు. ప్రజలందరికి కనీస అవసరాలు తీర్చి, విద్య, ఉద్యోగం, ఇళ్లు, సాగునీరు, సంక్షేమం అందించేందుకు మరింత కృషి చేయనున్నట్లు ఆయన చెప్పారు. ఏకగ్రీవంగా సర్పంచుల ఎన్నిక జరిగితే రూ.10 లక్షల బహుమతితోపాటు ప్రజాప్రతినిధులు తమ ఎంఎల్‌ఏ ఫండ్ నుంచి నిధులు ఇచ్చే అవకాశం ఉందన్నారు. నసూర్లబాద్ సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగితే ఎంఎల్‌ఏ నిధుల నుంచి అభివృద్ధి కోసం రూ.10 లక్షలు ఇవ్వడంతో పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చెపట్టనున్నట్లు ఆయన ప్రకటించారు. అభివృద్ధికి సర్పంచుల కృషి ఎంతో ఉంటుందని, ఏకగ్రీవంగా ఎన్నుకుంటే ప్రోత్సాహకాలు లభిస్తాయని చెప్పారు.

ఫాంహౌజ్‌లో విందు రాజకీయం

- హాజరైన పలువురు కాంగ్రెస్ నేతలు
- పార్లమెంట్ ఎన్నికల్లో ఒంటరి పోరే మంచిదంటున్న నేతలు



మన తెలంగాణ/హైదరాబాద్ : నగర శివారులోని గండిపేట్‌లో కాంగ్రెస్ పార్టీ ఫైర్‌బ్రాండ్ డికె అరుణ ఫాంహౌజ్‌లో ఆదివారం విందు భోజనాలు జరిగాయి. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, ఎంపిలు, ఎంఎల్‌ఏలు, మాజీ మంత్రులు, పిసిసి నాయకులు ఈ విందుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమికి దారితీసిన పరిస్థితులపై నాయకులు మరోసారి చర్చించుకున్నారు. అలాగే త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, పార్టీ పటిష్టత అంశంపై కూడా చర్చించినట్లుగా తెలుస్తోంది. కాగా అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి కంచుకోటలుగా నిలిచిన నియోజకవర్గాల్లోనూ టిఆర్‌ఎస్ ఎలా గెలిచిందన్న అంశంపై లోతుగా చర్చించినట్లు తెలిసింది. సిఎల్‌పి మాజీ నాయకుడు కె. జానారెడ్డి, ప్రచార కమిటీ చైర్మన్ భట్టి విక్రమార్క, వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డితో పాటు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, హరివర్ధన్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, కూన శ్రీశైలంగౌడ్, ప్రతాప్‌రెడ్డి, మధుయాష్కి తదితరులు హాజరయ్యారు. టిఆర్‌ఎస్ ముందస్తు వ్యూహం ఎలా ఫలించిందన్న అంశంపై ఆరాతీసే ప్రయత్నం చేశారు. ఈవిఎంల పనితీరు, రాష్ట్ర ఎన్నికల సంఘం తీసుకున్న పలు నిర్ణయాలు, టిఆర్‌ఎస్ ధనబలం కారణంగా ఏకపక్షంగా ఎన్నికల జరిగాయని కొంత మంది నేతలు వ్యాఖ్యానించినట్లుగా సమాచారం. పార్లమెంట్ ఎన్నికల్లో పొత్తులతో లాభం ఉండదని డికె అరుణ వ్యాఖ్యానించినట్లు సమాచారం. ఇదే విషయాన్ని పార్టీ హైకమాండ్‌కు వివరిస్తే ఎలా ఉంటుందన్న అంశంపై కూడా చర్చించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కంచుకోట పాలమూరు జిల్లాలో ఓటమిని చూస్తుంటే ఏదో అనుమానం కలుగుతోందన్నారు. పార్టీ బలోపేతానికి అవసరమైన చర్యలను అధిష్టానం తక్షణమే తీసుకోవాలని వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది.



సిరీస్ దక్కినట్టే!

ఆస్ట్రేలియా ఫాలోఆన్ | పట్టు బిగించిన భారత్ | ఇన్నింగ్స్ విజయంపై కన్ను | కంగారూలతో చివరి టెస్టు

సిడ్నీ: ఆస్ట్రేలియా గడ్డపై తొలి టెస్టు సిరీస్ గెలిచేందుకు టీమిండియా మార్గం సుగమం చేసుకుంది. చివరి టెస్టులో ఆస్ట్రేలియాను ఫాలోఆన్ ఆడిస్తోంది. చివరి రోజు ఆస్ట్రేలియాను ఆలౌట్ చేస్తే భారత్‌కు విజయం దక్కుతోంది. ఈ మ్యాచ్‌లో ఇన్నింగ్స్ ఓటమి తప్పించుకోవాలంటే ఆస్ట్రేలియా మరో 316 పరుగులు చేయాలి. పిచ్ బౌలర్లకు అనుకూలంగా మారిన నేపథ్యంలో ఆస్ట్రేలియాకు చివరి రోజు కష్టాలు తప్పక పోవచ్చు. ఒకవేళ వాతావరణం అడ్డంకి కలిగించక పోతే మ్యాచ్‌లో ఫలితం రావడం ఖాయంగా కనిపిస్తోంది. అదే జరిగితే ఆస్ట్రేలియా గడ్డపై భారత్ తొలిసారి చారిత్రక విజయాన్ని సొంతం చేసుకుంటుంది. ఒకవేళ మ్యాచ్ డ్రాగా ముగిసిన భారత్‌కే సిరీస్ దక్కుతోంది. ఇప్పటికే టీమిండియా సిరీస్‌లో 2–1 ఆధిక్యంలో ఉన్న విషయం తెలిసిందే.

ఆలస్యంగా

మరోవైపు ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 300 పరుగులకు ఆలౌటైంది. దీంతో ఆసీస్‌కు ఫాలోఆన్ తప్పలేదు. కాగా, వరుసగా రెండో రోజు కూడా మ్యాచ్‌కు వాతావరణం అడ్డంకిగా మారింది. ఆదివారం నాలుగో రోజు కూడా పూర్తి సేపు ఆట కొనసాగలేదు. కొన్ని ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. ప్రతికూల వాతావరణం నేపథ్యంలో ఆటకు పలుసార్లు అంతరాయం కలిగింది. మూడో రోజు కూడా వెలుతురు లేని కారణంగా ఆటను ముందుగానే నిలిపి వేయాల్సి వచ్చింది. ఇక, ఆదివారం నాలుగో రోజు ఆట ఆలస్యంగా ప్రారంభమైంది. వర్షం, వెలుతురు లేమితో ఆట లంచ్ తర్వాతే ఆట ప్రారంభమైంది. 236/6 ఓవర్‌నైట్ స్కోరుతో బ్యాటింగ్ చేపట్టిన ఆస్ట్రేలియాను భారత బౌలర్లు తక్కువ స్కోరుకే కట్టడి చేశారు. పాట్ కమిన్స్‌ను మహ్మద్ షమి అద్భుత బంతితో క్లీన్‌బౌల్డ్ చేశాడు. కమిన్స్ తన కిందటి స్కోరు వద్దే ఔటయ్యాడు. కొద్ది సేపటికే హాండ్స్‌కొంబ్ కూడా వెనుదిరిగాడు. 111 బంతుల్లో ఐదు ఫోర్లతో 37 పరుగులు చేసిన హాండ్స్‌కొంబ్‌ను బుమ్రా క్లీన్ బౌల్డ్ చేశాడు. ఆ వెంటనే నాథన్ లియాన్ (0) కూడా పెవిలియన్ చేరాడు. కుల్దీప్‌కు ఈ వికెట్ దక్కింది.

స్టార్క్ పోరాటం

దీంతో ఆస్ట్రేలియా 258 పరుగుల వద్దే తొమ్మిదో వికెట్‌ను కోల్పోయింది. దీంతో ఆసీస్ ఇన్నింగ్స్ ముగియడం లాంఛనమేనని అందరూ భావించారు. అయితే ఈ దశలో మిచెల్ స్టార్క్, హాజిల్‌వుడ్‌లు అద్భుత పోరాట పటిమతో భారత బౌలర్ల సహనాన్ని పరీక్షించారు. ఈ జోడీని ఔట్ చేసేందుకు భారత బౌలర్లు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. వీరిద్దరూ దాదాపు 14 ఓవర్లపాటు వికెట్ పడకుండా జాగ్రత్త పడ్డారు. వీరిని త్వరగా ఔట్ చేయాలని భారత బౌలర్లు చేసిన ప్రయత్నాలు చాలా సేపటి వరకు ఫలించలేదు. ఎట్టకేలకు కుల్దీప్ ఈ జోడీని విడగొట్టాడు. 45 బంతుల్లో రెండు ఫోర్లతో 21 పరుగులు చేసిన హాజిల్‌వుడ్‌ను కుల్దీప్ ఔట్ చేశాడు. దీంతో 42 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. మరోవైపు స్టార్క్ 55 బంతుల్లో మూడు ఫోర్లతో 29 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. భారత బౌలర్లలో కుల్దీప్ ఐదు, షమి, జడేజా రెండేసి వికెట్లు పడగొట్టారు. తర్వాత ఫాలోఆన్ ఆడుతూ రెండో ఇన్నింగ్స్ చేపట్టిన ఆస్ట్రేలియా వికెట్ నష్టపోకుండా ఆరు పరుగులు చేసింది.



30 ఏళ్ల తర్వాత ఆస్ట్రేలియా ఫాలోఆన్

సొంత గడ్డపై జరిగిన ఓ టెస్టు మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 30 ఏళ్ల తర్వాత తొలిసారిగా ఫాలోఆన్‌కు గురైంది. భారత్‌తో జరుగుతున్న చివరి టెస్టులో ఆస్ట్రేలియా ఫాలోఆన్‌కు గురైన విషయం తెలిసిందే. ఆస్ట్రేలియా సొంత గడ్డపై చివరి సారిగా 1988లో ఫాలోఆన్‌కు గురైంది. అప్పట్లో ఇంగ్లండ్‌తో సిడ్నీ వేదికగా జరిగిన ఓ టెస్టు మ్యాచ్‌లో ఆస్ట్రేలియాకు ఇలాంటి పరిస్థితి ఎదురైంది. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత ఇదే సిడ్నీ మైదానంలో మరోసారి ఫాలోఆన్ ఆడాల్సిన పరిస్థితి నెలకొంది. ఆస్ట్రేలియాతో జరుగుతున్న నాలుగు మ్యాచ్‌లో టెస్టు సిరీస్‌లో భారత్ పూర్తి ఆధిపత్యం చెలాయిస్తోంది. ఇప్పటికే సిరీస్‌లో 2–1 ఆధిక్యంలో ఉన్న భారత్ సిరీస్ గెలుచుకోవడం దాదాపు ఖాయం చేసుకుంది. చివరి టెస్టులో భారత్ గెలుపు అవకాశాలు అధికంగా ఉన్నాయి. ఒకవేళ వాతావరణం అనుకూలించక మ్యాచ్ డ్రాగా ముగిసిన కంగారూలు సిరీస్‌ను కోల్పోక తప్పదు. ఇక, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆస్ట్రేలియా ఈ మ్యాచ్‌లో గెలిచే అవకాశాలు కనిపించడం లేదు. ఎందుకంటే భారత్ తొలి ఇన్నింగ్స్ స్కోరు అందుకోవాలంటే కంగారూలు మరో 316 పరుగులు చేయాలి. ఒక్క రోజు ఆట మాత్రమే మిగిలివున్న నేపథ్యంలో ఆస్ట్రేలియాకు గెలిచే అవకాశం ఏమాత్రం లేదనే చెప్పాలి.





స్కోరు బోర్డు:

భారత్ మొదటి ఇన్నింగ్స్: మయాంక్ అగర్వాల్ (సి) స్టార్క్ (బి) నాథన్ లియాన్ 77, లోకేశ్ రాహుల్ (సి) షాన్ మార్ష్ (బి) హాజిల్‌వుడ్ 9, చటేశ్వర్ పుజారా 130 (సి) అండ్ (బి) లియాన్ 193, విరాట్ కోహ్లి (సి) పైన్ (బి) హాజిల్‌వుడ్ 23, అజింక్య రహానె (సి) పైన్ (బి) స్టార్క్ 18, హనుమ విహారి (సి) మర్నూస్ (బి) లియాన్ 42, రిషబ్ పంత్ నాటౌట్ 159, రవీంద్ర జడేజా (బి) లియాన్ 81, ఎక్స్‌ట్రాలు 20, మొత్తం 167.2 ఓవర్లలో 622/7 డిక్లేర్డ్.

బౌలింగ్: మిఛెల్ స్టార్క్ 26–0–123–1, జోష్ హాజిల్‌వుడ్ 35–11–105–2, పాట్ కమిన్స్ 28–5–101–0, నాథన్ లియాన్ 57.2–8–178–4, మార్నూస్ లబుస్చాంగే 16–0–76–0, ట్రావిస్ హెడ్ 4–0–20–0, ఉస్మాన్ ఖ్వాజా 14–0–4–0.

ఆస్ట్రేలియా మొదటి ఇన్నింగ్స్: మార్కస్ హారిస్ (బి) రవీంద్ర జడేజా 79, ఉస్మాన్ ఖ్వాజా (సి) పుజారా (బి) కుల్దీప్ యాదవ్ 27, మార్నూస్ లబుస్చాంగే (సి) రహానె) షమి 38, షాన్ మార్ష్ (సి) రహానె (బి) రవీంద్ర జడేజా 8, ట్రావిస్ హెడ్ (సి) అండ్ (బి) కుల్దీప్ యాదవ్ 20, పీటర్ హాండ్స్‌కొంబ్ (బి) బుమ్రా 37, టిమ్ పైన్ (బి) కుల్దీప్ యాదవ్ 5, పాట్ కమిన్స్ (బి) షమి 25, మిఛెల్ స్టార్క్ నాటౌట్ 29, నాథన్ లియాన్ ఎల్బీ–బి కుల్దీప్ యాద్ 0, హాజిల్‌వుడ్ ఎల్బీ–బి కుల్దీప్ యాదవ్ 21, ఎక్స్‌ట్రాలు 11, మొత్తం 104.5 ఓవర్లలో 300 ఆలౌట్.

బౌలింగ్: మహ్మద్ షమి 19–2–58–2, జస్‌ప్రీత్ బుమ్రా 21–5–62–1, రవీంద్ర జడేజా 33–11–73–2, కుల్దీప్ యాదవ్ 31.5–6–99–5, హనుమ విహారి 1–0–2–0.

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: ఉస్మాన్ ఖ్వాజా (బ్యాటింగ్) 4, మార్కస్ హారిస్ (బ్యాటింగ్) 2, ఎక్స్‌ట్రాలు 0, మొత్తం 4 ఓవర్లలో 6/0.

బౌలింగ్: మహ్మద్ షమి 2–1–4–0, జస్‌ప్రీత్ బుమ్రా 2–1–2–0.



రోహిత్ ముద్దుల కూతురు 'సమైరా'

ముంబయి: టీమిండియా స్టార్ క్రికెటర్ రోహిత్ శర్మ ఇటీవలే తండ్రైన విషయం తెలిసిందే. ఇటీవల రోహిత్ భార్య రితిక ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. దీంతో రోహిత్ నాలుగో టెస్టులో పాల్గొనకుండా భారత్‌కు వచ్చేశాడు. కాగా, తన ముద్దుల కూతురుకు సమైరా అని నామకరణం చేశాడు. ఈ విషయాన్ని రోహిత్ ట్విటర్ వేదికగా అభిమానులతో పంచుకున్నాడు. అంతేగాక తన కూతురు సమైరా, భార్యత రితికతో తాను కలిసి దిగిన ఓ ఫొటోను కూడా షేర్ చేశాడు. కాగా, రోహిత్ కూడా తన కూతురు ఫొటోకు సంబంధించి టెన్నిస్ మీర్జా సానియా మీర్జాను అనుసరించాడు. ఇంత వరకు రోహిత్ తన కూతురు ముఖాన్ని ప్రపంచానికి పరిచయం చేయలేదు. సానియా కూడా చాలా రోజుల వరకు తన కొడుకు ఇజాన్ ముఖాన్ని అభిమానులకు చూపించని విషయం తెలిసిందే. రోహిత్ కూడా ఇదే పద్ధతిని అనుసరించాడు.

భారత్ సంచలనం..



అబుదాబి: ఎఎఫ్‌సి ఏషియాన్ కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో భాగంగా ఆదివారం థాయిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ 4–1 గోల్స్ తేడాతో చారిత్రక విజయాన్ని అందుకుంది. స్టార్ ఆటగాడు సునీల్ ఛెత్రి మరోసారి అద్భుత ప్రదర్శనతో జట్టును గెలిపించాడు. చిరస్మరణీయ ప్రదర్శన కనబరిచిన ఛెత్రి రెండు గోల్స్ చేశాడు. ఈ క్రమంలో తన గోల్స్ సంఖ్యను 67కు పెంచుకున్నాడు. ప్రపంచ ఫుట్‌బాల్‌లో అత్యధిక గోల్స్ సాధించిన ఆటగాళ్లలో ఛెత్రి రెండో స్థానంలో నిలిచాడు. కాగా, ఈ విజయంతో భారత్ గ్రూప్‌లో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఏమాత్రం అంచనాలు లేకుండా బరిలోకి దిగిన భారత్ ఘన విజయంతో ప్రకంపనలు సృష్టించింది. భారత్ జోరు ముందు థాయిలాండ్ ఎదురు నిలువలేక పోయింది.

సౌతాఫ్రికాకు సిరీస్

కేప్‌టౌన్: పాకిస్థాన్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌ను దక్షిణాఫ్రికా మరో మ్యాచ్ మిగిలివుండగానే కైవసం చేసుకుంది. రెండో టెస్టులో సౌతాఫ్రికా 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2–0తో సొంతం చేసుకుంది. 41 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని సౌతాఫ్రికా ఒక వికెట్ మాత్రమే కోల్పోయి ఛేదించింది. ఆదివారం నాలుగో రోజు బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికా 9.5 ఓవర్లలోనే ఒక వికెట్ కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ఓపెనర్ డీన్ ఎల్గర్ 4 ఫోర్లతో 24 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. దీంతో దక్షిణాఫ్రికా ఘన విజయం అందుకుంది. తొలి టెస్టులో సౌతాఫ్రికా ఆరు వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. కాగా, ఈ టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో అద్భుత సెంచరీ సౌతాఫ్రికా కెప్టెన్ డుప్లెసిస్‌కు మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు లభించింది. పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 177 పరుగులకే కుప్పకూలింది. ఒలివర్ నాలుగు, స్టెయిన్ మూడు, రబడా రెండు వికెట్లు తీశారు. రెండో ఇన్నింగ్స్‌లో పాకిస్థాన్ 294 పరుగులకు ఆలౌటైంది. అసద్ షఫిక్ (88), షాన్ మసూద్ (61), బాబర్ ఆజమ్ (72) అర్ధ సెంచరీలు సాధించగా, మిగతావారు విఫలమయ్యారు. సఫారీ బౌలర్లలో స్టెయిన్, రబడా నాలుగేసి వికెట్లు పడగొట్టారు. సౌతాఫ్రికా మొదటి ఇన్నింగ్స్‌లో 431 పరుగులు చేసింది. డుప్లెసిస్ (103), ఓపెనర్ మార్క్రామ్ (78), బవుమా (75), వికెట్ కీపర్ డికాక్ (59) జట్టుకు అండగా నిలిచారు. ఇరు జట్ల మధ్య చివరి టెస్టు శుక్రవారం నుంచి జోహెన్నస్‌బర్గ్‌లో జరుగుతుంది.

కోహ్లి సేనపై ప్రశంసల వర్షం

ముంబయి: ఆస్ట్రేలియాతో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో అసాధారణ ఆటను కనబరుస్తున్న టీమిండియాపై ప్రశంసల వర్షం కురుస్తోంది. సుదీర్ఘ భారత టెస్టు క్రికెట్ ప్రస్థానంలో భారత్ తొలిసారి ఆస్ట్రేలియా గడ్డపై సిరీస్ గెలవనుంది. ఇప్పటికే సిరీస్‌లో 2–1 ఆధిక్యంలో ఉన్న కోహ్లి సేన చివరి టెస్టులో తిరుగులేని స్థితిలో నిలిచింది. మరోవైపు ఫాలోఆన్ ఉచ్చులో చిక్కుకున్న ఆస్ట్రేలియా ఓటమి కోరల్లో చిక్కుకుంది. ఈ మ్యాచ్‌లో డ్రాతో గట్టెక్కినా ఆస్ట్రేలియా సిరీస్‌ను చేజార్చుకోక తప్పదు. ఇక, కంగారూలు గెలిచే పరిస్థితులు ఏమాత్రం కనిపించడం లేదు. ఏదైనా అద్భుతం జరిగినా కూడా ఆసీస్ గెలవదు అంటే అతిశయోక్తి లేదు. అంతలా భారత్ ప్రత్యర్థి జట్టును ఆత్మరక్షణలోకి నెట్టేసింది. ఇదిలావుండగా ఆసీస్ గడ్డపై అసాధారణ ఆటను కనబరుస్తున్న టీమిండియాపై మాజీ క్రికెటర్లు దిలిప్ వెంగ్‌సర్కార్, ప్రవీణ్ ఆమ్రెలు ప్రశంసల వర్షం కురిపించారు. ఇప్పటి వరకు ఏ జట్టుకు సాధ్యం కానీ విజయాన్ని కోహ్లి సేన సొంతం చేసుకోనుండడం దేశానికి గర్వకారణమన్నారు. ప్రస్తుతం ప్రపంచ క్రికెట్‌లో కోహ్లి సేనను మించిన జట్టు మరొకటి లేదని ఈ విజయంతో స్పష్టమవుతోందని వారు పేర్కొన్నారు. ఆస్ట్రేలియా గడ్డపై తొలిసారి టెస్టు సిరీస్ గెలిచేందుకుకు అడుగు దూరంలో నిలిచిన భారత్‌కు అభినందనలు అంటూ వారు తమ సందేశంలో పేర్కొన్నారు.

“మేఘాలయలోని ఈస్ట్ జయంతియా జిల్లాలో అక్రమ మైనింగ్, వరదల్లో చిక్కుకు పోయిన 15 మంది మైనర్ల కోసం గత 24 రోజులుగా కొనసాగుతున్న సహాయక చర్యలకు అంతరాయం కలిగింది. నీటిని ఎత్తిపోస్తున్న రెండు హై పవర్ పంపులు సాంకేతిక ఇబ్బందులతో పని చేయడం లేదు. దీనితో సహాయక చర్యలు నిలిచిపోయినట్లు ఆదివారం సహాయక చర్యల అధికార ప్రతినిధి ఆర్ సుసుగ్ని తెలిపారు.”

సింగిల్ జడ్జి తీర్పుపై హైకోర్టులో సవాల్

నేషనల్ హెరాల్డ్ కేసు

న్యూఢిల్లీ: దేశ రాజధానిలోని ఐటిఒ ప్రాంగణాన్ని ఖాళీ చేయాలనే సింగిల్ జడ్జి తీర్పుపై నేషనల్ హెరాల్డ్ ప్రచురణ సంస్థ ఎజెఎల్ ఢిల్లీ హైకోర్టులో అప్పీల్ చేసింది. డిసెంబర్ 21న సింగిల్ జడ్జి తీర్పును నిలుపుదల చేయాలని అభ్యర్థించింది. శనివారం సాయంత్రం కోర్టులో అప్పీల్ చేశామని, జనవరి 9న విచారణకు వచ్చే అవకాశం ఉందని ఎజెఎల్ న్యాయవాది సునీల్ ఫెర్నాండెజ్ తెలిపారు. 56 ఏళ్ల లీజు గడువు ముగిసిందని, పబ్లిషింగ్, ప్రింటింగ్ పనులు జరగకపోవడంతో ఆ ప్రాంగణాన్ని ఖాళీ చేయాలని ఎజెఎల్‌కు కేంద్రం నోటీసులు జారీ చేసింది. దీనిని వ్యతిరేకిస్తూ ఆ సంస్థ హైకోర్టులో వేసిన పిటిషన్‌ను సింగిల్ జడ్జి కొట్టేశారు. రెండు వారాల్లో ఐటిఒ ప్రాంగణాన్ని ఖాళీ చేయాలని ఆదేశించారు.

ఫిలిప్పీన్స్ తుఫాన్ మృతుల సంఖ్య 126

మనీలా : ఫిలిప్పీన్స్‌లో తుపాన్ , కొండచరియలు విరిగిపడ్డ ఘటనలతో మృతుల సంఖ్య 126కు చేరింది. క్రిస్మస్ తరువాత ఇక్కడి మధ్య, తూర్పు దీవులను పెను తుపాన్ తీవ్రస్థాయిలో దెబ్బతీసింది. కుండపోత వర్షాలతో కొండచరియలు విరిగిపడిపోవడంతో పరిస్థితి విషమించింది. పర్వత ప్రాంతం అయిన బైకాల్‌లో ఇప్పటికే వంద మంది తుపాన్‌కు బలి అయ్యారు. ఈ ప్రాంతానికి తుపాన్‌లు తరచూ వస్తూపోతుంటాయి. అయితే క్రిస్మస్ వేడుకల హడావిడిలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ఈసారి భారీ స్థాయిలో ఆస్తి ప్రాణనష్టం జరిగిందని వెల్లడైంది.

వరల్డ్ రికార్డ్‌కోసం 5 వేల కిలోల కిచిడీ

‘భీమ్ మహాసంగం’ కోసం ఒకే పాత్రలో మహా వంటకం



న్యూఢిల్లీ: వెనకబడిన తరగతులవారి మహాసభ ‘భీమ్ మహాసంగం’ కోసం 5,000 కిలోల సమ్రస్త కిచిడీని వండేందుకు ఆదివారం ఇక్కడి రాంలీలా మైదాన్‌లో ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. భారీ సంఖ్యలో బిసిలు హాజరయ్యే భీమ్ మహాసంగంను ఢిల్లీ బిజెపి నిర్వహిస్తోంది. ఈ మహా కిచిడీని 400 కిలోల బియ్యం, 100 కిలోల కాయధాన్యాలు, 350 కిలోల కూరగాయలు, 100 కిలోల దేశీయంగా తయారు చేసిన నెయ్యి, 100 లీటర్ల నూనె, 2,500 లీటర్ల నీళ్లు, 250 కిలోల సుగంధ ద్రవ్యాలతో తయారు చేస్తున్నామని వంటవారిలో ఒకరు తెలిపారు. ప్రపంచ రికార్డు నెలకొల్పడంకోసం తయారుచేస్తున్న ఈ కిచిడీకోసం దేశ రాజధానిలోని మూడు లక్షల దళిత కుటుంబాల నుంచి బియ్యం, కాయధాన్యాలను సేకరించారు. అయిదు వేల కిలోల సమ్రస్త కిచిడీని వండేందుకు ఒకే వంట పాత్రను వినియోగించడం విశేషం. ‘ఒకే పాత్రలో మూడు వేల కిలోల కిచిడీని తయారు చేసి అదివరకు నాగపూర్‌కు చెందిన విష్ణు మనోహర్ రికార్డు నెలకొల్పారు. ఇప్పుడు అదే వ్యక్తి ఈ మహాసమావేశంలో ఒకే పాత్రలో అయిదువేల కిలోల కిచిడీని వండి కొత్త రికార్డు నెలకొల్పుతారు’ అని భారతీయ జనతాపార్టీ ఢిల్లీ శాఖాధ్యక్షుడు మనోజ్ తివారీ చెప్పారు.

ఆప్ సభ్యత్వానికి సుఖ్‌పాల్‌సింగ్ రాజీనామా



చండీగఢ్: ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) తిరుగుబాటు ఎంఎల్‌ఎ సుఖ్‌పాల్ సింగ్ ఖైరా ఆదివారం పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. అన్నా హజారే ఉద్యమం తర్వాత ఆవిర్భవించిన ఆమ్ ఆద్మీ పార్టీ తన సిద్ధాంతాలు, ఆశయాలు వదిలిపెట్టి పూర్తిగా పక్కదారి పట్టిందని పంజాబ్‌కు చెందిన ఖైరా ఆరోపించారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే ఆరోపణపై గత ఏడాది నవంబర్‌లో పార్టీ నుంచి సస్పెండ్ అయిన ఖైరా తన రాజీనామా లేఖను ఆప్ నేషనల్ కన్వీనర్ అర్వింద్ కేజ్రీవాల్‌కు పంపారు. ‘దేశంలో సంప్రదాయ పార్టీల రాజకీయ సంస్కృతి దారుణంగా పుచ్చిపోయింది. అప్పుడు ఆప్ ఆవిర్భావం ఒక కొత్త ఆశను రేకెత్తించింది. కానీ దురదృష్టవశాత్తు అందుకు భిన్నంగా జరిగింది. ఆప్ నాయకత్వం కూడా సంప్రదాయ రాజకీయ పార్టీలకు భిన్నంగా లేదని పార్టీలో చేరిన తర్వాత తెలిసింది’ ఖైరా తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. గత ఏడాది జూలైలో ఆప్ పార్టీ ఖైరాను పంజాబ్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడి హోదా నుంచి తప్పించింది. అప్పటి నుంచీ ఆయన పార్టీని విమర్శిస్తూనే ఉన్నారు.

అండమాన్‌కు ఆరెంజ్ హెచ్చరికలు

న్యూఢిల్లీ : అరేబియా సముద్రం నుంచి దూసుకువస్తున్న పుబూక్ తుపాన్‌పై కేంద్రం స్పందించింది. అండమాన్ నికోబార్ దీవులకు ఆరెంజ్ అలర్ట్‌ను ఆదివారం వెలువరించింది. తుపాన్ ప్రస్తుతం అండమాన్ సముద్రంలో, సమీప ప్రాంతాలలో కేంద్రీకృతం అయి ఉంది. ఇది దీవుల వైపు నెమ్మదిగా కదులుతోందని, వాతావరణ పరిశోధనా సంస్థ విశ్లేషణల మేరకు ఆరెంజ్ స్థాయి హెచ్చరికలు జారీ చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వ అధికారులు తెలిపారు. తుపాన్ ముప్పు పొంచి ఉందని, అప్రమత్తంగా ఉండాలని, వాతావరణం వికటించేందుకు లేదా విషమించేందుకు అవకాశాలు ఉన్నాయని తెలియచేసేందుకు కోడ్ రూపంలో ఈ ఆరెంజ్ హెచ్చరికలు వెలువరిస్తుంటారు. ఈ పరిస్థితులలో భారీ వర్షాలు కురిసి రహదారులు దెబ్బతినడం, ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లడం వంటివి జరుగుతాయని హెచ్చరించారు. సముద్రంలో నెలకొన్న తుపాన్ గత ఆరు గంటలలో గంటకు 20 కిలోమీటర్ల వేగంతో తూర్పు వాయవ్య దిశగా సాగుతోందని ఇప్పుడు పోర్టుబ్లెయిర్‌కు 310 కిలోమీటర్ల దూరంలో ఉందని వాతావరణ శాఖ తెలిపిందని కేంద్రం వెలువరించిన హెచ్చరికలలో తెలిపారు. ఆదివారం రాత్రి లేదా సోమవారం తెల్లవారుజామున తుపాన్ తీర ప్రాంతం వైపు దూసుకురావచ్చునని, దీనితోఓ అండమాన్ దీవులలో అంతటా గంటకు 75 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీస్తాయని అధికారులు తెలిపారు.

ఎన్‌డిఏ ఏకాకి అవుతోంది : శశిథరూర్



న్యూఢిల్లీ : కేంద్రంలో ఒకే వ్యక్తి అధికార ప్రదర్శనతో (వన్ మ్యాన్ షో) ఎన్‌డిఏ భాగస్వామ్య పక్షాల్లో నిరాశ పెరుగుతోందని, ఆ కారణం చేత భారతీయ జనతా పార్టీ మిత్రులు కొందరు... మునిగిపోతున్న ఓడను విడిచి వెళ్లిపోయే సూచనలు కనబడుతున్నాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శశిథరూర్ వ్యాఖ్యానించారు. కూటమిలో అంతా బాగుందని అనుకోలేమని చెప్పారు. మీ మిత్రులే మీపట్ల అసంతృప్తితో ఉంటే, దేశంలో మీ వైఖరిపట్ల మరింత వ్యతిరేకత ఉంటుందని బిజెపి తెలుసుకోవాలని థరూర్ సలహా ఇచ్చారు. యూపీఏలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి తలెత్తలేదని, నాయకత్వం అన్ని పక్షాలతో సమిష్టిగా ఆలోచించిందనీ థరూర్ చెప్పారు. యూపీఏలో భాగస్వామ్య పక్షాల మాట విన్నారు. సంకీర్ణ ధర్మాన్ని పాటించకుండా ఇప్పటి ఎన్‌డిఏ ప్రభుత్వంలో ప్రధాని నరేంద్రమోడీ వన్ మ్యాన్ షో నడుస్తోందని శశిథరూర్ విమర్శించారు. యూపీఏ పదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పుడు అందరినీ కూడగట్టుకొని సంకీర్ణ రాజనీతిని పాటించిందని ఆయన గుర్తుచేశారు. దేశం ప్రస్తుతం యూపీఏ వైపు చూస్తోందని థరూర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంక కొద్దినెలల దూరంలో లోక్‌సభ ఎన్నికలు ఉన్న తరుణంలో బిజెపి రెండు కీలకమైన మిత్రపక్షాలను పోగొట్టుకుందని అన్నారు. గత డిసెంబర్‌లో ఉపేంద్ర కుష్వాహ నాయకత్వంలో రాష్ట్రీయ లోక్ సమతా పార్టీ (ఆర్‌ఎల్‌ఎస్‌పి) బిజెపి నుంచి విడిపోయి, బీహార్‌లో ప్రతిపక్ష కూటమిలో చేరింది.

వహ్వాధార్... గేమ్‌ఛేంజర్

ఆర్థిక మంత్రి జైట్లీ విశ్లేషణ ● మూడు పథకాలకు సరిపడా ఆదా ● సరైన దారిలోకి రూ. 90,000 కోట్లు

న్యూఢిల్లీ : పౌరులకు సాధికారిక సంఖ్యలతో గుర్తింపు నిచ్చే ఆధార్ దేశాన్ని కీలక మలుపు తిప్పిందని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ చెప్పారు. ఇది గేమ్‌ఛేంజర్ అని అభివర్ణించారు. ఆదార్‌తో ఎన్నో ప్రయోజనాలు సమకూరాయని, దీని అమలుతో గత ఏడాది మార్చి వరకూ మొత్తం మీద రూ.90000 కోట్ల ఆదా జరిగింది. దీనితో ప్రతిష్టాత్మక ఆరోగ్య పరిరక్షణ కార్యక్రమం ఆయుష్మాన్‌భవ వంటివి మూడింటిని ఫక్కాగా అమలు చేయవచ్చునని ఆర్థిక మంత్రి తెలిపారు. ఆధార్ వల్ల పౌరుల గోప్యతకు భంగం జరుగుతోందనే వాదన, సుప్రీంకోర్టు జోక్యం నేపథ్యంలో ఆర్థిక మంత్రి స్పందన వెలువడింది. అనవసర వ్యయం తగ్గుతోంది. నిజమైన లబ్ధిదారులను గుర్తించడం ద్వారా వారికే సంక్షేమ ఫలాలు అందుతున్నాయి. ఈ విధంగా ఆదా అవుతోన్న భారీ మొత్తంతో ఇప్పటికే లక్షలాది మందికి విశిష్ట ఆరోగ్య సేవలు అందించేందుకు వీలుగా ఆయుష్మాన్ పథకాన్ని తీసుకువచ్చినట్లు ఆర్థిక మంత్రి వివరించారు. ఆధార్ ప్రయోజనాలు...ప్రస్తుత పరిస్థితి..అనే శీర్షికతో జైట్లీ తమ ఫేస్‌బుక్‌లో ఆధార్‌కు కితాబు వెలువరించారు. ఖచ్చితంగా ఇది ఆటను మలుపు తిప్పిన గేమ్ ఛేంజర్ అని తెలిపారు. ఆయుష్మాన్‌భవ వంటి మూడు ప్రజా సంక్షేమ పథకాలను తీసుకువచ్చే సత్తా సమకూరిందంటే ఆధార్ కీలక భూమిక ఏమిటనేది స్పష్టం అయిందన్నారు. మోడీ ఆధ్వర్యంలో ఎన్‌డిఎ ప్రభుత్వం ఆధార్ ప్రక్రియను సమగ్రంగా అమలు చేసిందని, ప్రధాని మోడీ నిర్ణయాత్మక నాయకత్వ సమర్థతతోనే ఆధార్ విజయవంతంగా అమలు అయిందని జైట్లీ తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి ఆధార్‌పై సరైన అభిప్రాయం లేదని, పైగా వైరుధ్యాలు చోటుచేసుకున్నాయని, దీనితో యుపిఎ హయాంలో ఆధార్ అమలు అంతంతగానే సాగిందని జైట్లీ విమర్శించారు.





సబ్సిడీలకు లింక్‌తో భారీగా ఆదా

ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అందించే సబ్సిడీని పొందేందుకు ఆధార్‌ను అనుసంధానం చేయడం వల్ల దేశానికి ప్రయోజనం చేకూరిందని జైట్లీ తెలిపారు. ఆధార్ లింక్‌తో సబ్సిడీల పంపిణీ సవ్యంగా జరిగిందని, అవకతవకలకు చెక్ పడింది. దీనితో గత రెండేళ్ల నుంచి చూస్తే గడిచిన మార్చి నాటికి రూ. 90000 కోట్ల మేర పొదుపు జరిగిందని గణాంకాలతో వెల్లడైంది. ఒకే పేరుపై ఎక్కువ సబ్సిడీలు పొందడం, లెక్కలో లేకుండానే సబ్సిడీ దక్కించుకోవడం, నకిలీ లబ్ధిదారుల ఆటకట్టు అయిందని, దీనితో దేశానికి చాలా మేలు జరిగిందని తెలిపారు.

డిడిఆర్ నివేదికలో కీలక అంశాలు

ఆధార్ ప్రక్రియ భారతదేశానికి బహుళ ప్రయోజనాలు చేకూర్చిందని డిజిటల్ డివిడెండ్ రిపోర్టు (డిడిఆర్)లో వెల్లడైందని ఆర్థిక మంత్రి చెప్పారు. ఈ నివేదికను ప్రపంచ బ్యాంకు రూపొందించింది. ఈ నివేదిక అంచనాల మేరకు చూస్తే ఆధార్ అమలుతో ప్రతి ఏటా దేశానికి రూ. 77000కోట్ల ఆదా జరుగుతుందని వెల్లడైందని తెలిపారు. ఆయుష్మాన్ భారత్, ప్రధాన్ మంత్రి జన్ ఆరోగ్య యోజనతో ఏటా ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల మేర ఆరోగ్య చికిత్సలు అందుతాయని, దీనితో దాదాపు 11 కోట్ల కుటుంబాలకు ఆరోగ్య పరిరక్షణ సాధ్యం అవుతుందని జైట్లీ తెలిపారు.

మొదలెట్టి కోర్టుకెక్కిన కాంగ్రెస్ వారు

నిజానికి ఆధార్ ప్రక్రియను తలపెట్టింది కాంగ్రెస్ వారు. అయితే వారిలో సరైన పొంతన లేకపోవడంతో చివరికి దీనిని మొక్కుబడి తంతుగా మార్చిపడేశారు. పైగా ఆధార్ ప్రక్రియను సవాలు చేస్తూ కాంగ్రెస్‌లోని లాయర్లు కోర్టులకు ఎక్కారని జైట్లీ విమర్శించారు. అయితే మేలు పథకాలను సమగ్రరీతిలో అమలు చేసే నిర్ణయాత్మక ప్రధాని పట్టుదలతో ఆధార్ ఆదాకు ఆధారం అయిందన్నారు. ఆధార్ నెంబర్ల ద్వారా నిజమైన లబ్ధిదారులకు ఇప్పుడు బదిలీ అయిన సబ్సిడీ మొత్తం రూ. 1,69,868 కోట్లకు చేరిందని అన్నారు.

సుప్రీం సమర్థన దక్కింది

ఆధార్ ప్రక్రియను అత్యున్నత న్యాయస్థానం సమర్థించిందని ఆర్థిక మంత్రి తెలిపారు.ఈ విశిష్ట గుర్తింపు ప్రాధికారిక సంఖ్య సంవిధానం సమూల రీతిలో బాగుందని పేర్కొందని చెప్పారు. ఆధార్‌తో గోప్యతా హక్కు దెబ్బతింటుందనే పిటిషన్లను తిరస్కరించిందని అన్నారు. అన్నింటికీ మించి ఆధార్‌తో రాజ్యాంగ విశ్వసనీయత విధానం ఇనుమడించింది. ప్రత్యేకించి అణగారిన వర్గాలకు సాధికారత దిశలో ఇది ఉపయుక్తంగా మారిందన్నారు.

దళారుల పీడ విరగడ

సబ్సిడీలు బ్యాంకు ఖాతాల ద్వారా నేరుగా లబ్ధిదారులకు చేరే ప్రక్రియ ఆధార్‌తో విజయవంతం అయింది. దీనితో ఇప్పటివరకూ ఉన్న దళారుల బెడద తీరిందని జైట్లీ చెప్పారు. ఇదేం మామూలు ప్రక్రియ కాదని, అత్యంత విశిష్టమైన సాంకేతిక ప్రక్రియ అని, ఈ తరహా వ్యవస్థ కేవలం ఇండియాలోనే అమలు అవుతోందని తెలిపారు. ఆధార్‌తో ఏర్పడ్డ భారీ ఆదా పేదల బాగుకు సవ్యంగా అందుతోందని స్పష్టం చేశారు. 2016లో ఆధార్ బిల్లుఆమోదం పొందిన నాటి నుంచి చూస్తే గత 28 నెలల్లో 122కోట్ల ఆధార్ కార్డుల జారీ జరిగింది. దీనితో దేశంలోని 18ఏళ్లు పైబడ్డ వయోజనులలో 99 శాతం వరకూ ఈ పథకం పరిధిలోకి వచ్చారని జైట్లీ వివరించారు. బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానంతో దాదాపు 23 కోట్ల మంది పహల్, ఉజ్వల లబ్ధిదారులకు వారి ఖాతాలలోకి నేరుగా నగ దు బదిలీ (డిబిటి) జరిగిందన్నారు. దాదాపు 59 కోట్ల మంది రేషన్‌కార్డుదారులు ఆధార్‌తో లింకయ్యారు. 11కోట్ల మందికి ఆధార్‌తోనే జాతీయ గ్రామీణ ఉపాధి నిధులు నేరుగా ఖాతాలకు చేరే వీలవుతుందన్నారు

ఆధార్ దుర్వినియోగం కాకుండా సుప్రీంకోర్టు పలు జాగ్రత్తలు కల్పించిందని, ఆధార్ సంవిధానానికి న్యాయస్థానం సమతుల్యతను కల్పించిందని చెప్పారు.


ఆధార్ ఘనత ఆ ఇద్దరికీ

ఆధార్ ప్రక్రియ విశిష్టతను సంతరించుకోవడంలో ఇద్దరు వ్యక్తులు కీలక పాత్ర పోషించారని ఆర్థిక మంత్రి తెలిపారు.ఆధార్‌ను నందన్ నిలేకని రూపొందించారు. ఇక డాక్టర్ అజయ్ భూషణ్ పాండేలు కీలకమైన పాత్ర పోషించారని దీనికి సరైన దిశను కల్పించి, సవ్య విస్తరణకు బాటలు వేశారని చెప్పారు. చట్టపరమైన సవాళ్లు తలెత్తకుండా చేసేందుకు అన్ని చర్యలూ తీసుకుని ప్రభుత్వ ఆలోచనకు సరైన రూపం ఇచ్చారని కితాబు ఇచ్చారు.

రగిలే చెరకు రైతు తిరుగుబాటు

ప్రధాని మోడీకి పవార్ హెచ్చరిక





న్యూఢిల్లీ : దేశంలో చెరకు రైతులను ఆదుకోకపోతే వారి నుంచి తిరుగుబాటు తప్పదని ప్రధాని మోడీకి ఎన్‌సిపి నేత శరద్ పవార్ హెచ్చరించారు. చెరకు రైతులు ఇప్పుడు ఆర్థికపరమైన చిక్కులతో నైరాశ్యంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. వీరి పరిస్థితిని గమనించండి. వారిని తక్షణం ఆదుకోండి అని కేంద్రంలో గతంలో వ్యవసాయ మంత్రిగా కూడా చేసిన పవార్ సూచించారు. ప్రధాని మోడీకి పవార్ ఈమేరకు ఆదివారం ఒక లేఖ పంపించారు. కడగండ్ల పాలయిన రైతాంగం రగిలిపోతోందని, వారిని ఆదుకోకపోతే పరిస్థితి తీవ్రంగా ఉంటుందని, వారినుంచే తిరుగుబాటు తప్పదని తేల్చిచెప్పారు. చెరకు పంటకు దిగే రైతులకు సరైన కనీస మద్దతు ధరలు అందడం లేదని, సాగు వ్యయం అత్యధికం అవుతోందన్నారు. చిన్న, మధ్యతరహా చెరకు రైతులలో ఇప్పుడు తీవ్రస్థాయి అశాంతి, అంతకు మించి నిరాశ నిస్పృహలు అలుముకున్నాయని, ఇది ఎటువైపు దారితీస్తుందనేది తెలియదని పవార్ తెలిపారు. కష్టాలలో ఉన్న రైతాంగాన్ని గుర్తించి వారిని ఆదుకునేందుకు పలు చర్యలు తక్షణం చేపట్టాల్సి ఉందని లేఖలో పేర్కొన్నారు. రైతాంగ సమస్యల గురించి తాను ఇంతకు ముందు కూడా లేఖ రాశానని అయితే ఇప్పటివరకూ స్పందన లేకపోవడం, రైతాంగ పరిస్థితి దిగజారడంతో తిరిగి లేఖ పంపించాల్సి వస్తోందని పవార్ తెలిపారు. రికార్డు స్థాయిలో చక్కెర దిగుబడి ఉందని, అయితే రైతుకు ధరలు పాతాళానికి అంటాయని దీనికి తోడుగా చెరకు మిల్లుల వారు సకాలంలో సంపూర్తిగా తీసుకున్న పంటకు చెల్లింపులు చేయడం లేదని, దీనితో ఫ్యాక్టరీల నుంచి రైతులకు భారీ స్థాయిలో బకాయిలు పెండింగ్‌లో ఉంటున్నాయని, దీనితో దిక్కుతోచని స్థితిలో రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, ఇక అశాంతితో రగిలే రైతులు ఏం చేస్తారనేది స్పష్టం అవుతోందన్నారు. కనీస మద్దతు ధరను కిలో చొప్పున ఇప్పుడున్న రూ.29 నుంచి రూ.34కు పెంచాల్సి ఉందని, దీనివల్ల కనీసం సాగు వ్యయ భారం నుంచి అయినా కుదుటపడుతారని తెలిపారు. రికార్డు స్థాయిలో చెరకు దిగుబడి ఉన్నా సరైన విధంగా రైతుకు ధర దక్కకపోవడానికి ప్రభుత్వ అసమర్థ చర్యలే కారణం అన్నారు. చక్కెర ఎగుమతులను తప్పనిసరి చేస్తూ విధించిన నిబంధనలతో మిల్లుల వారు సబ్సిడీలు కల్పించినప్పటికీ సరైన విధంగా నౌకల ద్వారా దీనిని బయటకు పంపించలేకపోతున్నట్లు తెలిపారు. విధానపరమైన జాప్యాలతో, సరైన పత్రాలు అందించకపోవడంతో మిల్లులకు అందాల్సిన క్వింటాలుకు రూ 13.88 ఉత్పత్తి సంబంధిత సబ్సిడీ అందడం లేదని పవార్ తెలిపారు.

ఒడిశాలో వాచ్‌మెన్‌ను కాల్చి చంపిన మావోయిస్టు

5 వాహనాలకు నిప్పు

ఫుల్‌బాని: ఒడిశాలోని కందమల్ జిల్లాలో మావోయిస్టులు చెలరేగి పోయారు. రోడ్డు నిర్మాణ స్థలం వద్ద ఉన్న వాచ్‌మెన్‌ను పోలీసు ఇన్ఫార్మర్ అనే అనుమానంతో కాల్చిచంపారు. శనివారం రాత్రి ఫుల్‌బాని పోలీస్ స్టేషన్ పరిధిలోని పటియాంబిలో కాంట్రాక్టర్ క్యాంప్‌పై సాయుధులైన మావోయిస్టులు దాడి చేసినట్లు ఎస్‌పి ప్రతీప్ సింగ్ తెలిపారు. మూడు ట్రాక్టర్లు, రోడ్డు ట్రోలర్, ప్రధాన మంత్రి గ్రామ్ సడక్ యోజన క్రింద నిర్మాణ పనుల్లో ఉన్న మరో ట్రాక్టర్‌కు నిప్పుబెట్టారన్నారు. అనంతరం వాచ్‌మెన్‌ను అడవిలోకి తీసుకెళ్లి కాల్చి చంపినట్లు ఎస్‌పి తెలిపారు. కందమాల్ కలహండి బౌద్ నయాగఢ్(కెకెబిఎన్)డివిజన్‌కు చెందిన మావోయిస్టులు ఘటలో పాల్గొన్నట్లు పోలీసులు తెలిపారు. వాచ్‌మెన్‌ను పోలీస్ ఇన్ఫార్మార్ అనే అనుమానంతో హత్య చేసినట్లు ఘటనా స్థలంలో వదిలి వెళ్లిన లేఖలో మావోయిస్టులు పేర్కొన్నారు.

సీనియర్ పిడిపి నేత జావేద్ ముస్తఫా మీర్ రాజీనామా

శ్రీనగర్: జమ్ముకశ్మీర్‌లో పీపుల్స్ డెమొక్రాటిక్ పార్టీ (పిడిపి)కి మరో ఎదురుదెబ్బ తగిలింది. పిడిపి సీనియర్ నేత, మాజీ మంత్రి జావేద్ ముస్తఫా మీర్ శనివారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. మధ్య కశ్మీర్‌లోని బుద్గాం జిల్లాకు చెందిన మిర్, చుదూర్ అసెంబ్లీ నుంచి మూడు సార్లు ఎంఎల్‌ఏగా ఎన్నికయ్యారు. తాను పిడిపికి రాజీనామా చేశానని, ఇది తన వ్యక్తిగత నిర్ణయమని ఆయన పేర్కొన్నారు. అయితే తన భవిష్యత్ కార్యాచరణ ఏమిటో ఆయన వెల్లడిం లేదు. పిడిపికి బిజెపి మద్దతు ఉపసంహరించుకున్నప్పటి నుంచి పలువురు నేతలు పార్టీని వీడుతున్నారు. పార్టీ అధ్యక్షురాలు మహబూబా ముఫ్తీ బంధుప్రీతి, పక్షపాతం వహిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. కశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉండగా పార్టీని వీడుతున్న నేతలు ప్రధాన ప్రత్యర్థి నేషనల్ కాన్ఫరెన్స్‌లో చేరుతున్నారు.

మమత పిఎం అవుతారని జోక్ చేశాను

- మాటమార్చిన బెంగాల్ బిజెపి అధ్యక్షుడు దిలీప్ ఘోష్
- ఘోష్ కామెంట్‌పై ప్రతిపక్షాల్లో ఊహాగానాలు

కోల్‌కతా: నోరుజారి ఏదోక మాట అనడం, ఆ తర్వాత నాలిక్కరుచుకోవడం నాయకులకు అలవాటే. పశ్చిమ బెంగాల్ భారతీయ జనతాపార్టీ అధ్యక్షుడు దిలీప్ ఘోష్ తను అన్న మాటకు సర్ది చెప్పుకొని యు టర్న్ తీసుకోవాల్సి వచ్చింది. మమతా బెనర్జీ ప్రధానమంత్రి అయ్యే అవకాశం ఉందని తను అన్న మాటను ఘోష్ వెనక్కి తీసుకున్నారు. మమతాబెనర్జీ పుట్టినరోజు సందర్భంగా జోక్ చేశానని, ఆ మాటను సీరియస్‌గా తీసుకోవద్దని దిలీప్ ఘోష్ కోరారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ శనివారం పుట్టినరోజు జరుపుకొన్నారు. ఆ సందర్భంగా దిలీప్ ఘోష్ ఆమెకు శుభాకాంక్షలు చెబుతూ... ఆమె ఆరోగ్యంగా, ఫిట్‌నెస్‌తో ఉండాలని అన్నారు. అంతటితో ఆగకుండా... బెంగాల్ నుంచి ఎవరికైనా ప్రధానమంత్రి అయ్యే అవకాశం వస్తే, అందుకు అన్ని విధాలా అర్హత ఉన్న వ్యక్తి మమతాబెనర్జీ అని ఘోష్ వ్యాఖ్యానించారు. మమతా గురించి కామెంట్ చేయమని శనివారం నన్ను విలేకరులు అడగ్గా అలా చెప్పాను. ఆమె ప్రధానమంత్రి అభ్యర్థి అని సరదాగా అన్నాను. ఆమె పార్టీకున్న లోక్‌సభ స్థానాలతో మమతా బెనర్జీ ప్రధానమంత్రి అవుతారని ఎవరైనా ఎలా అనుకుంటారు?’ అని వివరణ ఇచ్చారు. అయితే ఘోష్ వ్యాఖ్య అనేక అనుమానాలకు తావిచ్చింది. తృణమూల్ కాంగ్రెస్‌కు, భారతీయ జనతా జనతాపార్టీకి మధ్య రహస్య అవగాహన ఉందని ప్రతిపక్ష కాంగ్రెస్ ఆరోపించింది.‘ఈ ఏడాది పార్లమెంట్ ఎన్నికల్లో తాము తిరిగి అధికారంలోకి రాలేమని బిజెపి ఈ కామెంట్‌తో తనకు తానే అంగీకరించింది. అలాగే ఫెడరల్ ఫ్రంట్ గా ఏర్పడకుండా ప్రతిపక్షాలను విడగొట్టడానికి బిజెపి ఇలాంటి ఎత్తులు వేస్తోంది’ అని బెంగాల్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు అబ్దుల్ మన్నన్ అన్నారు. సిపిఎం కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.

బంగారం కోసం నదిలో తవ్వకాలు

అఫ్ఘన్‌లో 30 పేద బతుకులు బలి

కుందూజ్ : బంగారం కోసం ఆరాటం అఫ్ఘనిస్థాన్‌లో 30 మంది ప్రాణాలను తీసింది. దేశంలో ఈశాన్య ప్రాంతంలోని బదక్షాన్ ప్రాంతంలోని కోహిస్థాన్ జిల్లాలో గ్రామస్థులు అక్రమంగా బంగారు గనిలో తవ్వకాలకు దిగారు. వారికి సరైన అనుభవం లేకపోవడం, పైగా నదిలో ఈ గని ఉండటంతో గని గోడలు కుప్పకూలడంతో కనీసం 30 మంది దుర్మరణం చెందారు.ఏడుగురు గాయపడ్డారని జిల్లా పరిపాలకుడు మెహమ్మ ద్ రుస్తమ్ రగీ తెలిపారు. నదిలో బంగారు గని ఉందని ఈ ప్రాంతంలో చాలా కాలంగా ప్రచారం జరుగుతోంది. దీనితో ఆదివారం తెల్లవారుజామునే గ్రామస్తులు చాలా మంది నదిలో 200 అడుగుల మేర గుంత తవ్వారు. లోపలికి దిగి బంగారం కోసం వెతుకులాడుతూ ఉండగా ఉన్నట్లుండి గోడలు కూలి గ్రామస్తులు సజీవ సమాధి అయ్యారు. నదిలో బంగారం కోసం తవ్వకాల సమయంలో చాలా మంది ప్రజలు ఉన్నట్లు వెల్లడైంది. అయితే ఈ గుంత గోడ ఏ విధంగా కూలిందనేది తెలియడం లేదని, స్థానికులు పలుగులు పారలతో గని తవ్వకానికి పాల్పడినట్లు వెల్లడైందని అధికారి తెలిపారు. ఈ ప్రాంతంలోని వారు చాలా కాలంగా బంగారం కోసం తవ్వకాలకు దిగుతూ వస్తున్నారు. అయితే సర్కారు వారు సరిగ్గా పట్టించుకోకపోవడంతో పైగా చట్టపరమైన నిబంధనల గురించి తెలియకపోవడంతో స్థానికులు బంగారం జాడ ఉందంటే చాలు తవ్వకాలకు దిగుతూ ఉన్నారు. ఈ క్రమంలోనే ఇప్పుడు చేయడంతో వీరి ప్రాణాలు పోయినట్లు వెల్లడైంది. తజకిస్థాన్, చైనా, పాకిస్థాన్ సరిహద్దుల వెంబడి ఉండే ఈశాన్య అఫ్ఘనిస్థాన్‌లోని పర్వత ప్రాంతంలో అత్యంత మారుమూలలో బదక్షాన్ నెలకొని ఉంది. పేదరికం, తాలిబన్ల ప్రాబల్యం తాండవించే ఈ ప్రాంతంలో తరచూ వర్షాలతో కొండచరియలు విరిగిపడుతుంటాయి. ఎప్పుడూ చలిగా ఉంటుంది. అ ప్రాంతంలో భారీ స్థాయిలోనే బంగారం నిక్షేపాలు ఉన్నాయని విశ్లేషించారు. అయి తే సరైన సంవిధానం లేకపోవడం, నియంత్రణ లోపాలతో ఇక్కడి గను ల వెలికితీత సరిగ్గా జరగడం లేదు. దీనితో ఈ ప్రాంతంలోని వారే తాలిబన్ల ఇతర సాయుధుల అండదండలతో ఇక్కడి బంగారు గనుల తవ్వకాలకు పాల్పడుతుంటారు. అధిక భాగం అజ్ఞాత శక్తులకే అప్పగిస్తారని, తరువాత కూడా బతుకు కోసం ఇదే పనికి దిగుతుంటారని వెల్లడైంది.

శ్రీనగర్‌లో హిమపాతం



సిమ్లాలో



జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారి పాక్షిక పునరుద్ధరణ

శ్రీనగర్: కశ్మీర్‌ను దేశంలోని మిగతా ప్రాంతాలకు అనుసంధానించే ఏకైక జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారిని ఒక రోజు ట్రాఫిక్ అంతరాయం తర్వాత తిరిగి ఆదివారం పాక్షికంగా పునరుద్ధరించారు. వాతావరణం మెరుగవడంతో మంచును తొలగించి వన్ వే ట్రాఫిక్‌ను అనుమతించినట్లు రవాణా శాఖ అధికారి తెలిపారు. భారీ హిమపాతంతో రెండు రోజుల క్రితం శ్రీనగర్‌కు నిలిపి వేసిన విమాన సర్వీసులను కూడా తిరిగి ప్రారంభించారు. ఇటీవల సంవత్సరాలలో రికార్డు స్థాయిలో కురిసిన హిమపాతంతో జన జీవనం స్తంభించిందని, ఉపరితలంతోపాటు గగన తలంపై ప్రభావం చూపినట్లు ఆ అధికారి తెలిపారు. గురువారం వరకు జమ్మూకశ్మీర్‌లో వాతావరణం పొడిగా ఉండే అవకావశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

Printed and Published by **Tumu Mohan Rao** on behalf of Moveon Media Private Limited, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037 Medchel-Malkajgiri District, TELANGANA and Published from H.No.1-1-60/7A, 4th floor Beacon towers, street no.13, Jawaharnagar, near RTC X Roads Hyderabad-500020 Telangana state, Editor : **Anjaiah Polisetty**, RNI No. TELTEL/2012/42234. Email Id. editor@manatelangana.org. Phone No.040-27655666